వెంకట కృష్ణారావు, జయంతి

నానా ఫర్నవీస్ యొక్క జీవిత చరిత్ర

బరంపురం, 1924

Record no. 482

Veṅkaṭa Kṛṣṇārāvu, Jayanti

Nānā pharnavīs yokka jīvita caritra

Barampuraṃ, 1924

Record no. 482

Bibliographic Record Target

వెంకట కృష్ణారావు, జయంతి.

నానా ఫర్నవీస్ యొక్క జీవిత చరిత్ర / ఇయ్యది జయంతి వెంకట కృష్ణారావు పంతులుగారు రచియించిరి.- 1. కూర్పు.- బరంపురం : వేగుఁజుక్క ముద్రాలయము, 1924.

2, iv, iii, 178 p. ;19 cm.

Record no. 482

Veṅkaṭa Kr̥ṣṇārāvu, Jayanti.

Nānā pharnavīs yokka jīvita caritra / iyyadi Jayanti Veṅkaṭa Kr̥ṣṇārāvu Pantulugāru raciyiñciri.- 1. kūrpu.- Barampuraṃ : Vēgum̐jukka Mudrālayamu, 1924.

2, iv, iii, 178 p. ;19 cm.

Record no. 482

679

"వేగుఁజుక్క" గ్రంథమాల

(బరంపురం, గంజాంజిల్లా).

(Established on the 12th December 1911 in honour of the Delhi Coronation Durbar.)

This Cancels All Previous Rules.

1. వత్సరమునకు నాలుగు గ్రంథములు ప్రచురింపబడును.

2. ప్రతిగ్రంథమును ప్రచురము కాగానే శాశ్వతచందాదారుల పద్ధతిని చందాదారులకు వీ. పీ. గా పంపఁబడును.

3. నాలుగు గ్రంథములును పోస్టేజీలు కాక వత్సరమునకు మూఁడు రూపాయలకు మించదు. 4 ప్రవేశరుసుము మూఁడు తరగతులైయున్నది.

(a) శాశ్వత చందాదారుగాఁ జేరు తేదీకి పూర్వమున ప్రచురింపఁబడిన గ్రంథములన్నియు గైకొనినచో, ప్రవేశరుసుము నాల్గణాలు మాత్రమే. (b) వరుసగాగాని వరుస తప్పించిగాని కొన్ని గ్రంథములే కోరినయెడల, ప్రవేశరుసుము ఎనిమిదణా లగును. (c) శాశ్వతపు చందాదారుగాజేరు తేదీకి పూర్వము ప్రచురింపఁబడిన గ్రంథములలో నేదియు గోరక, తాము ప్రవేశించిన తేదీ తరువాత ప్రచురింపఁబడు గ్రంథముల మాత్రమే కోరినయెడల ప్రవేశరుసుము ఒక రూపాయి యగును.

ఇదివరకు ప్రచురింపబడిన గ్రంథములు


		చందాదారులకు	ఇతరులకు
1.	ఉషఃకాలము	ప్రతులు లేవు.	
2.	వాఁడే వీఁడు	1 0 0	1 4 0
3.	ప్రేమము	పునర్ముద్రణము.	
4.	సుహృల్లత	0 12 0	1 0 [illegible]
5.	పద్మినీపరిణయము	ప్రతులు లేవు	
6.	విలాసార్జునము	[illegible]	
7.	సగుణ (మొదటి [illegible]	[illegible] 0	1 8 0
[illegible]	,, (రెండవభాగము)	0 10 0	0 12 [illegible]
9.	,, (మూడవ[illegible])	0 10 0	0 12 0
10	గ్రొప్పుత్రాఖ్య	ప్రతులు లేవు.	
11	వేంకటరావు	1 0 0	1 8 0
12	నేనే (వాఁడే వీఁడునకు 2వభా)	1 0 0	1 6 0
♦13	కోటీశుతనయ (నిరూపకనవల)	1 0 0	1 4 0
14	కాలూరారాయి(నేనే)తరువాయి	1 4 0	1 8 0
15	ప్రతిజ్ఞాచాణక్యము	1 0 0	1 4 0
16	పద్మమాలి	1 0 0	1 4 0
17	నానా ఫడ్నవీసు	1 0 0	1 4 0

♦ 1922 సం॥మున బహుమాన పరీక్షా పఠనీయ గ్రంథముగా నేర్పడి పరీక్ష సానెప్పి, నూటుపదాల్లు, అన్న నూటుపదాల్లు, పాపు నూటుపదాల్లు బహుమానము లొసంగిన గ్రంథమిది.

VEGU-JUKKA OFFICE, *Berhampore.* 1924. } **D. V. Krishna Rao,** *Secretary.*

బ్రహ్మపుర

"వేగుఁజుక్క" గ్రంథమాల



యొక్క

జీవిత చరిత్ర

ఇత్యాది

మ॥ రా॥ జయంతి వెంకట కృష్ణారావు పంతులుగారు

రచియించిరి.

వేగుఁజుక్క గ్రంథమండలిచే సంపాదితము.

మొదటి కూర్పు

వేగుఁజుక్క ముద్రాలయము

బరంపురం

[Registered] 1924.

ఉపోద్ఘాతము

మహాత్ముల జీవితములు మననడవడికకు దారిజూపు దీపములవంటివి. వారి చరిత్రలు అప్పటి దేశకాలస్థితుల సూచించు దర్పణములు. ఈ చిన్నిపుస్తకమునకు కథానాయకుఁడైన నానా ఫడ్నవీసు జీవితమందు పదునెనిమిదవ శతాబ్దమునందలి హిందూదేశపు రాచకీయ పరిస్థితులు బాగుగా గురితింపనగును. ఇతఁడు మహారాష్ట్ర రాజ్యాంగ తంత్రజ్ఞులలో ముఖ్యుఁడు.

అనేకమంది చరిత్రకారులు హిందూదేశ సార్వభౌమత్వము మొగలాయి చక్రవర్తులనుండి ఆంగ్లేయులు గ్రహించినట్లు వ్రాసియున్నారే, గాని నిజమును బట్టిచూడ మహారాష్ట్రుల నుండియే గ్రహింపబడినది. ముగలాయి సామ్రాజ్యము, నర్మదా నదీ తీరమువరకును వ్యాపించియున్న కాలమున కాలిముల్లై, భామినీ రాజ్యములను మ్రింగి పెన్నారు నది వరకును వ్యాపించియున్నపుడు ప్రక్కలోని బల్లెమై, ఔరంగజేబు చక్రవర్తి గతించిన తరువాత మొగలాయి సామ్రాజ్య విచ్ఛిన్నమునకు మూలకారణమై విరాజిల్లి, కాలక్రమమున గంగానది మొదలు కావేరీతీరము వరకును వ్యాపించి, యేకఛత్రాధిపత్యము వహించుటయే గాక, నామమాత్రావశిష్టుఁడైన ఢిల్లీ చక్రవర్తికి గూడ, బత్తెమిచ్చి పోచినట్టు హైందవ మహారాష్ట్ర సామ్రాజ్యమును ఆంగ్లచరిత్రకారులు ఎట్లు మరచిరో తెలియరాకున్నది. ఇంచుమించుగ పదునెనిమిదవ శతాబ్ది మంతయు హిందూదేశము మహారాష్ట్రుల స్వాధీనమం దుండెను. ఇందు

కడపటి ముప్పదియెనిమిది వత్సరములు ఈ సామ్రాజ్య వ్యవహారములు నానా ఫడ్నవీసుచే నడుప బడినవి.

1772 సం॥లో నాల్గవ పీష్వా మాధవరావు గతించినప్పటి నుండియు పునహా పట్టణమున యీ మహామంత్రి మత్తేభము నిరంకుశముగా వ్యవహరింప దొడంగెను. వీని బుద్ధికౌశలమునకు గాకున్న మహారాష్ట్ర సామ్రాజ్యము పీష్వా నారాయణరావు వధతోడనే తుత్తునియలై పరాధీనము కావలసియుండెను. దక్షిణమున హైదరాలీ తన రాజ్యమును వ్యాపింపజేయ నువ్విళ్లూరుచుండెను. తూర్పున ఆంగ్లేయులు బంగాళీ కర్ణాటక రాజ్యములను స్వాధీన పరచుకొని మధ్య నున్న మహారాష్ట్ర దేశమును మ్రింగ వేచియుండిరి. ఉత్తరమున సిక్కులు మొగలాయి శృంఖముల విముక్తులై నూతనముగ స్వతంత్ర రాజ్యమును స్థాపింప యత్నించుచుండిరి. పానిపట్టు యుద్ధములో గెలుపొంది నప్పటినుండియు అఫ్ఘనులకు హైందవ సామ్రాజ్యాభిలాష నానాటికి నభివృద్ధి జెందుచుండెను. పైవారిమాట యటుండ మహారాష్ట్ర రాజ్యమందలి నాయకులలో పరస్పర ద్వేషములు అధికము కాజొచ్చెను. రాజపుత్ర శౌర్యాగ్నిని జల్లార్చి సిక్కుల పొగరడంచి, యోధాగ్రేసరుఁడ నని విర్రవీగుచున్న హోల్కారు ఒకవంక; బందెలమును జయించి, ఢిల్లీ పాదుషా యంతవానికి బత్తెమిచ్చుచున్నానని గర్వించి, ఫరంగీ నాయకత్వము క్రింద తర్ఫీదు చేయబడిన పెక్కు సేనలు గలిగి హిందూస్థానమున నాకు యీడు లేడని విర్రవీగుచున్న సింధియా ఒకవంక; పీష్వాను స్వాధీన పరచుకొనుటకు ప్రయత్నించుచుండిరి. ఇక పీష్వాయో ఆంగ్లేయదూతల ప్రేరేపణచేతనో

లేక నానాయొక్క చెప్పుచేతలకు విసిగియో తనవారిని వదలి ఆంగ్లేయ దాస్యమును స్వీకరించుటకు సిద్ధముగా నుండెను. ఇట్టి మహాతరుణమున నానా ఫడ్నవీసు తన బుద్ధికుశలతచేత విడిపోవ సంసిద్ధమైయున్న మహారాష్ట్ర శక్తులను అదిమిపట్టి, ఆంగ్ల రాచతంత్రజ్ఞులకు మహారాష్ట్ర రాచకీయవ్యవహారములయం దించుకంతయు జొరనీక మహా నిపుణతతో సామ్రాజ్య ప్రతిష్ట నిలువబెట్టుటయే గాక, పదునెనిమిది వందల వత్సర మార్చినెలలో తానుయీ భౌతిక దేహమువదలునంతదనుక సామ్రాజ్య వ్యవహారములయం దెవ్వరికిని చొరవీలు నీయలేదు.

పూర్వము చాణక్యుడును, మధ్య యుగమందు ఐరోపా ఖండమున మైకవిల్లియు, నేట్టి రాచకీయ తంత్రజ్ఞులో, నానా ఫడ్నవీసు పదునెనిమిదవ శతాబ్దమున యట్టివాడని చెప్పవచ్చును. మంత్రి యుగంధరుడు తెలింగనా రాజ్యమునకును, తిమ్మరుసు విజయనగర సామ్రాజ్యమునకును, తిక్కన మంత్రి మనుమసిద్ధి రాజ్యమునకును, పూర్ణయ్యగారు మైసూరునకును, చేసిన మేలుకన్న యీ నానా ఫడ్నవీసు మహారాష్ట్రమునకు చేసిన ఉపకారము కడుంగడు గొప్పది. పిట్ మహామంత్రి ఇంగ్లండును ఉద్ధరించినట్లు చరిత్రకారులు అభినుతించుచున్నారు. ఈ మహామంత్రి మహారాష్ట్ర సామ్రాజ్యము పట్ల నంతకన్న ఎక్కువ పొగడ్తకు నర్హుడని నాయభిప్రాయము. ఇతడు గతించిన వార్త వినినప్పుడు ఒక ఆంగ్ల రాచకీయ తంత్రజ్ఞుడు ఇట్లు నుడివెను. "నేటితో మహారాష్ట్ర సామ్రాజ్య శోభ, బుద్ధివైభవము, నిపుణత గతించినవి". నిజముగా యీమహామంత్రి నిర్యాణముతో మహారాష్ట్ర రాజ్యలక్ష్మి ప్రభ యస్త

మించిన దని చెప్పవచ్చును. ఇతడు గతించిన రెండు సంవత్సరములకే పీష్వా బాజీరావు ఆంగ్లేయ దాస్యమును స్వీకరించెను. మరి మూడు సంవత్సరములలో సింధియా భోంస్లేల పొగరణగెను. హోల్కారు కూడ తన దినములు గణింపవలసి వచ్చెను. ఐకమత్యము చెడిన యోధుల అహంకారము లడుగంటుటకు ఎంతకాలము పట్టును? మహారాష్ట్ర సామ్రాజ్య విచ్ఛిన్నము కూడ యీ మహామంత్రి బుద్ధివిశేషమును, రాజ్యాంగ నిపుణత్వమును వేనోళ్ల చాటుచున్నది. ఇట్టి వాని చరిత్ర ప్రతి హైందవుడును తప్పక చదువ వలసినదే. తమ వారిని తెలియకుండుట తమ్ము తా దెలియకుండుటయే. ఎంత స్వల్ప కార్యములనుచేసినను పాశ్చాత్యులు తమవారి జీవితములు వ్రాసి తమ జాతి వైభవమును వ్యాపింప జేయుచున్నారు. ఇంక నైనను మేల్కాంచి మనవారిని గూర్చి మనము దెలిసికొన బ్రయత్నింతుము గాక !

నా సోదరుడు యీ పుస్తకమును వ్రాసి నా కెంతయు సంతసము గలుగజేసెను. ఇది పాఠక ప్రపంచము, ఈ మహామంత్రియొక్క సంపూర్ణ జీవితముగా గ్రహింపు డను నభిప్రాయము కాదు. దీనిని ప్రథమ ప్రయత్నముగా గొని విద్వాంసు లేరైన యీ హైందవ మైకవిల్లి చరిత్రము సంపూర్ణముగా వ్రాసి ఆంధ్ర ప్రపంచమునకు మహోపకార మొనరింతురు గాక! అంతవరకు యీ చిన్నిపొత్తము ఆ మహామంత్రి కీర్తి సూచకముగా ఆంధ్ర పాఠకుల కరంబు లలంకరించు గాత.

18-11-24

జ॥ వెం॥ జగన్నాథరావు.

తొలిపలుకు

నానాటికి పెరిగి పెద్దదగుచున్న ఆంధ్రపుస్తక భాండారమున నవలలు, నాటకములు నాక్రమించుచున్న స్థలమున దశాంశమైన చారిత్రికగ్రంథములుగాని శాస్త్రీయగ్రంథములుగాని గాన రాకుంట కడుశోచనీయము. జాతీయతాభివృద్ధికి చరిత్రయు శాస్త్రవిజ్ఞానమును ముఖ్యాంగములని యెల్ల రెఱింగిన విషయమే. అదేమి పాపమోగాని పాశ్చాత్య చరిత్రకారులు మనవారి యౌన్నత్య విషయమున వ్రాసినవ్రాతలు యథార్థదూరములై మనకంతగ సహాయములు కాజాలకున్నవి. లభ్యములగు ప్రాచ్యలిఖిత చరిత్రలైన భారతీయుల యౌన్నత్యము యథార్థరీతిని జూపకపోవుటేగాక మీఁదుమిక్కిలి తమవారి యొక్క వందిమాగధ స్తోత్రములచే నింపి మనవారిని నిందార్హులుగను, నీతి విదూరులునుగను చిత్రించినవి. మహానుభావులును, ఆదర్శక ప్రదాయకజీవితులునునగు శ్రీ శ్రీ శ్రీ ఛత్రపతి శివాజీగారిని, మహామంత్రి నానాఫడ్నవీసు గారిని క్రమముగా **"కొండయెలుక"**, **"మేకియవెల్లీ"** దూష్యబిరుదావళులతో పేర్కొనినవి. కాని హైందవ నవయుగారంభమున పాశ్చాత్య భావనావలంబులుగ మార్చుచున్న తఱి, కీర్తిశేషులగు మహాదేవ గోవింద రేనడే, కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగార్లును, శ్రీయుతులు, చిలుకూరు వీరభద్రరావు, చిల్లరిగె శ్రీనివాసరావుగార్లును ప్రబంధములనుండియు, గీతములనుండియు, కావ్యములనుండియు తఱచి యథార్థమగు చరిత్రాంశ నవనీతమును పంచిపెట్టి, పోయిన జాతీయ భావమును, పునరుద్ధరింప మార్గదర్శకులై అజరామరమగు కీర్తి గడించిరి. కష్టదా

యకమును కంటకావృతమునగుట ననేకులీ పథమును ద్రొక్కక భాషాసేవచేయు నెపమున నతి సులభమును, అతి సుఖకరమునునగు నవలారచనకును గడంగిరి. కల్పనాకథలవెంతగ యాకర్షణీయములైనను, యథార్థచరిత్రలంత యానందదాయకములు కాజాలవు. అంతియగాక అమెరికను కవిలేఖరుడు లాంగ్ఫెలో రచియించినట్లు:—

ఇల మహాత్ముల జీవితములు మనల మ
హాత్ములుగ జేసికొనగ సహాయపడును;
తమ పథంబున మన జీవితములు నడపి
తమ్ముబోలెద మను యాశ దగనుగొల్పు;
నట్లు కావున నెట్టి యిక్కట్లనైన
బొందుటకు బూనుదమురండు! పురుషవరులు.

అని అభ్యుదయమును గోరుజాతి, మహామహుల సంగ్రహించి తనవారి కందించవలయు. కాని పెద్దలెందరో యున్నను యిట్టి యత్నము లంతగ నింతవరకు జరుగకుండుటం జూచి నాచేతనైనంతవరకు నేను నడ్డుకట్టి యిట్టి మహత్తర కార్యమునకు నెట్టుకొంటిని. ఆంగ్లమును, ఆంధ్రమును దప్ప వేఱే భాష నెఱుంగని నాకీకార్యము తలకు మీఱినదైనను, పెద్దపుస్తక భాండారమైన సహకారిగనుండ సమీపస్థానమున లేకున్నను దొరకినన్ని ఆంగ్ల గ్రంథములనుండియే, కాంగ్రెసుప్రచారకుండనగు నాకు చిక్కిన సమయములో నే నీ చిన్న పొత్తమును నవసరమనియెంచి వ్రాసితిని. ప్రచురిత గ్రంథముల నుండియే సంగ్రహించిన దీనిలో నే పడినశ్రమ యత్యల్పము, పాఠకుల కేమాత్రమైన యిదిరుచించి కృతజ్ఞతాపాత్రమని దోచిన

మొడ వారి యభినందనములకు, నా కిది రచింప నెంతయో తోడ్పడిన శ్రీ చిల్లరిగె శ్రీనివాసరావుగారి "మహారాష్ట్ర చరిత్ర" ముఖ్యముగను, కీర్తిశేషులగు కొ॥ వెం॥ లక్ష్మణరావు గారి మహమ్మదీయ మహాయుగమును, ఎల్ఫినస్టోను మొదలగు దొరలరచనలును, పత్రములు. వ్రాసినది మూలబట్టి చద కొరకకుండ యందుకొని యచ్చొత్తి ప్రథమ ముద్రణము మాత్రమే దనకిచ్చినను యొప్పుకొని, నన్ను సంతస పెట్టిన బరంపురం వేగుంజుక్క గ్రంథమండలి వారికి నా వందనములు. వలయు పొత్తముల దెచ్చిపెట్టియు వ్రాసిన దానిని సరి చూచియు నాకెంతయు దోడ్పడిన సహవాసులకు కృతజ్ఞుడను. ఆంధ్రలోక మీగ్రంథము నాదరించి, యున్న తప్పుల జూపి, వలయు మార్పుల దెలిపిన దీని రెండవ ముద్రణమున తప్పక దిద్దుకొన గలవాడను.

27—11—24
బరంపురం (గంజాం)

ఇట్లు
జయంతి వేంకట కృష్ణారావు.

కృతి

సీ॥ బహుకళా ప్రద్యోత • బ్రహ్మ మందిరమైన
యీ విశ్వమున జన్మ • మిచ్చినారు;
గర్భవాసమునందె • కడగి స్వార్థ త్యాగ
గురు మంత్రమును నాకు • గరపినారు;
ఆత్మదేశారాధ • నాశక్తి గనుంగాక
యంచు నన్నాశీర్వ • దించినారు;
ఆజన్మమును నాకు • నాదర్శకము గాంగ
తమ కీర్తి ధరనిల్పి • తనరినారు;
గీ॥ అరయ నాకిట్టి మాతాపి • తరులకంటె
కలరె ప్రత్యక్షదైవతం • బులు ధరిత్రి
మత్కృతంబైన యీకృతి • మహితభక్తి
తత్పదాంభోజముల కంకి • తంబొనర్తు.

1-1-1925.

జ॥ వెం॥ కృష్ణారావు.

సంపాదకీయము

1914వ వత్సరమున శ్రీ శివాజీ చరిత్ర రచియించిన శ్రీయుత జయంతి వెంకటకృష్ణారావు పంతులుగారే గ్రంథమును రచియించిరి. వారి యన్నగారగు శ్రీయుత జగన్నాథరావు పంతులుగారు ఉపోద్ఘాతమును వ్రాసిరి. గ్రంథకర్తగారు కూడ తొలిపలుకు వ్రాసిరి. సంపాదకీయ మను పేర నేమును యీ రెండు మాటలు నాచారము ననుసరించి వ్రాయక తప్పినది కాదు.

గ్రంథకర్తయు దన తొలిపలుకున సీ గ్రంథరచన కేయే గ్రంథములు సాయ మొనర్చినవో పేర్కొనియే యున్నారు. మహాత్ముల జీవితముల బ్రచురించుటలో నిదియే మా ప్రథమప్రయత్నమై యున్నది. కావున నిట్టుల దేశోద్ధారకుల జీవచరిత్రల గూడ గొన్నింటి నపుడపుడు బ్రచురింప మా జేయు ప్రయత్నములకు మా పాఠక లోకముగూడ తోడ్పడ వేడుచున్నాము. ఈ గ్రంథ ప్రాశస్త్యతం గూర్చిన చర్చల కొఱకు నాంధ్ర లోకము నెంతేని బ్రార్థించుచున్నారము.

ఇక పూర్వ కవి విరచిత గ్రంథ ప్రచుర కార్యమున కెంతేని బ్రయత్నింతుము.

జనవరి, 1925. సంపాదకుడు.

నానా ఫడ్నవీస్

విషయసూచిక.

మొగల్ చక్రవర్తుల వంశ వృక్షము

1 బేబరు (1526—1530)

2. హుమాయూను (1530—1556)

3. అక్బరు (1556—1605)

- 4. జహంగీరు (1605-1627)
  - ఖుస్రూ
  - 5 షాజహాన్
    - దారా
    - షూజా
    - 6 ఔరంగజీబ్ (1658—1707)
      - అజామ్
        - అజీమాషాన్
          - ఫ్యుర్ ... 19)
      - 7 బహదర్ (1707—12)
        - 8 జహందర్ (1712—13)
          - 12 అలంగీరు II (1754—59)
          - 13 షాఆలం (1759—1806)
          - 14 అక్బర్ II (1806—37)
        - ఖుజిస్టా అక్తార్
          - 10 మహమ్మద్ (1719—48)
          - 11 అహమ్మద్ (1748—54)
      - అక్బర్
      - కామ్ బక్ష
    - మూరాడ్
  - షారియార్
- డానియల్
- మూరాడ్

(మహారాష్ట్ర రాజవంశము)

(శ్రీ) శివాజీ వంశావళి

1. శివాజీ (1674—80)

- 2 శంబాజీ (1680—89)
  - 5 సాహూ (సతారా రాజు) (1708—1749)
    - * 6 రామరాజు (సతారారాజు 1749—77)
- 4 తారాభాయి (1700—08)
  - శివాజీ (కొల్హాపుర రాజు) (1708—12)
- 3 రాజారామ్—రాజసాభాయి (1689—1700)
  - * శంబాజీ (కొల్హాపురరాజు) (1712—60)

* నిజ సంతానము లేదు.

నానా ఫర్నవీస్

I భారతవర్షము—మహారాష్ట్ర విజృంభణము.

శ్రీ నివాసంబగు భారత వర్షము భారతీయుల యేలుబడి నుండి తప్పి పరాధీనమై కట్టుబట్టయు తిన దిండియు గూడలేక, దాస్యమే శరణ్యమని యెంచి, యెంతటి తుచ్ఛ జీవనమేని తనకు దగునని తలచినది యీ నూటయేబది యేండ్లనుండియే. అంతకుమున్ను రాజ్యమేలిన యవన, తురష్క, మొగల్ రాజులు మన సీమకరుదెంచి, నిజవీర్యంబున నిర్మించిన సామ్రాజ్యంబుల నివసించి, పాలించి, పాలితులతో కలసి, వారి కష్టసుఖములపాల్గొనుచునుండెడివారు. రాజ్యశ్రీకాయువు పట్టగు ధన ధాన్యాదివస్తు సంచయము పరసీమల కేగకునికి ప్రజాసంతుష్టియు, తన్మూలమున రాజ్యశాంతియు నుండెడిది. దైవికము కాక మానవ కల్పితమగు మతమాత్సరమేనాడు వృద్ధినొందెనో యానాటినుండియు, గృహకలతలు తలజూపజొచ్చెను. వలయునంత పనిలేని మానవులకట్టి విపరీత చర్యలు సహజములే కదా! అక్బర్ మొదలగు పాదుషహాలు పనివడి బాగుజేసిన నేలుబడి కేలికమైన యలంఘీరు, పరశత్రుభయము లేమింజేసి నింతవరకు మరచి మచ్చికవడిన మతభేదముల రేపి, రేగిననేల మరల పూటు వడకమున్నె కీర్తిశేషుడయ్యెను. ఆ వేని సంతతికంత చాకచక్యములు లేమింజేసి క్రమంబున నా మొగల్ సామ్రాజ్యము తుత్తునియలై యెవరికి

చిక్కినది వానికి దక్కె, ధరణీరాజ్యము వీరభోజ్యమను నుడువు సార్థక పరచెను. ఈ వంతుదారులలో శ్రీశివాజీ మొదలగు నొకరిద్దరు తప్ప తక్కినవారు నిజ లాభాపేక్ష తప్ప ప్రజాశ్రేయము గోరి పనిచేసినవారు కారు. కావుననే వారి రాజ్యములును వారితోడనే యంతమయ్యెను. కాని ప్రజాలాభ వాంఛితులయి తనస్వాతంత్ర్యమున పొందిన మహారాష్ట్ర, పీష్వ ప్రభుత్వములు కొంతకాలమైన ప్రజల మెప్పువడసినవి.

అటుల ప్రసిద్ధికెక్కిన హైందవరాజ్యము స్వార్థత్యాగులగు శ్రీశివాజీ, బాలాజీ విశ్వనాథ్, బాజీరావుల నాడు పెరిగి పెద్దదయి, పీష్వా బాలాజీ బాజీరాయల నాడు ఆసేతు హిమాచలమును తన ప్రతిభ వెలిగించెను. నిజరాజ్య నిర్మాణ కాంక్షాపరులగు నాయకుల చేతబడి మూడవ పానిపట్టుయుద్ధమున పరాభవమొందెను. నిజధర్మమును వీడిన ఫలిత మదియని గ్రహించనేరకుండెను. గృహకలహములలోనై, వర్తక లాభాపేక్షను వేలకొలది మైళ్లదూరమున నుండి యరుదెంచిన పరసీమలవారి హస్తముల కీలుబొమ్మయయ్యెను. మహాధీమంతులగు నానాఫర్నవీసు మొదలు గాగలవారల మాట వినకుండెను; చెడెను. అట్టి రాజ్య క్షయ క్రమమే నానా ఫర్నవీసుని జీవిత చారిత్ర్యము. ఆ రాజ్యరమ పెరుగు విరుగుదలల కాతని జీవితమొక శరపంజరము వంటిది. అతడు లేని పదునెనిమిదవ శతాబ్దాంత చరిత్ర 'కన్నులేని భారతి' యనవచ్చును.

అతడు జననమొందిన కాలమునాటి భారతరంగము నొకింత యెరుగకున్న వానిచరిత్ర మనకంతగా బోధపడదు; కాననే నాటి ఇతిహాసమొకింత దెలిసికొన ప్రయత్నింప వలయును. క్రీ॥శ॥

1740 ఏప్రిల్ 28వ తారీఖున బాజీరావు స్వర్గస్థుడయ్యెను. ఈతడు పేరువడసిన మహారాష్ట్ర పీష్వాలలో రెండవవాడు. అతడు పరిపాలనా ధర్మముల యొక్క అన్ని శాఖలను ఉపేక్షించి మతాచారముల యందు నిర్లక్ష్యము గలవాడు. కేవలము యోగివలె వర్తించెనని నిందింతురు. "అతడు బ్రాహ్మణ వర్ణముయొక్క కొన్నిలోపములను గలిగి యున్నను బ్రాహ్మణులయొక్క యాచార మర్యాదావలంబనమును గలిగియుండలేదు. అతని దేశీయులతనిగూర్చి చేసిన ఖండనల కన్నిటికిని ఆతనికి తటస్థించిన యాపత్కలితమైన స్థితిగతులే ప్రత్యుత్తరము లియ్యగలవు. అతడు అత్యాశాపరవశుడైనమాట సత్యము. దక్కను నంతను వశపరచుకొన వలెనని యతడు కడవట చేసిన ప్రయత్నమునందు తన సాధన సంపత్తిని తప్పుగ గణించెను. అపుడు తన దూరదృష్టి లేమి నతడు తరుణములో నే గ్రహించుకొని యాయుద్యమమునుండి జాగ్రత్తగ తప్పుకొనెను".

ఈ బాజీరావునకు ముగ్గురు కుమారులు గలరు. పెద్దవాడగు బాలాజీ బాజీరావు తండ్రి తరువాత పీష్వాయాయెను. రెండవ కుమారుడగు రఘునాథరావు, మహారాష్ట్రరాజ్యవినాశమునకు ప్రథమ పురుషుడు. ఈతని కుమారుడగు రెండవ బాజీరావుతో రాజ్యవినాశము పూర్తియయ్యెను. మూడవవాడు జనార్దన భావా యను నతడు యవ్వనమందే చనిపోయెను. వీరుగాక బాజీరావునకు, మహమ్మదీయ భార్య వలన నొక పుత్రుడుగలడు; ఆ కుమారునికి ఉపనయనము చేసి బ్రాహ్మణులలో జేర్పింప వలెనని అతడు కొంత యత్నము చేసెనట. గాని బ్రాహ్మణాక్షేపణముల వలన ఆ ప్రయత్నము విఫలమాయెనట,

ఈతడే మనము మున్ముందు విన బోవు షంశేర్ బహద్దర్.

ఈ మహారాష్ట్రుల చరిత్రయందు అప్పుడప్పుడు సంగ్రహముగ నైన వారితో సంబంధముగల రాజ్యములన్నిటిని కొంచెము వివరింపకున్న దేశకాల పాత్రంబులు స్పష్టముగ దెలియనేరవు.

నాదర్‌షాచే ఢిల్లీ పాదుషహా యగు మహమ్మదుషా అవమానితుడై తన కిరీటమును శ్వేచ్ఛను మరలపొందెను. ఢిల్లీ యందలి మూడుకోట్ల సవరనులధనము కొల్లపెట్టబడెను. దేశములో నివారెవరి నెవరు కొల్లపెట్టుకొనినను ధనము అచ్చటనే యుండుటవలనదారిద్ర్యత లేకుండెను. పరదేశీయుని చేకొల్ల పెట్టబడిన ధనము మరల వచ్చుటకు వీలులేకుండెను. ఢిల్లీపట్టణ వాసులు వేలకొలది చంపబడిరి. మహమ్మదుషా మరల తలయెత్తుకొనలేక సింహాసనము నందు జీవచ్ఛవ మయి పడియుండెను. కాబూలు, తట్ట,ముల్ తాను, రాజ్యములుపర్షియాతో కలుపుకొనబడెను.

నేటి హైద్రాబాదు రాజ్య నిర్మాతయగు నిజాముల్ ముల్కు, అమీరు లుంబ్రావు, అను బిరుదుతో కొంతకాలము ఢిల్లీయందుండి, తన రెండవ కుమారుడగు నాజర్‌జంగు, తిరుగుబాటు చేయదలచుచున్నాడని విని, పెద్దకుమారుడగు గాజీయుద్దీనుకు తన బిరుదము నిచ్చి ఢిల్లీ నుండి తాను హైద్రాబాదునకు ప్రయాణమయ్యెను.

ఔడ్ (అయోధ్య) నావాబు అయిన సాధద్‌ఖాను కాలముచేసినందున అతని అల్లుడును, మేనల్లుడును నైన, మునుమూరుఖాను, సబ్దరుజంగు తరువాత నవాబయ్యెను.

చక్రవర్తి కింకను సామంతులైన రాజపుత్రరాజులు

జయపూరు, ఝూడ్పూరు, ఉదయపూరు నైయుండెను. చివర రెండు రాజ్యములును, మహారాష్ట్రులచే చాలవరకు వశము చేసుకొన బడెను. కాని జయసింగునకును, బాజీరావు నకును గల స్నేహమువలన జయపూర్ రాజ్యమున దండయాత్ర జరుప బడలేదు.

సింధునదీ తీరమున ఆగ్రా, జయపూరు మధ్యస్థలము నాక్రమించుకొని 'జాటు' లనియెడి యొక శూద్ర సంఘముల వారు రాజ్యము చేయుచుండిరి. వీరి నాథుడగు సూరమను ఆకాలపు అరాచకములలో నధికార సమన్వితు డయ్యెను. ఔరంగజేబుయొక్క సామానులను దోచుకొనుటవలన వీరు భరతపురపు కోటను కట్టుటకు ప్రారంభించిరి. తమ విజృంభణమున మహారాష్ట్రులు చంబల్ నదిని దాటిన తరువాత నీ రెండు జాతులవారికిని పరస్పర స్నేహభావ ముదయించెను.

అలివర్దీఖాన్ అను నతడు, బేహారమునకు నవాబుఅయియుండి, బెంగాలు, ఒరిస్సా నవాబులనుచంపి మూడు రాజ్యములకును తానే యధిపతి యయ్యెను.

ఢిల్లీ చుట్టుప్రక్కలనే ఆలీ మహమ్మదు రోహిలా యను నతడు, రోహిల్ ఖండమను పేర ఒక రాజ్యమును నిర్మించెను.

దక్కనులో, మహారాష్ట్రుల కధికారమున్న దేశము నందు తప్ప తక్కిన దేశమునంతటను, నిజాముల్ ముల్కు మహారాష్ట్రులతో కప్పమును సమముగ ననుభవించుచుండెను.

బీజపూరు, గోలకొండల వంశములక్రింద కడప, కర్నూలు, సావనూరు గవర్నరుల సంతతి వారగు నవాబులు, మహారాష్ట్రులతో సఖ్యముగా నుండి యొకవిధమైన స్వాతంత్ర్యము

ననుభవించుచుండిరి. ఆర్కాటు నవాబుయొక్క అల్లుడై పేరొందిన చాందా సాహేబు తిరుచునాపల్లి రాజునకు రక్షణ మొసగెదనని మిషమీద, నా సంస్థానము నాక్రమించుకొనెను.

తంజావూరునకు నామమాత్రపు రాజగు నాతడు వెంకాజీయొక్క మనుమడు వెంకాజీ. ముగ్గురు కుమారులలో కడసారివాడగు తుకాజీ మాత్రము సంతానము కలిగియుండెను. ఈ సమయములో తుకాజీయొక్క యిద్దరు కుమారులును జీవించి యుండిరి. పెద్దవాడగు శయాజీ అను నతడు చాలదినములనుండి మంత్రిగనున్న యొక మహమ్మదీయ ఉద్యోగస్థుని వలన పదభ్రష్టునిగ చేయబడి మద్రాసులోని, యింగ్లీషువారి నాశ్రయించి యుండెను. రెండవవాడును, దాసీపుత్రుడును నైన ప్రతాపసింగను నతడు, మహమ్మదీయ వజీరుచే సింహాసనాధిష్టితునిగ జేయబడెనే కాని యాతడు మంత్రి యధీనములో నుండుట కిష్టపడక వెంటనే యతనిని చంపివేసెను.

తరువాత కొలది కాలములోనే తుత్తునియలైన, మొగలు రాజ్యమును క్రమక్రమముగ నాక్రమించి కలహములందు చొరనున్న యింగ్లీషు, ఫ్రెంచి రాజ్యములవారు, విధేయు, వినమ్రులై తమచుట్టును నున్న చినచిన్న దర్బారు లన్నిటికిని లంచములును నజరానాలను నిచ్చుటచేత వ్యాపారపు హక్కులను వృద్ధిచేసుకొన యత్నించుచుండిరి.

పోర్చుగీసువారు మహారాష్ట్రులచే గర్వభంజను లైరి. బొంబాయి యందు యింగ్లీషువారు, చిమ్నాజీ అప్పాద్వారా తమ వ్యాపార హక్కులను వృద్ధిచేసుకొనుటకు ప్రార్థించిరి.

సుందా రాజాయును, కార్వారు దేశాయియు, మహా

రాష్ట్రులతోడి యుద్ధమునందు పోర్చుగీసువారికి సాయపడిరి.

కొల్హాపురపు రాజు సంస్థానమునకు తగిలియున్న రాజ్యముగల బెహ్నూరు రాజు ముభావముగ నుండెను.

మైసూరు రాష్ట్రము మొగలులకును, సాహూకును సామంతుడుగ నెంచుకొనబడినప్పటికిని పది పదునైదు సంవత్సరములనుండి దరి సంస్థానాధిపతుల సాయమువలనను, యుద్యోగస్థుల సామర్థ్యము వలనను, మహారాష్ట్రుల యాధిపత్యమునుండి తప్పించుకొని యుండెను.

బాజీరాయుని యవసానకాలము నాటికి శ్రీ శివాజీ స్థాపితమగు అష్టప్రధాన పద్ధతి నామమాత్రావశిష్టమైనది. పీష్వాయే, రాజ్యమునకెల్ల అధికారి యయ్యెను. మొగలుల సామ్రాజ్యము మహారాష్ట్రుల హస్తగత మయ్యెను. వారి దాడులవలన కొల్లగొనిన ధనము, బాలాజీ విశ్వనాథుని యేర్పాటు ప్రకారమే పంచుకొనబడుచుండెడిది.

కాని శ్రీ శివాజీ ఛత్రపతి నియమములు మారి నేటివారు క్రొత్త యేర్పాటులను తెచ్చి పెట్టిరి. దినదినాభివృద్ధి నొందు, మహారాష్ట్రమున కది యప్పట్టున నెంతో యవసరముగా గానుపించినను, క్రమమున రాష్ట్ర వినాశనమునకు కూడ నవియె కారణభూతము లయ్యెను. ఈ యేర్పాటులలో నేటిదనుక మన్నిన మహారాష్ట్ర రాజ వంశములు నాటి వీరులచేత స్థాపితము లయ్యెను. మధ్యపరగణాలలో నాగపుర రాచ కుటుంబమునకు రఘుజీ భోన్స్లే మూలపురుషు డయ్యెను. బరోడా గైక్వారు వంశమునకు ఆదిపురుషు డగు

పిలాజీ గైక్వారు గుజరాతున నేలుచుండెను. మాల్వాలో, ఇందూరు రాజవంశమును, ముల్హారరావు హోల్కారు కనిపెట్టెను. రానోజీసింధ్య గ్వాలియర్‌లో రాజనిర్మాణ మొనరించెను. వీరు అందరును సతారా మహారాజ ప్రతినిధులగు శ్రీ పీష్వాల యేలుబడికి లోనగు సేనాధిపతులే; వీరల బలమ్మునన క్రమంబున మహారాష్ట్రమ పేరంది, పెద్దదై, మకల వారల కలహ కారణముననే తుత్తునియలయ్యెను.

2 బాలాజీ జనార్దన భానూ.

నానా ఫర్నవీస్ అని పేరొందిన బాలాజీ జనార్దనభానూ, జనార్దను బుల్‌హార్ భానూ కుమారుడు. ఈతడు క్రీ॥శ॥ 1741 సం॥ మే, 4 వ తారీఖున జనన మొందెను. ఈతని తల్లి మహీండ్లీ వంశపు బిడ్డ. బాలాజీ బాజీరావువద్ద కార్కూనుగానుండిన బుల్హారుని పేరంతగా ప్రఖ్యాతి వడసినది కాదు. మన నానా ఫర్నవీసు బాల్యముకూడ అంతగా ప్రఖ్యాతముకాదు. పదవయేట సదాశివ రఘునాథగుడ్రి కుమార్తెయగు యశ్వంథాభాయిని యీతడు వివాహమాడెను. తండ్రి గతించిన తరువాత అనగా తాను పదునైదు వత్సరములవాడైనపిదప యితని బుద్ధికుశలతను పీష్వా కనిపెట్టి ఫర్నవీసు పదవి నిచ్చి బయటకు తెచ్చెను. కాల క్రమమున తన బుద్ధి బలముననేమి, దూరదృష్టినేమి, యీతడు పీష్వా దర్బారున నొక ప్రఖ్యాతపురుషు డయ్యెను.

ఫర్నవీసుయందు గల వాత్సల్యముచే పీష్వా తాను మైసూరునకు బోవునప్పుడు తనతోగూడ నానాను గొంపోయెను. తిరిగి వచ్చుటయు అంత చిన్నవయసుననే తనకు కుమారుడు గలుగుటయు, కొలది నెలలకే ఆశిశువు మరణించుటయు, నానా కోమల హృదయమును కలచివేసెను. ఆ దుఃఖము నాపుకోనలేక తన స్నేహితుడును, మున్ముందు పానిపట్టున వీర విహార మొనర్చి కీర్తిశేషుడుకానున్న పీష్వా పిన్నతండ్రికుమారుడును నగు సదాశివరావు భావు గోదావరీతీరమున విడిసియున్నాడని విని యచ్చటికి విశ్రాంతిగోన నేగెను. ఇదివరకే యీ సదాశివరావు భావు పీష్వా నిందు దర్బారున రఘునాథరావుని అధిక వ్యయప్రియు డని నిందించియుండెను. పాపము రఘునాథుని దెట్టి గ్రహచారమో గాని, యెన్ని యుద్ధముల జయమొందినను యొక్క కాసయినను పీష్వాల బొక్కసమున జేర్పలేకుండెడివాడు. వాని దురదృష్టముకు తోడు అధిక వ్యయమువలన నిందలపాలాయెను. అట్టి యీతడు అబ్దాలీ వైస్రాయిని, వాని యాఫగనులను లాహోరునుండి పారదోలి తిరిగివచ్చిన దాదిగ హిందూస్థానమున మహారాష్ట్రులకు, ప్రతి యుద్ధమున నోటమియె కలుగుచుండెను. దక్షిణమున సదాశివుడు కోంకణ మైసూరు దండయాత్రల విజయుడై అమిత ధనరాసులు, కప్పముగ గొనిదెచ్చి పీష్వామెప్పువడసి యుండెను. ఈలోగా నిజాము దర్బారు తెలివి లేమిని సదాశివరావు వారలపై దండెత్తి మొగలుల నోడించి, వారిని అతి నీచమగు సంధి కొడంబడజేసి అరువది రెండు లక్షలు రాబడిగ గల రాష్ట్రమును మహారాష్ట్రులకు సంపాదించిపెట్టెను. ఈ కారణములవలన పీష్వాకు వానియందు గల దయ యధికమై వానిని సర్వ సేనాధిపతిగ గావింపజేసెను. తోడ్తోడనే యున్న నానాకు చూచిన

దానివలనను, వినిన దానివలనను రఘునాథు నెడ నసూయా
భావము జన్మించెను. తన స్నేహితునిమహోన్నతచ్ఛాయ నీతని
భావములు పెంపొందుచు వచ్చెనే గాని యీ రానున్న మహా
సమరమున సదాశివుని సేనాధిపత్యము హైందవ రాజ్య
లక్ష్మికి తెచ్చిపెట్టు ముప్పు, నానా కనువిప్పి,తన చెలికాని గు
ణావ గుణములను వెల్లడిచేసెను.

సదాశివుడు సహజముగ ధైర్యశాలియు, పట్టుదల గల
వాడు, నైనను తన కిదివరకు రణదేవి యనుగ్రహించిన విజయ
ములచే ఉత్సాహభరితుడై గర్వించియుండెను. అనుభవములే
ని సేనాధిపతియం దపాయకరంబగు సంగ్రామోత్సాహ మ
తని మనంబు నావహించెను. సులభంబుగ గడించిన జయం బ
తని మూర్ఖ ధైర్యము నిచ్చెను. కొన్ని యపజయముల నెన్న
డైన పొందయుండిన యడల నతనికి విద్యా బుద్ధులు వొడ
మి శ్రేయం బయ్యెడిదే. సదాశివరావును అతని యన్నకుమా
రు డగు విశ్వాసరావును వెంటనంటి వచ్చిన సైన్యము సుమా
రు 20,000. నిరకరమైన గుఱ్ఱపు దళంబును ఇబ్రహీముఖాను
గర్ది యొక్క కాల్బలము 10,000 వరకు నుండెను. ఇదిగాక
బాలాజీరావుతో గొప్పసైన్య మింకను నిలవ యుండెను. వాని
నదాశివరావు ఢిల్లీపట్టణమునకై పోవుచుండగ ద్రోవలో కలసి
కొనవలయు నని మహారాష్ట్ర సేనాధిపతు లందఱకును ఆజ్ఞలు
పంపబడెను. ఆప్రకార మతడు చంబల్ నదిని దాటుటకు పూ
ర్వమే, ముల్హారిరావు హొల్కారు, జంకోజీ, సింధియా, ద
మ్మాజీ, గాయక్వారు, జస్వంతరావు పరావు, అప్పాజీరావు,
[?]ఖ్వారీ, అంతాజీ మంతెశ్వర్ గోవిందపంత్ బొందిలే, మొ

ఱియు ననేక మ్రిక్కడి సేనాపతులు వచ్చి కలిసికొనిరి. రాజ
పుత్ర ముఖ్యు లనేకులు తమ యాశ్వ దళంబులను బంపిరి. అనే
క పిండారీలు, ఎల్ల తరగతుల, నశిక్షితులగు భటులు, యా మ
హా సమూహంబున గూడిరి. హిందువుల జాతీయ యుద్ధముగ
నది పరిగణింపబడెను. శూరజమల్లు, హొల్కారుచే ప్రేరితుడై
30,000 జనంబులతో నా మహా మహినినివచ్చి కలుసుకొనెను.

భావూయొక్క స్వంత సైన్యమందు ముఖ్య యుద్యోగ
స్థు లెవ్వరనిన: బల్వంత గణపతి మండలే, బాజీరావుయొక్క
మహమ్మదీయ భార్యాపుత్రుడగు షంషేరు బహద్దర్, రాజా
బహద్దర్, నారూశంకర్ (కొంకణ గవర్నరు) విఠల శివదేవు
(వించూర్కారు) త్ర్యంబకు సదాశివ (పురందర్) ఇంకను ననే
క మహారాష్ట్ర ప్రముఖులు గలరు.

ఈ మహా సేనతోడ సమరమున కరిగిన సదాశివుని దా
డిని గూర్చియు, ఢిల్లీచేరి అతడువన్నిన పన్నుగడలును, హోల్కా
రు, సురాజిమల్, మొదలగు రణ విశారదుల ప్రస్తావనలను,
'తాపట్టిన కుందేటికి మూడేకాళ్లు'అని భావు ఇచ్చ వచ్చినట్టుల
యుద్ధ మొనర్చుటయు, అందు హిందువులకు గలిగిన పరాభవ
మును, జగద్విఖ్యాతములు గానని యిచ్చోట నవి వర్ణించుట
లేదు. ఈ మహా సంగ్రామమున నానా పాల్గొనియుండెనే గా
ని దైవకృపను దెబ్బ తినకుండ తప్పుకొనగలిగెను. పానిపట్టు
గ్రామమున రణగడ నీడను మహారాష్ట్ర శిబిరముననున్న యా
డువాడ్రందరునుగడగడ వణకుచుండిరి. వారిలోనునానాఫర్నవీ
సు తల్లికూడ యుండెను. దేవునిపై భారము వైచి నిశ్చింతగ
నుండు మని నానా తన తల్లికి హితబోధ చేసెను.

సదాశివరావు రణగడయందు చిక్కుబడియున్న కాలములో యతని యవస్థనుగూర్చి యెప్పటివార్తలప్పుడు పీష్వాకు తెలియ వచ్చుచుండెను. నవంబరునెలలో నతడు అహమ్మదు నగరమునకు వచ్చెను. అచ్చటనుండి యతడు గోదావరీతీరమునకు వచ్చెను. సైన్యమంతయు హిందుస్థానమునకు బ్రయాణమయ్యెను. జనవరినెలలో నర్మదానదిని దాటుచుండగా సాహుకారులయొక్క యొక కోసిదు పానిపట్టునుండి ఔరంగబాదునకు తొమ్మిది దినములలో జేరుటకు నియోగింపబడినవాడై, పీష్వా సైన్యమును కలుసుకొని మహారాష్ట్రులోడిపోయి రని దెలియపర్చెను. అతనిచేతి కియ్యబడిన యుత్తరమును చదువగా నందు-'రెండు ముత్యములు కరిగిపోయినవి; 27 మొహిరీలు నష్టమైపోయినవి; యిక వెండి రాగియొక్క మొత్తము లెక్కింప శక్యముకాదు.' అని వ్రాయబడెను. ఈ మాటలచే పీష్వాకు స్థితి గతులు దెల్లమయ్యెను.

సైన్యమునుండి తిరిగివచ్చిన కొందఱి జనులనుండి యీ వృత్తాంతము ధృవపరచబడి నిస్సంశయ మయ్యెను. మొట్టమొదట యింటికి చేరినవారిలో బాలాజీ జనార్దనుడు ఒకడు. ఇతని తల్లి ఆఫ్గనులవలన చెరపట్టుకొనబడెను. ఈతని భార్యయు, సదాశివుని భార్య యగు పార్వతీభాయియు తప్పించుకొనిరి. పీష్వా విషాద సాగరమునమునిగెను. ఈదెబ్బల వలన మరి మెత్తిరిల్లలేదు. కాళ్ళీడ్చుకొనుచు మెల్లమెల్లగ పూనాకుబోయెను. ఆతని మతి చెడిపోయెను దేహ మనారోగ్యత నొందెను. వ్యధచే మంచముపట్టి జూన్మాసాంతమున పూనానగరమున నిజగృహమున కాలధర్మము నొందెను.

ఇక ఫర్నవీసునిగూర్చి కొంత దెలిసికొనవలసి యున్నది. ఆసంగ్రామ దినారంభమున యెవ్వరేమనినను వినక తనమిత్రుడగు భావూను వీడనని నానా శిబిరముననె నిలచెను; గాని ఐదు గంటలవేళకు సదాశివుడు కానరాకుండపోయె ననెడి వార్త విని గుఱ్ఱమెక్కి రణగడ వీడి పలాయనుడయ్యెను. పానిపట్టు గ్రామమున కరుగ నది నిండి క్రిక్కిరిసి యుండెను. ఆసీమ నెరుగనివాడు గాన నట నెటుబోవుటకును దోపకుండెను. వాని యదృష్టమునకు రానోజీపంత్ అనెడు బ్రాహ్మణు డొక డెదురై గుఱ్ఱము దిగి మారువేసమున తనతో రమ్మని పిలచెను. నానా తొడుగు లుడిగి గుఱ్ఱమును వీడి చిన్న ధోవతిమాత్రము గట్టి కొలదిమంది యనుచరులతో, తీర్థాటనమునకు బోవు బాటసారులవలె పశ్చిమ దిక్కున ప్రయాణమయ్యెను. కాని పానిపట్టునకు రెండు మైళ్ల దూరమైన నరుగకమున్నె శత్రువులచే వెన్నాడబడి పట్టువడి తనిఖీ చేయబడెను; గాని యీతూరికూడ యొక్క దెబ్బ యయిన తినక తప్పుకొనగలిగెను. మరల మరి పాతిక మైళ్లదూరమున శత్రువులచేత బడి ప్రక్కను మొలచిన రెల్లుగడ్డినిదాగి, ప్రాణములు దక్కించుకొనెను. వానియనుచరులును, రానోజీయును, ప్రాణములు గోల్పోయిరి.

కొంత కాల మచ్చటనే డాగి శత్రు సంచారము లేకుండ చూచుకొని మరల పయనిడ జొచ్చెను. బుద్ధి వెరిగినది మొదలెన్నడును కాలి నడకను దూరపు ప్రయాణములను జేసి యెరుగని నానా ప్రాణభీతిని గ్రుక్కాడు నిటకైన నాగకయొక్క యూపున ముప్పదియైదుమైళ్ళు నడచెను. మరునాడాకలి బాధకోర్వలేక చెల్లయూకులు సమాలి కడుపు నింపు

కొనెను. నాను మరల యెంతో కాలము నడచి నడచి చీకటి
పడకమున్న ఒకచిన్న పల్లెచేరి అట నొక గోస్వామి మఠమున
కతిథి యయ్యెను. కొంత విశ్రాంతిగొని మరల తెల్లవారక
మున్నె దారిపట్టెను. తరువాత నొక గ్రామముచేరి వర్తకు
డొకని పిలువ వానియింట విందారగించి అటనున్న యస్వంత
రావను నొకనికి పరిచయమును గావింప బడి వానితోడ పూనా
కరుగ నిశ్చయించుకొనెను; గాని ఆవర్తకుడు శత్రువు లా
గ్రామమున దిగుచు లాడుచున్నారని విని, తనబండీలోనే
నానాను జయ నగరవరకును గొనిపో నిశ్చయించు కొనెను.
నానా అందులకు ఒప్పుకొని బయలుదేరి త్రోవలో తన...మైన
మోసము చేకూరుననుభీతిని బండివీడి కాలినడకను-రాంవాం-
అను గ్రామమువరకును నడచిపోయెను. రామ్జీదాసు అను ధని
కు డొకడు నానా కచ్చోట నాతిథ్య మొసగి తన యింట
నొక్క-వారము దినములుండ నొడంబఱచెను. కాని వారమంత
ము గాకమున్నె-డీగుపట్టణమునకు బోవ నానా యత్నింప
నా ధనికుడు తగు సహాయము లేకుండ వానిని విడువ లేదు.
త్రోవలో నానా యొక పూర్వ పరిచితుని కలసికొని వాని
వలన తన భార్య-జిగినీ-లో సురక్షితముగా నున్నదనియు, వి
ఠోజీరావు బళెంకర ను నతడు యామెను యుద్ధభూమినుండి
తోడితెచ్చి యామె పినతండ్రియగు నారోపంతు గోళ్లే వద్ద
విడచె ననియు వినెను. ఈ శుభవార్త విని నానా వెంటనే
జగినీకి పోయి తనవారికప్పటి చావుతప్పి వచ్చినందుల కెంతో
[illegible] ప్రియముగ చూచుకొనబడెను.

అట కొంత విశ్రాంతి నైకొని కొన్నినాళ్లుండి పత్నీ

సమేతముగా నానా డీగన కేగెను. అట బాల్య స్నేహితుడగు
మహాదేవ్ పురుషోత్తమునిచే విడువబడక నెలదినముల వరకు
నుండి తరువాత మరల గృహోన్ముఖు డయ్యెను. త్రోవలో
తనతల్లి సేవకునొకనిని కలుసుకొని యామె మరణవార్త వినెను.
ఈ దుఃఖముచే సన్యాసియయి వారణాసికేగి సర్వత్యాగ మొ
నరింప నెంచెనే గాని, స్నేహితుల బలవంతమున బుద్ధిమరల్చు
కొని యింటి కరుదెంచి తల్లి యుత్తరక్రియల చేయనొప్పు
కొనెను. బరహాంపురమువద్ద యుద్ధవార్త విని చింతాక్రాంతహృ
దయుడై విడిసియున్న పీష్వాను కలసికొనెను. పీష్వా వానిం గాం
చి యెంతయుసంతసించి స్వాగత మొసంగెను. నానా సంగ్రామ
వార్తలెల్ల దెలిపి, వాని ప్రేమకు పాత్రుడై, తాను లేకున్న పీ
ష్వాకు మరియేమియు తోచకుండునట్లు చేసెను. ఈ బర
హాంపురమున కొలది కాలమున్న తరువాత పీష్వా పూనాకు
బో నిశ్చయించు కొనెను. తన భార్యదేహ మనారోగ్యము
గ నుండుటంజేసి ఆమెను కదల్పవీలులేక విడిచిపోజాలక పీష్వా
యనుమతిగొని నానా నర్మదాతీరమున విశ్రాంతిగొనుచుండెను.

పీష్వా బాలాజీ బాజీరావు తనరాజధాని కేగిననాటనుండి
యు మనోవ్యాధికి లోనై మంచముపట్టెను. కుశాగ్రబుద్ధియు,
కడు ప్రియుండును, గతించిన సదాశివుని స్నేహితుడును నగు
ఫడ్నవీసునకు నెన్నెన్నియో సంగతుల దెల్పవలెనని యెంచి, వా
ర్తావహుల నంపెను. తనకు కాల మాసన్న మగుచున్న దనియు
విలంబము సేయవలదనియు, చెప్పుచు, నెన్నియో లేఖల వ్రా
సెను. ఎట్టకేలకు నానాబయలుదేరి త్రోవలోనున్న పా[illegible]రా
చేరెను. విధాతృవ్రాలిట్టు లున్నదో గాని, నానా పూనా

చేరకుండగనే పార్వతిలో పీష్వా మరణవార్త వినవలసివచ్చెను. ఈ దుర్వార్త వినినంతనే యాతని దుఃఖ మపరిమితమయ్యెను. పూనా కేగి యెవరినైన చూడకుండగనే యింట గాలము వెళ్లబుచ్చుచుండెను.

నానా గుణావగుణములను బాలాజీ బాజీరావు గ్రహించి వాని నెట్టి పదవికి దే నెంచెనో నేరు చెప్పగలరు. వాని మరణమున తమ్ముడగు రఘునాథుని బలమధికమయ్యెను. పిన్నవయస్కుడగు మాధవరావు బల్లాల్ పినతండ్రి చెప్పు చేతల నడుచుకొన వలసివచ్చెను; గాని అతడు గూడ నానా యందు కీర్తిశేషుడైన బాలాజీ బాజీరావునకు గల విశ్వాసమును మన్నించి, వెంటనే కొలువునకు రప్పించి మాధవరావుని కార్ఖానుగా నియమించెను. ఈ యుద్యోగములో నుండగనే నానా మాధవరావుతోడ సలాగా కలిగి, యతడు పీష్వా బిరుదము సుబడయగాంచి మరలివచ్చి తనవారసత్వపు హక్కగు ఫడ్నవీసు పదవినిబొందెను. ఈకాలముననే తోడి కార్ఖాన్ అగు హరిపంతుఫడ్కె తోడి చెలిమి సంప్రాప్తమయ్యెనే, గాని మరి యెనిమిది వత్సరముల దనుక నానా రాజకీయ వ్యవహారముల సంతగా శ్రద్ధవహించి ప్రాముఖ్యత గణించి నటుల కాన్పించదు.

---

3 ఫడ్నవీసు ఉద్యోగము-అధికారము

ఫడ్నవీసు పదవి ఆదినుండియు నానా కుటుంబమునకే చెందియుండెను. మొట్ట మొదట ప్రవేశ పెట్టబడినప్పుడు యుద్యోగములు వంశపారంపర్యములు కావని చెప్పబడినప్పటికిని,

మన హిందువులలో నిరపకారణంబగు వంశ పారంపర్యపద్ధతి ప్రకారము కొడుకులకును మనుమలకును వచ్చుచుండెడివి. దేశములలో నరాచకము ప్రాప్తమైనప్పుడీ వారసత్వపు హక్కులు శూన్యమై అప్పటి స్థితిగతులనుబట్టి, బలాధిక్యత ననుసరించి ప్రాప్తమగుచుండెడివి. ఇటులనే లభించిన ఫడ్నవీస్ పదవికి నానా నిజమైన వారసుడు కాడు. ఈ పదవికి వారసుదారు నానా పెద్దతండ్రి కుమారుడగు మొరోబా; గాని 1763 సం॥మున నిజాముతో చేసుకొనబడిన సంధికారణమున మొరోబా వేరొండు ఉద్యోగమున నియమితుడై నానాకు ఫడ్నవీస్ పదవిని శాశ్వతముగా విడువ వలసివచ్చెను.

నేడు పెర్సనల్ సెక్రెటరీ పదవికి సరియగు నీ పదవి యందు నియమితుడగు ఫడ్నవీస్, పీష్వా తోడు తోడనే యుండి యెల్ల రాచకార్యముల తన నిజహస్తములను జరుపవలసినవాడగుచుండెను. ఈమహత్తర కార్యమున రాష్ట్రమునగల యున్నతోద్యోగులెల్ల వాని కాశ్రితులు కావలసి వచ్చుచుండెను. అదికాక రాష్ట్రాధికారులును, సామంతులును, తమలెక్కలను సరిచూచుకొన వాని నాశ్రయింపవలసెడివి. అదికాక సర్వకాలములందును పీష్వా వెను వెంటనుండుటచే నిజబుద్ధి కౌశలమున రాష్ట్రమును తానే యేలుచుండెనని చెప్పవచ్చును.

మాధవరావు సమర్థత గల ప్రభువగుటంజేసి నానా చాకచక్య మంతగా పనికివచ్చినది కాదు. కాని మున్ముందు దానాక్రమింపనున్న పదవికి వలయు పరికరము లతడు బాగుగ పరీక్షించి గ్రహించగలిగెను. విచక్షణాపూర్వకముగ శత్రుమిత్ర నిర్ణయ మొనరింప గలిగెను. చిరకాల నిర్విశమగు

రఘునాథునియందలి యీర్ష్యాభావము పెంపొందించుకొను
చుండెను. ఆ రాచ బంధువు అన్నకొమరుని పాలనాకాలమున
రెండుసారులు చెర కంపబడి, ముదిమిని పెండ్లాడిన పిన్నవయ
స్కయగు ఆనందాభాయిచేతుల కీలుబొమ్మయై, ప్రభునెడ
ద్వేష పూరితుడుగ నుండెను. అదియె కారణముగా పీష్వాపరి
వారమున నొక్కడగు నానా యందును ద్వేషముగలిగియుం
డెను. అదికాక 1769 వత్సరమున జంకోజీ సింధియా మరణా
నంతరము సింధియాపదవికి కేదార్జీ సింధియాను నియమించి,
బాలుడగు నాతనికి వాని పినతండ్రియు మహా నిపుణుడునగు
మహాదాజీని సంరక్షకుడుగా నియమింప దలచెను. మహాదాజీ
అందుల కీయకొనక పేరునకు మాత్రము కార్యకానులును నిజ
మునకు మంత్రులును అయిన నానా ఫడ్నవీస్, హరిపంతు ఫడ్కే
లను నాశ్రయించి మాధవరావు సాయమువడసి తానే సింధి
యా యయ్యెను. దీన నానా మహాదాజీ స్నేహమువడసి బల
వంతుడయ్యెను.

తోడి కార్యకానగు, హరిపంతు ఫడ్కే, యొకముందు
తనకాప్తమిత్రుడై సాయమొనరింప నేటినుండియు చెలిమిగావిం
పబడెను. పీష్వామంత్రియు, వయోవృద్ధుడును యావన్ప్ర
భుని సామర్థ్యముల నతిశయించి వానిప్రకాశమును రాహు
గ్రహమువలె మ్రింగివేయజాలిన సఖారాంబాపూ నాశ్రయించి
వానికి మిత్రుడయ్యెను.

తనపదవికి అనుకూలమగు అధికారముతోడను, మహా
మహుల స్నేహముతోడను, రఘునాథరాయని విరోధమును
నిర్లక్ష్యముగా జూడగలిగిన నానాకు, 1772 నవంబరు 18వ తే

దీని మాధవరాయని మరణము, కావలయునంత పని గల్పించె
ను. నిజసంతాన లేమింజేసి మాధవరాయని తరువాత వాని
తమ్ముడగు నారాయణరావు పీష్వాయయ్యెను. రఘునాథరా
వు సంరక్షకుడుగానుండి రాజ్యము పాలించుచుండెను. నానా
పీష్వాకు ప్రియమిత్రుడగుటంజేసి తనపదవి నిలుపుకొనగలిగెను.
కాని ఆగష్టు తే 20 ది 1773 వత్సరమున జరిగిన నారాయ
ణరాయని హత్య నానాకు యాశ్రయ విహీనునిగా చేసి రఘు
నాథునికి ప్రత్యర్థిగా నిలిపెను.

4 మహారాష్ట్ర విప్లవము.

మాధవరావుయొక్క మరణమునకు పూర్వము కొంత
కాలమునుండియు రఘునాథరావుయొక్క నిర్బంధ కాఠిన్యము
చాలవరకు సడలింపబడినది. అన్నకుమారుని యారోగ్యము
క్షీణించిన కొలదిని రఘునాథరావు సంపూర్ణ స్వేచ్ఛనొంది
తాను పీష్వాయగుటకు హైదరుతోడను, నిజామాలీతోడను
కుట్రలుచేయ ప్రారంభించెను.

పీష్వాయొక్క యంత్యదినములలో మంత్రులవలన నా
యుత్తర ప్రత్యుత్తరము లడ్డగింపబడెను. అందు దోషులైన
19గురు కొండకోటల నిర్బంధింపబడిరి. రఘునాథరావు నిర్బం
ధము అతికఠినమయ్యెడిదే కాని, మాధవరావు తన మరణము
ఆసన్నమగుటెరింగి తన పినతండ్రి స్వేచ్ఛకొరకు ప్రయత్నించు
టాతనికి సహజమేయని మనస్సు సమాధానము చేసికొనెను.
అతనియొక్క సహజవివేచనా సామర్థ్యముతో రఘునాథరావు
దిట్టముగా నిర్బంధింపబడుటయో, బలముగ సఖ్యపఱుప బడుట
యో, చేయబడినగాని తనసోదరుడు రాజ్యమేలజాలడని,యతడు

కనిపెట్టెను. కావున నన్నిపక్షములును దీర్ఘముగ పరికించి చూచినయెడల సఖ్యమే యుచితంబనియు, వైషమ్యము లుదయించినయెడల రాజ్యము తుత్తునియ లగుననియు నత డూహించెను. వెంటనే శుకారాం బాపూను మరలపిలిపించి దివానుగ జేసెను. శుకారం తక్కిన మంత్రులందఱికంటె రఘునాధరావు యెడల నెక్కువ పక్షము కలవాడు. రఘునాధరావు మంచియోధుడని యతనికి గౌరవముకలదు. అందువలన రఘునాధరా వితనియెడల విశ్వాసము కలిగియుండెను. నానా ఫడ్నవీస్ మాధరావు క్రింద నింకను ప్రసిద్ధిలోనికి రాలేదు. అతని సామర్థ్యము లింకను పూర్ణప్రకాశమునకు రాలేదు. అప్పటికి శుకారాంబాపూ రాజ్యములో నున్న వారందరిలోను సమర్థుడుగ పరిగణింపబడుచుండెను. మాధవరావు యొక్క ప్రస్తుతపు ఏర్పాటులకు పూర్వమే నానా సివిలులో ఫడ్నవీసుగను, అతని పెద్దతండ్రి కుమారుడగు మోరోబా సైనికాస్థానమున ఫడ్నవీసుగను నుండుటకు స్థిరపరుపబడినది.

థీయూరు గ్రామమునకు రఘునాధరావు పిలిపించబడెను. సఖ్యమొనగూర్పబడెను. మాధరావు, శుకారాం బాపూయొక్క సమ్ముఖములో తనతమ్ముని, పినతండ్రిరక్షణ కనేకవిధంబుల మనసు కరుగునట్లు బోధించి యొప్పగించెను. అంతియగాక యాతడు పరలోకమున కేగక పూర్వము తమ్మునితోడను, పినతండ్రితోడను శాంతముగ రాచకార్యములను ముచ్చటించి పరస్పర క్షేమముకొఱకును, రాజ్యరక్షణ కొఱకును, ఐకమత్యమవసరమని బోధించెను.

సోదరుని పరలోకక్రియలు సాంతమైనతోడనే నారాయణ

రావు డిసెంబరు మాసారంభమున సతారాకుపోయి రాజువలన పీష్వా దుస్తులను బడసెను. శుకారాం బాపూ కార్భారి నామమున ప్రధానమంత్రి యయ్యెను. బుజాబాపురంధరే దివానుగనుండెను. నానా ఫడ్నవీసతని వారసత్వపుటుద్యోగమునందు ఖాయపరుపబడెను.

క్రొత్త పీష్వాయు, పినతండ్రియగు రఘునాధరావును కొంతకాలము వఱకును పైకే విరోధములును లేకనే యుండిరి; కాని తోటికోడండ్రైన నారాయణరావు తల్లియొక్కయు రఘునాధరావు భార్యయొక్కయు కయ్యాటములును, బ్రాహ్మణ మంత్రుల యీర్ష్యలును, నింతకంటె నెట్టిశాంత వివేక సంపన్నులకైన, భేదంబులు పుట్టింపగల వనుటకు సందేహములేదు. రఘునాధరావు, ఒక్క శుకారాం బాపూతప్ప తక్కిన మంత్రులందరి సమ్మతితో ఏప్రిల్ 11 వ తేదీని మరల ఖైదీగ పట్టుకొనబడి పూనాలో పీష్వా భవనమునం దొకభాగము నందే నిర్బంధింపబడెను. ఈచర్య యెక్కువ తీవ్రమైనదని శుకారాం బాపూ చెప్పుచు వలదని సలహాయిచ్చెను.

యౌవనుడగు పీష్వా యొక్క మతంబున నానా ఫడ్నవీసు గౌరవమును సంపాదించియుండెను. బుజాబాపురంధరే యును, హరిపంతుఫడ్కేయును పీష్వాయొక్క అంతరంగికులై యుండిరి. రాచకార్యములు శుకారాం బాపూ చేతనే నిర్వహింపబడుచుండెను. కాని పీష్వాయొక్క ప్రియతములు, ఘంత్రిపరిపాలన యెడల నయిష్టులుగనుండిరి. [illegible]గరరంగ సత్క్రియందత్యంతాభిలాష కలవాడై పీష్వా రాబోవు శీతకాలమునందు కర్ణాటక దండయాత్ర చేయ నిశ్చయించెన., దీనికొఱకు

హిందూస్థానమునుండి సైన్యములు మరలి వచ్చుట కాజ్ఞ యియ్యబడెను. కాని మహారాష్ట్ర దేశములోనే వాని నుపయోగింపవలసి వచ్చునట్లు కొన్ని వృత్తాంతములు జరిగెను.

హిందూరాజ్య నాశనంబున కరిష్ట సూచకంబైన దారుణ క్రూరకర్మమొకటి జరిగెను. అది భరతవర్షంబెల్ల మ్రాన్పడజేసెను. రాచకార్యములెల్ల నొక్కమారుగ స్తంభించి పోయెను. కుమారపేష్వాయగు నారాయణరావుయొక్క కోమల రక్తధారలు మాతృభూమి యుత్సంగమున బడి యనేక యుత్పాతంబులకు కారణమయ్యెను. అక్కటా! ప్రజల కొరకు యేర్పడిన రాజ్యము, అక్రమంబుగ నొక్క మానవ వ్యక్తిచే గాంక్షింపబడిన, యుపద్రవము లేల వాటిల్లకుండును!

ఆగస్టు 30 వ తేదీని నారాయణరావు పూనాకు దక్షిణపుదిక్కున కొండమీదనున్న పార్వతీ దేవాలయమున కరిగి, యటుతరువాత రఘోజీ ఆంగ్రియాకు దర్శనమిచ్చి, శనివార భవనమునకు తిరిగి వచ్చెను. భోజనానంతర మతడు మధ్యాహ్న విశ్రాంతికొఱకు అంతఃపురంబున శయనాగారంబునకు బోయెను. ఆ దుర్దిన యుదయంబున పేష్వాయొక్క కాల్బలమున విపరీతమగు కలవరము గానవయ్యెను. రఘోజీ ఆంగ్రియాను చూచి తిరిగి వచ్చునప్పుడా సంగతి పేష్వాకు దృష్టిగోచరమయ్యెను. అతడు భోజనమున కరుగుటకు పూర్వము హరిపంతుఫడ్కేను పిలిపించి, యతని కా వృత్తాంతమును తెలియపరచి, యే యల్లరియు జరుగకుండ జాగరూకత తీసుకొనవలయునని యాజ్ఞయిచ్చెను. కాని కాలకర్మంబులు హరిపంతు ఫడ్కేయొక్క బుద్ధిని మందగింపజేసెను. అందువలన నాతడు

దానిని గూర్చి శ్రద్ధ వహింపలేదు. నారాయణరావు తనయంతఃపుర మందిరంబున నిద్రాపరుడై యుండగా రఘునాథరావు, ఖిద్మద్దారుడును, పూర్వము నారాయణరావుచే బహిరంగముగ దెబ్బలశిక్ష వేయబడినందున మత్సరపూరితుడును, ఈ ద్రోహకృత్యమున ప్రధాన నిర్వాహణ భారమువహించినట్లు ముందు [illegible]నముచూడబోవునట్టి వాడును అయిన తుల్యాజీపవారుకును, సుబేదారు సుమేరుసింగుకును, మహమ్మదు యూసుఫుకును లోన ప్రవేశించుటకు సన్నలు చేసెను. వీరును రెండువేల గార్దీతో (శిక్షిత కాల్బలము) నారాయణరావు తనపై వ్రేలుచున్నగొప్పయాపదలను కొంచమైన నెఱుంగక మధ్యాహ్నవిశ్రాంతిని హాయిగ ననుభవించుచున్న భవనంబులోనికి మధ్యాహ్నము రెండుగంటల వేళ కలకలంబుతో ప్రవేశించిరి. భవనము కాపాడుచున్న ఖడకుసింగు స్వామిద్రోహియై యావిద్రోహులకలసెను. వారి ప్రవేశమట్లు నిరాటంకముకాగ నారాయణరావు శయ్యామందిరంబును నొక్క విసురున వచ్చి చేరుకొనిరి. ఆప్రక్క బుధసింగు జమాదారుచే పరిరక్షితంబై యుండెను. ఇతడు తన తోడితక్కిన దుష్టమిత్రులవలె కాక రాజభక్తిపరుడై కఠినముగ వారి దుష్కృత్యమున కొడంబడ నని ధీరత్వముతో బలికెను. కావునవారు మొదట వానిని దుదముట్టించిరి. ఈ కోలాహలమంతయును విని, గారణ మేమైయుండునోయని పేష్వా స్వంత సిబ్బందియొక్క కార్కూను ఇచ్ఛారావుపంతు, సత్వరముగ, నాయల్లరి జరుగు స్థలంబునకు వెలువడి వచ్చెను. దురాగ్రహులగు నాగర్దీలవలన నొప్పింపబడి, గోశాలకు వారి పోయి స్వప్రాణ రక్షణార్థము దాగుకొనిన గోవుతోగూడ, ఖర

డతుండెములుగా నాతడు నరికివేయబడెను. అపుడు అడ్డము వచ్చినవారి నెల్ల నట్లంతమొందించి యాహంతకులు పీష్వా శయ్యాగృహమును సమీపించిరి. అబాజీపంతు కార్ఖానీసు పీష్వా గృహముయొక్క తలుపులుమూయ ప్రయత్నించెను. కానియతడు మూయజాలకపూర్వమే రెప్పపాటున నతనివారు జంపిరి. వారందరు నప్పుడు శయ్యాగారములోనికి బ్రవేశించిరి. నారాయణరావాకలవరంబున నిద్రనుండి మేల్గాంచి, భయాకలిత విహ్వల మానసుండై యేమిచేయుటకుం దోపక, కోశసోపాన మార్గమున గణపతి మహాలును దాటి, పినతండ్రి రఘునాథరావు యొక్క యాగారంబున కరిగెను. అయినను సుమేరుసింగాతని పిఱుందనంటి తఱుముకొని పోయెను. అతడు పోయిన తోడనే పినతండ్రి చేతులలో పడి దీనాలాపంబుల నిట్లు వేడుకొనెను. "తండ్రీ! నన్ను కారాగారబద్ధుని నైన జేసి నీవే పీష్వా రాజ్యమును నేలుకొనుము. నా ప్రాణముల రక్షింపుము. ఈ తిరుగుబాటు నీవు కల్పించితివి, అయినను నామీద కరుణించి, ఈ విద్రోహుల పంపివేసి, నన్ను గావుము. దయారసంబుగలిగి నన్ను రక్షింపుము." పీష్వాయొక్క కరుణాలాపంబులు విని, రఘునాథరావు మనసు కరిగి యా దుష్టుల ప్రాణముల ప్రార్థించెను; కాని యప్పటికప్పుడే కాలాతీతంబయ్యెను. తుల్యాజీపవారు పీష్వాయొక్క పాదము లబట్టుకొని బలాత్కారముగ రఘునాథరావుయొక్క యాలింగంబునుండి యీడలాగెను. సుమేరుసింగు, మహమ్మద్ యూసూఫ్ [illegible] క్రూరకరవాలంబుల నాభాగ్యుడగు బాలునిపై [illegible]. ఆసమయంబున నారాయణరావుయొక్క విశ్వాస

పాత్రుండగు పరిచారకుడు చపాజీతిలేకారు, నిరాయుధుండైనను ధైర్యముగ యజమానుని కడ్డముపడి రక్షింపయత్నించెను. విరామములేక వ్రాలుచున్న యా వ్రేటులెల్ల తన దేహమును తుండెతుండెములుగా జీరుచున్నను నారాజభక్తుడు, వెనుకదీయక తన మేన నుసురులున్నంతవరకు యజమానుని విడువలేదు. అట్లు పట్టపగలు మధ్యాహ్నంబున, బహిరంగముగ తన స్వంత భవనములో మందభాగ్యుడగు నారాయణరావు హత్య గావింపబడి, యెల్లకాలముల నాశ్చర్యంబగుకథకు నాయకుండయ్యెను.

ఇట్లు లోపల కలకలము జరుగుచుండ, భవనముయొక్క వెలుపలి ప్రాకారము విద్రోహుల యాధీనమయ్యెను. పట్టణజను లీకోలాహలమునెల్ల విని యచటికనేకులు గుంపులు గూడి వచ్చిరి. ఆయుధపాణులై వీధుల దిరుగాడ జొచ్చిరి. దుకాణములు కట్టివేయబడెను. పట్టణవాసు లేమిజరిగినదని యడుగుచు భయవిస్మయంబులు మనంబుల బెనంగొన నటునిటు పరువిడుచుండిరి. శుకారాం బాపూ కొత్వాలు చావిడికి పరుగెత్తుకొనిపోయెను. అచ్చట రఘునాథరావు బ్రతికియుండెననియే గాక, జనుల కందఱకును అల్లరిఅంతయు సద్దణగెనని యభయంబు దెలిపి, కొందఱిని లోపలికి రమ్మని పిలిచెననిగూడ నతనికి తెలియవచ్చినమీద, శుకారం హరివంతు ఫడ్కేను తన పేరుతో నుత్తరము వ్రాయ వలసినదని యాజ్ఞాపించెను. రఘునాథరావు స్వదస్తూరీతో తనయన్నకుమారుడు గార్దీలవలన చంపబడెనని ప్రత్యుత్తరమిచ్చెను. హరివంతుఫడ్కే యంత తాను రఘునాథరావునెడ బొందిన యనుమానములు స్థిరపడెనని నొక్కి వక్కాణించి, తనకేమి యాపద రాగలదో యని

భయపడి తత్క్షణమే బారామతికి పారిపోయెను. శుకారాం బాపూ జనుల మనంబుల శాంతపరచి యందరిని గృహములకు బోయి భద్రముగ నుండవచ్చునని బోధించెను. ఆరాత్రి బజాబాపురంధరెయును, మాలోజీ ఘోరేపు రేయును, రఘునాధరావు దర్శనము చేసిరి. త్రింబకురావు మామా, దురదృష్టవంతుడగు నా పీష్వాకళేబరమును తీసికొనిపోయి దహనాది సంస్కారముల నొనర్చెను.

భవనములోనికి అనేకమంది పరవిమర్శ నొనర్చుటకు వచ్చిరి. ఇంగ్లీషు రాయభారి మోాయిస్టెనును, అనేక యితర వకీళ్లును వచ్చి రఘునాధరావు దర్శనము చేసిరి. రఘునాధరావు తాను విద్రోహులవలన బాకీజీతములకు జామీనుగ నింకను నిర్బంధము నందుంచబడినటుల నటించెను. అతడే యీదుష్కృత్యమునకు గారకుడని యందఱు ననుమానించుచుండిరి. కాని నిశ్చయమైన రుజు వింతవఱకును దొరుకుటలేదు. అతనికి అన్నకుమారుని యెడల ప్రేమ కలదని ప్రసిద్ధియుండెను; గాని అపత్సమయమున, అరాచక సమయమున, లౌక్యబుద్ధిపరులై తమలో తమకెట్టి వైషమ్యములున్నను, న్యాయమైనను, అన్యాయమైనను, రాజ్య రక్షణార్థమై మంత్రులందరును కలసి రఘునాధరావును పీష్వాగా చేయుటకు సమకట్టుట యొంతయు పొగడదగియున్నది. అనుమానమునకు కొంచెమైన నవకాశ మున్నంతవరకు వానినే పీష్వాగా చేయుట వివేకమని వారందరభిప్రాయపడిరి. ఇందుకు రామశాస్త్రి సముగగా నతడుకూడ నమ్మతించెను; కాని యీనేరముయొక్క విచారణ పూర్తిగ జేసెదనని చెప్పెను. అటు తరువాత నాలువారములకు రామశాస్త్రి

రఘునాధరావుపై నేర స్థాపన చేయుటకు తగిన యాధారములగనుగొనినందున, యతని దగ్గరకుబోయి యాకృత్యమును జేయుటకు సుమేర్ సింగునకును, మహమ్మదు యూసూఫునకును ఆజ్ఞనిచ్చునటుల నతనిపై దోషారోపణచేసి చెప్పెను. తాను నారాయణరావును పట్టుకొనవలసినదని యాజ్ఞ నిచ్చితినిగాని, చంపుమని యనుజ్ఞ నియ్యలేదని రఘునాధరావు, రామశాస్త్రి యెదుట నొప్పుకొనెను. ఈ యొప్పుదల కొంతవఱకు నిజమైనటుల కనుపడుచున్నది. ఏలనన, రామశాస్త్రిచే తరువాత సంపాదింపబడిన అసలు ఆజ్ఞాపత్రమునందు ధరావే(పట్టుకొనుట) యను మాట మరావే(చంపవేయుట)యని దిద్దబడినది. ఈమార్పు మరాత్మురాలగు ఆనందభాయిచే చేయబడినటుల నెల్లరిచే నమ్మబడుచున్నది. ఆపద్వార్ధినున్న చిన్నికుమారుని, తన ప్రాణాపాయమునకైననోడక, రక్షింపక నూరకున్న రఘునాధరావు యొక్క ప్రవర్తన యనుమానమునకు జాల యవకాశమిచ్చినను, మహారాష్ట్ర దేశమున సామాన్య యభిప్రాయ మాత్రము నారాయణరావును చంపుట కుద్దేశించ లేదని యైయున్నది. అతడు నిర్బంధమువలన క్రోధానల దందహ్యమానసుండై, భార్య దుర్మంత్రములకు జెవియొగ్గి యిట్టి పాతకమున కొడిగట్టెను. తుల్యాజీ పవారు, నారాయణరావు తనను బహిరంగముగ కొరడా దెబ్బలు కొట్టించినందున, కోపముగలిగి మత్సర పూరితురాలగు ఆనందభాయిచే మఱింత ప్రోత్సాహము చేయబడెను.

రఘునాధరావు దనకేమి ప్రాయశ్చిత్తమని రామశాస్త్రి నడిగెను. అందులకు ఉత్తమ గురుడును, ధీరుడునునైన, రామశాస్త్రి జంకక యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "మీ ప్రాణ

మర్పింపవలెను. ఇక మీ జీవితము పశ్చాత్తాపమున గుదుట పడదు. మీరుగాని మీ రాజ్యముగాని యిక నభివృద్ధిబొంద జాలదు. నావట్టుకు నేను ఉద్యోగము నంగీకరింపను. మీరు పరిపాలించు నంతకాలము నేను పూనాలోనైన నుండనోపను.” అని చెప్పి ఆ మహామహుడు తన ప్రతిన చెల్లించుకొనుటకు వాయీ దగ్గిరనున్న నాకపల్లెకు పోయి నివసించియుండెను.

ఈ మధ్యకాలములో బాకీ జీతము లన్నియు తీర్చబడెను. రఘునాధరావు నిర్బంధ విముక్తు డయ్యెను. అతని దత్తపుత్రుడు అమృతరావు బూజాబాపురంధరే సహాయమున పీష్వా యొక్క పట్టాభిషేక దుస్తులు తెచ్చుటకు సతారాకు పంపబడెను. అవి వచ్చినవెంటనె రఘునాధరావు పీష్వాగా ప్రకటింపఁబడెను. శుకారం బాపూ కార్బారిగా స్థిరపరుప బడెను. కాని తన రాజ్యమును నిలుపగల సమర్థులెల్లరి యెడలను రఘునాధరావున కపరమితమగు యనుమాన ముండెను. అందువలన వారును అతని సభనుండి తొలగిపోయిరి. వారిస్థానములయం దసమర్థు లయ్యెను, దన కంతరంగ ప్రియులగు సదాశివ రామచంద్రుడు, చింతూవిఠలు, ఆబాజీ మహాదేవుడు, శుకారాంహరి మొదలగు వారలు నియమింపబడిరి.

ఇటుల నాదారుణ విప్లవము పరిసమాప్త మయ్యెనని రఘునాధరావు సంతసించు చుండెను. హృదయ శల్యముగ నున్న జ్ఞాతి విరోధ మంతమై దనకు రాజ్యప్రాప్తి గలిగెనని యతడు మిరియఁ జొచ్చెను. మహారాష్ట్ర ప్రజాకోటియు విపరీత సంభావనములు లేక యా నారాయణరాయుని హత్యానాటకము పరిసమాప్తి నొందె ననుకొనుచుండిరి. రాజ్యమున పైకెంతయు శాంతి కాన నయ్యెను. పీష్వా రఘునాధరావు

తన గద్దె యింక కంటక రహితముగ నుండునని తలచి దృష్టి నితర కార్యముల పట్ల మరల్చెను. తమ మంత్రాంగమున రాష్ట్రమేల గల్గిన ధీరులును, రఘునాధరావు నెడ యిష్టాపూరతులును, నగు మంత్రివర్గము, మాట్లాడక మిన్నకుండుటయె గాక నెచ్చోట డాగినదియు కానరాకుండెను. విద్యుల్లతా ప్రసారమునను దక్కోలా ఘాతమునను నేల మ్రాన్పడి చైతన్యముడిగి యుండురీతి, దేశమెల్ల చల్లగ గన్పట్టుచుండెను. కాని యనతి కాలముననె కలత పెట్టనున్న తుపానును బోలె నలుగడల రాజ్యారిష్టదాయక పరికరములు సమకూడుచుండెను.

5 ఫడ్నవీస్ — రాజనీతి.

పీష్వా యయ్యును రఘునాధరావు ప్రజల మెప్పువడయ లేకుండెను. బాల హంతకుడనియు, స్వామిద్రోహ మొనర్చెననియు, వాని నెల్లరు నిందించు చుండిరి. ఈమచ్చ మాపుకొన నాయోధున కే తెరువును గానరాకుండెను. కాని ప్రాంతసీమల ప్రభువులు తరుణముదొరికెనని మహారాష్ట్రమునుదాకి పంచుకొన నుద్యుక్తులై యుండిరని తాను దెలసికొనెను. కొలదికాలము క్రిందటనే యుత్తర హిందుస్థానమున జయము వడసి వచ్చిన సేన తనచేతులలో నుండెను. అదె యదయని పీష్వా యాసేనతోడ దాడి వెడలి దేశోద్ధారణకు బూనుకొనియెను. అట్లొనరించుటంజేసి ప్రజాకోటికి దాను దూరమై, వారి దృష్టిని, దన నుండియు దన లోపముల నుండియు మరల్చి; శత్రుభూముల దా నొందనున్న జయ లాభముల యెడద్రిప్పి వారి పే[illegible] దాను పాత్రుడు కాగలడని అతని యూహ. ఏది యెటు

రఘునాధరాయని దాడి మహారాష్ట్రమున కప్పట్టున కొంత కలత గలుగజేసినను, మొత్తముపై చాల లాభకారి యయ్యె నని చెప్పవచ్చును. ఏలనన, నిజరాజ్యస్థాపనా దీక్షితుడగు నిజామాలీయు, మైసూరు నందలి హైదరాలీయు, పీష్వామాధవరాయని కాలమున విధిలేక వీడిన దుర్గములను నేడు మరల జయించి యాక్రమించు కొనుచుండిరి. గృహకలత లడగకుండ పీష్వాగాని, వాని సేనానులు గాని, పూనావీడి దమ్ము నెదిరింతురని వా రనుకొనలేదు. అదియుగాక నూతన పదాన్నత్యమొందిన రణనేత రఘునాధుడే, మొక్కవోని మహారాష్ట్రసేనలతో నొక్కుమ్మడి తమ్ము దాకవచ్చు నని వారు దలంపలేదు. కావునన పరాభూతులై రఘునాధరావు కోరిన రీతి సంధి చేసికొన వలసిన వారైరి. పీష్వాయు రణోత్సాహ నిమగ్నుడై నిజరాజ్యాంతర్గతాందోళనముల కనుగొన లేకుండెను. బారాభాయి ప్రభుత్వమని పేరొందిన మంత్రిమండలి యొకటి సమావేశమై నానాఫడ్నవీసు ప్రతిభ బయల్పడి దిగంతముల వెలుగొంద జేసెను.

ఏనాడు, దానాశ్రయించిన ప్రభు డీల్గెనో యానాటగోలె నానా రఘునాధరావున కెటులేని ముప్పు చేకూర్ప నూహించుచుండెను. అనాది నుండియు నానాకు వానిపైగల రోత నేడపరిమితమయ్యెను. కాని సేవకుడగు నాతని కెట్టులైనను వానిపై బగదీర్చుకొన వీలైనది కాదు. అదియుగాక నుత్తమదేశభక్తుడగు నానా తన తలంపున దేశ మరాజకమగు నేమో యని యోచించెను. కావునను తొందరపడక, రఘునాధుని [illegible] వీడక, పీష్వాకొలువుకూటమున తనతోడ నేకీభవించు [illegible] నెల్ల యూపి చూచి, చిల్లర వ్యాజ్య కారణమున రఘు

నాధుని, రణసీమను వీడి వచ్చి, తన కనుకూలురగు వారినెల్ల పూనాకు రప్పించి యట రఘునాధరావునకు ప్రతికూలమగు మంత్రిమండలి నొకటి స్థాపించెను. కార్యభారమెల్ల, వృద్ధుడును, ప్రజలకు రత్యుపాత్రిముఖ్యతల గణించిన, శుకారాంబాపూపై వేసియుంచెను. పైకివాని నగుపరిచి, లోనుండి నాటకమెల్ల దానాడ జొచ్చెను. స్వీయాన్నత్య దాయకంబును, శత్రుపరాభవకారణంబును, దేశోన్నతా దర్శకంబును, నగు నీనాటికకు పాత్రంబులుగ వాని కుపకరించిన వారిలో, నానా పెదతండ్రి కుమారుడగు మొరోబా యొకడు. ఈతడు మాధవరాయని కాలమున పీష్వా కార్యాలోచనల యందు ముఖ్యుడై యుండెను. రఘునాధుని దర్బారున తనకట్టి స్థాన మలవడమి యతడు నానాతో గూడి మంత్రి మండలిలో నొకడయ్యెను. త్రియంబకరావు మామాయు, బుజాబాపురంధరేయు వీరలను గలసిరి. హరిపంతు ఫడ్కే, పూనాలో త్రింబకరావు దీక్షితు అనునొక సాహుకారు నింట సామాన్య పరిచారకుడుగ నుండి, తన బుద్ధికుశలత వలన వృద్ధిలోనికి వచ్చినవాడై, నేడు రఘునాధునికి విరోధిగ నుండుటజేసి, తనసర్వస్వము మంత్రిమండలి జయముపై నాధారపడియున్నదని యెంచి, దానిలో చేరెను. ఆనందరావు జీవాజీయనునతడు నానా మంత్రాంగములకు లోనై పీష్వాయొక్క స్వంతపనులను చూచు ఖాస్గేన్వీసా యను పదవినివీడి, వీరిని చేరుకొనెను. రఘోబాపురందరే వీరలను కలసెను. కృష్ణారావు బల్వంతు పీష్వాతోడనే యుండి శ్రీ వారిసైన్యములలో కుట్రలు కల్పించి తత్క్షణమునకై వేచియుండెను.

నానా మంత్రాంగమున సమకూడిన యీ మండలి

యెట్టియెత్తునో యని ప్రజాకోటి నిరీక్షించి చూడ కుతూహలపడుచుండెను. ఎక్కువకాల మటుల నిరీక్షింప నవసరము లేకనే మంత్రిమండలివారు తమ పన్నుగడల ప్రారంభించిరి.

పీష్వా నారాయణరాయుని, భార్య గంగాభాయి భర్త్ర మరణ కాలమునాటికి నెలతప్పి యుండెను. ఆదైవ ఘటన నూతగ గొని పుట్టనున్న శిశువును ముందు పీష్వాగా చేయనెంచి, బహిరంగముగ నుంచిన గంగాభాయికి శత్రులవలన నెట్టి బాధ కలుగునో యూహింప నలవికానందున, యామెను సురక్షితమగు స్థలమునకు గొనిపోవు మిషమీద పురంధరుకోటకు చేర్ప నిశ్చయింపబడెను. కాని నిజమైన యుద్దేశ మొకవేళ నామె కడుపున స్త్రీ శిశువు కలుగునెడల నా శిశువును రహస్యముగ నైన మార్చివేయుటకని సామాన్యముగ నమ్మబడుచున్నది. దీని కొఱకుగాను సమాన గర్భవతులగు ననేక బ్రాహ్మణ స్త్రీలు కోటకు తీసుకొని పోబడిరట. జనవరి 30వ తేదీని (1774 క్రీ॥ శ॥) గంగాభాయి, నానా, హరిపంతు ఫడ్కే సాయమున పూనాకు కొంపోబడెను. ఆమె నటుల తీసుకొని పోవుటకు గారణము బహిరంగముగ జెప్పబడెను. బహుజన సన్మాన్యమైన సదాశివరావు భార్య, పార్వతీభాయి ఆమె వెంట నుండెను. మంత్రిమండలి వారందరును, గంగాభాయి క్రింద సంరక్షక సంఘముగ నేర్పడి యామె పేరున రాజ్యమేల ప్రారంభించిరి.

అటు లేర్పడిన వీరి మొదటి చర్య రఘునాధరాయుని పక్షమువారి నెల్ల నిర్బంధించుట యయ్యెను. అటులైని మాలోజీతోడను, సాబాజిభాంస్లేతోడను రాయబారము [illegible]

వారివురును నారాయణరావు భార్య పక్ష మవలంబింతుమని యొప్పుకొనిరి. అట కృష్ణారావు బల్వంతు రఘునాధుని సేనలో విద్రోహమును పెంపొందజేసి మంత్రిమండలి యిచ్చు సన్నకై వేచియుండెను.

పీష్వా రఘునాధరావు దన విజయ యాత్రనుండి మరలుటకు వీలు లేకుండెను. తన చారులవలన విప్లవవృత్తాంతము తెల్ల విని దగురీతిని ప్రతిక్రియలు సేయ నెంచెనేగాని, వలయు సహాయము లేనందున విఫలమనోరథు డయ్యెను. అదియుగాక ప్రతినిధి భవానీరావు ననుమానించి దండింప నెంచినందున పలువురను దన శత్రు మండలిలో చేర్చిన వాడయ్యెను. అటుల శత్రు దళనాయకుని చేరినవారు మురారిరావు ఘోరపడే, వామనరావు పట్వర్ధనుడును. ఎల్లెడల నీరీతి శత్రువులు ప్రబలు కాలముననే ఏప్రిల్ 18వ తేదీనాడు గంగాభాయి మొగశిశువును గని పీష్వా యాశలనెల్ల యడుగంటఁ జేసెను. మాధవరావు నారాయణ యని నామకరణ మొనరింపబడిన యాశిశు జననవిషయమున దేశమెల్ల చాల యనుమానించుచుండెను. కాని యాబిడ్డ నారాయణరాయుని పుత్రుఁడౌట కేమియును సందేహము లేదు. గంగాభాయి, తన కుమారుని పక్షమున, పీష్వాయొక్క యభిషేకపు దుస్తులను గైకొనుటకు, శుకారాం బాపూను, నానా ఫడ్నవీసును నియోగించెను. ఆదుస్తులను, మాధవరావు నీలకంఠ పురంధరే ద్వారా, రాజు సతారానుండి పంపించెను. ఆశిశువు 40 దినముల వయస్సునన్ పీష్వాగా నభిషేకింపబడెను. క్రొత్త గవర్నమెంటు వారి ప్రథమ చర్య రఘునాధుని నియమమునకు విరుద్ధముగ వాని ప్రబల శత్రు

వగు సాభాజీ భాంస్లేను సేనాసాహేబు సుభేగా నియమించుట నై యుండెను.

నానాయొక్క ప్రతిభ దినదినాభివృద్ధి నొందజొచ్చెను. బాలవితంతువును, అమాయికయు, నగు గంగాభాయికి వానియందుగల శ్రద్ధా భక్తి విశ్వాసములు క్రమంబున ననురాగముగ మారి, ప్రేమగ పరిణమించెను. ఈ గుప్తసంబంధ మెవరికి దెలియకుండినను, యీ లేమగాఢానురాగమై ఫడ్నవీసు చెప్పు చేతలకులోనై, వృద్ధమంత్రియగు శుకారాం బాపూను యిచ్చవచ్చిన రీతి నడిపింపజొచ్చెను. శుకారాం బాపూ, వృద్ధుడును, వివేక మహితుండును, సమయ సేవకుండును నై యున్నను, నానా కంటె ధైర్యసారము కలవాడు. కార్యనిర్వాహణమందు తనకు ద్వితీయుడై, వినయ విధేయతలను పూర్తిగ చూపించుచున్న నానా తనకు మున్ముందు వైరియు బలవచ్ఛత్రువు నౌనని శుకారాం మెఱుంగలేక పోయెను. శుకారాం మంత్రిమండలి నుండి తొలగిపోయిన యెడల వారి యుద్యమము నాశనమగు ననుటకు సందియము లేదు. నానా యిందువిషయమై తఱచుగ భయపడు చుండెడివాడు. తదితరుల నాత డంతగ లక్ష్యంప లేదు. వారును వీరి ప్రాముఖ్యత గుర్తెఱింగి, యనతికాలము ననె యొకరియెడ నొక రీర్ష్యాపరులైరి.

నానాయొక్క పెద్దతండ్రి కుమారుడగు మొరోబా దా నపేక్షించిన ఫలము నందలేకుండుటచే యసంతుష్టుడై యుండెను. ఇతడు రఘునాథరావు పక్షమునకు క్షేమముగ నేగి యచట తన భవిష్య దధికారమును స్థిరపరచుకొనుటకు వీలున్న యెడల నట్లుచేయుటకుద్యుక్తుడై యుండెను. శుకారాం

నానాల యేలుబడికి లోబడ నిచ్ఛగింపని మంత్రివర్గ మొక ప్రత్యేక కక్షగ మారెను. వీరి వైషమ్యము మొరోబా బుజాబా, బాబాజీ నాయకు మొదలైనవారు రఘునాథరావు తో జేయుచున్న గుప్తోత్తర ప్రత్యుత్తరములు పట్టుబడుటచే బట్టబయ లయ్యెను. హరిపంతు ఫడ్కే అడ్డముగగొనిసంపాదించిన యుత్తరములవలన, యీ ముగ్గురును, శుకారాం, నానా గంగాభాయి, కుమార పీష్వాలను విరోధులకు పట్టియిచ్చుట కాలోచించు చున్నటుల దెలియవచ్చెను. పురంధరు కోట యందు శీతకాలమునందు బహుచలిగా నుండుట వలన శుకారాం బాపూ మొదలైన పైవారందఱురును అచ్చోటు విడిచి దగ్గఱ నున్న శాశ్వదు గ్రామమునందు కాపురముండవచ్చిన సమయములో పైఁజెప్పిన ప్రయత్నము చేయఁబడినది. కాని యీ కుట్రనుగూర్చి జూను 30-వ తేదీని వర్తమానము తెలియగనే వారు తత్క్షణము భయఁపడి పురంధర కోటలోనికి పాఱిపోయి అచ్చోటనే తమ దర్బారు నేర్పరచుకొనిరి.

ఈలోపున రఘునాథరావు బొంబాయిలోనున్న ఆంగ్ల వర్తకసంఘము తోడను, గోవిందరావు గయిక్వారు తోడను సంధిచేసుకొన నెత్నించి మార్చి 6వ తేది 1775 వత్సరమున సఫల మనోరథు డయ్యెను. రఘునాథుని సఫల యత్నముల వలనను, జయముల వలనను, కుమార పీష్వా వ్యవహారములు తబ్బిబ్బు కాజొచ్చెను. శుకారాంబాపూయును, నానా యును, అధైర్య పడజొచ్చిరి. మంత్రి మండలిలో అన్యోన్య మతస్పర్థలు కలిగి రఘునాథరాయుని కోపానలమునకు భీతిల్లి, సాబాజీ నిజాముల యుద్దేశములగూర్చి ననుమాన చేతస్కులై, అ

రకు ముభావముగ నున్న మహారాష్ట్ర యోధులను సాహాయ్యముగ రప్పించుటకు, సతారారాజును బంధవిముక్తునిజేసి ముందుంచ నెంచిన తరి స్థితి గతులు మారెను.

కుమార పీష్వా జననమునే నిజామాలీ సందేహించు చటుల నటించుచుండ, బ్రాహ్మణమంత్రుల యౌన్నత్యమునకు గినిసి వారిపై గల ద్వేషమున మహారాష్ట్ర ప్రముఖులు నూతన విప్లవ మొక్కటి దెచ్చిపెట్ట నుండుతరి, విపదబ్ధినుండి తప్పుకొనుటయె గాక, కొంతవరకైన రాష్ట్రమున మంత్రిమండలి ప్రభుత్వమును స్థిరపరుప గలిగిన నానా యత్నము, వాని బుద్ధి కుశలతకును, రాజనీతికిని, చిరకీర్తి గణించ గలిగెను.

క్రీ॥శ॥ 1775 వత్సరమున సూరతువద్ద రఘునాథరావు బొంబాయి ఆంగ్ల సంఘముతోడ చేసిన సంధి షరతులు సర్వాంగ్ల సంఘాధ్యక్షు లగు కలకత్తా సంఘమువారు ఖండించి తమ రాయబారి యగు కర్నల్ అప్టనును, పురంధరులోని నానా దర్బారుతోడ సంధి చేసికొనుటకు పంపించిరి. అంతియగాక బొంబాయి సంఘమువారిని తమ సేనలను వెన్వెంటనే మరల్చి రఘునాథరావును దైవాధీనముగ విడచిపొమ్మనియాజ్ఞాపించెను. అట్లు వారు తొందర పడుటయు, రఘునాథుడు నిస్సహాయుడగుటయు, కుమార పీష్వా పక్షావలంబు లగు మంత్రి మండలి బల మధికమయ్యెను.

---

6 ఆంగ్లవర్తక సంఘ ప్రాముఖ్యత

వేలకొలది మైళ్ల దూరముననున్న పాశ్చాత్య సీమల వర్తకులు ఫడ్నవీసు కాలమునకు నూటయేబదియేండ్ల పూర్వ

మే తమ కర్మాగారముల మన దేశమున నెలకొల్పిరి. అట్టి పాశ్చాత్యులలో పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఆంగ్లేయ జాతులవారు మన దేశమున స్థిరావాసముల గల్పించుకొనిరి. పైపేర్కొనిన జాతులలో మొదటి యిరుతెగలవా రనతి కాలముననే తమ ప్రభ వెలిగించి, ఫ్రెంచి, ఆంగ్ల వర్తకులకు వెనుకబడిరి. మహా మేధావియు, మాతృదేశ ఖ్యాతిని వృద్ధి సేయ నెంచిన డూప్లేక్రింద ఫ్రెంచివారు మొట్టమొదట మనదేశము పాలింప జొచ్చిరి. వారిపోరు పడలేక ఆంగ్లేయులు తమ బలమును పెంపొంద జేసికొని క్రమంబున రాజ్యమునుకూడ సంపాదించుకొనిరి. ఈ రాజ్యాక్రమణమే మన ఫడ్నవీసు కాలమునాడు జరుగుచుండెను.

తొలుదొల్త ఆంగ్లేయులు వర్తకమే ప్రధానముగా జూచుకొనుచుండెడివారు. పదునెనిమిదవ శతాబ్ద మధ్యమున ఫ్రెంచివారితోడ కయ్యము గల్గి, యది సమాప్తమగునప్పటికి హిందూదేశమున నచ్చటచ్చట చిన్నరాజ్యముల సంపాదించుకొనిరి. ఇప్పట్టున వారా భూములనెల్ల నొక్క పరిపాలనక్రిందకు దెచ్చిరి, అప్పట్టున దేశమున గల తదితర రాజ్యములను గూడ తమ పరిపాలనక్రిందికెటుల దెచ్చిరో గమనింపదగును.

ఈ కాలమున మనము గమనింపదగు విషయములు రెండు గలవు. అందు మొదటిది ఆంగ్లేయుల దిగ్విజయయాత్ర-రాజ్యాక్రమణము. రెండవది పరిపాలనా ప్రారంభము.

ఆంగ్లప్రభువులు పరరాష్ట్రపాలనమున జోక్యముగలుగజేసికొనకుండనుంటయో నలువుర సమానబలయుతులుగ నుంచ యత్నించుటయో, లేక నిజసామ్రాజ్య పాలనముక్రిందకు

వారలను దెప్పుటయో, వారి రాజనీతియై యుండెను. పరులె యుబుసునకు బోకుండనుండు వాంఛగల ప్రభువుల యుద్దేశము దమదానిని గాపాడుకొని, యితరుల వ్యవహారముల నెట్టి జోక్యములను గలుగజేసికొనకుండుటయే అయియుండెను. వంగ విజేతయగు క్లైవుకూడ సీమనున్న యధికారవర్గమునకు వ్రాయుచు "అధిక రాష్ట్రాక్రమణము గష్టములకు కారణమై నష్టకరముగనుండు" నని తెలియజేసెను. కానికాలక్రమమున వారియిరుగు పొరుగుల స్థితిగతులు వారిని యూరకొననిచ్చనవిగావు. ఉండినది యుడిగి నిజ గిడ్డంగులకు లోనసే తమ పాలనము నిముడ్చుకొనుటయో లేకున్న పర రాష్ట్రాక్రమణమో వారికి శరణ్యముగ గాన్పించెను. అదియుగాక వర్తకవ్యవహారముల సమకూడిన మిత్రరక్షణార్ధము వారుకొంతగా యుద్ధముల సంపర్కము గలుగజేసికొన వలసివచ్చెను.

అదేరీతిన సమబలరాష్ట్రోద్ధారణపద్ధతికూడ వారవలంబింప లేకపోయిరి. ఈరీతిని మధ్యవర్తులై బలాఢ్యు లేరును లేకుండుటజూచి, నిజ వ్యాపారముల రక్షించుకొన జూచియుండిరి గాని; వెలస్లీదొర యీ రెండుమార్గములవీడి యాంగ్లసామ్రాజ్య స్థాపనమే నిజనీతిగ దలచి ప్రారంభించెను. భారతసీమను నాగరికతా వ్యాపనమునకును, శాంతినెలకొల్పుటకును, అట్టినీతియే పరమావధియని వాని యుద్దేశము. తన ప్రభుత్వాంతము నాటికి రాజ్యాక్రమణము పూర్తి కాకున్నను, యానాటికే యాంగ్లవర్తకసంఘము హిందూదేశమున బలవత్తర ప్రభుత్వమయ్యెను. తక్కిన రాజ్యములెవ్వియు దానితో డతలపడి పోర [illegible] రాజ్యనిర్మాణమున వారెదుర్కొనినప్రభువులలో

పీష్వా మొట్టమొదటివాడు. సింధియాహోల్కారు, (నాగపురపు) భాంస్లే (మైసూరులోని) హైదరాలి, టిప్పుసుల్తాను నిజామాలీలను కూడ వీరెదుర్కొన వలసియుండెను. ఉత్తర సీమలలో నిజరాష్ట్ర నిర్మాణమొనరించుకొనుచున్న సిక్కులుకట్టకడకు వారి ధాటికెరయైరి. ఆంగ్లేయ నాయకులలో నీ పనికి తలపెట్టినవారు క్లైవు, వారన్ హేస్టింగ్సు, కార్నువాలీసు, వెలస్లీలై యుండిరి.

ఆంగ్లేయుల రాష్ట్ర నిర్మాణమునకన్న, పాలనావిధానమే మనము ముఖ్యముగ గమనింపవలసియున్నది. ఆంగ్లసంఘము వర్తకసంఘమనియు, వారి విధాయక కృత్యము దూరదేశమున నున్న యధికారులకు, లాభముసమకూర్చుటయేయనియు మన మెరుగవలయును. రాజ్యపాలనా పద్ధతియును కొంతవరకు వారెరుగవలసి యుండెను. ఏలనన సైనికులను జమచేసి యుద్ధము లొనర్చుటయు, సంధుల జరుపుటయు, పన్నులను రాబట్టుటయు, న్యాయము లొసంగుటయు వారికి విధాయకమయ్యెను; గాని కలలోనైన దలంపని బంగాళమువంటి పెద్ద రాజ్యమును, దక్షిణమున, చెన్నపురి ప్రాంతమున కోరక లభించిన సీమయు వారి రాజనీతిని బాగుగ పరీక్షించెను.

వర్తకనీతి, లాభాపేక్ష, రాజనీతి, పాలితసౌఖ్యసంపాదనము, లాభనష్టముల పరికించి లెక్కలువేయు యంగడులు, పాలక సభలు, కావలసివచ్చెను. ఇదను కాలముగ వర్తకమున కలవడిన వణిగ్బృందము పాలకవర్గముగ మారునప్పుడు కలుగు నిక్కట్టు లిప్పటున విశదమయ్యెను. బంగాళములోని ఏది పాలన మాంగ్లరాజ్య చరిత్రమున నెంతయు [illegible]ముగ

గానవచ్చుట కిదియే కారణము. సంఘముతరఫున పనిచేయు వారల కిప్పట్టునయేలికలయేర్పాటులచేతసింహాసనముల నెక్కించుటకును,సింహాసనాసీనులపదచ్యుతులను జేయుటకునుగూడ,నధికారముండెను. స్వలాభ పరులగు వీరలలో నెక్కుడు మంది యీయధికారమును నిజౌన్నత్యమునే పెంపొందజేసికొన వినియోగించిరి. నవాబులును, ప్రజలును యీ వర్తకబృందము చేతను వారిపరివారములచేతను దోచుకొనబడి పీడింపబడుచుండిరి. అత్యాశాపరులగు వీరల పాలినుండి పాలనమును గాపాడవలసివచ్చెను.

ఆంగ్ల వర్తకసంఘమున కాలగతిని గల్గిన యీమార్పు సీమలోని వారలకు దెలియవచ్చెను. అప్పట్టున ఆంగ్లేయ ప్రజాసభ (House of Commons) లోని స్థానములు కొలదిగనున్న పెద్దయింటికుటుంబముల పోషణను పెంపొందుచుండెను. వారు తమపలుకుబడిచేతనేమి, ధనమువలననేమి, సభాస్థానములనెల్ల యనుచరులతోడ నింపి దేశమును దామే యేలుకొనుచుండిరి. కాని హిందూదేశమున నైశ్వర్యసంపాదన మొనర్చి వచ్చిన, పేరునూరునులేని యువకులు దమయీవిని, పురాతన కుటుంబముల వారికెల్ల యీర్ష్యబుట్టించి వారింతదనుక యాక్రమించిన స్థానముల దమ స్నేహితులతోడ నాక్రమించుకొనిరి. అదియుగాక నవయుగారంభమనదగునకాలమున యావిరియంత్రమునుంగనిపెట్టుటంజేసి యంత్రశాలలుండు చోటులకు గ్రామవాసులు వలసవచ్చి పల్లెలన్ని పాడుగా విడచిరి. ప్రజాకోటిలో భ్రాతృభావము జనించి యొకరిఘనతయు వేరొకరిహీనతయు పాటింప వీలొసంగినది కాదు. ఆంగ్లసీమకు ముఖ్యమంత్రిగ

నున్న పిట్ దొర ధర్మాత్ముడు. ఆంగ్లజాతికి హిందూసీమ యేలుబడి యంతగ న్యాయముగ జరుగునటుల దోచలేదు. పాలకుల లాభముకన్న పాలితప్రజాసౌకర్యమే దామాలోచింపదగువిషయమని దోచెను. నాటినుండియు పాలక ధర్మములను వర్తకసంఘమునుండి వేరొనర్చుటకు బ్రయత్నములు ప్రారంభమయ్యెను. అట్టి వాంఛా ఫలితమే నవీన యాంగ్లేయ హిందూ సామ్రాజ్య బీజ మన వచ్చును. అంతదనుక నటునటు స్వతంత్రముగ స్థాపితమై, ప్రాంతపాలకులతోపాటు సమయానుకూలవర్తనులై యున్న చెన్న, బొంబాయి ఆంగ్లపాలనములు కలకత్తాలోని పాలనముక్రిందికి చేర్చబడెను. అచ్చటనున్న యధికారికి సహాయముగ మువ్వురు సభికు లమర్చబడి యాచతుష్టయమునకును నాంగ్లేయులకును మన సీమనున్న భూముల నెల్ల బాలింప నధికార మొసంగబడెను. ప్రధానన్యాయస్థానమొకటి నెలకొల్పబడి యాంగ్లసీమనుండి వారి ఱేనిచే నెన్నుకొనబడిన నల్వురు న్యాయమూర్తుల కొసంగబడెను. సైనిక, అర్థికవిషయములెల్ల సీమనున్న ఆంగ్ల రాజ్యాంగ శాఖవారల యనుమతి వడయకుండ పరిష్కరింపకుండ కట్టుదిట్టములుజేయబడెను. ఈ యేర్పాటు క్రీ॥ శ॥ 1773 వ వత్సరమున జరిగెను.

క్రీ॥ శ॥ 1784వ సంవత్సరమున పిట్ దొర వేరొక చట్టమును దెచ్చిపెట్టెను. దానినిబట్టి సభికులసంఖ్య నాల్గు నుండి మూడుకు తగ్గెను. ఇంగ్లండులో పాలకులను తగినరీతిని నడుపుటకొక సభ యార్వురు సభ్యులతోడ నేర్పరుపబడి నేడు హిందూదేశ రాజ్యాంగమంత్రిగ నాయకులనె నాడా సభకు నాయకులుగ నెన్నుకొని ప్రారంభింపబడెను. వర్తకాధికార వర్గ

మువారి కార్యక్రమమున సకాలమును నిపుణతతో నడపుటకని మువ్వురేర్పరుపబడిరి. మన దేశమునందలి ఆంగ్లరాజ్యపాలకుడును, సర్వసేనానియు, వర్తకాధికారవర్గముచే నెన్నుకొనబడినను ఆంగ్లపాలకుల యనుమతి బడయవలసియుండెను. "బ్రిటిష్ జాతి కోర్కెలకును, మర్యాదలకును, నీతికిని రాజ్యాక్రమణ మనుకూలముగాక విరోధకరముగను నీచముగను నున్న" దని యప్పట్టున చెప్పబడెను. అత్యవసర సమయములదప్ప దక్కనే వేళల ఆంగ్లరాజ్య పాలకుడును వాని సహాయ సభికులును తదితర హైందవ పాలకులతోడ యుద్ధము సేయుటకును, సంధిజరుపుటకును, యధికారవర్గమువారి యనుమతి గొనవలె నని చెప్పబడెను. హిందూదేశమునందలి ఆంగ్ల మహాయుగ చరిత్ర సంక్షిప్తముగ నాలుగు మాటలలో జెప్పవచ్చును. వర్తకమున కని వా సీమకరుదెంచిరి; వర్తక సంరక్షణకని రాజ్యాక్రమణ మొనర్చిరి. రాజ్యాక్రమణ మొనర్చి పాలన మొదలిడిరి; పాలన ప్రారంభించుటయు వారికిఁ దగినదని దోచినరీతిని, వీలుండినట్లు రాజ్యమేలుచున్నారు. కొన్నిపొరపాటు లొనర్చియు, కొన్ని ఘోరములకు కారకులయ్యు, యీ సామ్రాజ్యనిర్మాణమునకు గడంగిరి. ఎన్నియో సభలను రచ్చ చావడులను నెలకొల్పిరి. ఎందరికో రాజ్యాంగ శిక్షణ మొసంగిరి. ఎన్నియో చట్టములను శాసనములను దెచ్చిపెట్టిరి. ఎప్పుడైన నెచ్చోటనైన రాజ్యాక్రమణమునకు వలె అంత సులభముగ పాలనము జరుగదు.

ఇట్టి ప్రారంభమును, క్రమోన్నతియుగనిన ఆంగ్లవర్తక (తదుపరి రాజకీయ) సంఘము నికముందు మనము ఫడ్నవీసు చరిత్రమున బాగుగ పరిచయముచేసుకొనగలము. నిజామాలీ

హైదరాలీ, టిప్పుసుల్తానులతో పాటు ఆంగ్లరాజ్యపాలకులను మన ఫర్నవీసునకు వలయునంత పనిని గల్పించిరి. ఎట్టకేలకెల్లర కేలికత్తై నానా యంత్యదినములలో వాని మంత్రాంగశక్తులనెల్ల పరీక్షించినదియు వీరలే. కాన నింతగ వీరల చరిత్ర దెలుపవలసివచ్చెను. అదికాక మన చరిత్రాక్రమమున బేర్కొనిన ఆంగ్లరాయబారి కర్నల్ రిప్పన్ రాకను పునహాలోని మంత్రిమండలి బల మధికమయ్యె నంటిమి. రఘునాథరాయనికి నిస్పృహ జనించెనంటిమి. వీటికి కారణ మీ యాంగ్లవర్తక సంఘపు దినదినార్జిత ప్రాముఖ్యతయే. తరువాత వారొనర్చిన పొరపాటులే, నానా నిపుణతకు తార్కాణములగును.

---

7 నానా నిపుణత

కలకత్తా గవర్నరు జనరలుచే నియమితుడై లెఫ్టినెంటు కర్నల్ అప్టన్ దొర 1775 సంవత్సరము డిసెంబరు 2 వ తారీఖున పురంధర్ వచ్చి చేరెను. ఈలోపున గవర్నరు జనరలు, సఖారాము బాపూ కొకలేఖ వ్రాసెను. అందాతడు, తన సమ్మతిలేకయె బొంబాయిసేనలు దాడి వెడలినవనియు, వానిని మరలిపొమ్మని యాజ్ఞాపించితిననియు, మంత్రిమండలి వారిని యుద్ధసన్నాహముల మానవలసిన దనియు నింతలోనె తనరాయబారి వారలను కలియగలడనియు, వ్రాసెను. అందుమూలమున దమకు లభించిన యనుకూల పరిస్థితులను మంత్రిమండలి గ్రహించెను. ఆంగ్లేయుల సాధుభావము భయమున జనించినదనుకొని, సంధిషరతు లేమాత్రమును వర్తక సంఘమున కనుకూలము లగునట్లు ఒప్పుకొనలేదు. అప్టన్ దొర

వారాపరతుల కేమాత్రము తగ్గరనుకొనెను. అతనికి మహారాష్ట్ర బ్రాహ్మణులతోడి సహవాసమిదివరకెన్నడును లేకుండెను. అందులో శుకారాము, నానాలు సామాన్య రాజనీతివేత్తలుకారు. ఎన్నియో యుత్తర ప్రత్యుత్తరముల జరిపి, విసిగి, వారలనను కూలురజేయజాల నను నిస్పృహజనింప ఫిబ్రవరి 7వ తారీఖున అప్టన్ గవర్నరుజనరలునకు మరి మంత్రిమండలముతోడ సంధి జరుగనేరదని వ్రాసెను. అదిగని గవర్నరు జనరలు విధిలేక రఘునాథరావునకు దగుసాయమొనర్ప నిశ్చయించుకొనెను.

మంత్రి మండలి తమ బేరము మితి మీరిన దని గ్రహించి, అప్టన్ రాయబార మంత మొనరింపక మున్నె, మార్చి 1వ తారీఖున నించుమించుగ నాంగ్లేయులడిగిన షరతు లన్నిటికిని యొప్పుకొని సంధిచేసుకొనిరి. సంధి సమాధాన పత్రికలో సంఘము తరఫున అప్టన్ దొరయు, పీష్వా తరఫున శుకారామ్ బాపూ, నానాలును, సంతకములుచేసిరి. రావుపండిత పురదన్ అని తప్ప పీష్వా పేరెచ్చోటను ఆ పత్రిక యందు పేర్కొనబడలేదు. అత్యల్ప వయస్కుడగు మాధవరావు నారాయణుని బ్రతుకునకే స్థిరములేనందున నట్లొనరించి, యతడొకవేళ పరలోకగతుడైనచో రాజమాతయగు గంగాబాయిచే వేఱొకని దత్తత చేయించి, వానిచే రాజ్యమేలింప నూహించి యిట్లు సంధి పత్రమున వానిపేరైన సూచింపబడలేదని యనేకు లందురు.

ఈ సంధి యేర్పాటుల వలన, బొంబాయి గవర్నమెంటువారికిని, రఘునాథరావునకును జరిగిన సమాధానము రద్దయ్యెను. ఆంగ్లేయ సేన నిజ నివాసమునకు మరలెను. రఘునా

థరాయని సిబ్బంది నెల దినములలో విరుగగొట్ట నియమింపబడెను. పీష్వా నారాయణరావు వధలో పాల్గొనిన నలువురకు దప్ప దక్కిన రఘునాథుని యనుచరు లెల్లరకు నభయ హస్త మొసంగ బడెను. రఘునాథ రావిందుల కియ్యకొనడేని, ఆంగ్లేయులు, వానికి సాయ మొనరింప మని దెలిపిరి. కుమార పీష్వా తరపునున్న మంత్రి మండలి, రఘునాథుడు రెండు వందల పరిచారకులను, వేయి యాశ్వికదళమును నుంచుకొనుట కొప్పుకొనెను. అతనికి నెలకు యిరువదియైదు వేల రూకల నితర ఖర్చులకుగా నిచ్చుట కొప్పందము జరిగెను. అతడు మాత్రము గోదావరీ తీరముననున్న కొపర్గమున స్థిర వసతి నేర్పరచుకొన గోరబడెను. ఇదివరకు 1739, 1756 సంవత్సరములలో జరిగిన సంధులలో నిందుండు షరతుల కనుకూలమగునవెల్ల స్థిరపరుపబడి, మిగిలినవి కొట్టివేయబడెను.

క్రీ॥ శ॥ 1777 సంవత్సరారంభమున రాజమాత గంగాభాయి మరణించెను. నానాతోడ దనకు గల సంపర్క దోషము, నలువురకును వెల్లడి గాకుండ నుంచ నెంచి మందుతిని యా యబల యసువు లుడిగెను. పీష్వా కుటుంబము వారి మాట కల్ల యందురే, గాని కుమార పీష్వాకును నానాకును గల పోలికయే యీ గుట్టును, చెప్పకయ జాటుచున్నది.

ఇట్టి సమయమున సెయింటు ల్యూబిన్ అను ఫ్రాన్సు దేశస్థుడొకడు పరాసురాయబారినని పేరు పెట్టుకొని, చౌలు రేవులో పడవదిగి, పూనావచ్చి చేరెను. ఇతడు మంత్రి మండలితో సంధిచేసికొని వారి సహాయమునకు గాను 2000 పాశ్చాత్య సైనికులను దెచ్చి 10000 సిపాయిల నిచ్చోట దయారు

చేసి పలయు యుద్ధ సామగ్రిని దెప్పించుటకు దా నంపబడితి నని చెప్ప జొచ్చెను. దానికి ప్రతిఫలముగ చౌలు, శేవ్రుదండా నౌకాస్థలముల దనవారు యాసించిరి. అంగ్లేయులు రఘునాధున కొసగిన సహాయమును విని యెంతయు గినిసినటుల నటించెను. పఠాను కేశమున చిత్రించి దెప్పించిన పీష్వా నారాయణుని హత్యా కథను తాను పూనా దర్బారులో ప్రదర్శించి, కనుల నీరుగార్చి శ్రోతుకుల గుండెలు కరగించెను. కొందరు మాత్రమీతని చిత్రనాటకమును గని మెగతాళి, చేయజొచ్చిరి. పాశ్చాత్యులిట్టి తుచ్ఛనటన లభ్యసించి ప్రదర్శింప గాంచుట, మహారాష్ట్రులకిదియే మొదటి పర్యాయము. మహా తంత్రవేత్తయగు నానా మొదటినుండియు నీమాయల నమ్మలేదు. కాని వీనిని దన కాంగ్లేయులతోడ గల సంబధములలో పలయు రీతి నుపయోగింప వచ్చునని యూహించుకొనెను. ఈ యుద్దేశముతో దర్బారుననున్న యాంగ్లరాయబారిని నిరసన భావమున జూచుచు ల్యూబినును దన యనుగ్రహ పాత్రుడగునటుల జూడజొచ్చెను. అంతమాత్ర మాంగ్లేయుల యీర్ష్యరేపెట్ట నెంచెనేగాని, వేరొక యుద్దేశమేమియు నానాకు లేకుండెను. కాని దాజేయు పనియొక్క ఫలితము లెంత ప్రమాదకరములో యోచించినటుల కనుపట్టదు.

నానాకు యూరపియను తెల్లరియుడలను శత్రుభావమే; గాని సెంటలూబిన్ నీచప్రవర్తన నానాకును, తదితర మహారాష్ట్రులకును ఘోరించి దేశీయులయందు గౌరవమును తగ్గించె. పూర్వ మొకప్పుడు బంగాళమున కంపెనీ కొలువున నుండ ఆప్పట్టున అస్ట్రియావారి ప్రతినిధిగ పీష్వా దర్బారుననున్న

మాన్సియరు బొట్సు దొర ల్యూబినువలె బహూకరింప బడకుండుటచూడ, నానా ల్యూబినుతనకుదగు నుపకరణమగు నని గ్రహించుట దెల్లమగును. బొట్సుదొర తాను పంపివేయబడినను అగౌరవమందలేదని గ్రహించి యుండవచ్చును.

భారత దేశమందును, భారతీయులయందును, యూరప్ ఖండవాసులకుగల యపోహాలకు, ల్యూబిను గడుసుతనముతోడై, యనేక యమాయిక యువకుల బురికొల్పి, ల్యూబినుతోడ వారి నీ సీమకు గొనివచ్చెను. కాని, నీతిబాహ్యులగు వారలెంత చతురమతుల మనుకొనినను, వారి యవినీతివర్తనము వారి గుట్టు బయల్పెట్టెను. సెంటల్యూబిను పరమ డాంబికుడును, ముక్కోపియు నై యుండెను. దేశీయులతోడి రాజకీయ వ్యవహారములలో కోపిష్ఠియగువాడు నెగ్గుట దుస్సాధ్యము. ల్యూబిన్ యనుచరులతోడ యీ కారణమున వేరయ్యెను. వారనుమానించి ల్యూబిన్‌తోడ కలహించిరి. అతడు వారల చంపజూచెనేకాని, బొంబాయి రాజకీయ సేవలోనున్న మోస్టిన్ దొరవారి కభయ మొసంగెను.

నానా ఫర్నవీసు, సెంటబూబినునకొసగు ప్రోత్సాహము బొంబాయి గవర్నమెంటువారిని భయపెట్టి వారిచే పురంధరు సంధి షరతులకెల్ల, నానా చెప్పినటుల యొప్పించి యుండును. గాని వారి డైరక్టరులు, మంత్రి మండలి షరతుల కనుగుణముగ వర్తించనినాడు, రఘోబాతో సంధి కుదుర్చుకొనన అధికార మిచ్చియుండిరి. ఆ ధైర్యముననే వారంతగ నానా పన్నాగమునకు జంకలేదు.

ఈ లోపున పూనా నగరమున గల కక్షులలోని అం

ఱ్ఱకలహము లధికములయ్యెను. నానా, మొరోబా చేతగానితనమును నిరసించు చుండెను; కాని వానియందు గల శత్రుత్వముకన్న, నిరసన భావమును హెచ్చుగ దాచిపుచ్చు చుండెను. మొరోబాకు యెక్కుడు ప్రజాసహాయ ముండెను. పూనాలోనున్న ఆంగ్ల రాయబారి ఫ్రాన్సునుండి నానా పొందిన సహాయ వాగ్దానమే వానిధైర్యమునకు కారణభూత మని తలంచుచుండెను. రాజమాత గంగాభాయి మరణాంతమునుండియు శుకారాంబాపూ తనతోడి మంత్రియగు నానా యందు యీర్ష్యాపరుడయ్యెను. మొరాబాతోడ కలసి రఘోబాను మరల పీష్వాగద్దె నెక్కింప గుప్తముగ పన్నాగము పన్నుచుండెను. బొంబాయిలోనున్న రఘోబాను పూనాకు దెమ్మని ఆంగ్లసంఘము వారిని మొరోబా కోరెను. ఆ సంఘాధ్యక్షుడును సంఘము వారును తగు సహాయముసేయ నిశ్చయించుకొని, వెంటనె యందుకు దగిన యత్నముల ప్రారంభించిరి. మొరోబా యత్నములకు చేయూత నొసంగ నెంచిరేగాని పురంధరు సంధి పత్రముల సంతకముచేసిన శుకారాంబాపూ లిఖితరూపముగ తనకట్టికోర్కెగలదని వ్రాసి యీయవలయుననికోరిరి. శుఖారాం అట్టి లిఖిత వాఙ్మూలము నీయక కొంత దనుక వారి యత్నముల నిలుపుజేసెను. అట్టి యత్నముల పూనాలోని రాజ్యాంగ యంత్రమును తారుమారుచేసినగాని తమకెట్టి యిక్కట్టును లేకుండ నుండదని ఆంగ్లేయులు గ్రహించిరి. అట్టి తంత్ర భూయిష్టమగు రాజ్యాంగ పాలన మెల్ల, నానా నిపుణుడుగాన నెట్టి యిక్కట్టును లేక సాగింపుచువచ్చెను. అప్పటికిని కొద్దిగ తొందరపడి మొరోబాను పట్టుకొన నెంచుట

వల్లన, నతడు పూనా విడచి పారిపోయెను. అకాలమున నిటుల బయల్పడుటం జేసి తమయత్నములు విఫలములగునని యెవ్వరైనను జంకి తబ్బిబ్బు కాక మానరు; గాని, శుకారాము నొప్పించి వానిమూలమున మొరోబాను రప్పించి, మొరోబా, బుజాబా పురంధరేలుకూడ కలసియున్న నూతన మంత్రిమండలి నొకదానిని నానా నిర్మింప నిశ్చయించెను. బుజాబా యంత సుళువుగ నియ్యకొనువాడుకాడు. చిన్నతనమునుండియు దనను పోషించి పెద్ద చేసిన శౌర్యరాసి రఘునాథరాయుని మోసపుచ్చి, యిచ్చకములాడు పిరికి నానాతోడ గలయునని శుకారాం అంగీకన్నపట్టుపట్టెను. హోల్కారు సేనా సహాయమున మొరోబా పక్షమువారి బలము దినదిన ప్రవర్ధమానమగుచుండెను. విధిలేక నానా పురంధరు కోటకు పారిపోయి తలదాచుకొనవలసి వచ్చెను. అట్లయ్యును నిస్పృహ జెందక, పూనాకు రఘోబాను దెచ్చుటకు దానుకూడ నొప్పుకొనునటుల నటించెను. కాని తనకును, దనయాస్తికిని, యెట్టియపాయమును కలుగకుండ చూచిననే, యాయేర్పాటున కొప్పుకొందు ననెను. బొంబాయి పాలకవర్గము సిద్ధముగనుండ హెచ్చరించబడెను. వారిదేశీయ పటాలములు 6తగు ఫిరంగి దళములతోడను, గుర్రపు దళములతోడను, యమునా నదీ తటముననున్న కల్పీనగరమున, కర్నల్ వెస్లీక్రింద సిద్ధముగానుండ నేర్పాటులు జరిగెను. మొరోబా, కోర్కెలెల్ల సిద్ధించెననియు అప్పుడే దాను సర్వాధికారి నై పోతి ననియు, నుప్పొంగెను. నానా, శుకారాం యెడల నెప్పటియటుల వినయవిధేయుడై వర్తింపజొచ్చెను. మొరోబాయందు మిక్కిలి గౌరవము జూప

జొచ్చెను. రఘోబా పునః ప్రతిష్ఠాపనసూచ్చి యాలోచనలు జరుగజొచ్చెను. క్రమముగ మొరోబాకు, నానా చెప్పిన కారణములు సబబుగ కనుపించినందున, రఘోబా నేలగప్పింప బాధ్యో మతమునకు వచ్చెను. తానుమాధవరావుని కాలమున మంత్రిగనుండు దినములలో రఘోబా ప్రవర్తనమెటుల తప్పక కలహకారణమై నష్టమును, ప్రతిష్ఠాభంగమును, కల్పించుచుండెనో, జ్ఞప్తికి దెచ్చుకొనియెను. గనుక మరల మరల బొంబాయినుండి ఆంగ్లేయులు హెచ్చరింప, దానెంత కోరిన టుల నటించియు రఘోబా పునఃప్రతిష్ఠాపన ప్రసంగమును దప్పుకొనుచుండెను. మొరోబా చపల స్వభావమును గ్రహించి ఆంగ్లసంఘమువారు వాని సహాయమున పూనాలోని ఫ్రెంచి వారి పలుకుబడి చెరుపలేమని నిరాశజెంది, కర్నల్ వెస్లీకి పంపిన యాజ్ఞల ఏప్రిల్ 22 వ తేదీని రద్దుపరచుకొనిరి. మరల దూరమాలోచించి ఆతీర్మాన మువసంహరించుకొని మే నెల 8 వ తేదీని వెస్లీ దొరను సైన్య సమేతముగ నిర్ణీత మార్గము బయలు వెడల నాజ్ఞాపించిరి.

మోస్టిన్ దొరతో ల్యూబినును పంపివేసెద నని మొరోబా నచ్చచెప్పియుండెను; గాని యేనాటికిని వానిని పంపివేయుయత్నములు జరుగలేదు. నానా మంత్రాంగమున ల్యూబిను, మొరోబాను తన పక్షమునకు ద్రిప్పుకొనియెను. పైకెట్లునటించినను, నిజముగ ఫ్రెంచివారే మహారాష్ట్రసీమను స్థిరవసతి నేర్పరచుకొన జూచినయెడల, నానాయే వారికి ప్రతికూలుడై యుండెడివాడు. పాశ్చాత్యుల యెడ వానికున్న యనుమానముచేత ఫ్రెంచిసేనలు ఆంగ్లేయుల [illegible] చేయు[illegible]కే

వచ్చినను, వాటిని యెట్టకేలకు దాను పాత మార్చగలనను నమ్మకగల్గినచో పరిసరములకు రానిచ్చియుండును, ల్యూబిన్ యెన్నడైన సైన్య సహాయము చేయగలడని నానా నమ్మి యుండలేదు. ఆ మాయావి పలుకుబడి గణింప గోవా, డామన్ పాలకులకు ఫ్రెంచివారిని తమ రేవులలోనుండి దింపుకొనగోరి వ్రాసిన లేఖలు మహారాష్ట్రులను నమ్మింపలేదే గాని మధ్య త్రోవను వాటిని బట్టుకొని ఆంగ్లేయులకు మాత్రము తహతహ జనింప జేసెను.

పైజెప్పిన విషయములు జరుగుచుండు కాలముననే, మహాదాజీ సింధియా, హరిపంతు ఫడ్కేలు తమసేనల నురిచ్చి నగర పరిసరముల కూడ జేసిరి. వీరిద్దరును నానా పక్షావలంబులే. నానా కష్టకాలమున మైసూరు నవాబగు హైదరు నెదిరింప వీరు బలముల గూర్చుచుండి రను పన్నాగము హైదరును, మొరోబాను కూడ మోస పుచ్చెను. జులై 8 వ తారీఖున హరిపంతు మహాదాజీలు తమ సేనల వేరువేరు మార్గముల నడపించి పురంధరు ప్రవేశించి, యట నానా నుండి తొమ్మిదిలక్షలు లంచము దిని, వానిపక్షమున పనిచేయనొప్పుకొని, హోల్కారు సేనలతో కూడుకొనినవరకు, మొరోబా యెట్టి యనుమానమును బొందలేదు; గాని వారికూటమిని మొరోబా నిరాధారుడయ్యెను. నానా మరల మహారాష్ట్రమునకెల్ల నిజమగు యేలికయయ్యెను. వెన్వెంటనే మొరోబా ఆంగ్లేయులతోడి తొల్లిటి రాయబారముల మరల సాగింప జూచెను. తన ఖిలంబును నంతయు ధ్వంసమయ్యెనని గ్రహించెను. జులై 11 వ తేదీని మొరోబాను వాని సహవాసులను, మహాదాజీ బంధించెను

ముట్టడించి యనేకులను చంపిరి. బుజాబా పురంధరే చేతగో నబడి వాదన దుర్గమున ఖైదున నుంచబడియెను. తదితర ముఖ్యులు వేర్వేరు కోటలలో బంధింపబడిరి. సఖారాం ముని పేరున నీకార్యములు జరిపిన బాగుండునని యోచబడుటచే నూతనమాత్రము కనుమరగి పోకుండ కాచియుంచబడెను. పూనాలోని రక్షణాగాపత్యానములుబెల్లరు నటుల రూపుమాపబడిరి.

మహామంత్రి బుద్ధిమంతుడగు నానా శత్రుపరంపరలన్నిటిని కత్తిబూనక నేజయించెను. ఎవరిలోపములు వారలకే యంత్యకారణములుగా జేసెను. విధిలేనిచోట యొగ్గి, వలసినచోట లొంగక, బిగియబట్టి యెన్నటను నిస్పృహ జెందక, గార్యదీక్షను మాత్రమెంతటి కష్టకాలమునను మరువక, దేశారిష్టకరంబగు పరదేశబలసహాయాపేక్షను మనమున జొటీయక, యుచితరీతిని మెలగి నెగ్గెను. సఖారాముతప్ప తదితర నాయకులెల్లరును నిజలాభాపేక్షకులైనందున, తన్మార్గమున నె నానా కెదురై నిలువలేక పోయిరి. పాపమా వృద్ధయోసును మాత్రము తగని చావు జచ్చెను. అకుంఠిత ప్రభుభక్తి పరాయణుడగు సఖారాం, ముసలికాలమున దా నెత్తదరము కానంతటి యినుప గొలుసులచే కట్టబడి కడుపునిండ తిండియు దప్పితీర నీరును లేక, 14 మాసములు దీసికొని శల్యపంజరమై, లేవలేక ప్రాణావసాన కాలమున "బలముడిగినది; ప్రాణములు పోవుచున్నవి; కోటమారాము గాని మాంసరహితమైన నాయెముకలైన రఘునాథరాయని స్మరింపక మానవు" యనుచు పరలోకగతుడయ్యెను.

ఓ ప్రభుభక్తిపరాయణా! సఖారాం! ధన్యుడవు ఛత్రపతి స్థాపిత మహారాష్ట్రము, నిజలాభాపేక్షకుల పాలైన తరి

యగ్రస్థానమునుండియు, లోభివికాక, నీ నమ్మిన ప్రభువు యంతటి హంతకుడనిపించుకొని, పరాఙ్ముఖుడై యస్వసీమల తలదాచుకొనినను, దానికై నీయావచ్ఛత్రులచే పాటుపడి, కార్యము లేకుండుటను గ్రహించియు, బలవన్మనోధైర్యుడగు నానా చేతుల లోబడి, వాని యిచ్ఛకులోనగాక, యసుగు లుడిగితివి. నీవు కదా సార్థక జీవివి! నానా దేశభక్తుడే గావచ్చును. నీవు శత్రుడే కావచ్చును. నీ నమ్మిన నమ్మికకై చూపిన త్యాగము ద్వితీయము. ధన్యజీవనా! భగవంతుడు నీ యాత్మకైన శాంతి నొసంగుగాక!

8 (ఆంగ్లేయులతోడి మొదటియుద్ధము.)

మహాదాజీ సింధియా ఔన్నత్యము

నానా చతురత ననసాటి సెల్ల మోసపుచ్చగల్గెను కాని పాశ్చాత్యులగు ఆంగ్లేయుల, కనుబారిమ లేకుండెను. వారలమధ్య మహారాష్ట్రులకు జనింపజేసిన ఈర్ష్య యపార మయ్యెను. [illegible] వ్యవహారమున, ఘోరించివారను మహారాష్ట్రులును యేకమై తమ్మేమి చేయుదురో యనుభయము ఆంగ్లేయులను బాధించుచుండెను. అందుచే వారు తమ సేనల దూర్పునుండి పడమటి తీరమునకు బంప నెంచి, పూనా పాలక వర్గమును, సింధియా, హోల్కారులను, తమతమ దేశముల మీదుగా వాటిని నడపించుకొనుటకు అనుజ్ఞాపత్రిక నిమ్మని వేడిరి. మహారాష్ట్రులకీ వేడుకోలు దుస్తంత్రమొనరింప నెంచి చేసిన పన్నాగముగ గన్పట్టెను. ఆంగ్లేయులే తూర్పునుండు తమ సేనల పశ్చిమమునకు

నకు చేర్ప జూచిన, సముద్రమార్గమున నేల తేరాదని వారు ప్రశ్నించిరి. గవర్నరు జనరలగు వారన్ హేస్టింగ్సు త్రోవలోనున్న ముధోజీ భోంస్లేతోడ సంధికూడ కుదుర్చుకొన వీలగునని యాత్రోవనుగూర్చి యడిగెను.

పురంధరు సంధిషరతుల నమలులో బెట్టుటకు నానా యడ్డుపెట్టుచుండెననియు, తమ పశ్చిమతీరపు టాస్తుల కెల్ల ప్రమాదమును సూచించు సంధికై ఫ్రెంచివారితో నేర్పాటులు గావించెనో, గావింపనుండెనో యనియు, గవర్నరు జనరలు గారి యనుమతి ననుసరించి మహారాష్ట్రసీమలలో శాంతి నెలకొల్ప వలసినదనియు నెరిగి, బొంబాయి పాలకసంఘమువారు, పూనా పాలకుల పురంధరు షరతులకు కట్టుబడి యుందురా లేదా యనియు, వివాదాంశములనెల్ల పరిష్కరింతురా లేదా యనియు, ఖచితముగ నడుగుచు దమ రాయబారిని, ల్యూబినును వెంటనే పూనానుండి పంపివేయవలసినదిగ కోరుమనిరి. నానా యనుకొనిన దానికన్న నెక్కువగ ఆంగ్లేయుల బెదర గొట్టిరని గ్రహించెను. ఇంక నశ్రద్ధచేసిన మితిమీరునని తెలుసుకొనెను. తనకు రఘోబాతోడ గల వైరము బట్టియుత్తై, వా శిఖోగాని, వాసిమిత్రులతోగాని యిక ముందెట్టి సఖ్యతకును లోనంగదని యెరిగెను. కాన జులై మాసారంభమున మొరోబాను చెరబట్టక మునుపే, సెంటు ల్యూబినును పంపివేసెను. కాని వానిని పంపివేయునపుడు ఫ్రెంచివారిని దనకు సహాయముగ దెచ్చినట్లయిన వారికి మహారాష్ట్రమున వసతి నిచ్చెద నని వాగ్దానము చేసెను.

సింధియా హోల్కారులు కర్నల్ వెస్లీక్రింద వచ్చు

చున్న ఆంగ్లేయ సేనలు తమ తమ రాష్ట్రముల గుండా బోవునపుడు, శత్రువులుగ నుండుటయే మంచిదని యెంచి, అనుజ్ఞాపత్రముల నిచ్చిరి. పూనాలోని మంత్రిమండలివారు మాత్రము ఫ్రెంచివారి కొరకై వచ్చుసేన (ఫ్రెంచి) ల్యూబినును పంపివేసినయిప్పట్టున, రాకగాని, అనుజ్ఞాపత్రములుగాని అనవసరమనిరి. నానా మహారాష్ట్ర సేనానులకును, బుందేలము (బుందేల్ ఖండము)లోని రాజులకును, కర్నల్ వెస్లీ దాడి నాటంక పరుపమని రహస్యముగ కబురులంపెను.

ఈ సమయముననే పూనాలోనున్న ఆంగ్లరాయబారి, మోస్టిన్ దొరకు మొరోబా కతఃవారుకోరిన షరతులన్నింటికిని యనుకూల సమాధానము నొసంగగా నాతండును వాటినిగొని బొంబాయిపోనెంచెను; గాని పాలకవర్గమున కిదివర కడిగిన ప్రశ్నల కెట్టియుత్తరమువచ్చునో జూచియే బోయిన మంచిదని యాగెను. జరుగుచుండినదెల్ల యెప్పటికప్పుడు దెలుసుకొనుచుండిన నానా యీయవలసిన జవాబుల నీయక త్రొక్కిపెట్టియుంచెను. మోస్టిన్ దొర వేచి వేచి విసిగి బొంబాయికి బయలుదేరి పోయెను. రాయబారి వెడలిన వెంటనే, నానా వాని సహాయార్థమువచ్చి పూనాలోనుండియున్న ల్యూయిస్కి దా మీయవలసిన జవాబుల నప్పజెప్ప, నతడు వాటిని బొంబాయి కందజేసెను. అందు ఫ్రెంచివారితో నెట్టి సంధియు జేసికొనలేదనియు, పురంధరు షరతుల కిదివర కిచ్చిన యర్థమునే క్రోడీకరించియు నచ్చజెప్పి. 'మంత్రిమండలివా రాషరతులకు కట్టుబడి యుందురా యుండరా యని యాంగ్లేయు లడిగిన ముఖ్యప్రశ్నకు, ఆంగ్లేయులా షరతుల కెంతవరకు బద

యుండుకో యెంతవరకు దాముకూడ కట్టుబడియుండుట కెట్టి యభ్యంతరమును లేదని సమాధానము చెప్పిరి.

మంత్రిమండలివారి యుత్తరవు లందు సరికి [illegible]ంచినవారికిని ఆంగ్లేయులకును యూరపు ఖండమున యుద్ధము సిద్ధించె ననుపు వార్త బొంబాయికి వచ్చెను. అప్పటి పాలకవర్గమువారు యూరోపునకు వారంపిన పత్రమును విసిన తరువాత, మంత్రి సమాధానములు పురంధరసంధి షరతుల నతిక్రమించుట గనే భావించిరి. అందుచేత తమవద్ద నున్న గవర్నరు జనరలుగారి చ్చిన యనుజ్ఞానుసారము, దమ కెదురాడుచున్న ప్రతికూలములుగ నుండిన పూనాలోని యధికారవర్గమును, కూలద్రోసిన గాని దమకు కీడుమూడక తప్పదని భావించిరి. అందుకుగాను కుమార పీష్వా మాధవరావు నారాయణుని పాలకునిగా నియమించి బాలుడు యుక్తవయస్కుడగుదనుక, వాని తరపున రాజ్య మేల రఘోబాను నియమింప నుద్దేశించిరి. ఈ యుద్దేశమును యుద్ధానుకూల కాలమువరకును గుప్తముగ నుంచి, అప్పుడు దమ పనిని వెనుక జూడకుండ నెరవేర్ప దలంచిరి. ఇదివరకు సూరతునకు తరలి వచ్చుచుండిన కర్నలు వెస్లీని గమ్యస్థానమును జూనేరునకు మార్చుమని కబురంపిరి.

నలుగడల నలము కొనుచుండిన యీ సంరంభమును నానా గ్రహించి, దాని కెదురొడ్డిన దగు సన్నాహముల జేసెను. శుకారాం మద్దువచ్చునేమో యని, వృద్ధాప్యమను మిష మీద వానిని పాలకవర్గమునుండి తొలగించి, సింధియా సేనల కావలికిద నుంచెను. అప్పటికని సింధియాయును, నానాయును వాని యనుమతి లేకుండ, నేమియు చేయునటుల నటిం

చుచుండిరి. ఈలోన ప్రతి మూరు మూలలనుండియు సైనికుల గూడదీసి దసరానాటి కెల్లరు నొక్కచోట సమావేశ మగునటు లాయత్తము చేయబడెను. వివిధ నౌకాస్థలముల గల నావల బాగుచేసి, సిద్ధముగ నుంచిరి. దుర్గములును, కోటలు నాయత్తపరచి తినుబడి సామగ్రిలతోడ నింపియుంచిరి. పూనానుండి వచ్చిన యాజ్ఞానుసారముగ నని వెల్లడి కాకుండ కర్నల్ వెస్లీని ద్రోవలో చీకాకుపరుప కబురంపబడెను. బొంబాయిలోనివారి కంట దుమ్ముకొట్టుటకు గాను రఘోబాను మంచి చేసుకొనుట కని రాయబారి నొకనిని ఆంగ్ల రాజధానికి బంపిరి. కాని పూనాలోని ల్యూయీ బొంబాయివారికి లోని గుట్టు వెల్లడిచేసెను.

ఆగస్టు మాసాంతమున నట బొంబాయికి బీరారు రాజగు మూడాజీ భోంస్లేతో గవర్నరు జనరలును వాని సహవాసము సంధిచేసుకొను నుద్దేశముతో నుండునట్లును, అందుచే దాము స్వరక్షణకు దప్ప మరే కారణమునను పూనా రాజ్యాంగముతో పోరు సలుప రాదనియు వార్త వచ్చెను. ఐనను మూడాజీ కూడ రఘోబా పునః ప్రతిష్ఠాపన విషయమున దమతో నేకీభవించును గాన, యీ వార్త దమ కెట్టి యాటంకమును గలుగజేయ దని భావించిరి. కాని అక్టోబరు 12 వ తేదీవరకు బొంబాయిలో నెట్టి యుద్ధ సన్నాహములును జరుపబడలేదు. అది గని గవర్నరు హార్న్బై తరువాత యీ పదవికి రానున్న జాన్ కార్నక్ దొర వెంటనే దగు శ్రద్ధ పుచ్చుకొనవలసిన యగత్యతను దెల్పుచు, ఆలస్యముచేసిన గలుగనున్న యనర్థకముల వెల్లడి చేసి దన యభిప్రాయమును విశదపరచెను. పశ్చిమ భాగ

సీమను రాజకీయ వ్యవహారములలో చేరెన్నిక గనిన యీ కార్నక్ మొదట బంగాళమున సైన్యములో పనిచేసి బ్రిగెడీరు జనరలు అను పదవి గడించి విఖ్యాతిజెందెను. బొంబాయి పాలకవర్గమునకు జెందిన డేవరు, బాగుగ యోచించి యీ విషయమున చాల తెలివితో, గవర్నరు జనరలును వాని సహాధ్యాయులును యేమాలోచించి మూడాజీతో రాయబారము నడుపనెంచిరో యెరుగరా దనియు, గాన తొందరపడరా దనియు చెప్పి, కార్నక్‌ను ప్రతిఘటించెను. నానా ఫర్నవీసును దొలగింపవలసిన యావశ్యకతయు, కాలము మించకుండ పని చేయవలసిన యవసరమును దా నొప్పుకొనెను. అట్టి యత్నము జయప్రదముగ జరుగ గలిగిననే మంచిది గాని, లేకున్న మరింత విషమ స్థితిలోనికి రావలసి వచ్చునని చెప్పెను.. మొదట దా మా యోచన సేయుసరికిగల స్థితిగతులు మారి, పూనా దమకిప్ప డుండవలసినంత ప్రతికూలముగ నుండెను.ఇవియన్నియువినియు, కార్నక్ దనపట్టువీడదయ్యెను. ఎన్నియో తర్కవితర్కములు జరిగెను. కొనకు రఘోబాతో సమాధానము కుదుర్చుట కొక సంఘము నేర్పాటుచేసి, దాని కధ్యక్షునిగ కార్నక్‌ను నియమించిరి. ఈ యుపసంఘములో పాలక సంఘములోని సభ్యు లిద్దరును, సేనాధ్యక్షుడును, సభ్యులుగా నియమింపబడిరి. సేనాధ్యక్షునకు రాజకీ యాధికారమే గాక, రఘునాధరాయని పూనాకు గొనిదెచ్చు సర్వాధికారములును నొసంగబడియెను.

వర్తక సంఘపక్షమున యోచింప రఘోబా తోడి ప్రస్తుతపు సంధిలో నూరతు సమాధానముకన్న వేరేమియు చేర్ప

బడినటుల గనుపించదు. రఘోబా మాత్ర మిందుమూలమున రాజప్రతినిధిగ పూనాలో నుండ నిశ్చయింపబడెను. తదితర విషయములలో బంగాళమునుండి వచ్చినషరతుల నేమాత్రము మీరియుండలేదు.

1778 నవంబరు 22 వ తేదీనా డాంగ్లేయుల మొదటి సేనా సమూహము బొంబాయి ద్వీపమును వీడి భారత సీమను గాలు పెట్టెను. మరియొక మాసమగుసరికి యీసేన 2500 బలముగలిగి భోరుగాటీమీదుగా పూనాకు బోవు మార్గమున నున్న ఖండ్లా వద్ద కూడెను. బొంబాయిపాలక వర్గపక్షమున వచ్చుచున్న కార్నక్ తనకు దోడ్పైరా, రఘునాధరావు తన యనుచరులతో నచ్చోట నీ సేనను కలుసుకొనెను. ఈ సేనకు కర్నల్ ఎగర్టన్ అధ్యక్షుడుగ నియమింపబడెను. సేనకు సదుపాయముల గమనింప జేసిన నేర్పాటుల లోటువలన యీదళము పదునొకండు దినములలో సుమారు 8 మైళ్ళు ముందునకు నడిపింపబడెను. బొంబాయిలో జరుగుచున్న యీయత్న విలంబము నానా సింధియాలకు దమసేనల గూడజేయ గావలసినంత వేళ నిచ్చెను. ఇప్పటున పురంధరు సంధిపత్రమున సంతకము జేసిన శుఖారామును చెరనుంచుట రాజనీతి గాదని యెంచి వానిని సమాధాన పరచి మరలమంత్రి వర్గమున పేరునకు జేర్చుకొనిరి. మహాదాజీ సింధియా, హరిపంతు ఫడ్కే తుకాజీహోల్కారులకు సైన్య కథనము నొప్పజెప్ప బడెను. హోల్కారునందు మాత్రము నానాకు పూర్ణవిశ్వాసము లేకుండుటనే యాతని యెదుటి సేనలోనున్న రఘోబాను కలియకుండునటుల దూరమున నెలకొల్పిరి.

1779 జనవరి 9 తేదీని 40000 బలముగల మహారాష్ట్ర సేన వచ్చుచుండిన ఆంగ్లేయ సేనను దాకుటకో యన, తల్లిగాము వద్ద నిలువబడెనే గాని వారు ముందంజవేసినంతనె వెనుకకు మరలెను. ఆగ్రామము ఫడ్నవీసు ననుజ్ఞానుసారము నాశనము చేయబడెను. చించోడ్, పూనాపట్టణములుకూడా నట్లే ధ్వంస మొనర్ప యాజ్ఞాపింపబడె నని ఆంగ్లోపసంఘమువారికి తెలియవచ్చెను. రాజకీయవ్యవహారమునకే వచ్చుచుండినను కార్నాక్ సైన్యపు బాధ్యతకూడ తనపైనుండినందున భయపడి మహారాష్ట్రుల రాజధానికి 18 మైళ్ళ దూరములోనుండి వచ్చితిని, శత్రువితో సమాధానయత్నములు గావింప నవకాశము మరలిపోవుటకు నిశ్చయించుకొనెను. రఘోబా కెన్నిలోపములుండినను యోధాగ్రేసరుడుగావున యిట్టి పిరికిపన్నాగము తగదనియు, నాంగ్లేయ లక్షణము కాదనియు పోరి చెప్పెను; గాని యొక్కడు దప్ప కార్నిక్ ఆదిగాగల యూరోపియన్ ఉద్యోగులెల్ల ఆ రాత్రి యేమరలి యంత భయమును జెందియుండిరి. చేరువనె వెన్నాడు మహారాష్ట్ర గుర్రపుదళమంతయుండ, ముందంజవేసి యెదుర్కొనుటకు మారు మరలుట పరమ ప్రమాదకరమైయుండెను. ఆంగ్లేయ సైన్యము వెనుజూపినంతనె మహారాష్ట్ర సేనలన్నియు నొక్కుమ్మడి వారిని దాకిరి. అదృష్టవశమున కెప్టను హార్ట్లేయను సేనాని వారినుండి సేనను కాపాడుచుండెను. అప్పటికిని ఆంగ్లేయులకు గలిగిన యపరిమితమగు నష్టము వారిని వార్గామునుండి మరిముందుకు నడువ వీలొసంగినది కాదు. అచ్చోటనిలచి వారు సంధియత్నములు సల్పజొచ్చిరి. ఆంగ్ల ఉపసంఘ కార్యదర్శియగు ఫెరారు, మంత్రులయొద్దకు

బంపబడెను. మంత్రివర్గమువారు రఘోబాను ఒప్పగింపుమని కోరిరి. ఇట్టి హీనకృత్యమునకైన ఆంగ్లేయులొప్పుకొని యుందురు గాని, రఘోబా సింధియాతో స్వయముగా సంధిచేసుకొని ఆంగ్లేయులకా కళంకమునకుగూడ వీలొసంగలేదు. సింధియా యెట్లైన నానానుమీరి మహారాష్ట్రమున దానే యద్వితీయుడైయుండ నెంచుచుండెను. నానా వానిని దనకు పైచేయిగాకుండ జూచుచుండెను. వారికోర్కె లెట్లుండినను ప్రస్తుతాశయము లొక్కరీతినే యుండుటంజేసి మహారాష్ట్రమున కీయిరువురి సఖ్యతయె యవసరముగ నుండెను. నానా, సింధియాల చేతులలోనే పాలింపబడుచుండిన పూనా పాలకవర్గము, బొంబాయి వారిని మాధవరావు బల్లాలుని కాలమునుండి వారాక్రమించుకొనిన రాజ్యమునెల్ల నొప్పగింపవలసినదనియు, సూరతు, బ్రోచి పట్టణముల రాబడిని దమకు చెల్లింపుమనియు కోరిరి. ఆంగ్లోపసంఘమువారు తిరిగి బోవుటకు దారిగానక పూనావారిని కొంతగాకున్న కొంతకైన ప్రసన్నుల జేయనెంచి, ఫార్మరుదొరను దమయున్నతాధికారుల యనుమతి లేకుండ దామెట్టి సమాధానమును జేయ నసమర్థులమని దెలుప బంపిరి. ఈవార్త వినిన మహాదాజీ "ఎవరియనుమతిపైని కర్నల్ అప్టన్ చేసిన సంధిని మీరు మీరిరో దెలుపు"డని యడిగెనే గాని యాంగ్లేయులు గాలమతిక్రమించకుండగనె హోమ్సుదొరను, సింధియానుగలసి సంధికుదుర్చుకొని, రా, సర్వాధికారమిచ్చి బంపివేసిరి.

తనతోడ నాంగ్లేయులు ప్రత్యేకముగ నడుపుచుండిన యీ రాయబారము సింధియా నంతయు నుప్పొంగజేసి, వాని

యాశల వృద్ధిజేసిరి. అంత మాత్రమున నాతను మై మరువక ఆంగ్లేయులనుండి వీలగు సదుపాయములెల్ల రాబట్టి, నానాకు మాత్ర మేమియు చేజిక్కకుండ చూచుకొనెను. ఇందుకై వార్గాముపద్ద నొక యొడంబడిక చేసికొనబడెను. ఇందుమూలమున యిరుపక్షులవారును 1773వ సంవత్సరమునయున్న స్థానములను మాత్రమే యాక్రమించుకొన నిశ్చయింపబడెను. కర్నల్ గొడార్డు క్రిందవచ్చుచున్న సేన తిరిగి పోవుటకు యాజ్ఞాపింపకోరబడెను. ఈషరతులను తిన్నగ పాలించువరకు నాంగ్లేయులిద్దరు తమవద్ద జామీనుగ నుండవలసినదిగ కోరబడిరి. ఆంగ్లేయులిటుల జామీను కోరబడుటయు యిచ్చుటయు వారి భారత రాజ్యాంగ చరిత్ర నిదియే ప్రథమము. ప్రథమమున నేల యిదితప్ప మరెప్పుడిట్టి యవస్థ పాలుకాలేదు.

ఈ యొప్పందల వార్త విని బొంబాయిలోనివారును సీమలోని దొరలును మండిపడిరి. కార్నక్, ఎగర్టన్, కాక్బర్న్ దొరలను కొలువులోనుండి తొలగించిరి. గవర్నరగు హార్నబీ దొర అట్టి సంధిని జరుపుటకు వారికెట్టి యధికారమును లేదని కొట్టివేసెను. 1778 ఫిబ్రవరి 19వ తారీఖున పెద్ద నివేదికనొకదానిని తయారుచేసి సంఘమువారి యెదుట బెట్టెను. అందు మహారాష్ట్ర రాజ్యాంగ విధానమును గూర్చియు, ఆంగ్లాధికారులా రాజ్యముపట్ల వర్తించవలసిన రీతియు సూచింపబడెను. సేనను భాగుచేసి బలపరచదగు యత్నముల జేసెను. శాంతి నెలకొల్పుటయు, మహారాష్ట్రమునుండి ఫ్రెంచి వారిని వెడలగొట్టుటయు, అప్పటికి తను పాలననున్న రాజ్యము నిలుపబెట్టుకొనుటయు, తన కనుకూలకర్తవ్యములని తెలిపెను. సింధియా వర్తనము వారికి ఫ్రెంచివారిసిన గిట్టనట్లును, నానా కోర్కెల కెదురగ నాంగ్లేయులతోడి సంధి కనుకూలుడైనట్లును, హార్నబీ దృఢముగ నమ్మియుండెను. వాని నమ్మికయందును కొంతసత్యము లేకపోలేదు. నిజబలముననో, పరసహాయముననో నానా బలోన్నతుడయ్యెనేని, సింధియా బొంబాయిగవర్నరు దలంచినటు లాంగ్లేయుల సాయమపేక్షించియుండునే గాని నానా యధికారమెల్ల తన బలముపై నాధారపడియుండునంతకాలము సింధియా వానికి సాయమొనర్పుట నే ధనకు మంచి దని తలంచెను. ఆంగ్లనాయకుడు సింధియా నాఖరులకిత్తుమనిన ధనము యీయవలయుననియు, వార్గాముపద్ద నాంగ్లేయులను విడిచిపెట్టి నందుకుగాను బ్రోచిపట్టణము సింధియాకు యీయవలయు ననియు సలహానిచ్చెను. ఈ నివేదిక ఆంగ్లాధికారుల యోచన కర్పింపబడెను.

సింధియాతోడి సాంగత్యమును గూర్చి గవర్నరు జనరలగు హేస్టింగ్సు హార్నబీదొర చెప్పినట్లు సింధియాకు భిన్నాభిప్రాయ మేదియో యుండునని తలంచెను. కాననే కర్నల్ లెస్లీ స్థానమున నియమింపబడిన జనరల్ గొడార్డు, సింధియా కంపెనివారితో చెలిమి జేసికొన నెప్పుడైన నుద్దేశించినయెడల సంధి సమకూర్ప నియమింపబడెను. నానా భయము నాధారముచేసుకొని తన మాటల నాడుచున్న సింధియా యుద్ధకారణముండిననే గాని, నానా దనకు లక్ష్యము జేయడని యెంచి, యీవల నాంగ్లేయులతోడ మంచిమాటలాడదన వకీలును బొంబాయిలోనుంచి, యావల వారి వైరము రేపుటకు బంకోటును ముట్టడింప సేనను బంపెను. పండ్రెండులక్షలు విలువగల జా

గును రఘోబా బందెలంబున ముట్టునట్లు యేర్పాటుజేసి యాత
డెప్పటికిని దిరుగబడడని నానాకు నచ్చదానే దానికి జా
మీనుగా నిలచెను. ఈతీరున రఘోబా, సింధియా చేతు
లలోని కీలుబొమ్మ యయ్యెను. కాని వాని యమానుష
క్రౌర్యాన్విత జన కంటక మతని నెట్టు లుపయోగించుటకును
సింధియాకు హిలోసంగలేదు. పరుల పట్లనున్న భయకారణ
మునకుకు దప్ప నేరొందు ప్రయోజనములేని రఘోబా సాంగ
త్యము సింధియాకుగూడ జనకంటకమునకు గుఱిచేయగల ద
ని నానా లోలోన సంతాపించుచుండెను. ఈ యేర్పాటు జరిగి
నవెంటనే సింధియా రఘోబాను బుందేలమున నున్న వాని
జాగీరునకు బంపివేసెను. వాని నట్లు బంపి ఝాన్సీ కోటలో ఖై
దీగానుంచి దన కవసరమగు నపుడు సింధియా విడువనెంచె నని
నానా దలచెను. రఘోబా సామాన్య పరివారమును, వాని
వెంటనంపబడిన కావలిదళము వాని పరివారమున కేమాత్ర
మును సంఖ్యకు మించియుండలేదు. రఘోబా నర్మదా తీర
మును చేరకుండగనే, మే మాసాంతమున, సింధియావానిని
ఝాన్సీకోటలో బంధించి యుంచునని దెలియవచ్చెను. అదివిని
యదనుగని రఘోబా కావలి భటుల నెదురించి గెలిచి త్వరిత
గతినేగి బొంబాయిలోనున్న దనమిత్రులగు నాంగ్లేయులను మరల
శరణుజొచ్చెను. రఘోబా చర్యను విని సింధియా మొట్ట ప్ర
శ్నల నడుగలేదుగాని యీ యత్నమంతయు సింధియా పన్నిన
పన్నగడమే యనుటకు సందియములేదు. ఈ కారణ
మున నానాకు ఆంగ్లేయులకును గల మనస్పర్ధలు మరింత హె
చ్చెను. ఇరుగడలవారును సింధియాపై మరింతగ నాధారపడ

వలసిన వారైరి. నానాకు సింధియాను గనిన నీర్ష్యయు భయ
మును హెచ్చెను. అందుచే వానిని విడిచివేయుటకు మరింత
వీలుపడినదికాదు. ఆంగ్లేయుకిట్టి యగమ్యగోచరములగు స్నేహ
సూచనలు దమయుభయ మిత్రుడగు రఘోబాను విడిచిపెట్టుట
లో దమతోడి సఖ్యతకు కారణమగు నని యాశల బుట్టించెను.

1779వ వత్సరాంతమున శుకారాంబాపూను సింధియా
నానాకు నొప్పజెప్పెను. నానా వానిని సింహగడమున బం
ధించి యుంచి యటనుండి ప్రతాపగడ దుర్గమునకు మార్చెను.
సమతలమునుండి 4000 యడుగుల యెత్తున నున్న యీ దుర్గ
గవాక్షములనుండి శుకారామునకు వాని ముత్తాతయగు పం
తాజీ, స్వామిద్రోహియై శివాజికి అఫ్జుల్ఖానుని నొప్పగించి
చంపించినతావు గానవచ్చుచుండెను. అటనుండి మరియొకచోటు
నకును, అచ్చటనుండి వేరొకతావునకును, మార్చి మార్చి యె
ట్టకేలకు రాయగడ దుర్గమున, భోగభాగ్యములను దారిద్ర్యదు
ర్భిక్షములను గూడ నేకరీతి ననుభవించిన యీ ముదుసలి శు
కారాము స్వర్గస్థుడుగా జూచెను. రఘోబామంత్రియగు చిం
తూవిఠలుడుకూడ నొక కొండకోటలో సరియైన తిండిలేక పడ
రాని పాట్లుబడి మగ్గెను.

తన ప్రత్యర్థియగు శుకారామును, రఘోబా మంత్రి
యగు విఠలుని కోరి, బడసి దన యీర్ష్యాగ్నికాహుతులను
జేసినను నానాకు సింధియా నమ్మదగినటుల దోచలేదు. తన
కోర్కెచెల్లింప సింధియా వారి నడిగినంతనే యొప్పజెప్పుటజూడ
రఘోబా పారిపోవ, దాను జేసిన సాయము ననుమానించకుండ
పన్నిన పన్నాగమేగాని వానికి నానాయందు గలనమ్మకము

నుండి కాదని స్పష్టమయ్యెను.

తూర్పునుండి పశ్చిమమునకు తరలి వచ్చుచున్న సేనాధిపతి జనరల్ గోడార్డు రాక నాపవలయు నని వార్గాము షరతులలో నొక్కటియైయుండెను. ఆసమాధానము నే బొంబాయి బంగాళము మొదలగు పాలక వర్గములవారు పాటించని నాడు, గోడార్డు సేనాని తన దాడిని సాగించె ననివేరె చెప్పవలసిన యావశ్యకత యేమున్నది. అతడు బుందెలఖండము, మాళవ, భూపాళముల దాటి బరహాంపురంద్వారా సూరతు నగరమునకు 1779 ఫిబ్రివరి 26 వ తేదీని వచ్చి చేరెను. శత్రుసేనలు దన నరికట్ట చేసిన యత్నములనెల్ల నతిక్రమించెను. కలనైనను తలువని తలంపుగ నంత సేనా సమూహము యమునానదీ తీరమునుండి వచ్చి పడుటను జూచిన రాజ దర్బారులలో వార్గాము సమాధానమునుండి, ఆంగ్లేయులయందు గలిగిన నిరసవభావము దొలగిపోయెను.

ఈ దాడి కాలముననె కలకత్తాలో ఫ్రెంచివారికిని యాంగ్లేయులకును సంభవించిన యుద్ధవార్త వినవచ్చెను. నానా ల్యూబినుకు జూపిన యాదరముపై నీ యుద్ధవార్త రాగా హేస్టింగ్సు దొర మహారాష్ట్రులతోడ ఫ్రెంచివారు కలయుదురని యనుమానపడజొచ్చెను. ఇట్టి నూతన సంఘటనము నెదుర్కొన హేస్టింగ్సు గట్టియత్నములు జేసెను. సైన్యము నభివృద్ధిపరచెను. కలకత్తాలోని రక్షకభటులను వేయిమంది దనుక హెచ్చించి సైనిక నియమములకు లోనుగా జేసెను. బీరారు రాజ్యమునేలు మూడాజీ భోంస్లేకు పీష్వాపదవి నిప్పింతునని యాశబెట్టి, వాని చెలిమి సంపాదింప జూచెను; గాని వానికోర్కె

నెరవేరినది కాదు. మూడాజీ యీ సంగ్రామమున పాల్గొన నెంచనందున గోడార్డు సేనాని చేసిన సంధి యత్నము నిష్ఫలమయ్యెను. గోడార్డు వచ్చినంతనె వానికి స్వాగతమిచ్చి బొంబాయి పాలకవర్గమువారు వానిని దమ సంఘమున నొక సభ్యునిగ జేర్చుకొనిరి. బరోడా ప్రభువగు గైక్వారు నెట్టులైనను పూనా పాలనమునుండి వేరుచేసి స్వతంత్రునిగ స్థాపించమని హార్న్బీ దొర గోడార్డు సేనానిని కోరెను. గాని గవర్నరు జనరలనుమతి లేనిదే గోడార్డు అట్టి పనికి నెట్టుకొన సాహసింపలేదు.

ఫ్రెంచివారిని చేరదీయరాదని మాత్ర మెక్కువగ చేర్చి పురంధరు షరతులతోడనే మరల సంధి యొనర్పవలసిన దని హేస్టింగ్సు 1779 ఏప్రిల్ 15వ తేదీని కబురంపెను. అది పొసగదని హార్న్బీ చెప్పినట్లు గైక్వారుని స్వతంత్రుని చేయమనెను. రఘోబా శరణాగతుడై వచ్చిన తరువాత వానిని సూరతు నగరముననె, స్వాగత పూర్వకముగ కాకపోయినను, యాదరించిరి. జూను నెల 12 వ తేదీని తన కుమారులగు అమృతరావు బాజీరావుల దోడ్కొని జనరల్ గోడార్డు విడిదికి రఘోబా వచ్చినప్పుడా దొరవారిని దగు రీతిని సత్కరించెను. అంతియకాక ఆంగ్ల సేనాని వారలకు నెలకు 50 వేల రూపాయిలు ముట్టునట్టి యేర్పాటు గావించెను. ఈచర్య ననవసర వ్యయమనియు దుబారా కర్చనియు నధికారులు విసుగుకొనిరి. వేతన మేమో నిర్ణయించెనె గాని గోడార్డు రఘోబాతో నెట్టి సఖ్యతను కుదుర్చుకొనలేదు. ఏలనన ప్రజాకోటి కయిష్టుడైన రఘోబాను వారిపై కధికారిగ నుంచుటకు వారును సందేహించిరి. అంతియ కాక దాము కోరుచున్న పూనావారితో

సఖ్యత కుదురనినాడు, ఆంగ్లేయులు వార్గాము పరాభవ నివారణార్థము స్వతంత్రముగనే మహారాష్ట్రుల నెదురింప నెంచిరిగాని, రఘోబా కొఱకని పోరు సలుప దలచుకొనలేదు.

గోడార్డునకును నానాకును మాసముల తరబడి రాయబారములు జరుగుచునే యుండెను. వర్షాకాలాంతమున గోడార్డు హైదరాలీ, నిజాము, గైక్వారులు దప్ప తదితర మహారాష్ట్ర నాయకులెల్ల సమావేశమై ఆంగ్లేయుల నలుగడలనుండి యెదిరింప నిశ్చయించుకొనిరని వినెను. వెన్వెంటనె యీవార్త బొంబాయిలోని పాలకవర్గము వారికి దెలియబఱచెను. నానాను వెంటనె దన రాయబారమునకు దగు నుత్తరు విమ్మని కోరెను. నానా మహారాష్ట్రులతోడ నాంగ్లేయులకు సఖ్యతే గావలసిన యెడల సంధియత్నము లెట్టివైన జరుగక పూర్వ మాంగ్లేయులు సాల్సెట్టిపట్టణము నిచ్చివేసి రఘోబా నొప్పజెప్పి మరియు మాటాడవలయుననెను. వట్టి యేర్పాటు లెప్పటికిని మన్నింపదగినవి కావుగాన, నాంగ్లేయులు యుద్ధమునకే సిద్ధమైరి. గోడార్డు గైక్వారగు ఫత్తేసింగుతోడి సంధినిగూర్చి యోచింప బొంబాయికి వెంటనే పయనమై, యచటికి నవంబరు మొదటి తారీఖునాటికి చేరెను. బొంబాయికిపోయి యచట వారిని కలసి యాలోచించుట కన్న గోడార్డునకు సేనకు సౌకర్యముల గూర్చుటయే ముఖ్యోద్దేశమై యుండెను.

అతని కోర్కె నామోదించి బొంబాయివారు 100 యూరోపియను ఫిరంగులను, 200 యూరోపియను కాల్బలమును, రెండు దేశీయ పటాలములను, వెంటనే గోడార్డుక్రింద సేనలు విడిసియుండిన, గుజరాతునకు బంపిరి. జనరలు గోడార్డు

సూరతునకు మరలి వచ్చిన వెంటనే నానా వకీళ్ళను దన విడిదినుండి బంపివేసి, తన సేనను యుద్ధమున కాయత్తము జేసి, ఫత్తేసింగుతోడ రాయబారము నడుపజొచ్చెను. సూరతులోని యాంగ్లేయుల కోటను హటాత్తుగ ముట్టడించి పట్టుకొన, పోర్చుగీసు నాయకుడగు వాండిగ్రిస్పుతోడ నానా నడుపుచున్న యుత్తరప్రత్యుత్తరములు ఆంగ్లేయుల చేతులంబడ, వారా కుట్రకు లోనుగాకుండ సకాలముననె శ్రద్ధవహించి దగు నేర్పాటులను జేసుకొనిరి.

ఫత్తేసింగున కాంగ్లేయుల రాయబారమందిన తరువాత నాతడు దగు శ్రద్ధ వహించలేదు. ఆంగ్లేయులతోడ నెట్టి యొడంబడికయు జేసుకొని దానికి కట్టుబడియుండ నాతడిచ్చగింపకుండెను. కాన జనరల్ గోడార్డు 1780 సం॥ మొదటిదినమున తపతీనదిదాటి జనవరి మాసాంతము లోననే 2300 సైన్యముచే కాపాడబడుచుండిన పీష్వాయొక్క ద్యాబాయికోటను ముట్టడించి వశపరచుకొనెను. అది గాంచిన ఫత్తేసింగు వారితోడ సంధికి మొగ్గెను. ఇందుమూలమున వారొండొరుల శత్రుశిక్షణమునను యవసర రక్షణమునను సాయముచేసుకొనుట కొప్పుకొనిరి. ఫత్తేసింగు 3000 గుఱ్ఱపుదళముతో యాంగ్ల విడిదిని చేరి, మిహీ కుత్తరముననున్న పీష్వారాజ్యము నంతను పుచ్చుకొనుటకును దక్షిణముననున్న కొన్నిజిల్లాలను ఆంగ్లేయుల కిచ్చివేయుటకును నొప్పుకొనెను. ఈయొప్పుదల జరిగిన పదమూడవనాడు గుజరాతు ముఖ్యపట్టణము ముట్టడింపబడి పట్టుకొనబడెను. ఈ ముట్టడిలో గాయములుపడియో యుసురులుడిగియో 106గు రాంగ్లేయులు నష్టపడిరి. అట్లహమ్మదా

బాదును పట్టుకొనిన తరువాత సింధియా, హోల్కారులు 20000 సేనతోడ దన్నెదిరింపవచ్చుచున్నా రని గోడార్డు వినెను.

రఘోబా పారిపోయిన తరువాత నానా సింధియాలకు మనస్పర్థలు కలిగెను; గాని వారు వెంటనే మరల కలసుకొనిరి. అట్టి సమయమున పూనావిడిచి పోవ సింధియా కేమియు నిష్టములేకుండెను. ఐనను దా నాంగ్లేయులతోడ సంధి కుదుర్చుకొనునేమోయను భయము నానాను దనపై కత్తిగట్ట వీలొసగదని సింధియా దలంచెను. ఆధైర్యముననే గోడార్డు నెదురింప గుజరాతునకు నేగ సమ్మతించెను. అప్పటినుండియు సింధియా దన చర్యలన్నియు నానాకు దెలియబరచుచు వచ్చెను; గాని సింధియా నానాతో తగవులాడి కత్తిగట్టనుండెనను వదంతి లోకమెల్లనిండెను. అంతియకాక సింధియా సూరతును పట్టుకొని రఘోబాను యెట్లయిన దన చేతులలోనికి దెచ్చుకొన జూచుచున్నాడని కూడ పుకారు చేయబడెను.

గోడార్డు యుద్ధమున కరిగినప్పుడు రఘోబా వానితో నేగక నగరముననే యుండిపోయెను. రఘోబా తరఫుననే యాంగ్లేయులు యుద్ధముచేయుచున్నా రనియు, గాన దన పన్నాగము నెదిరింతు రనియు దలంచి సింధియాకు, రఘోబా సైన్యముతోడ నేగకుండుట చూడ నేమియు తోచినదికాదు. ఐనను దాను రణరంగమునకు దిగిన వెంటనే నానాయందమిత శత్రుత్వమును ఆంగ్లేయులయెడ స్నేహమును నటించి, దనకు వార్గాము యొడంబడికను పాలించుటకు జామీనుగా, నాంగ్లేయు లొప్పజెప్పినఫార్మరు స్ట్యూవార్టు దొరలను విడిచిపెట్టెను. ఈదొరలతని యొద్దనున్న దినములలో నతి దయతో సత్కరింప

బడిరి. వారిట్లు విడిచి సింధియా దన వకీలగు ఆబాజీశంబాజీని తన తరఫున సమాధానము కుదుర్ప నాంగ్లేయుల కడకంపెను. కాని గోడార్డు యిరుకక్షులవారికిని ననుకూలముగా నుండు షరతులను దననే చెప్పుమని సింధియాకే విడిచిపెట్టెను. ఏలనన నాంగ్లేయు లీ దేశమున మర్యాదగ శాంతినెలకొల్పుటయే ముఖ్యోద్దేశమనియు, అట్టిశాంతి స్థిరమై దమనెట్టి యిక్కట్టుకును లోనుగాకుండనుంచగల్గినదయియు నై యుండవలెననియు గోడార్డు కోరెను.

సింధియా వృథాప్రసంగముల కాలయాపనముజేసి తమకనుకూలమగు యుద్ధకాలమును వ్యర్థము చేయ జూచుచుండెనని యాంగ్లసేనాని గ్రహించెను. కాబట్టి సింధియా కోరినట్లు దనకు సంధి కుదుర్చుకొన నెంతయో కోర్కెగలదని చెప్పి యెంతకాలములో నది జరుగవలయునో మాత్రము ఖచితము దెలియజేసెను. నియమిత కాలమగు మూడు దినములలో సింధియా వకీలు మరలివచ్చి, ఆంగ్లేయులు వార్గాము వీడి యేగిన తర్వాత రఘోబాకును సింధియానుకుజరిగిన యొడంబడిక ప్రకారము రఘోబా పూనా వ్యవహారములో నెట్టి జోక్యమును కలుగజేసుకొననియు, జాన్సీకి బోవుదు ననియు నట సాలునకు 12 లక్షల రూపాయలు దనకిచ్చుచుండ వలయుననియు, మాధవరావు నారాయణుడే సింహాసనమున నుండవలెననియు, రఘోబా రెండవ కుమారుడగు నాల్గేండ్ల ప్రాయముగల బాజీరావుపీష్వా దివానుగ నియమింపబడ వలెననియు, ఆబాలుడు పెరిగి పెద్దవాడగువరకు నాతని యుద్యోగము సింధియా చేయుచుండవలెననియు, వ్రాతమూలమున జాగ్రత్త పెట్టబడి

యున్నదని చెప్పెను. కాన రఘోబా యిప్పుడు జాన్సీ కగుగవలెననియు, బాలుడగు బాజీరాయుడు దనతోడ పూనాకు పయనము కావలెననియు, సింధియా కోరె ననెను. ఇక నాంగ్లేయుల తరఫున నేమి కోరవలసి యున్నదో కోరుకొనుమని గోడార్డు నడిగెను. తనంత దా కోరివచ్చిన రఘోబాను వాని యిష్ట మరయకుండ బొమ్మనుట యక్రమము గాన తాను సమ్మతింపలే నని గోడార్డుచెప్పెను. ఒకవేళ నాంగ్లేయులు సింధియా కట్టినసర్వాధికారార్జనకు సహాయమొనర్చినను, సింధియా మొదట పీష్వాతరఫున ఆంగ్లేయుల కనుకూలమగు షరతుల కొప్పుకొన వలెననెను. ఏలనన సింధియా కట్టి యేర్పాటమితమగు లాభ మొనంగుటయేగాక, మహారాష్ట్రులతోడి సంగ్రామము లాంగ్లేయుల కపరిమితమగు నష్టమును కలిగించెను.

ఇట్లధమ మేడు నెలలైనను బాడుగించి మహాచతురుల మనుకొను పూనాలోని బ్రాహ్మణుల భయముల నొకవంకను, రాజ్యాంగవేత్తల మనుకొను యమాయికులగు నాంగ్లేయుల యాశల నొకవంకను రేపెట్టనెంచిన సింధియా యాటలనెల్ల యేడు దినములలో గోడార్డు కట్టిపెట్టెను. యుద్ధమును, నియమిత కార్యసాధనమును దప్ప నన్యమెరుంగని గోడార్డునుండి మరేమియు సింధియాకు ఫలింపదయ్యె.

తన రాయబారమునకు గోడార్డంపిన సమాధానము సింధియా కేమాత్రమును నచ్చకుండినను యాంగ్లేయులయెడ దనకుగల స్నేహభావ మేమాత్రమును తగ్గలేనటుల నటించెను. అట్లు చేసియు గోడార్డును మోసబుచ్చనేరక సింధియా గోవిందరావు గైక్వారునకు గుజరాతునిప్పించు షరతున సంధికి యు

డంబడిచెను. వెంటనే యుద్ధము మొదలయ్యెను. గోడార్డు మహారాష్ట్రుల నెదుర్కొని నురుమాడ నెంచి సర్వయత్నముల జేసెను. మహారాష్ట్రులు వానికెదురుబడకుండ తప్పుకొనుచుండిరి. ఎట్టకేలకు ఏప్రిల్ 3వ తారీఖున పావనగర్నున్న మహారాష్ట్ర శిబిరమును గోడార్డు ముట్టడించి వారిని యోడించెను. చాల నష్టపడిన మహారాష్ట్రులోడిరనియు దనకు మహోత్తర విజయము చేకూరిన దనియు గోడార్డుతలంచెను. అప్పట్టున సింధియా వెన్నాడుట భావ్యముకా దనుకొనెను; గాని మహారాష్ట్రులు వేరొండుతావున యెప్పటియట్లు విడిసియుండిరని దెలియవచ్చెను. గోడార్డుమరల వారిపైబడెను. కాని యథావిధిగ మహారాష్ట్రు లాంగ్లేయులపై బాణసంచులను కాల్చి విడిచి విడిదియెత్తుకొని పలాయనమైరి. (ఏప్రిలు. 14.) ఇంతలో బొంబాయినుండి వచ్చిన యాజ్ఞల ననుసరించి కర్నల్ హాన్లే దొర కొంకణము నందుండు సేనకు సహాయము జేయ బంపబడెను.

బేసీను దుర్గము నాక్రమింపవలసినదని గోడార్డు సేనానిని బొంబాయివారు కోరిరి. గుజరాతు నవ్వాకువిడిచివెళ్ళిన దమమిత్రుడగు ఫత్తేసింగు నిరాధారుడై శత్రువులపాలబడును గాన గోడార్డు బొంబాయివారి యాజ్ఞను పాలింపలేకుండెను. బొంబాయిదీవిలోని వారికి వలయు తినుబడి సామగ్రియంతయు ప్రక్కనున్న దేశమునుండి రావలసినదేగాన మహారాష్ట్రులా తీరముననున్న తావులనాక్రమించకుండ చూచుకొనవలసియుండెను. ఆకారణమున ప్రక్కనున్న స్థలములను గొన్నింటిని దామే యాక్రమించుకొనిరి. ఈ యాక్రమణమున, నానా యెంత

యో విలువగలదిగ జూచుకొనుచున్న కళ్యాణపట్టణమొకటి బట్టుకొనబడెను, అది విని నానా వారి నాయాతావులనుండి దరిమివేసి కళ్యాణమును స్వాధీనము చేసుకొనుటకు పెద్దసైన్యమును సమకూర్చెను. కళ్యాణపట్టణాక్రమణమునకు ముందు, కనుమలలోని మహారాష్ట్ర స్థానము నాంగ్లేయు లాక్రమించుకొని యుండిరి. ఫడ్నవీసుయొక్క సేన లాతావునుండి శత్రుల దరిమివేసెను. పిమ్మట జయోత్సాహమున మహారాష్ట్రసేన కల్యాణమును ముట్టడించెను. ఆంగ్లేయులు ధైర్యసాహసములతో దానిని రక్షించుకొనుచుండిరి. ఈలోపున వారి యదృష్టవశమున గుజరాతు నుండివచ్చుచున్న కర్నల్ హార్ట్లే మేనెల 25వ తారీఖు నా డచ్చోటజేరి, ముట్టడించుమహారాష్ట్రుల నెదిరించి, యోడించి, పారదోలెను. మహారాష్ట్రులచ్చటి నుండి పోయిన తరువాత కొంకణమునువీడి, యుద్ధానుకూల కాలమంతయు మరల యచ్చోటికి రాలేదు.

ఘూర్జరమునన్ను గోడార్డు వర్షకాలమాసన్నమగుటగని, దన సేనను నర్మదా తీరమున ననుకూలమగు దావుల విడియబంపెను. వర్షకాలమున మహారాష్ట్రులు చిన్నచిన్న గుంపులుగా వచ్చి కొంకణమున నున్న యాంగ్లేయుల నెదిరించిరి. కాని కొంకణమున కెల్ల యాయువు పట్టనదగు కళ్యాణము మేజరు హాప్కిన్సు, కెప్టను ఎబింగ్టనులక్రింద మహాపట్టుదలతో రక్షింపబడుచుండుటచేత మహారాష్ట్రు లేమియును చేయజాలక పోయిరి.

ఘూర్జరమునన్న సింధియానో, హోల్కారునో లేకున్న, వారిద్దరినికూడనో, యాయా దేశములనుండి మరలించు

టకు బందెల ఖండమునకును మాళవమునకును సేనను పంపుమని గోడార్డు, గవర్నరు జనరలునకు వ్రాసెను. అదిగని హేస్టింగ్సుదొర కెప్టను పోఫాము యాధిపత్యమున 2400 మంది సిపాయిలను కొంత యూరోపియను ఫిరంగిదళమును నిచ్చి పంపెను. పోఫాము లాహారమును పట్టుకొని, నిర్భేద్యమగు గ్వాలియరు కోటను ఆగస్టు 4వ తేదీని వశపరచుకొనెను.

అనుకూల కాల మాసన్నమైనంతనె గోడార్డు తన సేనను సముద్రమార్గమున సాల్సెట్టీకి దెచ్చి నవంబరు 13వ తేదీని బేసీనును యాక్రమింప దాని ముందు విడిసెను. సర్వసన్నాహములజేసి డిశంబరు 11వ తేదీని యా పట్టణమును బట్టుకొనగల్గెను. నానాయును, హరిపంతు ఫడ్కేయును యాముట్టడిని చెరుపనెంతయో యత్నించిరి. 20000 సైన్యమును గొని ముట్టడించు వారలను గాపాడుచుండిన హార్ట్లీక్రింద బొంబాయిసేనను రెండుసార్లెదిరించి యోడిరి. రెండవసారి యుద్ధమున నిపుణుడగు మహారాష్ట్ర సేనాని రామచంద్ర గణేశుడు మడసెను. ఈయుద్ధమున మహారాష్ట్రు లపరిమిత నష్టము పాలై నిరుత్సాహులై రణభూమిని వీడిరి.

బేసీనును గోల్పోవుటయు, కొంకణమున దనసేనయోడి పోవుటయు, నానాకు చాల మనస్తాపము గలుగజేసెను. బంగాళమునుండి అక్టోబరు 9వ తేదీని వ్రాసినజాబు డిశంబరు 13వ తేదీని బొంబాయి పాలకుల కందెను. అందు నధికారవర్గమువారికి పీష్వాతోడ సంధిచేసుకొను గోర్కె యున్నదనియు, అట్లు చేయుటచే పీష్వా, నైజాము హైదరులతో కలియకుండ నుండగల దనియు, చెన్నపురివారితో యుద్ధము చేయుచున్న

హైదరు పీష్వాతో కలియకుండులే యాంగ్లేయులకు మంచిదనియు దెలియచేయబడియుండెను. ఆంగ్లేయులకును పీష్వాకును సంధికుదురుటకు మూడాజీ భోంస్లేకోరబడెను. కాని యీ సమాచార మందినపైని కర్నల్ బెయిలీ హైదరునుండి పడినపాట్లు దెలసెను. అదివిని మూడాజీ సంకోచించి మధ్యవర్తిగానుండుటకు హేస్టింగ్సు సమ్మతింపలేని కోర్కెల కోరెను. అందుపై నాంగ్లేయులు జేయునదిలేక యుద్ధమును సాగించి పీష్వానుండి యనుకూల రాయబారమరుదెంచువరకును మిన్నకుండ నిశ్చయించుకొనిరి.

గోడార్డు 1781 జనవరి 18వ తారీఖున ఆర్నావలుకోటను పట్టుకొనెను. కనుమలనుదాటి పూనాపై దాడివెడలిన మహారాష్ట్రులు సంధి కొడంబడుదు రని దలంచెను. అది విని నంతనే హరిపంతుఫడ్కే పూనాకు వడివడి జనుచు దోవలోనున్న భోరుఘాటీలో మహారాష్ట్రసిబ్బందుల నిలిపెను. బంగాళీపటాలముల సహాయమున కర్నల్ పార్కరు మహారాష్ట్రుల నోడించి, ఘాటీనిదాటి యావలనున్న ఖండల్లాలో విడిసెను. ఘాటీ ఆంగ్లేయుల వశమగుటంజేసి, వారి సేన లావలకు సులభముగ పోయి చేర గలిగెను. సేనాని గోడార్డు మాత్రము ఘాటీ కీవలనే కంపోలీ గ్రామమున విడిసియుండెను. నానా వీరి రాకకేమాత్రమును జంకక సైన్యపు సంఖ్యనుమాత్రము హెచ్చించి దేశమంతయు మరు భూమిగామార్చి పూనాను పాడుచేసి వీడదగు యత్నముల జేయజొచ్చెను. గోడార్డును మాత్రి మాడించుట కధికారమేమియు నీయకుండ నొక రాయబారిని వానికడ పంపెను. గోడార్డత్యాతురత తోడ, పూర్వము గవర్నరు

జనరలు మూడాజీద్వారా పంపిన షరతులరీతిని, సంధిజరుపసిద్ధమయ్యెను. అవియెట్టివియో నెరుంగని వానివలె నానా నటించెను. గోడార్డువానినెల్ల దెలుపు నకలును నానా కడ కంపెను. నానాయవిగాంచివారిమిత్రుడగు హైదరాలీయందులో పాల్గొన వీలులేమింజేసి యట్టి నియమము లెన్నటికిని మహారాష్ట్రులకు సరిపడవనియు చెప్పుచు గోడార్డును తిరస్కరించెను. "మీరంపిన షరతుల పట్టికను మీ మిత్రులు చదువ సొంతముగ వింటిని. అందలి విషయములీ దర్బారున వినుటయనుచితము. మాతోడి సాంగత్యమే మీరు నిశ్చయముగ కోరునెడల యిప్పట్టున మాతోడ చెలిమిగలిగిన మిత్రులెల్లరును మీ సంధిపత్రమునకలుపబడియుండ వలయును" అని తన మాటలుగ నానా చెప్పి పంపెను.

ఏడేండ్ల ప్రాయముగల కుమార పీష్వా పురంధరు కోటకు పంపివేయబడెను. హరిపంతు తూకాజీలతో కలసి నానా స్వయముగ మూలబలముల దోడ్కొని కనుమల దరికి తరలెను. 12000 బలముతో పరశురామ భవ పట్వర్ధనుని కొంకణమున విడిసియుండిన గోడార్డు నెదిరింప బంపెను. బొంబాయితోడ నాంగ్లేయ సేనలకు జరుగుచుండు ప్రత్యుత్తరములకు ల సాగకుండ సేయజూచెను. ఈ యుద్ధమున మహారాష్ట్రులిరువదివేల సేనను యుద్ధరంగమున నిలుపగలిగిరి. గోడార్డు విధిలేక రంగస్థలిని వీడవలసివచ్చెను. అపజయ మెట్టిదో యెరుగని గోడార్డీయుద్ధముననే పరాభవమును జెందెను. బొంబాయి పాలకవర్గమువా రంతటినుండి నిజరక్షణకొరకే యుద్ధము చేయజొచ్చిరి. గవర్నరు జనరలున కది నచ్చనందున అత డదివర

పోషాము దొర నంపినట్టు కర్నల్ కార్నక్‌ను సింధియా యేలుబడినున్న రాజ్యములోని కంపెను. కార్నక్ నిరాటంకముగ నాసీమ జొచ్చెనేగాని మహారాష్ట్రనాయకులు పెట్టు చిక్కులకు లోనె పడగాని పాట్లు బడియెను. ఎట్టకేల కాతడు సింధియా నెదుర్కొని యోడింప గలిగెను. ఆంగ్లేయు లపరిమితమగు ధనరాసులర్పించి ముధోజీ భోంస్లేను మహారాష్ట్రకూటమునుండి విడదీయ గల్గిరి. అప్పటి కిరుకక్షులును విసిగియుండుటంజేసి 1782 మేనెల 17వ తారీఖున శాల్బైవద్ద సంధి జరుపబడెను.

ఈ సంధి కాంగ్ల వర్తక సంఘ పక్షమున డేవిడ్ ఏండర్సన్ దొరయును, మహారాష్ట్రపక్షమున మహాదాజీ సింధియాయును షరతులు నిర్ణయించిరి. కుమార పేష్వా తరఫున సర్వాధికారములను దానే వహించినట్లు జూడ పూచీపడెను. ఆ శల్బై షరతుల 17లోను ముఖ్యమగునవి:—

(1) రఘోబాకు నెలకు 25000 రూపాయిలిచ్చి యతడు నివసించుట కెంచుకొనుమని స్థలము చూపబడెను.

(2) పురంధరు సమాధానాంతర మాక్రమింపబడిన తావు లెవరివి వారి కప్పజెప్పవలసినదిగ నేర్పరుపబడెను.

(3) గైక్వారు దేశము నెవ్వరును నాక్రమింప జూడరాదు

(4) ఆంగ్లేయుల నుండియు, ఆర్కాటు నవాబు నుండియు, హైదరాలి దీసుకొనిన దేశము వానిచే దిరిగి వారల కిప్పింప వలయును.

ఈ సంధి పత్రమున నాంగ్లేయులు జూను నెల 6వ తేదీని కలకత్తాలో నామోదించినట్లు సంతకము చేసిరి. [illegible]వ చెప్పనున్న కారణములచే నానా మాత్రము డిసెంబరు

నెల 20వ తారీఖు వరకును పేష్వా తరఫున యీ పత్రములో దస్కతు చేయలేదు. అంతేగాక 1783 ఫిబ్రవరి 24వ తేదీ వరకు సంధి యత్నములు పూర్తిగ పరిష్కరింపబడలేదు.

ఈ పరిష్కార సమయముననే ఆంగ్ల గవర్నరుజనరలును వాని సభ్యులును కలసి, మహాదాజీ సింధియా, వార్గాము వద్ద బొంబాయిసేన కొనరించిన సహాయమునకును, జామీనుగ నుంచిన ఆంగ్లేయుల కొనర్చిన సత్కారము నకును, మెచ్చి వానికి బహుమానముగా బ్రోచి పరగణా నిచ్చిరి.

ఇక శల్బై సంధి జరిగినది మొదలు పేష్వా తరఫున దానిని మహారాష్ట్రు లామోదించు వరకును జరిగిన విలంబమునకు గల కారణము లొకింత చర్చింతము. నానా యిందుకొక ముఖ్యకారకుడు గాన యట్టి పాత్రల భావము పరిశీలింపవలయును. మహాదాజీ సింధియా, నానాలకు మనస్పర్థ లధికముగ నుండినమాట నిజమే. సింధియా స్వతంత్రుడుగా నుండ నిచ్చగించుటయు నందుకు దగు యత్నములు సల్పుటయు నిజమే. నానా, సింధియా లిర్వురును మహారాష్ట్రము నెల్ల నద్వితీయాధికారమున నేల జూచుటయును సత్యమే; గాని యిర్వురును సామ్రాజ్య సౌష్టవమును దమ పోరాటమున భగ్నమొనరింప నెంచక దమ కూటమి నయ్యది యాదరపు గొనియుంట గుర్తెరింగి యుండిరి. యుద్ధకాలమున నానా ప్రఖ్యాత యశుండయ్యెను. సింధియా పలుకుబడి తగ్గనే గాని శల్బై సమాధానమున సింధియా కోర్కెలెల్ల ఫలించినప్రాయన నతనికి మహారాష్ట్ర సామ్రాజ్యమున కెట్టి లోటును రా[illegible]డగనే, స్వతంత్రాధికారము చేకూరెను. ఐశ్వర్యమునన్న[illegible],

వేసు పెద్ద దయ్యెను. నానా, సింధియా లిరువురును దేశమున శాంతి నెలకొల్ప దగు సంధి కోరినను, దమ యధికారస్థాపన కవసరమగుపట్ల నద్దాని నతిక్రమింప సంకోచింపలేదు. ఇదివరకు మహారాష్ట్రులయేలుబడిలోనుండిన నర్మదానదీ దక్షిణసీమల నెల్ల మరల సంగ్రహింప నానా యోచించుచుండెను. ఉత్తర హిందూస్థానమున మరల మహారాష్ట్ర సామ్రాజ్యమును నెలకొల్ప సింధియా తలంచుచుండెను.

ఆంగ్లేయులకును హైదరాలీకిని యుద్ధము జరుగుచుండుటంజేసి శల్బి సంధి షరతులు మహారాష్ట్రుల కెంతయో ననుకూలముగ నుండుట తటస్థించెను. అప్పటికిని సింధియా యీ సంధికి కారకు డగుటచే నానా యొర్వక ఆంగ్లేయులతోడ మరింతగ పెనగులాడి సాల్సెట్టిని గూడ వారినుండి యియ్యదల్చుకొన జూచుచుండెను. అందుకు గాను వారితోడి రాయబారములలో నెల్ల హైదరు దమకు పరమాప్తుడై నటుల సూచించుచుండెను; గాని హైదరు రాయబారులకు, శల్బి షరతులు మహారాష్ట్రుల కెంతయు నాదరణీయము లయ్యు హైదరు కృష్ణానదీ దక్షిణ భాగమందలి మహారాష్ట్ర సీమలదిరుగ దమ కొప్పగించినచో యవికావని వానికి సహాయము చేయనగు నని చెప్పెను. ఆదేశము లొప్పగించని యెడ మహారాష్ట్రు లాంగ్లేయులకు దోడై హైదరు నెదిరించవలసివచ్చునని బెదరించెను.

సమాధానమే కుదిరి పూర్తియగు నెడల నానా యాంగ్లేయులకే మాత్రమును వీ లొసంగకుండ నిజామాలీ తోడ సంధి కుదుర్చుకొని హైదరాలీతోడ కయ్యము సేయ నెంచెను. ఇక సింధియా బలోన్నతు డగుట కొనర్చిన యత్నము

లును యవిమెరిగియు నాతనిని హిందూస్థానమున పెచ్చు పెరుగ నిచ్చిన యాంగ్లేయుల రాజనీతియు పరిశీలింప వలసియున్నవి. గుజరాతులో నున్న గోడార్డు సేనాని నెదురింపక పూర్వమును తదుపరి తన రాజ్యముపై నాంగ్లేయులు దాడివెడలిన నాడును కూడ సింధియా తుకాజీ హోల్కారును దనకు సహాయముగ పంపిన బంగాళమున కేగి యటనుండు నాంగ్లేయుల నెదురింతు నని పీష్వాను వేడుచుండెను. నానా కీ పన్నాగ మేలుయు మనస్కరించినది కాదు, కాని గోడార్డును మరలింపదగు దొన్నమిదియని కొంత కాలమునకు గ్రహించెను. అప్పటున పీష్వాదళనుండి హోల్కారును వేరుచేసిన, గోడార్డు మరలకుండునేమోయను భయమే గాక, హోల్కారును మంచిచేసుకొని, సింధియా తన చెప్పుచేతల నుండడేమోయని కూడ జడిసి నానా వానిని బంగాళమున కంపుట కంగీకరింపలేదు; గాని సింధియా కోరిన యెడల వాని సహాయార్థము హోల్కారుకు బదులు మహారాష్ట్ర సిల్లేదారుల కొందరును జాగ్రతచేసి పంపెదనని చెప్పెను.

సింధియా దన కోర్కెలాంగ్లేయులతోడి సాంగత్యమున ఫలించునట్లు వారితో వైర ముంచుకొనిన ఫలింపవని యెంచి నానా యోచనల చెవిబెట్టలేదు. ఈలో 1782 డిశంబరు నెల 7వ తేదీని హైదరాలీ పరలోకగతుడయ్యెను. తోడనె నానా పీష్వాముద్రికను శల్బిసంధిపత్రికకు దగిల్చి మహారాష్ట్రుల సమ్మతి దెలియజేసెను. ఇది జరిగినకొలది దినములలోనే మహారాష్ట్రుల నావికాబల మాంగ్లేయుల నావ నొకదాని నోడించి యందుగల నాంగ్లేయాధికారులననేకుల చెరగొనెను. ఆంగ్లేయు

లప్పట్టున యుద్ధమున కాయత్తమైయుండిన మరల సమరము ప్రారంభించి యుందురు. కాని వారును విశ్రాంతికై యాశించు చుండిరిగాన పూనానుండి క్షమాపణవచ్చి వారి నొకవారి కం దినంతనె సఖ్యత కొప్పుకొనిరి. ఖ్యాతిగాని లాభముగాని లేక యాంగ్లేయులీ యుద్ధము నంతట ముగించ వలసిన వారైరి. మహారాష్ట్రులకును ఆంగ్లేయులతోడి మొదటి యుద్ధమంత మయ్యెను.

---

9 మైసూరు ప్రభ

తన నిజబాహుబలంబునను బుద్ధిచాతుర్యమునను మైసూరు సింహాసనము నాక్రమించుకొని, యారాజ్యపు సరిహద్దుల ననతి కాలముననె విస్తరింపజేసి, ఆయత్నమున దన్నాటంకపరచిన ఆంగ్ల తురుష్క మహారాష్ట్రబలంబులనోడించి, వారి సీమల నాక్రమించుకొనిన సామాన్యపు సిపాయిబిడ్డ హైదరాలీ సుల్తాను బిరుదు గడించి ప్రఖ్యాతయశులగు హేస్టింగ్సు నిజాము నానాలచే వెరువబడి సఖ్యతకై యెదురుజూడబడి 1782 డిశంబరు 7వ తేదీని కాలధర్మము నొందెను. ఆ మృత్యువార్త వినునంత దనుక వానిచర్యల గణింపకయె యెవ్వారు నెట్టికట్టు బాట్లకు·లోనుగా వెరచుచుండిరి; గాని విధివశంబున హైదరు స్వర్గస్థుడైనంతనె నెవరంతటవారు చల్లబడిరి. దక్షిణ హిందూస్థానము,దక్షిణమని నిర్ణయింపనేల-యప్పటి భారతభూమి యందంతటను కొంతకాల మైనను వివిధరాజ్యపాలకుల సైన్యముల రాపిడికి లోనుగాక శాంతి నెలవుగావించుకొని ప్రజలకు హాయి నిచ్చుటను యాశవొడమెను. కాని తండ్రిపేరు నిలుపగల కుమారుని హైదరు మైసూరునువిడచి యేగెను. ఆ పులిపిల్ల,టిప్పూ,

కీర్తిశేషుడగు తండ్రిమరణకాలమున శత్రురాజ్యమండలము నెదురింప నేరిగాదని యోచించి శల్బీసంధికి తలవంచెనేగాని, హైదరు గడించిన యాస్తిలోని కీర్త్యపకీర్తులును శత్రుత్వ మిత్రత్వములును గూడ తనకు విడిచిపోయెనను మాట మరువలేదు. హైదరంతటి రాజనీతి నిపుణుని బిడ్డడగుట వెంటనె బయల్పడక దేశమంతకును యుద్ధమంతమయ్యెనను యాశ వొడమజేసి దన సంకల్పము నెవ్వరి కెరిగింపక యున్నచుండెను. చెన్నపురి ప్రాంతముల గల ఆంగ్లేయ సీమలపై యపుడపుడు పడి దోచుకొనుచుండెను. మహాదాజీ సింధియా వాని నట్టి దోపిడులు మానుమని కోరెను. అట్లు మాననినాడు ఆంగ్లేయుల తోడ దన మహారాష్ట్రులు కలసి వానిని దండించవలసి వచ్చుననియు దెలియజేసెను. టిప్పూ మాత్రము వాని బెదరింపులకు భయపడక దనపని దా గావించుచు వచ్చెను. సింధియా వానిని లొంగదీయుటకు ఆంగ్లేయులతోడ 1778 సం॥ అక్టోబరు 28వ తారీఖున సంధి చేసుకొనెను.

టిప్పుసుల్తానుని శల్బీసంధి షరతుల గమనింప జేయుట యందు నానాకును, సింధియాకును గూడ నత్యావసరముగ నుండెను. మైసూరందు కొడంబడిన యెడ తదితర భారతరాజులా సుల్తాను మహారాష్ట్రుల పాదాక్రాంతుడనియు చెప్పుచేతల మెలగ వలసిన వాడనియు భావింతురు. కాని, సింధియా ఆంగ్లేయులతోడ మైత్రిగావించుకొని టిప్పూను లొంగదీయనెంచినయెడల వానికి పలుకుబడి హెచ్చుననియు, అందుచే దాను వెనుక బడవలసి వచ్చుననియు, అట్టి యెడ దా నైజాము చేయుచున్న చెలిమి కవాంతరము గల్గుననియు, నానాజడిసెను

కాని యైనను వశమున, వైస్రాయి కోరిన రీతి శల్బై షరతుల నాధారము జేసికొనకయే చెన్నరాజధానివారు టిప్పూతో వేరొండు సంధిచేసుకొనిరి. ఆంగ్ల రాయబారులను టిప్పు సన్మానింపక, వారిని దేహీ యనిపించెను. 1784 మార్చి 11వ తారీఖున మంగళూరున జరిగిన యీ సమాధానమున శల్బైసంధి కెట్టి సంపర్కముగాని సూచనగాని లేకుండ నుండుట టిప్పు కెంతయో సంతృప్తికరముగా నుండెను. మహారాష్ట్రుల కెట్టి సంపర్కములేని యీ సమాధానము చాల యవమానకరముగ దోచెను. వైస్రాయి కోరినదానికి వ్యతిరిక్తముగ జరుగుటేగాక చాల యవమానకరమగు షరతుల కాంగ్లేయులు కట్టుబడవలసి వచ్చినందు కతడద్దానిని నిరాకరించియుండును. కాని యీనూతన సమాధానపు షరతులు కొన్ని యప్పటికప్పుడె పాలింపబడి యుండుటంజేసి, దన నిరాకరణమునగాని, మహారాష్ట్రులతోడ గలసి టిప్పూను వేరొండు సంధికి లొంగదీయుట వలనగాని, దాను దన సంఘము నరాచకస్థితికి దేవలసి వచ్చునని జడిసెను.

పూనా రాజకీయ వర్గము, దా మొడంబడని సంధి జరుగుట దుర్లభమనియు, అట్లు జరుగుట శల్బై సంధికి విరుద్ధమనియు, అందుచే నిది నమ్మరాదనియు చెప్పజొచ్చెను. కాని వైస్రాయియగు హేస్టింగ్సు దా చెన్నరాజధాని వారి కిచ్చిన సంధిపూర్వపు యనుజ్ఞలును, విధిలేక వారొనర్చిన యుల్లంఘనమును సింధియాకు దెలియజెప్పి, దా నప్పట్టున ఆ సంధి కొడంబడవలసిన యగత్యమును దెలయజేసెను. అందుచే దాము తలచినరీతి మెలగ నెంచినవారగుట మహారాష్ట్ర నాయకులు

విధిలేక నిశ్చితాభిప్రాయ మొందు గావించుకొనిరి. దాని కనుగుణముగ నానా వెంటనే టిప్పు సుల్తా నీయవలసిన బాకీ కప్పమునకు గబురంపెను. అతడా కప్ప మీయక మొడ్డిన యుద్ధమునకు సిద్ధమగుటకు తగు కారణ ముండునని యెంచెను. టిప్పు సుల్తాను దానీయవలసిన బాకీ నొప్పుకొనియు వెన్వెంటనే చెల్లింప లేంములకుఁ దగు కారణముల జూపుచు నానాను క్షమింపుమని గోరెను.

టిప్పు సుల్తాను బాకీ నొప్పుకొన డనియు, అప్పట్టున యుద్ధము తప్పదనియు బాగుగ నమ్మికొని యుండిన నానా, నైజాముతో కలయ నెంచి, జులై 1784 సం॥లో భీమా, కృష్ణా నదుల సంగమ స్థానమగు ఈడ్గరులో యవన శిబిరము చేరెను. చాల కాలమునుండి మహారాష్ట్రులకు నైజాం బాకీ పడియుండినచౌతు, సర్దేశముఖి లెక్కలను పరిష్కరించి వసూలు చేయుటకై తానొప్పుచుంటినని నానా పైకివెల్లడిచేసెను. నిజముగ నిజాముతోడ చెలిమియొనర్చి మైసూరును సాధించుటె నానా యట కేగుటకు కారణమై యుండెను. యవన హైందవదర్బారుల కప్పట్టున యెట్టి కలహ కారణమును లేకుండుటే గాక చాల చెలిమికూడ నుండెను. ఇందుకు తార్కాణముగ, నానా లెక్కల నరిచూడ నేగిన కొలదికాలము క్రిందటనే నిజాము రాష్ట్రమున గలిగిన గొప్ప తిరుగుబాటు నణచివేయ, నానా, నిజామునకు సాయ మొనర్చెను. నైజాము రాష్ట్రమున మహారాష్ట్రులకు గల హక్కుల విషయమున, 1774 సం॥ నుండి నైజాము యే మహారాష్ట్ర ముతాల నాక్రమించుకొనెనో, వాటిని మరల మొగలాయి రాష్ట్రమున ప్రతిష్ఠాపన మొనరింప నొప్పు

కొనబడెను. గత రెండు ఫసలీల బాకీ చౌతు, సర్దేశముఖిలును వెంటనే చెల్లింప నొప్పుకొనబడెను. సందేహ మున్న విషయముల నావుదలచేసి, నిజాముల్ ముల్కు కాలమున నొప్పుకొనిన రీతి పరిష్కరించిన దా నందులకు బద్ధుడ నయ్యెద నని నైజా మొప్పుకొనెను.

అంతమట్టున కా సమావేశ ఫలితము బయ ల్పెట్టబడెను. గాని; యిరు కక్షులవారును టిప్పుసుల్తాను దాడిని నష్టబడిన మండలముల తిరిగి రా బట్టుకొన నెంచి వానిపై కత్తిగట్ట, చెలిమి చేసుకొనుటయే యీ సమావేశమునకు మూలకారణ మని సూచించియుంటిమి. నైజామాలీ దనకు సాయ మెంతయు నవసరమో యెగరుకుండుట జేసియు, నిజబల మెంతయో యున్న దనుకొని, మహారాష్ట్రులు, దననుండి యొకానొకప్పుడు దీసుకొనిన అహమ్మదు నగర బీజపుర రాష్ట్రముల దిరిగి యొప్పజెప్పినగాని యెట్టి సమాధానమును జరుగనేర దనెను. తుంగభద్రానది యుత్తరభాగమున నుండు దేశము నాక్రమించుకొనిన పైని నైజామునకు బీజపూరు రాష్ట్రము నొప్పగింప దన కెట్టి యభ్యంతరమును లేదని, నానా యొప్పుకొనెను. కాని అహమ్మదునగర విషయమున నేమియు జెప్పలేదు. నెవరికిని సంతృప్తికరముగ లేని యిట్టి యుత్తర ప్రత్యుత్తరములతో కొంతకాలము గడచెను. ఇరుకక్షులలో నెవ్వరును పరిస్థితులు విమర్శించిన తగవులాడు స్థితిని లేకుండిరి. కాన నీ సమావేశమున కోరిన ఫలితము లభింపక పోయినను యిరుకక్షులవారును శాంతముగ యిండ్లు చేరుకొనిరి. సమాధాన నియమావళి, పాటింప దగు సమయమున ప్రకటింపబడు నని వెల్లడి చేయబడెను. సారాపుర

నాయకు డీయవలసిన కప్పమును వసూలుచేసి యిరు కక్షుల వారు నొండొరుల వీడ్కొనిరి.

జులై మాసమున నైజామును వీడి, నానా, జింజిరా సిద్దీపై తన బలము నుపయోగించి వానిని దన స్వాధీనమునకు దెచ్చుకొన నెంచెను. ఆంగ్లేయులు మధ్యపడి వాని నా యుద్యమమునుండి మరలించిరి. నైజామాలీ తన రాజధానిని చేరినంతనె టిప్పు సుల్తాను, మహారాష్ట్రులకును వానికిని జరిగిన సమావేశమును గూర్చి విని, నైజామును బీజపూరు వెంటనే దన కొప్పజెప్పవలసిన దనియు, మైసూరున తా నములున నుంచిన కొలతలను నైజాము రాష్ట్రమున వాడవలసిన దనియు, కోరెను. ఈ పొగరుబోతు కోర్కెలను తుచ్ఛము లని భావించి నైజాము సరకు గొనలేదు. కాని అక్టోబరు మాసమున టిప్పుసుల్తాను సైన్య సమేతుడై కృష్ణానదికి దక్షిణమున నున్న మొగలాయి రాజ్యము నాక్రమింప దాడి వెడలె నను వార్త నైజామునకు వినవచ్చెను.

టిప్పుసుల్తానును యుద్ధభూమి నెదుర్కొన నైజాము సంసిద్ధుడైయుండలేదు. టిప్పుసుల్తానుశిబిరమునకొక, రాయబారినంపి వానిని ప్రసన్నునిగ జేయజూచెను. అంతతో సంతుష్టినొందక పూనాకు వేరొండు రాయబారమంపి నానా కోరిన చెలిమి నెట్లయిన వెంటనే లభింప జేయ జూచెను. నైజామాలీ యాతురతపడినను, నాడు నానాకు నిజరాష్ట్రమున గలపని తొందరలవలన, స్వయముగ దా కోరి యేగిన ఈడ్గారునందలి పని, ముగింప వీలైనది కాదు. కాన నైజామునకెట్టి సహాయమును చేయలేక పోయెను. చేయునది లేక నైజాము శ్రీర[illegible]పట్టణ

మునకు దానంపిన రాయబారి ద్వారా సమాధానము కుదుర్చుకొని సంతసించెను. టిప్పుసుల్తాను దగు యుద్ధ సన్నాహమొనరింపమి వానికిట్టి వీలుచేకూరెనే గాని, మైసూరు దర్బారునకు నైజామునందలి గల వాత్సల్యమున నీసంధికుదురలేదు.

---

10 (రెండవ బాజీరావు)

సింధియా చతురత

తానెంతయు కోరిన నైజాముతో మైత్రిని నానా చేతులార విడిచి పెట్టుటకు దగినంత కారణము లేకపోలేదు. పూనా రాజ్యాంగమున నానా సూత్రధారుడై నిలువ గలుగుటకెవ్వడాధార భూతుడో, యెవ్వని శైశవము సామాన్యుడగు నానా బుద్ధిబలమునకు భారతభూమినెల్ల కర్మక్షేత్రముగ సర్పించెనో, యెవ్వని పైనున్న ప్రజావాత్సల్యము ఇంటను బైటను గూడ నానాకు శత్రువుల నవలీల జీకాకు పరుప వీలొసగెనో, యట్టి కుమార పీష్వా మాధవరావు నారాయణుడు పదవీచ్యుతుడగు నేమోయను భయము జనింపదగు కుట్ర జరుగుచున్నట్టుల దెలియరా, నానా దానిని కనిపెట్టి, పట్టుకొన సర్వశక్తుల వినియోగించుచు పూనాలో నుండవలసిన వాడయ్యెను.

కుట్రపన్నిన వారు, బాల పీష్వాను తొలగించి వాని స్థానమున, రఘోబా కుమారుడగు బాజీరావును పట్టాభిషిక్తుని జేయ నెంచిరట. బాజీరావు తొమ్మిదేండ్లయున నిండని బాలుడు. పితృవిహీనుడు. భావి చరిత్రనెంతటి ప్రాముఖ్యత వహించినను యప్పటికి మాత్రమంతటి విప్లవమును నిజ

బలంబున నడిపింపదగు సమర్థత గలిగియుండలేదు. శల్బిస మాధానానంతరము రఘోబా గోదావరి నదీ తీరముననున్న కోపర్గామునందు స్థిరవసతి గావించుకొని, కొన్ని నెలలు మాత్రముండి స్వర్గస్థుండాయెను. అప్పటికాతని భార్య ఆనందీభాయి గర్భవతిగానుండెను. తరువాత ఆయమకు 1784సం॥ ఏప్రిలు మాసమున చిమ్మాజీ అప్పాయను శిశువు జన్మించెను. ఆ కుటుంబ దీనస్థితికి కారకుడనియు, నిజోన్నతినే కోరువాడనియు, నానాను నిందించు రఘోబా యనుచరులును యప్పటికిరాజ్యాంగ విధానము గిట్టని వారును గలసి యీకుట్రను పన్నిరి.

నానా యివన్నియు కనిపెట్టెను. వెంటనే విద్రోహుల నెల్లర పట్టుకొనెను. కుట్ర విప్లవపరిణామమునకు రాకమున్నె, రూపు మాపబడెను. కోపర్గాముననున్న రఘోబా కుటుంబమే మాత్రము నికృష్టుల పాలుకాకుండ చూచెను. కాని యానాటినుండి మాత్రమా బ్రాహ్మణుడు, వారినొక కంట గనిపెట్టుచునే వచ్చెను. అందుమూలమున రఘోబా కొమారులకు నానాయందును, నానాకు, వారియందును యనుమానమధిక మయ్యెను.

నానా భయపెట్టి తన చెప్పుచేతల త్రిప్పుకొన యెప్పట్టునకైన యోచించు సింధియా యీ కలతలకు గారకుడందురు. ఇట్టి యత్న మితడు స్వయముగ చేసినను చేయకుండినను జరిగినప్పుడు మాత్రమెంకింత చేయూత నొసంగియుండును. కాని బాల పీష్వాను పదభ్రష్టుని జేయునంత దనుక దెచ్చుటకు దలంచియుండడు. ఏలనన యిప్పట్టున మహాదాజీ సామ్రాజ్య సమస్యలలో చేయిచేసుకొని తల త్రిప్పదగు యత్నముల

జేయుచుండెను. అందున మొగల్ సామ్రాజ్య వ్యవస్థ దినమున కొకరీతి మారుచు తలవని తలంపుగ సింధియాను మహోన్నత పదవి కెక్కించెను.

మొగల్ దర్బారున రెండు కక్షలేర్పడెను. అఫ్రిసైబ్ ఖానుడును, మహమద్ బేగును యిరుకక్షులకును నాయకులైరి. పాదుషా కుమారుడగు మీర్జాజీవన్భఖ్తు యే కక్షను జేరుటకును దోచక ఆంగ్లేయులకడకేగి శరణువేడెను. తన తండ్రికి సాయము చేయుడని వారిని కోరెను. హేస్టింగ్సు దొర వాని కభయ మొసంగనే గాని; సామ్రాజ్యమున కెట్టి సాయమొనర్ప లేమని జెప్పెను. అఫ్రిసైబ్ ఖాను డాంగ్లేయులు పాదుషాకు సహాయము జేయవత్తురని జడసి వారినే మహమ్మద్బేగును వశపరచుకొని దనకు సాయ మొనరింప రమ్మనెను. వారు నిరాకరింప సింధియా ఆహ్వానింపబడి 1784 సం॥ అక్టోబరు 22 వ తేదీని, పాదుషాతో సమాధానము జేసుకొని, మున్నెవ్వడో పొందగల నను యాశతో నున్న పదవిని యధికారమును నాడే వడసెను. అమీరు లుమ్రావు పదవి దనకు వలదని చెప్పి, తనదు సహజ చాతురి వెల్లడికా పీష్వాకు వకీలీ ముత్లక్కు పదవి సంపాదించెను. ఈ సామ్రాజ్యోద్యోగ పదవి నిజాముల్ ముల్కు మొదట మహమ్మద్షా పాదుషాగా నుండు కాలమున వడసెను. తత్కాలమున నాతడు సామ్రాజ్యమున సర్వాధికారి యయ్యెను. ఆ పదవి నేటికి పీష్వాల వశ మగుటకు మహారాష్ట్రలోక మెంతయో సంతసించి దాని కారణుడగు సింధియాను మెచ్చుకొనిరి.

మహాదాజీ అమీరు లుమ్రావుపదవి వదలి మిన్నకుండ

లేదు. పీష్వాకిప్పించిన పదవిని గల కార్యభారమెల్ల దనచేతులనే నడపుటకు వీలగు నుద్యోగమును గడించెను. అందుమూలమున అధికార పాలనమెల్ల దనచేతులలో నుంచుకొనుటయే గాక, సామ్రాజ్య సేనాధిపత్యమును, నాటి నగరరాజములగు ఢిల్లీ, ఆగ్రాపాలకత్వమును గూడ దా బడసెను. ఇందుమూలమున సింధియా, పీష్వా దర్బారునగల నాయకులెల్లరను యధికారబలంబుల మీరగల్గెను. ప్రజాబాహుళ్యమున కితని పద వెంతి సంతసదాయకముగ నున్నను, హోల్కారు నానాల కదియంతయు కంటసముగ నుండెను. సింధియా కూడ యిప్పుడున్నంతగ నెప్పుడును వారియెడ నిర్లక్ష్యముగ నుండలేదు.

సింధియా యౌన్నత్యమహిమను కాబోలు పాదుషా తరఫున యాంగ్లేయులను, వారికి బంగాళమునగల దేశమునకు చౌతు చెల్లించవలసినదని కోరెను. అప్పటికి హేస్టింగ్సుదొర యుద్యోగమంతమై సీమకేగియుండెను. అతని స్థానమున మాక్ఫర్సను దొర పనిచేయుచుండెను. అతడీ సింధియా యాజ్ఞను తృణీకరించెను. అంతటితో నూరకుండక ఆంగ్లేయులు సింధియాబలము తగ్గింపనెంచి మూడాజీ భాంస్లేను పురిగొల్పిరి. మూడాజి పూనాదర్బారున కొక యాంగ్ల రాయబారి నంపుడని వారిని ప్రోత్సాహ పరచెను. ఆంగ్లేయులు ఛార్లెస్ మేలెట్ దొరనక్కార్యమునకు నియమించిరి. ఇదివర కాంగ్లేయుల కార్యములెల్ల మహాదాజీయే పూనాదర్బారున జరుపుచు వచ్చినందున వాని యనుమతి వడయకుండ మేలెట్ను పూనాకు బంపుట సరసముగ నుండదని తలచి మొదట సింధియా విడిదకే వానిని బంపిరి. సింధియా, మేలెట్ అటకేగిన,

తన వలుకుబడికి గలుగనున్న లోటును గ్రహించెను. కనుక మూడేండ్లనుండి తాను చూచుచున్న పనికి వేరొకని నియమించుటచే ఆంగ్లేయులకు దన యందున్న నమ్మకము నేడు చెడెనని యెల్లరు భావింతురని చెప్పెను. మాక్ఫర్సను ఈయభ్యంతరముల నంతగ పాటింపలేదు. మేలెట్ను పూనాకు వంప నిశ్చయింపబడెను. ఈ లోపున దక్షిణ హిందూదేశ యితిహాసమున గలిగిన మార్పులవలన పూనాలో దమ రాయబారి నుంచుట మిక్కిలి యావసరమని ఆంగ్లేయులకు దోచెను.

|| టిప్పు సుల్తాను

బిజాపురమును తనకు నొప్పజెప్పవలసినదని కోరుటయందును, నైజాము రాష్ట్రముపై దండెత్తిపోయి యెదిరించుటయందును గూడ, టిప్పుసుల్తాను కర్ణాకర్ణికగ వినిన ఈడ్గరు సమావేశమునకు ప్రతి క్రియగను, నానా నైజాములకు దా మెదిరింపనున్న శత్రువుగూడ సంపూర్ణ సమర సన్నాహుడే యని వెల్లడిజేయుటకును పన్నినపన్నాగమువలె కాన్పించును. తరువాత నైజాముతోడి సంధిలో గూడ నిరు కక్షులవారు నీ సంధి షరతులెంతయో కాలము దనుక మన్నవని యెరుంగుదురు. ఏలనన బిజాపురమును నైజామునుండి రాబట్ట కబురంపకముందే, టిప్పు పుదుచ్చేరిలోని ఫ్రెంచివారికి నైజామును మహారాష్ట్రులను యణగ ద్రొక్క దగు యదనునకు వేచి యున్నట్లును, ఆంగ్లేయులను రూపుమాప జూచుచున్నట్లును, అనేక హైందవ క్రైస్తవ మతస్థులను మహమ్మదీయ మతము స్వీకరింప జేసినట్లును వ్రాసి యుండెను. అంతియగాక మైసూరు సైన్యముల దరి

పీజా సందుకూడ టిప్పు కడుశ్రద్ధ వహించుచుండెను. కోటల నెల్ల బాగుచేయించి సిద్ధముగ నుంచెను. యుద్ధకాల మాసన్నమైనకొలదీ రాష్ట్ర పరిసర దుర్గముల రక్షణ వాని నెంతయో శ్రద్ధ పుచ్చుకొన జేసెను. మల్పర్బాకు దక్షిణమున పదివండ్రెండు మైళ్ల దూరమున బ్రాహ్మణదేశాయి క్రిందనున్న నార్గుణా మండలమును కోటయును 1878 సం॥ లో హైదారాలీచే మహారాష్ట్రులనుండి చేపట్ట బడెను. అ దేశాయి లొంగుటం జేసి హాయిదరాలి వానినుండి, మహారాష్ట్రుల కొతడిచ్చు కప్పము కన్న వేరేమియు రాబట్టనించలేదు. టిప్పు మాత్రము వానినట్లు విడిచి పెట్టక కప్పము నెచ్చించి చెల్లింప తొందర జేసెను. ఆ దేశాయి టిప్పు కోర్కె చెల్లింపనిదే నాతడూరకుండడని యెరింగి, రహస్యముగ పీష్వాను దాను మహారాష్ట్ర పాలన లోనివాడు గాన రక్షింపుమనికోరి, అంతకన్న రహస్యముగ దనకొలువున యున్న యూన్ అను ఆంగ్లేయుని సహాయమున, బొంబాయిలోని ఆంగ్లేయులకు దాను స్వతంత్రుడనియు, తనకుకొన్ని సైన్యముల సహాయముగ బంపమనియు, అట్లొనర్చిన దానాంగ్లేయులకు మైసూరు నాక్రమింప సాయమొనర్తుననియు కబురంపెను. ఆంగ్లేయుల కంపిన యీ వార్త మంగుళూరు సమాధానమునకు పూర్వమే వారికి జేరినను వారందు శ్రద్ధవహింప కుండుటం జేసి, యతడు పూనాలోని మహామంత్రిని తనకు బంధువులగు పట్వర్ధనము వారిని యాశ్రయింప జొచ్చెను. తరువాత టిప్పు వానిని కప్పమునకై తొందరచేసెను. నానా దేశాయిని వెనుక తీసుకొని మునుపటికంటె నెక్కుడు కప్పమును వసూలుచేయ వీలు లేదని టిప్పు

సుల్తానునకు కబురంపెను. మండలములు ప్రభుత్వాధీనము నుండి వేరొక ప్రభుత్వమునకు మార్చబడినపుడు మండలాధిపులు విద్రోహులైన తప్ప యెక్కుడు కప్పముగట్ట నవసరము లేదని నానా కారణము చెప్పెను. టిప్పు తనపాలనక్రిందవారికి తనచిత్తమువచ్చినకొలది పన్నువిధింప నధికారము తన కున్నదని బహులు చెప్పి, దేశాయి తలకు మీరిన కప్పము యీయవలసిన దని కబురంపుచు, అది వసూలుజేయ రెండుసేనల బంపెను. ఆ రీతిగ టిప్పు నూర్గుణ మండలమును లొంగదీయ జూచెను.

మార్చిమాసమున నూర్గుణ ముట్టడి ప్రారంభింపబడెను. గణేశపంతుబేహ్రే, పరశురాంభావు పట్వర్ధనులక్రింద మహారాష్ట్రులు ముట్టడిని యెత్తివేయింప సైన్యముల గొనివచ్చిరి. టిప్పుసుల్తాను వకీళ్ళు పూనాలోనే యుండిరి. సైన్యము పంపెనేగాని నానా మహారాష్ట్రసేనానికి తొందర పడవలదని మాత్రమాజ్ఞాపించెను. మహారాష్ట్రులు నూర్గుణ పరిసరములకు చేరుసరికి నీటిలేమిని టిప్పు సేనాధిపతులు ముట్టడి నెత్తివేసి కొంత దూరమున విడిసియుండిరి. వారట్లు మహారాష్ట్ర సేనలువచ్చుట గాంచి మిన్నకుండక నపహాస్యముగ, హిందూనాయకులకు, వారినేతయగు పీష్వాయందలి గౌరవముచే యట్లు ముట్టడినెత్తివేసితిమని కబురంపెను. ఈ కేలింతకు దాళలేక మహారాష్ట్రులు మైసూరు సేనలపైబడి పైపైనున్నవారిదళముల నదిరి, నిజాయును పైబడి, టిప్పు కాల్బలములును గుఱ్ఱపుదళమును కలసి తమ్మెదురింప వెనుకకు మరలిరి.

నానా తన కోర్కెలకు వ్యతిరిక్తముగ జరిగినదని యీ పైనికి విచారించుచు కూర్చొనక, వెంటనే తూకాజీ హోల్కారును తగు సైన్యమిచ్చి నూర్గుణ వద్దనున్న సేనలకు సహాయమొనర్చ బంపెను. అంతట నూరకుండక జరిగిన కలహమునకు చాల విచారించు చున్నాననియు, తగురీతిని సమాధానము జరిగిన సంతసించెదననియు సుల్తానునకు కబురంపెను. మున్ముందువిశదము కాగల కారణములచే, టిప్పుకూడ నానాకోర్కెల మన్నింప యభిలాషగలదని చెప్పుచు, రెండేండ్ల కప్పముకూడ వెంటనే చెల్లింపనొప్పుకొని, నూర్గుణ మాత్రము తనకు లోబడి యుండవలయునని కోరెను. నైజామాలీ సలహాపై దేశాయి లోబడి యుండుటే కావలసినదని యొప్పుకొనిన పిదప టిప్పు కోరినరీతి నానా తనసేనల కృష్ణానదిదాటి యింటికి రప్పించెను. కప్పము చెల్లించు విధానము మాత్రము పరిష్కృతము కాలేదు. అందుకై యిరువదేడు దినముల గడువీయబడెను. టిప్పు ఘోరమగు మోసముజేసెను. అసహాయయగు నూర్గుణ సుల్తాను చేతులబడెను. దేశాయి లొంగుటేగాక సకుటుంబముగ కోటవిడిచి పోవలసివచ్చెను. ఇలువిడచి బయట పడినంతనే టిప్పుసేనలచే చెరపెట్టబడెను. పుత్రికను కన్నులార సుల్తానుని జనానాకు గొంపోవ నిస్సహాయుడై చూచుచు మిన్నకుండెను. కాబూల్దుర్గమున కుటుంబ సహితముగ బంధింపబడి యసువులుడిగెను.

అట్టిదే యగు వేరొక్క దేశాయి పాలననున్న చిత్తూరు దుర్గముకూడ నదేరీతి నాక్రమింపబడి నూర్గుణతో బాటు సకాలమున సుల్తాను సేనలతో నింపబడెను. టిప్పు యంతట సంతుష్టినొందక మహారాష్ట్రుల కగ్గడమగునట్లు కృష్ణా దక్షిణ తీరమందలి హిందువులనేకులను మహమ్మదీయ మతమున బలవంతముగ కలపెను. పదివేల బ్రాహ్మణుల యవమానకరమగు

దీక్షకొప్పుకొనక యాత్మహత్య గావించుకొనిరి.

నానా యీ మోసమును వెంటనే గ్రహించి నైజాముతోడి చెలిమినికూడ సందేహింపజొచ్చెను. ఈడ్గరున నైజామాలీ కలసిననాడు వానిసేనలుండు స్థితిని కనిపెట్టి వాటిబలలేమిని గ్రహించెను. మైసూరు సుల్తానుని సంసిద్ధ సైన్యప్రసంగముల విని మనము జడియజొచ్చెను. ఈ సమాచారమునకు దోడు ఫ్రెంచివారితోడ టిప్పూ చెలిమి గావించెనని తెలుసుకొని ఆంగ్లసేనలను దనరాజ్యమునకు రప్పింప మరెట్టి యాటంకములను జెప్పలేదు. జులై మాసమున బొంబాయి గవర్నరగు బోడాము వారకు తనమునిషిద్వారా, ఆంగ్లేయులు టిప్పూరాజ్యమును లాంగిదీయ తనకు సాయ మొనర్చినయెడల అందలి యేరెండు సంస్థానములనైన వారికిచ్చెదననికబురంపెను. బోడామూవార్త సంతగ పాటింపక తనపై యధికారులకు దెలియజేసెను. సూక్ష్మగ్రాహియగు నానావార్తావహుడు వాని నిర్లక్ష్యభావమును గ్రహించి దెలియజేయ, నానా ఆంగ్లేయ రాజనీతి గమనికను పోల్చుకొని తన యూహల మార్చుకొనెను. పీష్వా దర్బారున ఆంగ్లరాయబారి లేకుండెను. కనుక నానా తనస్వంత ప్రతినిధిని కలకత్తాకు పంపినప్పటికిని, సింధియాద్వారా ఆంగ్లేయులతోడ రాయబారము నడుపవలసివచ్చెను. మహాదాజీ తనతోడ విడిదిలోనున్న లెఫ్టనెంటు జేమ్సు పండర్సను ద్వారా పీష్వాకును సుల్తానునకును యుద్ధము జరిగిననాడు సాయ మొనర్పవలసినదని గవర్నరు జనరలును కోరెను. శల్బిషరతుల ననుసరించి మహారాష్ట్రుల శత్రువులుగాని మిత్రులుగాని, ఆంగ్లేయులచే గూడ శత్రువులుగా గాని మిత్రులుగా గాని పరిగణింపవలసి యుందు

నని కూడ హెచ్చరించెను. నైజామాలీ పీష్వాకు తప్పక సాయపడుననియు, వారి సమాధాన నియమానుసారము గెల్చిననాడు యెవరు గోల్పోయిన రాష్ట్రమును వారు దీసుకొనవచ్చుననియు, మిగిలినదిసమానముగ మిత్రులుపంచుకొందురనియు దెలియపరచెను. 1784సం॥ సంధినిగూర్చి ఆంగ్లేయులాడుమాటలు, పూనా మంత్రివర్గమున కాంగ్లేయులు దప్పక మైసూరు నేదిరింప దమ తోడ చేరుదురను యాసగొల్పుచుండెను. కాని సింధియా బంపిన వర్తమానమునకు జబాబుగ మేక్ఫర్సను ద్వార, శల్బిషరతులలో మహారాష్ట్రులు చెప్పినరీతిలేదనియు, యొకరి శత్రులకింకొకరు సాయముచేయరాదని మాత్రమున్నదనియు, తెలియజేసి మంగుళూరు సంధిననుసరించి ఆంగ్లేయులు టిప్పూ శత్రులకు సాయమొనరింప వీలులేదని చెప్పెను. కోరినదానికిట్లు ప్రతిచెప్పినను మంగుళూరు షరతులన్నియు దిన్నగ పాలింపనందున టిప్పూయెడ నసంతృప్తికనబరచుచు, మేక్ఫర్సను ద్వార మహారాష్ట్రులయెడ దమ కెంతయో స్నేహభావ మున్నదనియు, నాంగ్లేయులు, మహారాష్ట్రులతోడి మూలపట్ట నున్ననాడు చూచుచునూరకుండరనియు సింధియాతో జెప్పెను. యుద్ధమేసిద్ధమగునాడు నైజాము ఆరితేరిన మైసూరు బలములకు వెరచునని యెంచి గవర్నరుజనరలెంత తృణీకరించెనో నానా యంతగ ఆంగ్లసహాయమునకై ప్రాధేయబడజొచ్చెను. ఎట్టకేలకు, నానా నిరాశజెందియో లేక నాంగ్లేయులకు వెట్ట బుట్టింపనో, గాని దన కవసరమున్నయెడ సాయమొనర్తుమని లోగడ వాగ్దానము జేసియున్న పోర్చుగీసు వారికి నానా కబురంపెను.

టిప్పు సుల్తాను ఫ్రెంచి వారితో చెలిమికై యేది

యొ క్రొత్త సమాధానము జేసియుండునని నానా దృఢ విశ్వాసము. పుదుచ్చేరిలోని మహారాష్ట్ర రాయబారి యీ విషయమున ఫ్రెంచి గవర్నరును ప్రశ్నింప, నా దొర యట్టి సమాధాన మేదియు జరుగలేదనియు, వలయుచో మహారాష్ట్ర పీష్వాతోడ కోరిన రీతి చెలిమిజేయ సంసిద్ధుల మనియు, జెప్పెను. ఈ వార్త టిప్పు సుల్తానున కొడలు మండ జేసెను. పూనాలోని ఫ్రెంచి రాయబారికి మర్యాద సత్కారము లధిక మయ్యెను. టిప్పు సుల్తానునకు సహాయ మొనరింపమని వారు వాగ్దాన మొనరించిన, రేవు దండా వారి కిచ్చివేయ బడునని కూడ వదంతిపుట్టెను. ఈ ప్రసక్తులన్నియు దన రాయబారి నొకనిని పూనాలోనుంచ ఆంగ్లేయులను మరింత పురికొల్పెను. మేలెట్ దొర వెంటనే కలకత్తానుండి బొంబాయి కనుపబడి పీష్వా కబురంపిన తక్షణమే పూనాకేగ నియమింప బడెను.

ఈలోపున టిప్పూ రాజ్యముపై దాడి వెడల పూనాలో సేనలు జమచేయబడుచుండెను. టిప్పూ రాజ్యమున దప్ప తదితర స్థానముల పనిచేయ గవర్నరు జనరలుచే బంప బడిన సైన్య సహాయ వార్త నానాచే తిరస్కరింప బడెను. ఆ వత్సరము వర్షము లధిక మగుటంజేసి డిశంబరు మొదటి దినము దనుక హరి పంతు ఫడ్కే యాధిపత్యమున నున్న మహారాష్ట్ర సైన్యము, పూనా వీడ లేకుండెను. ఆ నాడు పూనా విడిచిన సేన మూడాజీ భోంస్లే, నైజామాలీల గలసుకొన నెంచి తూర్పున కేగెను.

మాధూరావు బాల్లాలు జీవాజీ భోంస్లేలచే 1769సం॥లో జేయబడిన సంధి నిబంధనలకు మూడాజీ కట్టుబడి యుండెద నని

యొప్పుకొనెను. పీష్వా దొరతనము నెదిరించునాడు ఆంగ్లేయులకు సహాయము జేయననెను. టిప్పూతోడ జేయనున్న యుద్ధమున నానాకు సహాయ మొనర్చెదనని జెప్పి సైన్య సమేతుడై తిరిగి వచ్చుచుండెను. నానా కూడ పూనా సేనలతో బయలుదేరి నైజామాలీతో గలిసి ప్రసంగింప బోవుచు, హరిపంతును పంఢరపురమున గలసి, భీమానది కుడివైపునబడి చని, మరల ఈడ్గరు వద్ద మొగల్ సేనల గలసు కొనెను. టిప్పూ రాజ్య విధ్వంసమునకై సమావేశమైన వీరలు, సుల్తానుని కే మాత్రము సేలను విడువకుండుటకును, రణార్జితమును నారు భాగము లొనరించి నైజామునకు రెండు పాళ్ళును, పీష్వాకు రెండును, సింధియా హోల్కారులకు జెరొక్కటియు, పంచుకొనుటకు తీర్మానించు కొనిరి. అంతియగాక కృష్ణా తుంగభద్రా నదులమధ్యనున్నదియు, మహారాష్ట్రులనుండి హరింపబడినదియు నగు, రాజ్యముపై వారి యత్నములు మొదట సాగింప నుద్దేశింపబడెను. ఉద్దేశాను సారముగ 1786 సం॥ మే, మాసమున బదామికోట ముట్టడి ప్రారంభింపబడి, నా మాసాంతములో సమాప్తమై మిత్రులకు జయ మొసంగెను. అదిగాంచి సంతుష్టుడై నానా పూనాకు మరలెను.

సేనాని, హరిపంతు ఆశ్వీక బలముల దేశమంతట నుండులాగున విస్తరిల్ల జేసెను. టిప్పూ యెదురుపడి యీ సేనలతోడ పోరాడకుండెను. తన సేనలతోడ టిప్పు సుల్తాను వెనుకనుండి వచ్చి, నైజా మాలీ సోదరుని, వాని కుమారిని రాణీవాసములు వసతి గావించుకొనియున్న, అదోనీ దుర్గమును దాకి, నచట నుండు వారలచే దరిమివేయ బడెను. అటుపై

ననేకసారులు మెదిరించి, యదరబడి, యెక్కుడు నష్టమేమియు బొందకుండగనే, తొమ్మిది మాసములవరకు రణభూమి నుండి, కొనకు నిజేచ్ఛను, సంధి కోరెను. అంత నిరుకక్షులును 1787 వ సం॥ ఏప్రిలు మాసములో సమాధాన పత్రమున సంతకముల జేసిరి. ఇందుమూలమున మహారాష్ట్రులకు దమ పూర్వపు భూములు కొన్ని తిరుగ నిచ్చివేయబడెను. అదోనీ నైజాము వదలివేయబడెను; సుల్తాను నలభై యైదు లక్షలు కప్ప మిచ్చుట కొప్పుకొని, వెంటనే ముప్పై లక్షలు చెల్లించి, మిగిలిన దా సంవత్సరాంతములో చెల్లించుటకు నొప్పుకొనియెను.

టిప్పూ అంతవేగమె సంధి కొడంబడుటకు గారణ మేమో తెలియదు. కాని మహారాష్ట్ర దర్బారున కాంగ్ల రాయబారిని నియమించుటచే నాత డాంగ్లేయులు గూడ శత్రు దళమున చేర నున్నారని యనుమానపడుటయే గాక, నమ్మికొనెను. మేలెట్ దొర పూనాకు పిలిపింపబడి యప్పటికి బదామీ మెదుట విడసియున్న నానాను వచ్చి చేరవలసినదిగ కోరబడి యట్లొనరించెను. సుల్తానున కీ చర్య వారి కొండొరులయెడ నున్న చెలిమి ఫలితముగ గన్పట్టెను. గవర్నరు జనరలిట్టి యపోహాలు గలుగకుండ, వీలగు రీతుల నెల్ల యత్నించెను. కొంత దనుక సఫలమనోరథు డయ్యెను. ఇంతలో 1787 సం॥ సెప్టెంబరు మాసమున లార్డు కార్న్వాలీసు గవర్నరు జనరలయ్యెను. పీష్వాకును, నైజా మాలీకిని, టిప్పు సుల్తానుతోడ వా రొనరించు యుద్ధమున, దా నెట్టి జోక్యమును గలుగ జేసుకొనననీ దెలియజేసెను. కాని ఆంగ్ల సంఘమువారి

సైన్యము నాతడు బాగుజేయుటకై చేయు యత్నములు టిప్పు సుల్తానున కాంగ్లేయుల యెడల ననుమానము హెచ్చించెను. అందుచేతనే యాతడు తన శత్రువులతో సంధి కుదుర్చుకొన గుతూహలుడై, అంతటనాగక తరి దొరకునా ఆంగ్లప్రభా విధ్వంస మొనరింతునా యని యోచనల సేయుచుండెను.

పూనాలో నాంగ్ల ప్రతినిధిని నియమించుట టిప్పున కెంతటి భయకారణ మయ్యెనో, సింధియా కంతటి యీర్ష్యాహేతు వయ్యెను. ఆతని నీ యేర్పాటున కొప్పించుటకు గాను వాని సంతుష్టికై పూనానుండి యాంగ్లేయుల కంపబడు కాగితము లన్నియు సింధియా చూచి తన సమ్మతి నిచ్చిన పిదప కలకత్తాకు బంపబడుచుండెను. కాని సింధియాకు ఉత్తర హిందూస్థానమున నున్న పనులు వాని నేమాత్రమును పూనాలో నాంగ్లేయులు సంపాదించు పలుకుబడిని తగ్గింప దగు యత్నములు జేయ వీ లిచ్చినవి కావు. అంతియ గాక దక్షిణ హిందూస్థాన మందలి వ్యవహారముల నేమాత్రమును జోక్యము గలుగ జేసుకొన నిచ్చినవి కావు.

మన మిదివరకు దెలుసుకొనిన రీతి సామ్రాట్టు సింధియా కిచ్చిన సర్వాధికారము నాత డుపయోగించి రాజపుత్రుల నాతడు కప్ప మిమ్మని యడిగెను. అప్పటికి వారు కాదనక కొంత సొమ్మును చెల్లించిరి. మిగిలినది వెంటనే చెల్లింపవలసిన దని సింధియా వారి కాజ్ఞాపన పత్రమును బంపెను. అదిగని వారు తిరుగబడిరి. మాన్షియురు డి బోయనే యను పరాసు వాసిచే తరఫీజు చేయబడిన బలమగు సేన కధికారి యైనను, సీకులతో యుద్ధమునకుగాను కొంతసేన నంపుటం జేసియు, సింధియా

కప్పట్టున, వారి నెదురింపజాలు బలము లేకుండెను. ఐనను సంశయింపక మహాదాజీ వారి దేశముపై బడి వారిని యుద్ధమున కీడ్చెను. పాదుషా పాలన కిచ్చగింపని ప్రభువు లనేకు లీ యుద్ధమున రాజపుత్రులతో గలసి వారికి సహాయము గూర్చిరి. యుద్ధ మంతమగు తరి పాదుషావారి పద దళము 80 ఫిరంగులను గొని, సింధియాను వీడి, శత్రువులతో గలసిపోయెను. ఉరుములేని పిడుగు వ్రాలె తటస్థించిన, యీ యాపద సింధియాను నిశ్చేష్టునిగా జేసెను. కాని యా ధీరు డెంతయో కాల మందువలన, చేష్ట లుడిగియుండక తన సహజ ధైర్య స్థైర్యములతోడ గ్వాలియరున కేగెను. అట మిన్నకుండక నానాకు దన యవసర మెరుక బరచుచు వ్రాసెను.

అం దాంగ్లేయులు పాదుషా తోడను, రాజపుత్రుల తోడను, జెలిమిజేయ నున్నారు గావున, దనకు నానాను సహాయము జేయుమనెను. పాదుషా యాజ్ఞానుసారము నా పర దేశజులు హిందూస్థానమున పలుకుబడి సంపాదించిరేని, దాన మహారాష్ట్ర సామ్రాజ్యమునకు గలుగనున్న విపత్తును సూచించెను. తన కెవ్వరియెడలను యీర్ష్యాభావము లేదనియు, తన యెడ నట్టి భావమే నానా కున్నయెడల నద్దానిని విడువవలసినదనియు, హోల్కారు హరిపంతు పరశురామ భావూల నడిగి తాను (సింధియా) ఎన్నడైన వారి కెదురాడె నేమో కనుగొని తెలుసుకొనవచ్చుననియు, దన యత్నము లెప్పుడైన మహారాష్ట్ర విజృంభణమునకు దప్ప వేరెద్దానికైన సహాయభూతములైనవివో యోచింపు మనియు, వ్రాసెను. "మన మొక్క స్వామినే సేవించుచున్నారము. మనయత్నములు గూడ నొకే యుద్యమమునకు సహాయభూతములు గానిండు. తమకే నా యెడల ననుమాన మున్నయెడ, మొరోబా తమ్మెదిరించిన నాడు తమ కెవ్వరు సాయ మొనరించిరో యోచింపుడు. ఎవరు మీ విరోధి శఖారాం బాపూను పట్టి మీకు నొప్పగించిరో యోచింపుడు-సదాశివరావు భావూ నని వచ్చిన మోసగాని తిరుగుబాటు నెవ రడంచిరి- తల్లిగామున ఆంగ్లేయుల నెవ్వ రోడించిరి- వారితోడి యుద్ధభార మమితముగ నెవరు తగ్గించిరి. ఎవరు లాభకరమగు సంధి సమకూర్చిరి ? ఈ సేవలను యోచింపుడు. అనుమానమును విడనాడుడు. చాడీల పెడచెవిని బెట్టుడు. మన కిర్వురకును గూడ శత్రు లెవ్వరు ? మహారాష్ట్ర జాతి ప్రతిష్ఠ హిందూస్థానమున నెలకొల్పబడు గాక ! మన సామ్రాజ్యము భగ్నమై నిర్మూలన మొనరింప బడకుండు గాక !" ఆంగ్లేయుల విషయమున దలంచెడి మొగలాయి మైత్రి దప్ప తదితర విషయముల సింధియా సూచనలు సత్యములై దేశహితైక కరములై యుండెను. కాని నానా మహారాష్ట్ర సామ్రాజ్యమునకెల్ల శ్రీ పీష్వానే యధినేతగా గావింప నిశ్చితాభిప్రాయుడై యుండెను. సింధియా చర్య లీ సామ్రాజ్యాధికారము నపహరింప జేసినవి గాకపోయినను, సామంత పాలకునిగ నుండక, తాను సామ్రాజ్యములోనివాడైనను స్వతంత్రుడై స్వయం వ్యక్తిత్వమున కపేక్షించుటను వేనోళ్ళ జాటుచుండెను. అందుచే నానా హిందూస్థానమున మహారాష్ట్రుల పలుకుబడి తగ్గుట కెంత యిష్టపడకుండినను; సింధియాకు సహాయ మంపు రీతికై సందేహించుచుండెను. సింధియా గ్వాలి

యరునకు రాకమున్నె షంసీరు బహద్దరు కుమారుడగు ఆలీ బహద్దరు యాజమాన్యమున కొంత సైన్యము సంసిద్ధ మొనరింపబడి యుండెను. కాని, నానా, రాజపుత్రులను పీష్వాకు లోబడునట్లు చేయుటకును, మహారాష్ట్రులట పలుకుబడి సంపాదించుటకును, యత్యాశాపరుడగు సింధియావంటి రెండవ వ్యక్తి నట కాలూనకుండ జేయుటకును, నా సేన నుపయోగింపదలచి యుండెను.

హైందవప్రతిష్ఠ గాపాడుటకుగాను, నానా, జయపురపు మహారాజుతో నుత్తర ప్రత్యుత్తరముల జరిపినట్లును, ఆ రీతిగ సింధియాను తన చెప్పు చేతల నుంచుకొనుటకు నుద్దేశించినట్లును మహారాష్ట్రు లనుకొనుచుండిరి. సింధియా పరాజితుడయ్యు విజయులగు రాజపుత్రులచేత నెట్టి యవాంతరముల బాలుగాక గ్వాలియరునకు సురక్షితముగ జేర గలుగుట, నానాకు, రాజపుత్రస్థానమందుగల గౌరవము చేతనే యని చెప్పుకొనిరి. సామ్రాజ్య వినాశ హేతువగు సింధియాతోడ కయ్యము లేకుండ, పీష్వా యధికారమును నెలకొల్పు టెట్లని నానా, కూడ దిక్కులు జూచుచుండెను. ఈ యోచనల గలిగిన చిక్కులటులుండ, టిప్పూ నూతనముగ గావించిన దుండగములు, దక్షిణముననున్న సైన్యముల నటనుండి మరలింప నానాకు బుద్ధిని పోనిచ్చినవికావు. సింధియా కూడ పూనాలో జేయగల కార్యము లెల్ల జేయుచు, నానా సహాయముపైనే, కేవలమాధారపడి యుండక, దన నిజబలమున నేరీతి కష్టములుడుగునో యాయా రీతుల బనిచేయు చుండెను.

1787వ సంవత్సరమున సింధియా గ్వాలియరున కరుగు

నప్పుడు దక్షిణముననున్న మహారాష్ట్ర సైన్యముల వాని సహాయమునకై నానా, బంపకుండుటకు ప్రబలకారణము టిప్పూవలన కలిగిన క్రొత్తయొత్తిడియే యని జెప్పియుంటిమి. విళంబ మేమియు జేయక హరిపంతుఫడ్కే సంధి జరిగెను గదా యని దన సైన్యములగొని, కృష్ణానదినిదాటి, యీవలితీరము జేరినంతనె, కిత్తూరును టిప్పూ యాక్రమించెను. వాని సైన్యము బెద్నూరున సమావేశమై, కొంకణముననున్న మహారాష్ట్రసీమల నావరింపబడెను. అంత కక్కురితిగ కొలది కాలము క్రిందటనే తొందరపడి సంధి పొసగించు కొనిన టిప్పూ, నేడిట్టి చర్యలకు దిగుట యెవ్వరికిని బోధపడ కుండెను. ఈ చర్య నానా సలహాతోడనే ఆంగ్లేయుల నీ దేశమునుండి దోలి వేయుటకుగాను, మొగల్ మహారాష్ట్ర మైసూరు ఫ్రెంచి వారల నేకీభవింప జేయుటకును టిప్పూ పన్నిన పన్నాగమని కొంద రాంగ్లేయు లనుమానించు చుండిరి. మహారాష్ట్రుల కిందెట్టి సంపర్కమును గలదనుకొనుటకు వీలులేదు గాని, ఫ్రెంచి వారితోడ టిప్పూనకుగల సంబంధము మరల కుదుటబడి, మహారాష్ట్రులను సాధించుటకుమా రాంగ్లేయులను సుల్తాను సాధింప నుండె ననుటకు గారణము గన బడెను. కాని తన సైన్యము నాయత్తముచేసి, ఫ్రెంచివారి సహాయము బడసిన దనుక నిజాభిప్రాయమును టిప్పూ వెల్లడిచేయ నుద్దేశింపకుండెను. నానా, మహారాష్ట్రసీమలనాక్రమించుటే సుల్తాను కోర్కెయని నమ్మి, 1787వ వత్సరాంతమున, గవర్నరుజనరలగు కారన్వాలీసునకు, మేలెట్ ద్వారా టిప్పూ దుండగములను యాశలను నణచుటకుగాను యాంగ్లేయులతో పీష్వా సఖ్యము జేసికొన గోరుచున్నటుల దెలియ

జేసెను. ఆంగ్లాధికార రక్షకు మహారాష్ట్రుల సహాయ మెంత యపేక్షణీయ మైనను, పార్లమెంటువారి యాజ్ఞ యనుల్లంఘనీయమాట, టిప్పూ తనంత దా నాంగ్లేయులతో జేసిన సంధికి విరుద్ధముగ వర్తించిన దనుక కారన్వాలీసున కెట్టి యొడంబడికకు, నొప్పుకొన నిచ్చినది కాదు. కాని ఫీష్వా కోర్కె నెరిగింప వచ్చిన మేలెట్ వకు కారన్వాలీసు, ఆంగ్లేయు లెన్నటికేని ఫీష్వావారి తోడ సఖ్యమును కోరువారే యని మాత్రము జెప్పుమని జెప్పెను.

1788 సం॥ లో టిప్పు సుల్తాను ప్రతికూల కార్యముల జేయుచున్నాడను నమ్మకమైన కబురు గవర్నరు జనరలునకు దెలసెను. తెలిచ్చేరిపై చెరికా ప్రభువు, టిప్పూ ప్రోద్బలముననె దాడి వెడలె ననియు, ఆంగ్ల రాజ్యాక్రమణమునకు ప్రథమ సోపానముగ, ఆంగ్లేయుల మిత్రుడగు తిరువాన్కూరు రాజు యొక్క భూముల నాక్రమింప నున్నటులను గూడ నాతనికి దెలసెను.

1768 సం॥ లో జరిగిన సంధి ననుసరించి, నైజాము చనిపోయిన దన సోదరుడగు బసాలజంగుయొక్క గుంటూరు సర్కారును ఆంగ్ల సంఘము వారికీయ నొప్పుకొని యుండెను. అతడు 1782 సం॥ లో స్వర్గస్థుడైనను, నైజా మద్దానిని ఆంగ్లేయుల కీయకుండెను. 1788 సం॥ కెప్టను కెన్నవే దొరను బంపి ఆంగ్లేయు లద్దానిని వప్ప జెప్ప హాయిదరాబాదు వారిని గోరిరి. తలువని తలంపుగ నైజా మా మండలమును వెంటనే యిచ్చివేసి, ఆంగ్లేయులు గూడ దాము నెరవేర్తుమని యొప్పుకొనినషరతులను కోరినంతనె నెరవేర్తురని తానునమ్ముచున్నట్లు

తెలియజేసెను. ఆ నియమానుసారము, నైజాము కోరినంత నాంగ్లేయులు రెండు సిపాయి పటాలములను, ఆరు ఫిరంగులను వాని నుపయోగించు పాశ్చాత్యులను, హాయిదరాబాదు వారి యుపయోగార్థము బంపవలసి యుండెను. అప్పటికి హాయిదరు నాయకునిచే "యాక్రమింప బడియున్న" కర్నాటకములోని బాలాఘాటును జయించి నైజామున కొప్ప జెప్ప వలసి యుండెను.

ఆంగ్లేయుల నట్లు హెచ్చరించిన నైజాము, వారి నీ దేశమున నిలువనీయకుండ దోలుటకు గాను, సుల్తానును దనకు సహాయ మొనరింప గోరుచు రాయబార మంపెను. టిప్పూ మాత్రము కొండెక్కి యుండుటజేసి, నైజాము స్నేహమును తృణీకరించెను. దిన దినాభివృద్ధి నొందుచున్న సుల్తానుని దుండగముల విని కారన్వాలీసు, చేయునదిలేక నైజాము కుతంత్రముల వినియు, వానిని, మహారాష్ట్రులను గూడ మైసూరు నెదిరింప దనకు సహాయ మానటుల జేయు టవసరమని దలంచెను. అందులకు గాను సమాధాన పత్రముంబోలు లేఖ నొకదాని నైజామునకు వ్రాసి యందు పూర్వము జరిగిన సంధి విషయములనె విపులముగ బేర్కొంటి నని చెప్పెను. నైజాముకోరిన బాలఘాటు నాంగ్లేయుల చేతుల బడినంతనె యొప్ప జెప్పుట కెట్టి యభ్యంతరమును లేదనెను. ఆంగ్లేయులతో స్నేహముగనున్న వారిపై ప్రయోగింపకుండిన, నైజాము కోరిన పటాలములు వాని వశము గావింపబడునని వ్రాసెను. ఆంగ్లేయుల మిత్రుల పట్టిక నొకదానిని నందు నిముడ్చి యుంచెను. ఆ పట్టికలో దన పేరు లేకుండుటంజేసి, తనను

సాధింపనెంచి యాంగ్లేయులు నైజాముతో జేసిన సంధిగా టి
ప్పూ దీనిని భావించెను. అందుచే మరొట్టి మొగమోటమును
చుకొనక 1789 సం॥ డిశంబరు 29 వ తేదీని నిర్భయముగ తి
రువాన్కూరు రాజ్యముపై టిప్పూ దాడివెడలెను. ఆ రాజ్య
మాంగ్లేయుల మిత్రమండలిలోనిది కావున, సుల్తాను దాడి
యాంగ్లేయుల నెదిరించుటగానే భావింపబడెను.

అంతవరకు కారన్వాలీ సంపువార్తల నంతగ గుర్తింపని
నానా, నేడీ తిరువాన్కూరు దాడినిగూర్చి వినినంతనె, టిప్పూ
నెదిరింప నాంగ్లేయులకు సహాయ మొనర్తునని కబురంపెను.
మార్చి 1790 సం॥ లో నాంగ్లేయులు పీష్వాతో సంధికుర్చు
కొనిరి. జులై మాసమున నదేరీతి నైజాముతో గూడ సమాధా
నమును గావించుకొనిరి.

ఈ సంధి ననుసరించి నానా, నైజాములు, సుల్తానుని
యుత్తరసీమల వర్షకాలములోను, తదనంతరముగూడ నెదిరించి,
వలయునంత యొత్తిడి కలుగజేసి, వీలగునంత రాజ్యమాక్రమిం
ప నిశ్చయింపబడెను. అవసరమున్న నాంగ్లేయుల సహాయార్థ
ము 10000 గుఱ్ఱపు దళమును కోరిన మాసము దినములలో
నిచ్చుటకును ఆంగ్లసంఘమే దానికగు వ్యయము భరించుట
కును యొప్పుకొనబడెను. కలసిదామాక్రమింపగల దేశము
ను దుర్గములను సమానముగ పంచుకొనుటకును, యుద్ధానంత
రము సంధి పొసగినపైని టిప్పూ యీ మిత్రులలో నెవ్వరి
నైన యెదిరించిననాడు తక్కినవారు వానికి సహాయ మొన
రించుటకును కట్టుదిట్టము చేయబడెను.

జనరలు మెడోస్ ఆధిపత్యమున టిప్పూ రాష్ట్రముపై

నాంగ్లేయులు మొదట దాడి వెడలిరి. 1790 సం॥ మే నెల
26వ తేదీని బయలుదేరి తిరుచునాపల్లి మీదుగా 15000 సేన
తోబోయి, తిరుగ 1791 సం॥ జనవరి 27వ తేదీని మెడోస
చెన్నపురిని జేరెను. అనుకొనినంత లాభము గలుగక పోయి
నను నాదాడిలో కారూరు, దిండిగల్, కోయంబత్తూరు, పాల
ఘాటులు వాని, స్వాధీనమయ్యెను. బొంబాయి సేనలతోడ
వచ్చిన కర్నలు హార్ట్లే, మలబారులో మైసూరు సేనానియగు
హుస్సేనాలీ నోడించెను. జనరల్ ఏబర్క్రాంబీ కన్ననూరు
పట్టుకొని సముద్రతీర ప్రదేశమును కైవశము జేసుకొనెను.

1791 సం॥ మేనెల 29 వ తేదీని స్వయముగ కారన్వా
లీసు ప్రభువు కార్యక్షేత్రమునకు వచ్చి తన నడకల సుల్తా
నుని కనుబ్రామి, బెంగుళూరు నాక్రమించుకొని, నైజాము
బలములం గలసి, అరికెరావద్ద టిప్పూనోడించి, మహారాష్ట్రులు
నకాలమునకు రాకుండుటం జేసి, శ్రీరంగపట్టణము నాక్రమిం
పలేక, వలయు పరికరములు లేకుండుటను జెన్నపట్టణమునకు
మరలెను. మరల 1792 సం॥ ప్రారంభమున శ్రీరంగపట్టణము
పై దండెత్తిపోయి ముట్టడించెను. ఈ యభేద్యదుర్గముకూడ
వశపడు నను సమయమున టిప్పూసంధికై రాయబారము నడు
పజొచ్చెను; గాని యనేక కారణములచే వాని రాకడలు మ
న్నింపబడినవి గావు. ఎట్టకేలకతని రాయబారపు ధోరణి బా
గుగ నుండునట్లు దోచుటచే, దన మిత్రులు మధ్యపడుటవల్లను
ముఖ్యముగా హరిపంత ఫడ్కే ప్రోద్బలమునను, కారన్వాలీసు
ప్రభువు టిప్పూపంపిన వకీళ్లను తన దర్శనమునకు, 1792 సం॥
ఫిబ్రవరి 14వ తారీఖున రానిచ్చెను. కోట ముట్టడియు రక్షణ

యు, యథావిధిగ నడచుచునే యుండెను. మిత్రత్రయము తరపున ముగ్గురు ప్రతినిధులు, టిప్పూ వకీళ్ళను, గలసి మాట్లాడ నిశ్చయింపబడెను. సర్ జాన్ కెన్నవే, బచ్చాజీ రఘునాథుడు, మీర్ ఆలమ్‌లు మిత్రుల తరపున నీకార్యమున కేర్పరుప బడిరి. వారు యేర్పరచినరీతి ఫిబ్రవరి 23 వ తేదీని, టిప్పూ యుద్ధమునకు పూర్వ మేలుచుండిన రాజ్యమున సగము శత్రువులకు నొప్పజెప్ప నొప్పుకొనెను. మూడుకోట్ల ముప్పదివేల రూకల నిచ్చుకొనుటకును, అందు సగమప్పుడే చెల్లించుటకును, మిగిలినది మూడువంతులుగ యేడాదిలో నిచ్చుటకును నొప్పుకొనెను. హైదరాలీకాలమునుండి చెరబెట్టబడిన ఖైదీలను విడుదలచేసెను. సంధిషరతులన్నియు పాలించుటకు గాను పూచీగా టిప్పూ కొడుకు లిద్దరొప్పజెప్పబడిరి. రెండు దినముల వరకు విశ్రాంతి గైకొన బడెను. సుల్తాను కుమారులు ఆంగ్ల శిబిరమున కంప బడిరి. కోటికి పైబడ నాతడీయవలసిన ధనమును చెల్లించెను. ఎల్ల నియమములును సాంతముగ పాటింపబడునను, నమ్మకము దోచిన సమయమున, టిప్పూ దా నీయవలసిన రాజ్య భాగమున కూర్గుకూడ కలసియున్నదని విని, తన కోట కొక బురుజు పోయినట్లుగ భావించి, తిరిగి యుద్ధమైన చేసి వలసిన ప్రాణమైన యర్పించెదను గాని దానిని వీడనని పట్టు బట్టెను. కాని మధ్య వర్తు లట్టి చర్యవలన గల్గు ముప్పు నచ్చజెప్పుటంచేసి విధిలేక యొప్పుకొనెను. వెంటనే కూర్గు [illegible]ని పూర్వపు ప్రభువులకు నొప్ప జెప్ప బడెను. ఆతడు స్వతంత్రునిగ నెంచబడెను.

టిప్పూ ఒప్పగించిన రాజ్యమున నుత్తరభాగము మహా

రాష్ట్రుల పాలయ్యెను. తుంగభద్రానది వారి రాజ్యమునకు దక్షిణపు టెల్లగ నిర్ణయింప బడెను. నైజామునకు వాని రాజ్యము నంటియున్న తూర్పు భాగము వచ్చెను. కర్ణాటక మళయాళ తీరము లందలి దేశము ఆంగ్లేయుల వంతయ్యెను. ఒక్క మంగుళూరే, రేవు స్థలములలో టిప్పూ వంతునకు మిగిలెను. సముద్ర మార్గమున పరదేశములతోడ నుత్తర ప్రత్యుత్తరముల జరుపుటకును, వ్యాపారము సాగించుకొనుటకును, వానికా మాత్రమే యను కూల స్థానము మిగిలెను.

యుద్ధము సాంత మైనంతనె ఆంగ్లేయులు హిందూ ముసల్మాను రాష్ట్రముల, సఖ్యత మరింతగ దృఢపరచి, వారి సహాయమున మున్ముందెట్టి శత్రువునైన సాధింప వీలు జేసుకొన దలంచిరి. కాని వారి మూలమున నట్టి సంధి పొసగునేని యాంగ్లేయుల యాధిక్యత నెల్లవారును పరిగణింతురనియు, తన్మూలమున మహారాష్ట్రుల యశము కళంకితమగుననియు, నానా, దలచి యందుకు మొగ్గకుండెను. టిప్పూ సబలుడై యున్ననాడే పూనావారు దనను సాధించు నలవాటు పడియుండ, నేడు నిరాతంకముగ, వారు దనపై బడుదురనియు, బలవంతులగు స్నేహితులగుట, నాంగ్లేయులు మహారాష్ట్రులనేమియు ననలేరకుందురనియు, దలచి కారన్వాలీసు కోరినరీతి సంధి కొడంబడ డయ్యెను. అదికాక నీ దక్షిణ సమస్యలలో నింతదనుక నెట్టి జోక్యమును గలుగజేసుకొనక, దన నిజోన్నతికే ప్రబల యత్నముల గావించి సఫల మనోరథుడైన మహాధాజీ సింధియా నేడు పూనా దర్బారున యాడినది యాటయు, పాడినది పాటయునై చెల్లించుకొనుచు, దనను పాటించక మేలెట్ ద్వారను

పూనాలో దెచ్చిపెట్టిన యాంగ్లేయుల యొక్కయు, నానా యొక్కయు, ప్రాముఖ్యతను పరిగణింపదగు నీ సంధికి మొగ్గడయ్యెను. ఏ కారణమున నైననేమి ఆంగ్లేయు లాశించిన శాశ్వత సమాధానముగాని, యా వర్తకసంఘము మధ్యవర్తులుగా నుండుటగాని భారతీయులు పాటింపక, కారన్వాలీసుప్రభువును బోలు ఆంగ్ల వ్యక్తుల మెత్తని మొత్తులకు జాతీయ స్వాతంత్ర్యమప్పచెప్పక మరికొంత కాలము దనుక నిలుప గలిగిరి.

12 నానా యుచ్ఛదశ

నాడు గ్వాలియరు దేశమున తలదాచుకొని పూనాకు సహాయార్థము కబురంపిన మహాదాజీ నేడు పూనాలో నింత యాధిక్యము సంపాదించుటకు దగిన కారణములుండెను. ఏనాడు అబ్దాలీ పానిపట్టున గెలిచెనో ఆనాటి నుండి రోహిలాల ప్రభ ఢిల్లీలో మిక్కుటమయ్యెను. నజీబ్ ఖాను డను రోహిలాయే అబ్దాలీకి సహాయభూతుడై నిరువది సంవత్సరముల వరకు ఢిల్లీ వ్యవహారములలో బ్రముఖుడై యుండెను. 1770సం॥లో నితడు మరణింప నీతని కుమారుడు జాబెత ఖాన్ ప్రాముఖ్యము వహించెను. కాని పానిపట్టు పరాజయమునుండి తెప్పరిల్లిన మహారాష్ట్రులు, పాదుషాను ఆంగ్లేయుల పోషణ నుండి తప్పించి యావత్సరముననే ఢిల్లీ సింహాసనమున కూర్చుండబెట్టి, దామును భారత రాజధానిని గణనీయ పాత్రులైరి. నాటినుండి రోహిలాలకును, మహారాష్ట్రులకును, పెట్టని పగ పెరుగ జొచ్చెను. ఏనాడు సింధియా ఢిల్లీ వ్యవహారములలో

జోక్యము కల్పించుకొనెనో, యేనాడు సర్వాధికారములతో పీష్వాకు ప్రధానామాత్యపదవి నిప్పించి వానితరపున దాను ఢిల్లీలోనుండి చెలాయింప జొచ్చెనో, ఆనాటినుండియు రోహిలాల కాతని నెట్లయిన తొలగించు నుద్దేశముండెను; గాని యా చతురమతి వారల కేక్రీతిని లొంగినవాడు కాడు. ఎట్టకేలకు రాజపుత్రస్థాన దండయాత్ర వలన రోహిలాలకు, సింధియాను సాధింపవీలొసంగినది. వారు సింధియాను గ్వాలియరులో తలదాచుకొను నంతకు దెచ్చిరి.

హరిపంతు ఫడ్కే యధీనమున దక్షిణాది వ్యవహారముల విడచిన నానా, మహాదాజీ ప్రక్క తన దృష్టిని మరల్చి కొంతవరకు, శిథిలావస్థనున్న మొగలాయి సామ్రాజ్యమును దాని పరిస్థితులను పరిశీలించెను. ఆ సేతు హిమాచల మెవ్వారి పేరెత్తి ప్రజలు గజగజలాడెడువారో, ప్రఖ్యాత రాజ్యములలో నెల్ల నాయకమణిగ భారతలక్ష్మి యెవ్వారి ప్రభను పేర్కొండెనో, యట్టి మొగలాయి వంశము నేడు పరాధీనుడును, సజ్జనుడును, పాపభీరుడును నగు షాహాఆలముచే నలంకరింప బడుచుండెను. తాత ముత్తాతలార్జించి యశోవిఖ్యాతములొనరించిన పట్టణ రాజంబుల, నాడు ప్రబలుచున్న శత్రుల యలికిడికి భీతినొంది, యా ముదుసలి వాటిని వీడి, విగ్రహారాధకు లనియు కాఫరు లనియు ఔరంగజేబు దూషించెడి హిందువులలో నొక్కని యాశ్రయించి, మధురాపురంబున కాలము గడుపుచుండెను. 'బ్రతుకు జీవుడా' యని సింధియా పోషణమున కొంత విశ్రాంతి నొందగలిగిన ముక్కాలి ముదుసలి కామాత్రము సౌఖ్యమైన, నా విధాత వ్రాతనుగాబోలు,

యనుభవింప వీలొసంగినదికాదు. తమపన్నుగడలచే సింధియా గ్వాలియరున దాగియుంట, వాని సుడి తీరినదని యెంచి రోహిలాలు, పాదుషాను సకుటుంబ సపరివారముగ ఢిల్లీకి దెచ్చి, యట బడరాని పాట్లు బెట్టిరి. రోహిలా జాబెతఖానుని కొమరుడు గులాం కాదరను దుర్మార్గుడు, తన తండ్రి తాత లనుభవించిన వైభవ మీ ముదుసలి మహారాష్ట్రులను దెచ్చి చెడగొట్టెనని యెంచి, పాదుషా మీద దిరుగబడి ఢిల్లీలో జేయరాని ఘోరకృత్యముల జేసెను. పాదుషాను, అతని కుటుంబములోని జనులను కాళ్లతో దన్ని, కొరడాదెబ్బల కొట్టి, వృద్ధుడని యైన కనికరించక బాదుషా కనుల దీయించెను. సింహాసనమును దన్ని యగౌరవ పరచెను. దిక్కులేక యా ముదుసలి పడియుండెను. అంతట తనివి నొందక యా క్రూరుడు సింధియా మూలమున హిందువులు గడించిన పలుకుబడిని రూపుమాప జూచెను. చారుచక్షుడగు నానా కివియన్నియు విశదము లయ్యెను.

మహదాజీ యన్న నా యపర చాణక్యున కెంత యీర్ష్యయున్నను, వాని మూలమున పెరిగి పెద్దదయిన హైందవ ప్రతిభ కీనాడు వాటిల్లనున్న ముప్పు, దాని నెల్ల నూలబెట్టించెను. వెంటనే నానా, సింధియాను యెట్లు ఢిల్లీ కనిపి యాతడార్జించిన పూర్వపు ఔన్నత్యము గడింపజేయ నగునా యని యోచించెను. తన క్రింద నున్న పీష్వాసేనల గ్వాలియరున కంపెను. అంతట సంతృప్తినొందక తూకాజీ హోల్కారుని గూడ ప్రోత్సాహ పరచి సింధియా సహాయమున కంపెను. అట్లిద్దరిని బంపుటలో కొంత లాభమును కూడ జూపెను.

వెడలిన పని కాజేసుకొని వచ్చినపైని చేంబల్ నదికి దక్షిణమున నున్న దేశమును మొగలాయీల నుండి మహారాష్ట్రుల వశము గావింప బడవలెనని కోరెను. అద్దానికి యుద్ధమున పాల్గొనిన సింధియా, హోల్కారు, పీష్వాలు సమాన యధికారు లయ్యెదరని యొప్పించెను. సింధియా కీ మూలమున దన యధికారము క్రిందనున్న కొంత నేల బోవనుండినను, అసలే బోవనున్న దానికన్న కొంతయైన దక్కుట మంచిదిగదా యని యొప్పుకొనెను. వెన్వెంటనె బయలుదేరి రోహిలా గులామ్ కాదరు విజృంభణ సీమయగు ఢిల్లీపై బడెను. కాదరు వీని రాక విని పారిపోయెను; గాని దూర మేగక మున్నె పట్టువడి 1788 సం॥ లో సింధియాచే చిత్రవధ గావింపబడెను. ఆ పని ముగియ సింధియా కొంత విశ్రాంతి గొనిదాను లేని కాలమున, వివిధ కళల పాలనకు లోనై, యరాచ కావస్థనున్న సామ్రాజ్య పాలనమును చక్కబెట్టెను. నాల్గేండ్ల కాల మట గడపి, ఉత్తర హిందూస్థాన సమస్యలెల్ల కొంతవరకు దనకు తృప్తికరముగ నేర్పడ, మనసులో నున్న మహారాష్ట్ర పాలనమును హస్తగత మొనరించుకొను కోర్కె--నానాను ప్రక్కద్రొక్కగల కోర్కె-- దీర్చుకొన వీలయ్యెను. తన కష్టకాలమున కూడ యీర్ష్యాపూరితుడగు నానా, సాయ మొనరింప సందేహించెను గదా యనియు, తుదకు స్వలాభాపేక్ష లేకుండ నెట్టి సాయమైన చేయ డయ్యెనుగదా యనియు, యింతకును వానికి పీష్వావద్ద గల పలుకుబడి యే కారణ మనియు, సింధియా మాగువక దా నా బ్రాహ్మణుని స్థాన మాక్రమించు టెట్లని యోచించెను. ఈ లోపున తనకు మొగలాయి

దర్బారున నున్న పనులన్నియు ముగియుటయు, టిప్పూ యోడి యవమానకరమగు సంధి కొడంబడె నను వార్త వినుటయు దటస్థించెను. ఇవి మూలముగా జేసుకొని యీ నిపుణుడు దా నెంచిన వ్యూహమును బన్నెను.

షాహా ఆలమ్ బాదుషా కష్టము లుడిగి సౌఖ్యము సేకురినందులకు గాను సింధియా యెడల మిగుల కృతజ్ఞుడై యుండెను. అది యాదరవుగా గొని మహాదాజీ, వానినుండి, పీష్వా కొరకు వానికి పాదుషా యొసంగిన బిరుదున కవసరమగు బహుమానముల బడసెను. వాటితోడ యౌవన పీష్వాను సంతోషబరుప నెంచి, తన్మూలమున దాను పూనాలో పలుకుబడి సంపాదింప జూచెను. ఇందుకై దాను కొంత కాలము పూనాలో యుండు టవసర మని దలచి ఢిల్లీ దర్బారున సెలవు పుచ్చుకొనెను. మహారాష్ట్రమునకు దా నేగక మున్న పీష్వాకు దన మూలముననను, హరిపంతుని మూలముననను, లభించిన జయశ్రీకి యభినందించుచు కబురంపెను. అనతి కాలములోనె దానాను దాసు డగు దాను పూనాలో శ్రీ వారిని కలుసుకొని 'ప్రణతు లర్పింతు' ననియు 'దర్శన లాభ మపేక్షించుచుంటి' ననియు దెలియబరచెను. ఆ వర్తమాన మందియు నందక మున్నె బయలుదేరి, ఢిల్లీనుండి పూనాకు యెకా యెకిని, నానా, మొదలగువారు దన లోని యుద్దేశమును గ్రహింపక మున్న, బోయి చేరెను. ఆ సమయమున, వాని కనుకూలముగ స్వ సైన్య సమేతముగ హోల్కారు మొదలుగా గల దన్ననుమానుంచు బలాధికులు రాజధానిని లేకుండుట దటస్థించెను. పీష్వా కూడ యౌవను డగుమ హాదాజీ దనకై సంపాదించిన

సామ్రాజ్య గౌరవములను యద్వితీయ బహుమానములను గూర్చి విని, యెదురేగి, సింధియాను రాజ నగరి బహిర్ప్రదేశమున గలసుకొనెను. వినయ వినమ్రుడై యీ టక్కరి దోడ్తెచ్చిన అమూల్య పురస్కారముల పాదుషా తరఫున వకీలీ ముత్లక్కగు శ్రీ పీష్వా కందజేసెను.

నూతన గౌరవ నాంధుడింకును, సహజ భోగ విలా సాపేక్షితు డును, శ్రోత్రియ వృద్ధ బ్రాహ్మణ నిబంధన శిక్షితుడు నగు శ్రీ పీష్వా మాధవరావు నారాయణున కీ యమూల్య బహూత్కారము కనుల మిరుమిట్లు గొలిపి, సింధియాపై మిక్కుట మగు దయ కలుగజేసెను. ఆ బహుమాన మందుకొనినది మొదలు నానా యెడల వాని కొక విపరీత భావ ముత్పన్నమయ్యెను. సింధియా కోరిన కోర్కె సఫలమగుట కిదియే సుముహూర్త మయ్యెను. హైందవ సామ్రాజ్య స్థాపనార్థము నిజ బాహుబలార్జిత మగు రాజ్యమును, సన్యాసి యగు రామదాసున కర్పించి, వాని ప్రతినిధిగ దానినేలుచు రాజభోగములు దనకు కావని యెంచిన క్షాత్రపతి శివాజీ స్థాపించిన సింహాసనము, భోగ పరాయణు లగు వాని వంశమునుండి శ్రోత్రియ బ్రాహ్మణుల వశమై, వారలకును, రణ ధన కాంక్ష లలవడజేసి రఘోబా నాడు శిశు హంతకు గూడ దార్చి, నేడు యే మొగలాయి దుండగము లడంప జనించెనో, ఆ మొగలాయి వరప్రసాద లబ్ధ మగు యుద్యోగ లాంఛనములకు మురిసి బడు, నవస్థకు వచ్చెను. ఔరా! స్థానబలిమి కెంతటి యుత్కృష్టాదర్శమైన నేమి లెక్క! లేకున్న మహారాష్ట్ర పాలకు లెక్కడ! శిథిల సామ్రాజ్య వరప్రసాద లబ్ధ లాంఛన శోభిత

ఆనంద మెక్కడ! కాల మహిమ.

పాదుషహా బంపిన దుస్తుల తొడగి, ఆత డంపిన యలంకారముల నలంకృతుడై పీష్వా, సింహాపీఠి నెక్కెను. సింధియా, నానా మొదలుగా గల మహారాష్ట్ర నాయకులు కానుక లర్పించిరి. హరిపంతు సింధియాలు ఛత్ర చామరము వైచిరి. పాదుషా తప్ప మరెవ్వ రెక్కరాని నాల్కీలో మాధవరావు నారాయణు డెక్కి పురవీధుల బ్రవేశించి పూనా పౌరు లెన్నడెరుంగని వైభవముతోడ నూరేగి, భేరీ కాహళ ధ్వానములు మిన్ను ముట్ట, పౌర జనంబులు జేజే లొనర్ప, ఫిరంగులధ్వని దిక్కులు బిక్కటిల్ల, సింధియా కోరిన యుత్సవములు జరిగి, పీష్వా మనం బమితానందభరిత మయ్యెను. అంతకును కారణభూతుడైన మహాదాజీ, ప్రదర్శించిన వినయ మెప్పటను నే యున్నతోద్యోగియు జూపెట్టి యుండడు. పరిస్థితుల గమనించిన, టిప్పూ మూడు నెలల క్రిందటనె యోడుటం జేసి, పదునారు సుశిక్షిత పటాళముల కధినేతయు, ఐదువందల ఫిరంగి దళమున కధికారియు, లక్ష గుఱ్ఱపు బలమును, కోరిన మాత్రమున రణభూమిని నుంచగల యోధుడును నగు సింధియా కీ భారత భూమిని సాటి రేడు కానరాకుండెను. కాని యా చతురుడు పూనా నగర ద్వార సమీపమున యేనుగు డిగి, పాదచారియై బోయి రాజచావిడిలో నున్న మహారాష్ట్ర నాయకు లెల్ల రుండుచోట నగ్రస్థానము నాక్రమించ వలసినవా డయ్యు, నధమ స్థానమున గూర్చుండెను. పీష్వా దర్బారును చేరినంతనె, యుదిగాంచి ప్రశ్నింప, దన కంతటి యర్హత లేదని జెప్పి, చంక నిడికొని దెచ్చిన మూట విప్పి, యందుండు చెప్పుల జత ముందిడి "ఇవి నా

వృత్తి! నా తండ్రివృత్తియు నిదియె యనెను. కాని శ్రీవారి బలవంతమున విధిలేక దనకొర కేర్పరుపబడిన స్థాన మలంకరించెను. అంత పీష్వా, బాదుషా ప్రధానామాత్యుడుగ నభిషేకింపబడెను.

వకీలీ ముత్లక్కు ప్రతినిధిగ సింధియాకు పట్టము గట్టబడెను. ఇప్పట్టునను తదితర సమయములను మహాదాజీ పటేలని దప్ప వే రొండురీతిని బిలువబడుట కొప్పుకొనకుండుటయు, జరుగు మర్యాదల కర్హుడు గానట్లు నటించుటయు, పీష్వా పరివార ప్రభు బృందమున కెంతయు నసహ్యాకరముగ నుండెను. మహారాష్ట్ర లోకమున కీ నమ్రతెంత సహజముగ నుండినను, సింధియా కోరిన రీతి నీతని వర్తనము ఫలింపకుండెను. చదువుకొనిన బ్రాహ్మణు డెవడును వీని ప్రవర్తనమున సంతృప్తిబడుట గాని, మోసబోవుట గాని, జరుగలేదు. అసలు మహారాష్ట్రులందరికిని, సింధియాకు మహారాష్ట్రమున యాస్తు లున్నను, వానికి నూతనముగ ప్రాప్తమయిన రాజ, మహారాజ, ముదారుల్ముహామ్, ఆలీజా బహద్దూర్ బిరుదములు వాడుకే యిష్టముగ నుండెను గాని, కన్నేరుఖేరు కధికారి యగుటచే వానికి గల పటేలు బిరుదము నుపయోగింప నేమాత్ర మిచ్చ లేకుండెను. మంకాజీలు మొదలుగా గల సతారా ప్రభువుల నాశ్రయించి పెద్దలైన ప్రముఖులు, దా మెక్కెడి గుఱ్ఱమైన దమదని చెప్పుకొనలేని దారిద్ర్య మనుభవించుచున్నను, పీష్వాకు వకీలీ ముత్లక్కు బిరుద మొచ్చిననాడు, పాదుషా యిచ్చిన గుడారములలో పీష్వాను దర్శించి నజరు లర్పింప పరువునష్టముగ దలంచిరి. ఏలనన, పరువు ప్రతిష్టలు

గల పాత కుటుంబముల పౌరుషమునకు, పేరునకు పెద్దయగు పాదుషహా యిచ్చిన బిరుదము లనవ్యాకరములుగనుండెను. సింధియాకు మాత్రము వాని క్రిందివారు కానుక లర్పించిరి. కాని మహాదాజీకి దేశీయులలో నున్న భావము స్పష్టమై జాగరూకతతో మెలగవలసిన యవసరము వెల్లడిజేసెను.

మాధవరావు నారాయణు డుదార స్వభావుడు గాన, స్వేచ్ఛాభావము గల్గిన సింధియాతో సాంగత్యమున కెంతయు నాసించుచుండెను. ముక్తసరిగ మర్యాద నతిక్రమింపక ప్రసంగించు స్వభావము గల మహామంత్రి నానా, వద్దనె యెల్లకాల ముండుటం జేసి పీష్వాకు సింధియాను బోలు చెలిమికాడు గావలయు నను కోర్కె హెచ్చెను. పూనా పరిసర ప్రాంతముల వేటల కని యాటల కని సింధియా, పీష్వాను గొని పోవుచుండెను. నానా కూడ కాదనలేక సమ్మతించుచుండెను. సింధియా రాకడలలోని భావమును గుర్తించి వానిని దన దృక్పథమునుండి యేమాత్రమును దొలగి పోకుండ కాచుకొనుచుండెను. పీష్వాతోడ యొంటరిగ మాట్లాడుటే నానాకు, కష్టమగుచుండెను. కాని నానా, కేమాత్రమైన కనుచాటైనపట్ల పీష్వా స్వాతంత్ర్య రాహిత్యమును గూర్చి దా విచారింపుచున్నట్లును, యతడు గోరెనేని నానా, యధీనమునుండి దప్పింపదగు కోర్కెయు, బలమును కూడ దనకున్నట్లు సింధియా హెచ్చరించుచు వచ్చెను. పీష్వా వానితో సాంగత్య మెంత యవసరమని దోచినను నానా యందలి విశ్వాసమును, గౌరవమును, వానిబోధనల నేమాత్రము పీష్వామనమున కెక్కనిచ్చినవి కావు. కాని సింధియా బోధించినది మొదలు నానా,

పోషణకు లోబడి యుంట, పీష్వాకు గష్టముగదోచుచు, సింధియాతోడ సాంగత్య మెంతయో వాంఛ నీయముగ గన్పట్టెను.

పూనాలో సింధియాకున్న పను లెల్ల నుత్తర హిందూస్థాన సంబంధమైనవియే యైనట్లు దోచెడిని. తాను, సామ్రాజ్యోన్నతికి గాను పెట్టిన కర్చులును, పీష్వా కీ మర్యాదలసంపాదించుటకుగాను చేసిన వ్యయమును, చెప్ప జొచ్చెను. తనకైన కర్చుల నిప్పించమని పీష్వాను వేడెను. హిందూస్థానమందలి వ్యవహారముల జూచుటకుగాను సర్వాధికారమిమ్మనెను. అచ్చటనున్న ఆలీబాహద్దరు హోల్కారుల పిలచి వేయుమని గోరెను. ఇట్లడిగి నపుడెల్ల నానా, యతడంత సునాయాసముగ సంపాదించిన మండలముల యాదాయ మెంతయో లెక్కజెప్పమనియు, దా నెన్నాళ్ళనుండి వాటి ననుభవించు చుండెనో దెలుపవలసిన దనియు గోరుచుండెమ. ఈవిషయమున వాదప్రతివాదములు ప్రబలి మంత్రుల కొకరియెడ నొకరికిగల నీర్ష్యాభావమును హెచ్చింపనగు గారణము లనేకములు బయల్పడెను. కాని వారంత వేగమే బయల్పడక నొండొరులయెడ గనుపరుపవలయు గౌరవ మర్యాదలకు లోటుజేయక, లో లోన నొకరి నాశన మింకొకరు కోరుచున్నను, చెక్కుచెదరక నుండిరి. హిందూస్థానముననున్న రెండు కక్షులవారును రాజపుత్రస్థానమున నేక కార్యమున బనిచేయుచున్నను, నొకరిని గాంచిన నొకరు కొరకొరలాడుచు యేనాడు పొడుచుకొనెదరో దెలియక యుండిరి.

రాజపుత్రులీయవలసిన కప్పమును వసూలు చేయుటకేగి మున్నొకప్పుడు సింధియా యోడెను గాన, ఆతని ప్రభ

దీపించు నేడు, హోల్కారు సేనలును, దన సేనలును కలసి రాజపుత్రుల దండించి వారినుండి రావలసిన కప్పమును వసూలు చేయుటకు గాను నియమించెను. సింధియా పూనాకు తరలి రాకమున్నె, మహారాష్ట్ర సేనలు, కానుంద దుర్గమును స్వాధీన పరచుకొనిరి. అటుల మరి రెండు కోటల నాక్రమించుకొని కొల్లగొనిన ధనమును విభజించు కొనుటలో, దగవులాడిరి. సింధియా సేనాని డీ బోయి నే 20000 గుఱ్ఱపు దళముతోడను, 9000 కాల్బలము తోడను, 30000 గుఱ్ఱములును నాలుగు పటాళములను కలిగియున్న హోల్కారు సేనలపైబడి వాని నుక్కడగించెను. తూకాజీ తన భగ్నసైన్యమును గొని మాళవ కేగి, అట దనచేతగాని కోపమున కాహుతిగ, శత్రు రాజధాని యగు ఉజ్జయని నగరమును దోచుకొని, పరశురామ ప్రీతి గావించెను. ఈ వార్తలు పూనాలో దెలిసినంతనె సింధియాకును, దర్బారునకు నున్న సంబంధము విషమించెను. వెన్వెంటనె యిరుకక్షులును దమ కే మైన హాని వాటిల్లగలదను మిషను జాగ్రత్త బడజొచ్చిరి. నానా, పరశురామ భవుని సహాయము జేయుమన, నాతడు రెండువేల యాశ్విక దళమును నగరము లోనికి దెచ్చెను. తొందరబాటున నానా, చేసిన పనిని మిషజేసుకొని సింధియా తోడ దెచ్చిన దన సేనాని హోస్సింగు పైలోజుల బలము లభివృద్ధి గావించి, సుశిక్షితమగు తన పదదల మొకటి పూనాలో ప్రవేశపెట్టెను. కాని యే మంత్రియు యుద్ధమూలమున దన పంతము నెగ్గించుకొను నిచ్ఛగలవాడు కాడు గాన, సేనానుల కెట్టి యెడను కలహమునకు దిగవల దని గట్టిగా చెప్పి నియమించిరి. పీష్వా

పరిష్కరించు రీతిని మెలంగుట కెదురు జూచు చుండిరి.

హోల్కారు నోడించుటం జేసి హిందూస్థానమున దా గడించిన ప్రఖ్యాతి నెరింగినను, సింధియా దా దక్షిణమున నంతగ ప్రజా వాత్సల్యమును బడయ లేదని దెలసి దాని సంపాదింప జూచుచుండెను. ఈకోర్కె తోడనే మున్ముందు పెలుపనున్న తీరున గోవిందరావు గైక్వారుని పక్ష మవలంబించి, పూనాకు వచ్చినది మొదలు బనిచేయు చుండెను. మరియొక్కతరి, పంతు సచివుని బాల్యమున, వాని భూములను నానా, పాలన క్రిందికి దెచ్చుకొన, ఆవనికి ప్రజ లెవ్వరు నిష్టపడకుండుటు జూచి, సింధియా మధ్యపడి, నానా వలదన్నను వినక, సచివుని గొని పూనా కేగి, నానా, యా భూముల జూచుటకుగాను నియమించిన బాజీరావు మోరేశ్వరుని, నటనుండి బంపివేసి, సచివుని భూములు వాని కిప్పించి వేసెను. ఈ దుందుడుకు చేష్టచే మంత్రు లిద్దరికిని గల కయ్యా మధికమై హరిపంతు ఫడ్కె మధ్యపడి యష్టకష్టముల బాలై తగవు గుదిర్చ నదనుక చల్లబడ దయ్యెను. కాని సింధియా బహిరంగముగ పీష్వాను దన యాశ్రయమునకు దెచ్చుకొన జేసిన యత్నములు నూతన కలహ కారణము లయ్యెను. ఇట్టి యత్నముల ఫలితము లెట్లుండెడివో యూహింప నలవికాదు, గాని పరిస్థితులు విషమింప నానా, దన యధికారము నెగ్గుట కష్టమని నిస్పృహ జెంది వారణాసి కేగుటకు నిశ్చయించి, పీష్వాను సెల వడుగ, నాత డీ ముదుసలి ప్రార్థన విని, గుండె నీరై వానిని క్షమింపవేడి, ముందెన్న డిట్టి యజాగ్రతకు పోలొనంగనని, వాగ్దత్త మొనరించెను. ఈ సమయమున వనోల్లీలోనున్న

మహాదాజీ సింధియా జ్వరపీడితుఁడై 1794 సం॥ ఫిబ్రవరి 12వ తేదీని స్వర్గస్థుఁ డయ్యెను. హీన కులోద్భవుఁడయ్యు మహాదాజీ, రాజనీతి నిపుణుఁడును, మేధావియు, చతురుఁడును, కార్యశాలియు, ఆత్యాశాపరుఁడును నై సుమారు యేబది యేండ్లు భారతీయ యితిహాసమున నొక రాజ్యమేలెను. నానా సమకాలికుఁడై వాని సహకారిగనే యుండి వానికన్న యధిక వైభవ ప్రాప్తి నంది, కొసకు వానినే మూలబెట్టునేమో యను స్థితికివచ్చి నాఁడును కీర్తిశేషుఁడయ్యెను. దేశ భక్తుఁడును యోధాగ్రేసరుఁడునగు నీతఁడు పదునెనిమిదవ శతాబ్దాంతరార్ధమును దన చేతల తోడనే భారతేతిహాసమును నింపినను, జీవిత కాలమున కోరిన కోర్కెలెల్ల నెరవేర్చుకొన గలిగినను, దా ద్రొక్కిన త్రోవలనె మహారాష్ట్ర సామ్రాజ్య విచ్ఛేదనమునకు కారణములుగ విడచి పెట్టెను. దేశభక్తిని, స్వమత సంరక్షణ వాంఛ నాదరవుజేసి శ్రీ శివాజి సిద్ధ పరచిన మహారాష్ట్ర సేనలు లాలాజీ బాజీరాయని కాలమునకె స్థాపితాదర్శముల కెడమయ్యెను. మహాదాజీ సింధియా కాలమున నవి సంపూర్ణముగ ధనోపార్జితములై జాతీయ భావమే మాత్రమును లేనివై యుండెను. యుద్ధవిధానములును మార్చబడెను. కొలదిగ నుండిన కొండకోటల నెన్నిటినో గెల్చి కోట్ల సైన్యమున కధినాథుఁడగు నలంఘీరును దన దాగు మూతల నాటలాడించిన మహారాష్ట్రీకసేన స్థానముననేఁడు బరువు ఫిరంగులును, తాబేటి సడకల ననుసరించు పదదళమును, పేరునకు కొంత గుఱ్ఱపుసేనయు, కని విని యెఱుగని శిబిర సామగ్రియు జతపర్చ బడెను. పరదేశజుల గాంచి దెచ్చిపెట్టిన యీనూతన శాఖల కవసర

ముగు శిక్షలేకుంట దగురీతి నుపయోగింప వీలులేకుండెను. అద్దాని సంపాదింప విదేశీయుల కమిత వేతనములిచ్చి దేవలసియుండెను. తమది కాని నేలను, పరమతస్థులకై పనిచేయు కిరుమెవరెక్కువ ధనమిచ్చిన వారిపక్కకే యొరుగుటంజేసి సేనాబలమె కొనకు మహారాష్ట్రులకు సంకటకారణమయ్యెను. పరాధీనత చేకూరెను, యలవడెను, కొనకుస్వతంత్రత యన నెట్టిదియో కూడ మరువజేసెను.

ఎట్లైన నేమి మహాదాజీ యిహలోక కొట్లాటలను వీడి పరలోకమున కేగెను. అమిత బుద్ధి బలమున నేమి, బాహుబలమున నేమి సంపాదించిన దెల్ల ననుభవింప దగు నిజ సంతానమైన నిడని బోలేదు. కాని తనసోదరుఁడును పానిపట్టు రణరంగమున వీరస్వర్గమున కరిగిన వాఁడునగు తూకాజీ మనుమఁడగు దౌలతరావును దనకు వారసునిగ నియమించి తర్లెను. ఈ నియమము శాస్త్రీయమగు దత్తతను గాకున్నను ప్రజలెల్లరిచే నామోదింప బడెను. మహారాష్ట్ర నాయకులందరిందుకు సమ్మతించిరి. తూకాజీ మూడవ కుమారుఁడగు ఆనందరావు పుత్రుఁడు దౌలతారావు అప్పటికి పదునైదేండ్లవాఁడు. రాచకీయ వ్యవహారముల చెయిజేసుకొను వయసు లేకుండెను; గాన నానాకు ప్రత్యర్థి లేకుండుటంజేసి సర్వాధికారమును హస్తంగతమయ్యెను.

13 ఖర్దా యుద్ధము

పీష్వా మాధవరావు నారాయణుని నిర్యాణము

ఆంగ్లేయు లెన్నించిన సంధికి మహారాష్ట్రులు మొగ్గ

కుంటను, నైజామిష్టపడకుండుటను జూచితిమి. మహారాష్ట్రీలకు నైజామాలీ పైగల హక్కులను సూచించితిమి. అనేక వర్షములుగ నాత డీయవలసిన చౌతు సర్దేశముఖీలు బాకీపడి యుండెను. గత పదేండ్ల నుండి మహారాష్ట్రీలు నైజాము నీ విషయమునే ప్రశ్నించుచుండిరి. గాని టిప్పూతో యుద్ధమునకై గావించిన సంధి నెపమున నిన్ని దినములును నైజామా విషయమును గూర్చి మాట్లాడక కాలక్షేపము జేయ గల్గెను. మహారాష్ట్రీలుగూడ నా మొగమాటముననె యిన్ని దినముల వరకు మాటాడకుడిరి. 1791 సం॥ లో హైదరాబాదు దర్బారులో నున్న పీష్వా రాయబారులు గోవిందరావు కాళే గోవిందరావు పింగళేలు నైజామును, దమకును నతనికి నున్న లెక్కలను పరిష్కరించుటకు దగు మనుష్యులను నియమింప గోరిరి. అటుపై వాద ప్రతివాదములు ప్రబలి, నైజామాలీ దనకు రావలసినవిగా 24 బాపత్తుల క్రింద బాకీలను జూపుచు పట్టిక నొకటిచ్చెను. అందు బలవంతముగ దన నుండి వివిధ సమయముల మహారాష్ట్రీలు వసూలు చేసిన అన్యాయపు బాపతులు, అధర్మముగ గొంపోయియో, నీయకనో యున్న మండలముల ఆదాయములు జేర్కొన బడియుండెను. పీష్వా రాష్ట్రమున నివసించుచున్న పిండారీల దాడుల వలన దనకు గలిగిన నష్టమునకు పరిహార మీయవలసి యుండునని దెల్పెను. వీటిని చూచుకొని తగు సమాధానము జెప్పి, స్పష్టముగను విపులముగను నానా 28 బాబతుల నైజాము దమకీయవలసిన మొత్తమును దెలిపి వెంటనే పరిష్కారమును గోరి, 1774 సం॥ నుండి యెట్లు హైదరాబాదువారు బాకీపడుచున్నారో దెల్పెను.

కొన్ని బాకీలను నైజాము విధిలేక యొప్పుకొన వలసి వచ్చెను, తక్కినవి తప్పించుకొన జూచెను. మొత్తముపై నన్నియు, టిప్పూతో యుద్ధ మంతమైన పిమ్మట, దన మనిషి నొకనిని నిర్ణయించి వాని మూలమున పరిష్కరించుకొందు నని తెలియ పరచెను. అప్పటి కాంగ్లేయులు దన వ్యవహారములలో జోక్యము గల్పించుకొని సహాయము జేయ గల్గుదు రని యాశించెను. 1790 సం॥ లో కారన్వాలీసు ప్రభువు గావించిన సంధిలో నిజాము గాని, మహారాష్ట్రీలు గాని, ఆంగ్లేయులు గాని టిప్పూచే మున్దెన్నడైన నెదిరింప బడిననాడు మిగిలిన వారిచే సహాయము చేయ బడవలయు నని యొక షరతుండెను. 1792 సం॥ లో యుద్ధానంతరము గవర్నరు జనరలీ షరతు నందలి భావమును విపులముగ బోధపడులాగున జేయ జూచెను. ఆ కోర్కెతో "పూచీ సంధి పత్రము" Treaty of guarantee ఒక దానిని తయారు జేసి పూనా, హైదరాబాదు దర్బారుల కంపెను. అందుతో నీ మిత్రుల కెవరి కైనను టిప్పూతో తగవు వచ్చిననాడు, యెందుల కట్టి స్థితి చేకూరెనో తక్కిన వారికి దెలియపరచ వలయు ననియు, వారట్టి తగవు న్యాయమని దోచిననాడు తప్ప తదితర సమయముల యుద్ధము జేయ నవసరము లేదనియు, ఒకవేళ యుద్ధము జేయుటే తప్పనినాడు సంధికి దగు యత్నము లన్నియు మొదట జేసి, సంధి పొసగకున్న యుద్ధము చేయుటకును, స్పష్టముగ దెలియజేయబడి యుండెను. నైజామునకీ యేర్పాటున మహారాష్ట్రీలకును దనకును మధ్య తగవు లేకుండ నుండు సూచనలు గన్పట్టెను. ఈ రీతిగ ముందుముందు వారి బాధల తప్పించుకొనుటకును, ప్రస్తుతపు

శాకీల నెగవేయుటకును జూచెను. అథమము హైదరు మహారాష్ట్రులతో నేర్పరచుకొనినట్లు, కొంత నిర్ణీతమగు కప్పమును చెల్లించుటకు నిశ్చయించుకొన జూచెను; గాని నైజాముపై దమకు గల హక్కులను ప్రతిఘటించు సంధికి మహారాష్ట్రులు మొగ్గకైరి. అప్పట్టున మహాదాజీ సింధియా పూనా దర్బారున పలుకుబడి గలిగియుండెను. ఆంగ్లేయు లీ సంధి మిషను దమ యాధిక్యతను నెలకొల్ప జూచుచున్నా రని యతడు జెప్పజొచ్చెను. ఆంగ్లేయులను మంచి చేసుకొని సింధియా నమపున నుంచ నెంచి నానా, వెంటనే వారి మాట కాదనక యడిగిన దానికి సమ్మతింప నిచ్ఛ లేకున్నను, వృథా ప్రసంగముల కాలము గడపివేసెను.

1793 సం॥ లో కారన్వాలీసు ప్రభు వీ దేశమునుండి బోవాని స్థాన మలంకరించిన సర్జాన్ షోరు పూచీ సంధి పత్రము విషయమున జోక్యము కలుగజేసుకొన మానెను. ఏలనన ఆంగ్ల వర్తక సంఘాధికారులు దేశీయ ప్రభుత్వములలోన వారి సేవకులను చేయిజేసుకొనరాదని స్పష్టముగ దెలియజేసిరి. వారి యాజ్ఞనుల్లంఘింప షోరుదొర యిచ్ఛగింప కుండెను.

మరల మహారాష్ట్రులు దమ హక్కులను గూర్చి తగవు జేసిరి. నైజాము వారు నిజముగ యుద్ధమునకే సిద్ధముగుదురని తలంపక యీ పూచీ సంధి పత్రి విషయమున చర్చ జరుగుచుండు కాలమున సేనల బలపరచుకొనుచుండెను. రేమండను ఫ్రెంచి సేనాని క్రింద టిప్పూకెదురుగ బనిచేసిన దన రెండు పద దళములను నేడు ఇరువదిమూడు పటాళములవరకు హెచ్చించెను. మహాదాజీ స్వర్గస్తుడగుట, నైజాము, సేన

మరింత బలపడుటయు, ఆ యవాంతర కారణమున మహారాష్ట్రులు సులభముగ సంతుష్టి నొందుదురనియు, ఆంగ్లేయ సహాయము లేకున్నను వా రెదిరించిన నాడు వారిని సులువుగ నెదుర్కొన గలననియు, దలంచెను. అందుచేత గోవిందరావు కాలే పీష్వాకు సమాధానమిమ్మని త్వొందరజేయ, స్పష్టముగ మహారాష్ట్రులు దనకే రెండుకోట్ల యిరువదిలక్షలు యీయవలయునని లెక్కల జూపెట్టెను. అందుపై నైజాము మంత్రి, ముషీరుల్ముల్కునకును గోవిందరావునకును తగవు హెచ్చెను. నైజాముమంత్రి నిండుదర్బారున తగవును పరిష్కరించుటకును లెక్కల సరిచూచుటకును నానాయే స్వయముగ రావలయునని జెప్పెను. "అనేక కార్యములున్న నానా యెట్లు రాగలడు?" అని యాతడనగ "ఎట్లు రాగలడా; వచ్చుమార్గము నేను జూపెదను" అని ముషీరుల్ముల్కు ప్రత్యుత్తరమిచ్చెను. ఈ తాటింపు వలయునంతపనిని జేసెను. రాయబార మొకమూల జరుగుచుండినను, యుద్ధమున కిరు కక్షలవారును ఆయత్తమైరి.

ఎప్పుడో జరుగగలదని దలచినన్నాళ్ళను మొగలులీ యుద్ధమున కువ్విళ్ళూరుచుండిరి. లక్షాపదివేల సైనికులుగల వారిసేన నైజామాలీ నిజాధిపత్యమున బీడరున సమావేశమై, శిబిర ప్రదేశము కలకలలాడ పరమోత్సాహకరముగ నుండెను. జయశ్రీ దమకు లభింపకదప్పదన్ని వారి యూహ. వారిప్రధానామాత్యుడు బహిరంగసభలో "మొగలులిక మహారాష్ట్రుల దాడులనుండి విముక్తులయ్యెదరు. బిజాపూరు, ఖాందేశములను తిరుగ సంపాదించెదరు. అని గంభీరముగ బల్కెను.

దోపిడికి వీలున్నదని దెలుప, మహారాష్ట్రు లెన్నడును

యుద్ధమున జంకువారని కాదు. నాటియుద్ధమునకు పీష్వా స్వయముగ నరుగదలచి సామంతపాలకులెల్లరను యుద్ధమునకాహ్వానముజేసెను. విధివశమున మహారాష్ట్రచరిత్రలో సామంతులెల్లరు జాతీయపతాకపు నీడను పోరాడుటకు నిదియే కడసారి దయ్యెను. సింధియా, హోల్కారు, గైక్వారు, బీరారుల నుండి వచ్చినసేనలును, దక్షిణాది జాగీర్దారు లంపిన దళములును గలసి మహారాష్ట్రసేన లక్షముప్పదివేల బలముండెను. ఫిరంగిదళము 150 యుండెను. నానా ఫడ్నవీసు పెద్దసైన్యముతోడ వచ్చెను.

బీడరునుండి మంజిరానదీ తీరమున బడి నైజామాలీ, సేనాసమేతముగ మహారాష్ట్రపరిసరములకు వచ్చెను. 1795 సం॥ జనవరిలోన పీష్వా పూనావీడి దనసేనలతోడ వానిని, మార్చి 10వ తేదీనాడు యెదుర్కొనెను. ముఖ్యోద్యోగుల నాలోచించి నానా, పరశురాం భావునకు సైన్యాధిపత్య మొసంగెను. మార్చి నెల 11వ తేదీనాడు యుద్ధముజరిగి, నైజామాలీ ఖుర్దావద్ద నంపూర్ణముగ నోడి 13వ తేదీనాడు సంధికై వేడెను.

మహారాష్ట్రులు 3 కోట్లరూపాయిల నగదును, 35 లక్షలు రాబడి రాగలదేశమును నీయవలసినదిగ నైజామును కోరిరి. ఒక కోటిని వెంటనే చెల్లించవలసినదనియు, నానాను తూలనాడినందుకుగాముషీరుల్ముల్కునునప్పచెప్పమనియుగోరిరి. విధిలేక నైజామీ విషపుషరతుల కొడంబడి 1795 సం॥ మార్చి 13వ తేదీని యొడంబడిక పత్రమున సంతకముజేసెను. వేరొండు సమాధానమూలమున $3\frac{1}{2}$ లక్షలురాబడిరాగల గంగోత్రిలోని ఘూస్థనాకు బదులుగ రఘోజీ భాంస్లేకు మూడులక్షల యెనుబదివేల్ల రాబడిగల దేశమునిచ్చుకొనెను. అదికాక వానికిబాకీ

పడియున్న యిరువదితొమ్మిదిలక్షలు నిచ్చివేయుటకును, బీరారులోని దనరాబడిని వసూలు చేయుటకును నొప్పుకొనెను. ఇంతకుగాను పీష్వా రఘోజీ తరఫున దాను పూచీబడెను. నైజామునకీ షరతులన్నిటిలో దన మంత్రి నప్పజెప్పుటే చాలకష్టముగ దోచెను. కాని యా రాజభక్తిపరాయణుడు దా మున్న స్థితిలోన దనకిచ్చిన షరతులంత కఠినముగ లేవనియు, మహారాష్ట్రులింతకన్న బిగియకమున్న దన నొప్పజెప్పమనియు జెప్పెను.

ముషీరుల్ముల్కు కోర్కె ననుసరించి యాతనిని నైజాము, మహారాష్ట్రులకు నొప్పగించెను. రెండు వందలమంది హైందవయోధులు వానిని మహారాష్ట్ర శిబిరమునకు గొంపోయిరి. శిబిరపువాకిటనె పీష్వావానిని గలసుకొనెను. కాని రక్షకభటుల నేమాత్రమును తగ్గింపక చెరనున్న శత్రునిగనే మర్యాదజేసెను. మహారాష్ట్రులీ విజయమున కమితానందభరితులైరి, గాని పీష్వామోమున విచారచిహ్నములు పొడజూపుచుండెను. నానా దానిని కారణమడుగ నాయువకుడు "ఇరుదళంబుల కింత నీచదశవచ్చెనే యని విచారించుచున్నాను. మొగలాయీ లింతటి నీచపు సంధి కొడంబడుటయు, దమప్రతాప మేమియులేక గల్గిన జయమునకు, మహారాష్ట్రు లింతగ మురియుటయుకూడ నాకు సంతాపకారణములుగనె గన్పట్టుచున్నవి" యనియనెను. యుద్ధమున నీ మహాసేనలలో పడసినవారు రెండువందలైనను లేరు. మొగలు లనేకులు మృతులైనను వారు యుద్ధానంతరము సంభవించిన భయోత్పాతమున సమసినవారే; గాని చాలకాలమువరకు మహారాష్ట్ర శిలేదారులు దాము ఖుర్దలామహాయుద్ధమున గెలిచియుంటిమని సగర్వముగ జెప్పుకొనుచుండిరి.

పూనాకు పీష్వాతోడ వచ్చి నానా, యుద్ధసంపాదనమును వివిధ నాయకులకును దగురీతిని పంచెను. పరసహాయము లేకుండ నెయీ యుద్ధమున నానా దనకోర్కెలనెల్ల నెరవేర్చుకొనగల్గెను. మహారాష్ట్రాధిక్యతను నెలకొల్పి, నాయకులకు వలయునంత దోపిడిధనమిచ్చి సంతృప్తి బరచెను. దౌలత్రావు సింధియావానియెడ యెంతయో గౌరవము జూపెట్టెను. బీరారుప్రభువును తదితర బ్రాహ్మణ నాయకులును నానాయెడ వినయ విధేయులై యుండిరి. ఫడ్నవీసు యద్వితీయాధికారమును మహారాష్ట్రమున యనుభవించెను. కాని యధికారకాంక్షయు, దాని నెవ్వరపహరింపకుండ జాగ్రత్తబెట్టుటకు గలకోర్కెయు, నానా యవసానకాలమును కళంకపూరితముజేసి కష్టముల పాలుగాజేసెను.

1995 సం॥ నకు పీష్వా 21 వత్సరముల ప్రాయుడై యుండెను. యువ్వనుడగు నీతని కేమాత్రమును నానా స్వేచ్ఛ నొసగలేదు. రాజకీయ ఖైదీలయెడ మునుపటికన్న యెక్కువ కాఠిన్యము వహించి వారిచర్యల గమనింపజొచ్చెను. శివనేరీ దుర్గమున బంధించియుంచిన సతారా ప్రభువును, మహాదాజీ దనజీవితకాలమున నుపయోగించి, బ్రాహ్మణ ప్రభుత్వమును గూలద్రోయనెంచియుండెను. అట్టి యపాయకరమగు రాజును నేడు నానా ముప్పుతిప్పుల బెట్టజొచ్చెను. వాని సౌకర్యముల తగ్గించెను. బంధువుల జూడ నివ్వకుండెను. రక్షకభటులను హెచ్చించెను. వేయేలవానికిచావైన మేలనిదోపించెను.

1793 వరకు కోపర్గ్రామున నివసించుచుండిన రఘోబాకుటుంబమును నాశికవద్దనున్న ఆనందవేలికిమార్చెను, ఇటులచేయుటలో

ఆనందీభాయి అశ్వస్థతగానున్నందున ఆపె నివసించుటకు తగిన స్థలమని నెపముగా జెప్ప జొచ్చెను. సం॥ 1794 లో నాపె ఏప్రిల్ మాసమున పరలోక గతురాలయ్యెను. రఘోబా కొమారులు బాజీరావు, చిమ్నాజీ అప్పాదత్తపుత్రుడు అమృతరావూ యచ్చటనే యుండిరి. నైజామాలితో యుద్ధము సిద్ధమైనప్పుడు వారిని శివనేరి దుర్గమునకంపిరి. యుద్ధానంతరము నానా వారినచ్చోటనేకట్టిబెట్టి, దనకునచ్చినరఘూపంతు ఘోరుపురే, బల్వంతరావు రఘునాధుల వారిపై కావలియుంచెను.

రఘోబా కొమారుల చెరనుంచ నవసరమున్నదని తలచువారునుగూడ, నానా వారియెడజూపెట్టుకార్పణ్యమును, క్రౌర్యమును, కాఠిన్యమునుజూచిదిట్టజొచ్చిరి. ఇట్టి ప్రజాభిప్రాయ ప్రదర్శనమునకు భయపడిన నానా వారిని మరింత జాగ్రత్తగ దనచేతులలోనుంచుకొనుటవసరమని దలంచెను. వారిలో బాజీరావు, మొదటినుండి నానా జడియుటకు కారణభూతుడయ్యెను. స్ఫురద్రూపియు,యౌవనుడునగు నీతడు నలువురదయ నాకర్షించగలిగియుండెను. శాంతభావమును,మెప్పువడయగలసంభాషణానైపుణ్యమును, దరిచేర గలిగినవారి నెల్ల వశపరచుకొను శక్తియు నాతనికి గలవు. వీనికి తోడతని బుద్ధి బలములుగూడ శ్లాఘాపాత్రములై యుండెను. 19వ యేటికే స్వారియందును ధనుర్గ్రహణ ప్రయోగముల, నిపుణుడై, గంగోత్రిలోనెల్ల యీటెపోటునకు సాటివాడు లేడనిపించుకొని యుండెను. బహుశాస్త్ర పారంగతుడును, వేద వేదాంగాది వేత్తయునగు, బాజీరావునకు నీడగుపండితుడు వేరొకడుమహారాష్ట్రమున లేడని ప్రజ లనుకొనుచుండిరి.

పీష్వా, తన పినతండ్రియగు బాజీరాయని గుణస్తోత్రముల
విని యీర్ష్యనొందుటకు మారుగ సంతసించి, వాని నెట్లయిన
చెరనుండి విడిపించి తెప్పించి, వాని స్నేహమును సంపాదింపజూ
చుచుండెను. రఘోబా దౌర్బల్యమునను ఆనందభాయి కార్య
మునకును బుట్టిన నీవిషవృక్షమును దూరముననే యుంచుట
మంచిదని నానా యెన్నియోసారులు పీష్వాను హెచ్చరిం
చెను. హెచ్చరించిన కొలది మాధవరాయని కోర్కెయు హె
చ్చెను; గాని మాధవరాయని నానా కనుమరగ నిచ్చిన
వాడుకాడు. బాజీరావుని చెర పోతు టీగకైన దూర శక్య
ముకాకుండెను. ఐననూ రఘోబా పుత్రుడు పీష్వాకు దన యం
గలదు భావమును దెలిసుకొని బల్వంతరావు రఘునాథుని
వశపరచుకొని, వానిద్వారా మాధవరావు నారాయణునకు
దనకు వానియెడ గల గౌరవమును ప్రేమను దెలియజేసెను.
తాను శివనేరిలో చెరనుంటిననియు, పీష్వా, మంత్రి య
ధీనమున నుండెననియు; కాలుకదల్పలేని స్థితి నుండుట నిద్ద
రికిని సమానమే యనియు, గాని బంధింపనేరికిని శక్యముగాని
ఘనములను అభిమానములను నొకరికై యొక రుపయోగింపవ
గుననియు, తమ పితరులు ప్రఖ్యాత యశస్కులనియు, దాము
సంతటి కార్యములొనర్చి పేరందెడి కాలము రాకబోదనియు
కబురంపెను. ఈ వార్తతోడ ప్రారంభమైన యుత్తర ప్రత్యు
త్తరము లమితములై, మహారాష్ట్ర సేన పూనాకువచ్చినదిమొ
దలు కొంతకాలమువరకు జరిగి నానా చెవినిబడెను. వినినంతనె
నానా మండిపడెను. వెంటనే బల్వంతరావు రఘునాథునికి
మోయలేనియినుపసంకెలలువైచి యొక కొండకోటలో ద్రో

యించెను. మాధవరావుని నిందించెను. బాజీరాయని కారా
వాసము నరకతుల్యముజేసెను. అప్పటికే దన్నసవసరముగ
నణచియుంచిన యదుపునకు గినియుచున్న మాధవరావునకు
బాజీరాయని వార్తలు రేపెట్టి, నేటి నానా చర్య నాతనికి
కోపమును, నిస్పృహయు, దుఃఖము నొక్కుమ్మడి జనింపజేసె
ను. అందుచే నతడు గదివీడి బయటికి రానొల్లకుండెను. దర్బా
రున నుచిత స్థానమత డలంకరింపకుండుటకు కారణము జ్వర
మని చెప్పబడెను. దసరా దినమున (అక్టోబరు 22వ తేదీ 1795)
అట్టహాసముగ నతనిని కొలువున బ్రవేశబెట్టిరి; నిజసైన్యముల
జూచుకొని, సాయంసమయమున సామంత పరిహారజనంబులకు
దర్శనమిచ్చెను. కాని లోని మనఃక్లేశ మనివార్యమయ్యెను.
ఆ వేదనను భరింపనేరక 1795 అక్టోబరు 25వ తేదీనాటి యుద
యమున నాయువకుడు రాజసౌధ శిఖరమునిండి క్రిందికి దుమికి
ఆత్మహత్య గావించుకొనెను. ఎముకలు విరిగి పడిన చోటనున్న
జలయంత్రకారణమున గాయపడిన దేహముతో, జొటజొట
కారు నెత్తురుతో తడయుచు ప్రాణములు పోకమున్న "బాజీ
రావునే పీష్వాచేయుడు" అని చెప్పెను. చిన్ననాటినుండి దా
నెంతయో ప్రేమించిన బాబూరావు ఫర్కేవక్షమున దలనిడి
యుసువులుడిగెను. వానితో గూడ మహారాష్ట్రభాను డస్త
మించెనని చెప్పనగును. విప్లవ పూరితము, రుధిర సమన్వితము
యవసానసామీప్యమునగు బాజీరాయనిపాలన సంధ్య చీకటుల
లముకొనునట్లేయుండును. అటుపై జాతీయప్రభ కంధకారమే
ప్రాప్తి. ఐనను మన కథానాయకుని జీవితావసానమిందుగూడ
గడచినది గాన దానినిగూడ మనమియ్యకొనకున్నను, యిందు

న దెలుపక దప్పినదుకాదు.

14 బాజీరావు పీష్వా

మాధవరావు స్వర్గస్థుడగుట నానా ఫర్నవీసుని రాజకీయ జీవితమున కెంతయో విషమసమస్యగ పరిణమించెను. అమాయకుడగు నారాకొమరుని మరణ మాముదుసలికెంతయో దుఃఖకారణమైనను, దాన గలుగనున్న మార్పులా బ్రాహ్మణుని కేమాత్రమును చింతింప వీలొసంగినవికావు. ప్రమాదము సంభవించినంతనె నానా మహారాష్ట్ర ప్రముఖులనెల్లర రావించి, మాధవరాయని మరణ శాసనమును మరుగుపరచి, బాజీరావును పీష్వాను జేయవలయుననుమాట జెప్పక, రఘోబా పేరెత్తిన ప్రజలకు గలుగు కోపమును సూచించి, కీర్తిశేషుడగు మాధవరాయని యుద్యోగులయెడ బాజీరావునకు వానితల్లి కలిగించిన శత్రుభావమును దెలియబరచి, మహారాష్ట్రమప్పటికి కలిగియున్న సౌష్టవమును ప్రతిభను నొక్కి చెప్పి, తాద్రొక్కిన ద్రోవనె రాజకీయవ్యవహారముల నడపిన నిరాటంకముగ దేశమెట్లు బాగుపడునో చెప్పెను. ఇందులకని, యుక్తవయసునకురాని మాధవరావు నారాయణుని భార్యయగు యశ్వదాబాయిని పుత్రుని పెంచుకొనజేసిన, వానితరఫున దా నిదివరకు నడపినరీతి రాచకీయ వ్యవహారముల నడపెదనని చెప్పెను. సింధియా ప్రధానామాత్యులలో నొకడగు బలోబా తాతియా యీతీర్మానము నామోదించకుండెను. కాని వానితోడిమంత్రి జూబా బక్షి, తూకాజీ హోల్కారుని బోలు వృద్ధసామంతులుండ బాలుడగు దమ యేలిక వ్యవహారములలో దాము స్వతంత్రిత

వహింపదగ'దని వాని నోరుకట్టెను. కొంతతర్కము జరిగినపైని కాలము గడపిన సామంతులెల్ల యొప్పుకొని లిఖితరూపమున నానా కోర్కె కామోదముదెలపి 1796 సం॥ జనవరిలో పూనానుండి బోయిరి.

ఆంగ్ల రాచకీయమువారి తరఫున పూనా దర్బారులో రాయబారిగానున్న మేలెట్ దొర, మంత్రిని నేరీతిగా మున్ముందు వ్యవహారముల నడుపనున్నారని 1795 సం॥ నవంబరులో నడిగియుండెను. అప్పట్టున, మాధవరాయని భార్యయే ప్రస్తుతము సర్వాధికారిణిగ పరిగణింపబడుననియు, మహారాష్ట్రప్రముఖులెల్ల యోచించి యెవ్వరు రాజ్యార్హులో నిర్ణయించినపైని యానిర్ణయము నెరుకబరచెదమనియు, నానా జెప్పియుండెను. ఇప్పుడు నాయకసభా తీర్మాన మాతనికి దెలుపబడెను. మేలెట్ అందు కభ్యంతరమేమియు జెప్పనేరకుండెను. ఎట్టి యాటంకమును లేక తీర్మానానుసారము పని సాగించుటకు దత్తతకు తగు బాలకుని నిర్ణయించుటయు, పెంచుకొనటయు మిగిలియుండెను. బాజీరావున కీయుదంతము దెలిసెను. అది సాగెనా దాను బడయనున్నపదవిని గోల్పోవుటేగాక జన్మాంతము చెరసాలనే యుండవలయునని గ్రహించెను. వెంటనే సింధియాతో నుత్తర ప్రత్యుత్తరముల జరుపజొచ్చెను. సింధియా దనవృద్ధమంత్రి జూబాబక్షీ మరణకాలమున జేసిన హితమున మనసు మార్చుకొనియుండెను. వాని రెండవమంత్రి బలోబా తాతియా సమ్మతిపైని, బాజీరావు, సింధియా ధనకు రాజ్యమును సంపాదించ సహాయ మొనర్చునెడల సాలుకు నాలుగువేలు రాబడిగల జాగీరుల నిచ్చెదనని వాగ్దత్తము చేసెను.

సింధియా వానికి సమ్మతించెను. లిఖితరూపమున పత్రము వ్రాయబడి సింధియాచేతికందెను. నానాఫర్నవీసునకీ సమాచారము దెలసెను. ఆతడదరి తాస్గాముననున్న పరశురాము భావూనకు కబురంపెను. భావు నూటయిరువదిమైళ్ల దూరముననున్న తాస్గామునుండి కొంత యాశ్వికదళమునుగొని రెండుదినములలో పూనాకరుదెంచెను. దీర్ఘాలోచనచేసి, సింధియా కెదురెత్తుగ దానే బాజీరావును విడిచిపెట్టి పీష్వాగా ప్రకటింప, నానా దలచెను. భావూ శివనేరీదుర్గమున కరిగి నానా యుద్దేశమును దెలిపెను. అమృతరావు తమ్ముని నందులకు సమ్మతింపవలదని చెప్పెను. భావూ మాటలను బాజీరావు నమ్మలేదు. తనయెడ నెట్టి మోసమును దలపెట్టలేదని భావు గోదావరీ పుణ్యజలంబులను ముట్టియు, గోవుత్రోక బట్టియు, ప్రమాణికముజేసిన దనుక విశ్వసింపలేదు. అప్పుడు కోటవీడి తమ్ముడగు చిమ్నాజీఅప్పాతోడ నిజరాజదాని కేగెను. భావూ యనుజ్ఞానుసారము అమృతరావు శివనేరీలో నిర్బంధముననే యుండెను.

పూనా ప్రవేశించినంతనె బాజీరావు నానాతో సఖ్యత గుదుర్చుకొనెను. ఆతనినె మంత్రిగ నుంచుటకు సమ్మతించెను. లిఖిత రూపమున యిర్వురు నిందు కొప్పుకొనిరి. బాజీరావు నానా కిచ్చిన పత్రమున "భగవత్సాక్షిగ నా హృదయాంతరమునుండి మీయెడ గల భావమును పెకలించి వైచితిని, ముందెన్నడేని మన వర్తనములు విశ్వాస పూరితములై యుండు ననియే దలచెదను. మనోవాక్కాయ కర్మల నేనెన్నడును మీకు గాని, మీవారికి గాని హాని చేయను. ఎవ్వరిచేత నట్టిపనిని చేయింపను. ఇందును గూర్చి నిశ్చితాభిప్రాయుడనై

యున్నాను; ఎవరేమిచెప్పినను చలింపను. మీ యశమునకు కళంకము రానీయను. ఎవరైన నట్టి యత్నము జేయునెడ మీ కప్పగింతును. మీరు చెప్పనిది యెవ్వరిని గాని చెరనుండి విడువను. ఇర్వురమును యేకీభవించని రాజకార్యమేదియు నొంటరిగ జేయను. నేటినుండి మీరుచేయు పనుల కెల్ల నేనే పూచీ పడెదను. అనుమానమునకు నా మనమున దావులేదు" అని యుండెను.

ఇది విని బలోబా తాతియా మండిపడి నానాను ప్రతిఘటింప నిశ్చయించుకొనెను. గోదావరీ తీరమున విడిసియున్న సింధియాను పూనాపై సేన లన్నిటిని దోడ్కొని దాడి వెడలబురికొల్పెను. నానా యెంతటి రాజనీతి పారంగతుడో యంతటి పిరికి స్వభాము గలవాడు గాన, బాజీరావునకు సింధియా తనపై పగ సాధింప వచ్చుచున్నాడే కాని వాని నేమియు చేయజాలడని చెప్పి, అంతఃకలహ నివారణార్థము దాను పనిమాని రాజనగరు వీడిన యెల్లయు చల్లపడు నని జెప్పెను. భావూ యట్టి పని చేయువల దని యెంత చెప్పినను వినకుండెను. వెంటనే బయలుదేరి పురంధరు కేగి యటనుండి సతారా కరిగెను. బలోబా కోర్కె నెరవేరుటం జేసి భైరో పంతు మెహండ్లే ద్వారా భావూనకు కబురంపెను. మాధవరాయని భార్య చిమ్నాజీ అప్పాను దత్తత చేసుకొనవలసిన దని కోరెను. బాజీరావును చెర నునిచి భావూను రాజ్యభారము వహించి అప్పా తరఫున పాలించ మనెను. నానా పిరికితనమునకు భావూ వాని యెడ నెంత యసహ్యించుకొనినను, వాని బుద్ధి బలమునందు గల గౌరవముచే వాని నీయెడ సలహానీయ వేడెను. నానా

యుండుటకు సమ్మతించి, బాజీరావును మాత్రము దన చేతులలో నుంచుకొనుమని జెప్పెను. భావూ బాజీరావు విషయమును దప్ప దక్కిన పట్ల నానా చెప్పినట్లే వర్తించెను. అనుభవ జ్ఞానములేని దౌలతరావునకు వ్యతిరేకముగ నానా యితర నాయకులను జేరదీసి సింధియా వంశమున కెట్టి యాపదను దెచ్చిపెట్టునో యని వెరచి, బలోబా చేయు కార్యములెల్ల నానా నానుభూతిని బడయగ లట్టివే జేయునట్లు నటించెను. కనుకనే వాని సమ్మతి బడసినంతనె బలోబా నానాతోడ సఖ్యత కెక్కించి సఫలు డయ్యెను.

నానా స్వయముగ జేసిన యత్నము లొకింత గమనించవలసియున్నవి. పురంధరునుండి యాతడు సతారా కరిగి నప్పుడు మహారాజును లేవదీసి మరల శ్రీ శివాజీ పెట్టిన విధానమును నెలకొల్ప దలచెను. అటుల జేసిన ప్రస్తుతము బొడజూపిన రాజకీయ కల్లోలము లడగు ననియు, లేకున్న నవి మితిమీరు ననియు నత డూహించెను. కొన్ని దినము లట గడపిన పైని నట్టి యత్నము నిష్ప్రయోజనకర మని గ్రహించెను. దా ననుభవించిన యనుభవమునుండి మహారాజునకు నానా యెడల విశ్వాసమే లేకుండెను. మహారాజు పేరెత్తిన యింక ననేక మహారాష్ట్ర యోధ కుటుంబములు వాని పతాక సేవ జేయవత్తురను నమ్మిక యుండెను. ఇప్పటికిని శ్రీ శివాజీ యోధు లగు మావళీలును, హెట్కారీలును వానికుటుంబమనిన యుత్సాహపూరితు లగుచుండిరి. నానా బలాధికు లగు మహారాష్ట్ర నాయకులను లొంగదీయుగల కేంద్రపాలనా స్థాపన జేయ నెంచెనే గాని, యున్న విధానమెల్ల దలక్రిందు జేయు శక్తిని లేవనెత్త

దలంచుకొనలేదు. కాననె మహారాజుతోడ కొంత ప్రసంగమొనరించిన బిదప నా ప్రశక్తి మానుకొని నానా సతారానుండి ప్రక్కనున్న వాయీ కరగెను. నానా చేసిన యత్నమున కెట్టి ఫలితమును గలుగక పోయినను, మహారాజునకు మాత్రము స్వేచ్ఛ యధికమాయెను రాజుయొక్క దయా సంపాదించి తాను మర్యాదగ కాలము గడుప వీలయ్యెను.

చిమ్నాజీ అప్పాను పీష్వా భార్య పెంచుకొనుటకు బలోబా తాతియా కోరగా నానా యందులకు సమ్మతించెను. మహారాజు ననుమతిని దుస్తుల నిమ్మని కోరవలసి యుండెను. అందుకై అప్పా తరఫున నానా వాయీనుండి సతారాకు వచ్చి మహారాజును దర్శించి. వలయునది బడసి, దనకు సమయాను జిక్కిన పీష్వా బాలాజీ బాజీరావు రామరాజుతోడ జేసిన ఒడంబడికను నెరవేర్తు నని జెప్పెను. అందుమూలమున శ్రీ సాహు మహారాజు సంగోలా సంధిని వాగ్దత్తము జేయబడిన రాజ్యమును బడియ నుండెను.

అనుజ్ఞాపత్రమును, దుస్తులను గొని నానా స్వయముగ పూనా కేగి యుండునే గాని, బాజీరాయని భావూకు నొప్పచెప్పని కారణమున బలోబా యేదియో కుట్రజేయ నున్నాడని యనుమానించెను. నిజము కూడ నంతియే. నానా యెట్లయిన నచ్చిన దన చేతుల బడునని బలోబా దలంచుచుండెను. అది కనుగొని నానా దుస్తులను పూనాకు బంపి దాను వాయీకి మరలిపోయెను.

బాజీరావునకు వీరు దనకు వ్యతిరేకముగ బన్నిన ప్రన్నాగ మప్పటికిని దెలియలేదు. అది వాని కెరించినరీతియెరింగిన

పూనా దర్బారు వ్యవహార రీతులు స్పష్టమగును. సింధియా దనకైన వ్యయముల పరిహారముగ బాజీరావును ధన మడిగెను. బాజీరావు కోరిన ధనము దనవద్ద లేదన, సింధియా మితిమీరి ప్రసంగించెను, దానిపైనైన తర్కమునకు గినిసి దౌలతా్రవు హిందూస్థానమున కేగుటకు పీష్వా యనుమతి గోరెను. వెంటనే బాజీరావు సింధియా విడిది కరిగి యట ప్రసంగవశమున సాయంసమయము దనుక నిలిపివేయబడెను. చిమ్నాజీ అప్పానుగొని భావూ పారిపోయెనను వార్త రానా ప్రసంగమాగెను. బాజీరావు పరశురాముని వెన్నాడ దలచి దానును సింధియాచే చెరపెట్టబడె నని గ్రహించెను. ఈలో భావూ, బాబూరావు ఫర్కేలు చిమ్నాజీ అప్పాను బలవంతముగపూనాకు గొనిపోయిరి. అట అప్పా, దాను భాతృద్రోహిని గానేరననియు, బాజీరాయునకు సహాయముచేయ వాగ్దానము చేసియున్నానియు నెంతచెప్పినను వినక వారుదత్తహోమము నెథావిధిగ జేయించిరి. అటుపైని చిమ్నాజీ మాధవరా వను నామముతో నతనికి 1796 సం॥ మే నెల 26వ తేదీని పీష్వా పట్టము గట్టిరి.

సింధియా కప్పట్టున ధనలేమి మిక్కుటముగ నుండెను. దానిని సంపాదించు మార్గ మేదియు గాన రాకుండెను. సర్వాధికారము హస్తగతమైన భావూ నాతడు చేర బారెను. చెరలోనున్న నైజాము మంత్రియగు ముషీరుల్ముల్కును నైజామీయవలసిన మూడు కోట్లలో నేమాత్రమైన దే గలిగినయెడ విడుదల జేయవలసినదని భావూను కోరెను. అతడందులకు సమ్మతించి ఖుర్దా యుద్ధానంతరమునుండి పదునాల్గుమాసములు చెరనున్నముషీరుల్ముల్కును పరిహారధనమును నొసంగవిడిచెను.

పూనాలోని ప్రతికక్షువారును నాడు ఫర్నవీసును దమచేతులలోనెట్లు చిక్కించుకొందుమాయని యోచించుచుండిరి. భావూ, ఫర్నవీసును పూనాకు వచ్చి బలోబాతో సఖ్యపడి, దనకు సైనికాధికారము మాత్రము విడచి మిగిలిన రాజకీయాధికారమెల్ల వహింపుమని గోరెను. ఈ యాదేశమును విని నానా, భావూను ముందు జరుగవలసిన యేర్పాటుల నన్నిటిని పరిష్కరింప నాని పెద్దకుమారుడగు హరిపంతుని వాయీనున్న తనవద్దకు బంపమనెను. రాయబారమునకు రమ్మనిన హరిపంతు 5000 నమ్మిన గుఱ్ఱపుదళముతోడ నీరానదిని దాటి వాయీకరుదెంచుచుండెను. అది వినినంతనె నానా యనుమానించెను. అనుమానమునకుదోడు బాబూరావు ఫడ్కే బంపిన గుప్తలేఖ ఫర్నవీసున కొకక్షణమైన వాయీనుండక సురక్షితస్థానమున తల దాచుకొనుమని చెప్పెను.

నానాయొక్కదశ తిరిగె ననియెల్లరును దలచుచుండిరి. అతడును దన స్థితినిగూర్చి సందేహించుచుండెను. వెంటనేయాతనిబుద్ధిబలమును, చతురతయు, పలుకుబడియు బయల్పడెను. నాతడుపయోగింప జతపరచిన యుపకరణముల గాంచిన దేశీయులెల్లరు నాశ్చర్యనిమగ్నులైరి. సమకాలికులగు పాశ్చాత్యులతనిని "మహారాష్ట్ర * మేకియవిల్లి" యని ప్రణుతింపజొచ్చిరి.

నానా దన యపాయమును గుర్తెరింగినంతనె వాయీనుండి కొంకణమునకు బారిపోయెను. త్రోవలోనున్న కొండబాటలన్నియు దుర్గమములుగా జేసెను. మాగ్ యను పల్లెజేరి

* ఇతడు ఇటాలియను దేశస్థుడు. ప్రిన్సు అను ప్రఖ్యాత గ్రంథమొకటి వ్రాసెను; అది కౌటిల్యుని నీతిశాస్త్రమును బోలియుండును.

చేరువనున్న రాయగడ దుర్గమును శత్రులకు భేదింపవలను పడని స్థితిలోనుంచెను. బలోబా తాతియా వానిని వెంటనే వెన్నాడుమనియు, వలసిన సింధియా శిక్షిత పటాలముల సహాయముగ నిచ్చెదననియు భావూనకు జెప్పెను. కాని నానా ఫర్నవీసు పక్షము వారి ప్రోద్బలమున పరశురామ భావూ వృద్ధ మంత్రిని శిక్షణ మార్గములకు లొంగదీయ నిచ్ఛగింపకుండెను. ఇంత మాత్రమున నానా యెడ వానికి శత్రుభావము లేదనుటకు వీలులేదు. నానా యొక్క జాగీరులను సింధియా కిచ్చివేసి యాతని స్వంత గృహములను యాస్తిని స్వాయముగ నాక్రమించుకొనెను. ఫడ్నవీసునకుగల యాస్తిలో లోకు లెరుంగునది సహస్రాంశమైయుండ వచ్చును. మిగిలినదెల్ల గుప్తముగ నాతడుంచి యుండెను. నానా పూనా వీడి పోవునపుడు తరతరములనుండి పీష్వాలార్జించి జాగ్రత్త జేసిన సువర్ణ రాసులను గొని పోయెనని వదంతులు ప్రబలి యుండెను; గాని మాధవరాయుని కాలము దనుక పీష్వాలు ఋణగ్రస్తులైయే యుండిరనియు, పైకమునకై పలుబాట్లు పడుచుండిరనియు, వారి యాదాయ పట్టికలను జూడ స్పష్టమగును. కాన, ఫడ్నవీసుని యపార సంపద, వాని పాలన కాలముననె యార్జింప బడి యుండుననుమాట నిశ్చయము. దేశమున గల వేర్వేరు చోట్ల వివిధ పాత్రల మూలమున నది దాచబడి యవసరమైనప్పు డనుకూలముగ నుపయోగపడురీతి నుంచబడెను. ఎట నెంత యుంచబడెనో, ఎవ రెంత జాగ్రత పరచిరో, యేరీతి నెవరి మూలమున నదెంత యుపయోగించెనో యిప్పటికిని నెవ్వరు జెప్పనేరక బోవుటయే గాక పలువుర కింకను శంకస్ఫూర్తి గాకుండ నున్నది.

శత్రుముఖమున విరోధులు సఖ్యులగుట సహజము. విపత్కారణ మిరువురకు నొకటే యగుట బాజీరావు నానాలు మిత్రులైరి. చిమ్నాజీ దత్తతానంతరము వారిరువురకును రహస్యముగ నుత్తర ప్రత్యుత్తరములు, మున్ముందు ప్రఖ్యాతుడుగా నున్న నొక వ్యక్తిద్వారా జరిగెను. బాలాజీ కుంజరుడను నీతడు బాజీరావు శివనేరి నుండి విడుదలైన నాటినుండి వాని కొలువున నుండెను. తన యధికారితోడ గలసి మాట్లాడు నవకాశము లేకుండినను కుంజరుడు మారు గ్రామములోనున్న ఫర్నవీసును గలసి బాజీరావుని స్నేహభావము నెరింగించి యిరువుర తరఫున బనిచేయుమని వేడెను. నానా యత్నమున కెట్టి ప్రోద్బలము నవసరమే లేకుండెను. వలయు నుపకరణముల నెల్ల నాతడు కార్య రంగమున బెట్టి నుపయోగించుచునే యుండెను. పీష్వా నిజబలంబుల కధికారియైన బాబూరావు ఫర్కే వలయు నెడ వాటిని నానా ప్రక్కకు మరల్ప యొప్పుకొని యుండెను. తూకాజీ హోల్కారుని సేనయు నధికారము కోరి సంతనె నానా కుపయోగ్యబడనుండెను. బలోబా తాతియా రాయిజీ పటేలుని ద్వారా శత్రుడైన సింధియాతోడ నుత్తర ప్రత్యుత్తరములు జరుపు చుండెను. బలోబాను చెరనునిచి, బాజీరావునకు పీష్వా పదవి నిచ్చి, దాను హిందూస్థానమున కరిగినచో సింధియాకు పరశురామ భావూ పట్వర్ధనుని జాగీరును, పదిలక్షలు రాబడిగల భూములతోడ అహమ్మదు నగరు దుర్గము నిత్తునని నానా యాశపెట్టెను. నానా యత్నములంతమాత్రము బాజీరావునకు కుంజరుని మూలమున దెలుప బడెను. ఈ విప్లవమున పైకి వచ్చిన యనామ

ధేయులలో కుంజరుని కన్న తక్కువవాడు లేడు. ఇట్టి వారిలో రాయిజీ పటేలుని సింధియా కడ కంపుటకు నానా జాగ్రత్త చేసిన శుఖారాము ఘాట్గే యనువాడు ప్రఖ్యాతుడు. ఈతడు షిర్జీరావను పురాతన కగుల్ వంశమునకు జెందినవాడు. తన కుటుంబమున నొక్కనిచే మోసపడి యీతడు భావూ, నానా సింధియాల క్రింద క్రమంబున నూర్గురు రౌతుల కధికారియై బనిచేసెను. వాని కొక చక్కని కుమార్తె యుండెను. ఆమెను చేపట్ట నెంచిన సింధియా ఘాట్గే చెప్పినట్లు వర్తించు చుండెను. అట్టి వాని సహాయమున ఫర్నవీసు సింధియాను దన ప్రక్కకు మరల్చుకొనగల్గెను. ఈ రహస్యము నెరిగి బాబూరావు మొదలగు వారలు యశ్రద్ధ వహింప జొచ్చిరి. సింధియా శిబిరముననున్న బాజీరావు దన పితృవ్యమిత్రుడగు సీతారామఫడ్కే సహాయమున ఫర్నవీసు నుండి పైకము దెప్పించుకొని నిజసహాయార్థము సేనల జత పరచుకొనుచుండెను. ఆతని కప్పట్టున పాతిక యేండ్లు మాత్రమే యుండెను.

ఫర్నవీసు పేరెత్తిన మండిపడు బలోబా కీయుదంతము దెలిసెను. వెంటనే యాతడు బాబూరావు ఫడ్కేను పట్టుకొని చెర నునిచెను. ఫడ్కే క్యాప్యాకును నారూపంతు చకర్దేవు పూనా పరిసరములలోనె దన శిబిరము సేర్పరచుకొని యున్న ముషీరుల్ముల్కు యండను తలదాచుకొన బోయెను. నీరానదికి దక్షిణమున నున్న కొండకోటలలోనికి నానా పక్షము వారెల్ల పారిపోయిరి. బాజీరావు జాగ్రత్త పరచిన సైన్యమును దోలివేయ నాజ్ఞాపింప బడెను. కాని యా సేన వాయిబా కేగి యట సాల్పి ఘాటువద్ద విడిసి యుండ, వలసిన దిగ నానాచే యాజ్ఞాపింపబడెను. సైన్య సంఖ్య 10000 వరకు హెచ్చింపబడి బాజీరావునే పీష్వాగా నెన్నుకొనెను.

బలోబా, నానాదనకై త్రివ్వినగోతి లోతు నెరుంగక, బాజీరావే యీకుట్రకెల్లకారకుడని, వానిని హిందూస్థానమున బంధికానలో నుంచుటకు నిశ్చయించుకొనెను. శుకారాము ఘాట్గేకు కొంత సేననిచ్చి వానిని బాజీరావును వశపరచుకొని రమ్మని పంపెను. ఆ యువకుడు ఘాట్గేను వశ పరచుకొని, వానిచే సింధియాకు కొమార్తె నిచ్చి పెండ్లి చేయుటకును, సింధియాచే దాను బంధ విముక్తుడై కిరీటమును బడయుటకును యొప్పించెను. సింహాసనము నెక్కిన తరువాత బాజీరావు దనకు, యల్లునకు వరదక్షిణగా నొసంగుటకుగాను రెండు కోట్లు నగదు నీయ, వాగ్దత్తము చేసిన నెట్టి యభ్యంతరమును జెప్పనని ఘాట్గే చెప్పెను. బాజీరావు పీష్వా యైననాడు శుకారాముకు సింధియా మంత్రిగా చేయుటకును వాని పితార్జితమగు కాగుల్ గ్రామము వాని కిప్పించుటకును నొప్పుకొనెను. అట్లొప్పుకొనిల పైని బాజీరావు దేహ మనారోగ్యముగ నున్నదని చెప్పి యున్నచోటినుండి కదల కుండెను.

ఫర్నవీసు యత్నములు ఫలోన్ముఖములయ్యెను. అతడు నైజాముతో మారు సంధి యని పేరొందిన యొడంబడిక నొకదానిని గావించుకొనెను. అది 1796సం॥ అక్టోబరు 8వ తేదీని జరిగెను. అందు మూలమున హైదరాబాదు వారు 15000 సైన్యమును ఫిరంగిదళమును బంపి బాజీరావును పీష్వాగను ఫర్నవీసును మంత్రిగను స్థాపింప నొప్పుకొనిరి. మహారాష్ట్రుల కాలాడిచ్చిన దేశమును లంగి యిచ్చివేయుటకును, యింక

నాతడీయవలసినయుద్ధ పరిహార ధనమును వదలి వేయుటకును యొప్పుకొనిరి. బాజీరావునే పీష్వాగా పరిగణింతుమని యాంగ్లేయు లొప్పుకొనిరి. పదిలక్షల రాబడిగల భావూ జాగిరు నిత్తు ననియు జెప్పి అహమ్మదు నగర దుర్గమును వాని కాధారమైన మండలమును నిత్తుననియు సింధియా నొప్పించి వానిచే 1796 సం॥ అక్టోబరు 27వ తేదీని బలోబాను చెరలో బెట్టి విప్లవారంభ మొనరించెను.

పరశురామ భావూ చిమ్నాజీ అప్పాను దీసుకొని తిరిగి జూడకుండ శివనేరి దుర్గమునకు పారి పోయెను, గాని వెన్నాడబడి లోంగదీయబడెను. ఆనందరావు రాష్ట్రియా వానిని జాగ్రత్తగ నుంచెదనని పూచీబడ వాని కొప్పగించ బడెను. బాజీరావు తీసుకొని రాబడి, పూనాకు పదునెనిమిది మైళ్ళలో భీమాతీరమునన్నున్న కోరిగాములో నుంచబడెను ఆనందరావు బాబూరావు ఫడ్కేలు బంధ విముక్తులు గావింప బడిరి. సాల్పీఘాటు వద్దనున్న దన సైన్యమును గలసుకొని బాయిడు క్రింద నున్న హైదరాబాదు సేన దనను కొలచిరా; ఫర్నవీసు పూనా రాజధానికి పయన మయ్యెను. త్రోవలో యింత యాలస్యమైనదను భావమును సూచించుచు బాజీరావు నుండి లేఖ రాగా, నానా యెదరి ముందంజ వేయక నాతడు దనకెట్టి కీడును దలంప లేదనియు, దాను తన మంత్రి పదవిని విడువ దలంచిననాడు, దనకును దనయాస్తికిని రక్షణగల్గు చోటునకు నెట్టి యాటంకమును గలిగింపనని లిఖితరూపముగ యివ్వమని బాజీరావును కోరెను. నైజామాల్ సింధియాలు కూడ బాజీరావు పీష్వాగను, ఫర్నవీసు మంత్రిగను నియమించి

నొప్పికొని పూచీ కత్తును వ్రాసి యిచ్చిరి గాని వారుకూడ నానానుండి యాతడొప్పుకొనిన షరతుల దప్పననివ్రాయించుకొని పుచ్చుకొనిరి. ఇట్టియొడంబడికను నానా నిజామునకు జెందవలసిన దానిలో దా నందవలసిన దెంతకలసి యున్నదో జూచుకొనక మోసపోయెను. ఇట్టి యెదురు సన్నాహములెల్ల పూర్తి గావించుకొని నానా పూనా తరలివెల్లి 1796 సం॥ నవంబరు 25వ తేదీని మరల తన పదవి నందుకొనెను.

సతారా నుండి వలయు పరికరములు గ్రహింపబడి బాజీరావు డిశంబరు 4వ తేదీని పీష్వాగా నభిషిక్తుడయ్యెను. ధర్మపరిషత్తీర్మానాను సారము మాధవరావు నారాయణుని భార్య పినమామ గారగు రఘోబా కొమారులబెంచుకొన రాదనియు, అట్టిది శాస్త్ర విరుద్ధము గాన పనికిరాదనియు ప్రకటింప బడెను. దత్త హోమముచేయించిన శాస్త్రవేత్తల నూరు వెడలించిరి. చిమ్నాజీ బలవంతముగ నాకర్మకు లోంగినను ప్రాయశ్చిత్తమునకు బొల్పడ వలసిన వాడయ్యెను. బాజీరావు మాత్రము కోపముంచుకొనక తమ్ముని గుజరాతునకు పాలకునిగ నియమించి, వానిని తన దర్బారుననే యుంచుకొని, ప్రతినిధిని నటకు బంపెను.

15 కారాగృహ వాసము

నూతనముగ యేర్పడిన మంత్రివర్గమున నానా ఫర్నవీసునకు త్ర్యింబకరావు పర్చురే సహకారిగ నుండెను. ఈ తగవులాటలలో యరాచక స్థితికి వచ్చిన సైన్యమునకు నారూపంతు చక్రదేవు యధిపతి యయ్యెను.

ప్రాగ్దాన మొనరించిన రీతి అహమ్మదు నగర దుర్గమును దత్త్వాప్రింత భూములును సింధియా కిచ్చి వేయబడెను. సమయము జూచుకొని పరశురామ భావూ యొక్క జాగీరును స్వాధీన పరచుకొన ననుజ్ఞ నీయబడెను. రఘోజీ భాంస్లే కిచ్చుట కొప్పుకొనిన దెల్లనీయబడుటచే నతడు నాగపురమునకు ప్రయాణమై పోయెను. మూరు సంధి ననుసరించి నైజామున కీయవలసిన దానికి మాత్రము బాజీరా వొప్పుకొన కుండెను. ఆ షరతుల లో నెన్నియో మార్పులను జేసినగాని యంగీకరింప వీలు లేద నెను. దానికి గినిసి ముషీరుల్ముల్కు పీష్వా నుండి సెలవు గైకొనకయె పూనా వదలి మిగుల నాగ్రహించి హైదరాబాదున కేగెను.

అట్లేర్పడిన భేదాభిప్రాయముల మార్ప బాజీరావే మాత్రమును శ్రద్ధ వహింప డయ్యెను. నానా జత పరచిన మండలి బలమిందు మూలమున సడలెను. ఈ లోపున తటస్థమైన తూకాజీ హోల్కారుని మరణమున (1797 ఆగష్టు 15వ తేదీ) యీ కూటమికి మరింత ముప్పు వాటిల్లెను. తూకాజీకి కాశీరావు మల్హరి రావను నిరువురు పుత్రులును, యుంపుడు కత్తెవలన యశ్వంతరావు విఠోజీ కాశీ రావను కుమారు లిరువురును నుండిరి. విఠోజీ దేహబుద్ధిబలంబులను లోటువడి యుండెను. మల్హారి రావు యింటి పేరును నిలుప గలిగిన ధీశాలి. పితృమరణానంతరము హోల్కారుని కొమారులు తగవు లాడజొచ్చిరి. నానాయొక్క దన్ను జూచి మల్హారి, యశ్వంతవిఠోజీల సహాయముతోడ కాశీరావుతో గలహించెను. కాశీరావు నిరాధారుడగుట, సింధియా ననడుగుకొని, వాని సహాయమున

సైన్యమును గొని మల్హారిని యుద్ధమున జయించి చంపెను. అతని కుమారుడగు ఖండేరావును పట్టుకొని చెరనునిచెను. అట్టి సహాయమును బడయుటంజేసి హోల్కారు వంశము సింధియాకులోబడి యుండవలసివచ్చెను. దానివలన నానా కొక చేయి విరిగినట్లయ్యెను.

సింధియా పూనా వ్యవహారములలో చేయిజేసుకొనుట, యెన్నడు కనివిని యెరుంగని దురంతములకు కారణమయ్యెను. బాజీరావు కూడ దూరమాలోచింపక సింధియాను ప్రోత్సాహ పరచెను. కొలాబా దుర్గ మాక్రమింప బడెను. మన్నాజీ ఆంగ్రియా చెరపెట్ట బడెను. సింధియా సమీప బంధువగు బాబూరావు ఆంగ్రియా కాదుర్గ మీయబడెను.

ఈ దురంతములు ప్రజలు సహింప నేరనివైనను బాజీరావును మాత్ర మెవ్వరును నిందించలేదు. అతని రూపవిలాసములును, పడిన కష్టములును చూపర హృదయమును కరిగించి, వాని మంచి తనమును జూచి, యిచ్చవచ్చినరీతి నాతని నాడించు వారల యెడ గినుక వహింపజేసెను. ఆంగ్ల రాయబారియగు మేలెట్ దొర మాత్రము పీష్వా మంచి తనము, చతురత, వానికి గల కపట నటనా నిపుణత, టక్కరి తనముల వలన గలిగిన ఫలితములుగ పోల్చెను. ఎవ్వరిని నమ్మక యెల్లర మోసబుచ్చుటే పనిగ నాతడు కాలము గడపెను. తదనుకూలముగనే, యట్టి విశ్వాస హీనులరీతినే, యెన్నడును తా దలచిన దానిని నెరవేర్చుకొన లేకుండెను. పీష్వా సింధియా నానాలను యదుపుకొన జూచుచుండెను. సింధియా నెటులైన హిందూస్థానమున కనుప గలనను ధైర్య మాతని కుండెను

గాని, నానాను మీరుట తన తరము కాదను కొనెను. అందుకు మొదట నానా నెటుల నాశన మొనరింప గలనని యోచింప జొచ్చెను. ఈ యత్నమున పీష్వా దనకు సహాయులుగ అమృతరావు గోవిందరావు కళ్లే మొదలగు కొందరను గూర్చి వారికి దన యుద్దేశమును జెప్పెను. ఘాట్గే యీ కుట్రలో జేరిన వారిలోన ముఖ్యుడు. ఈతడు దన వంశ బిరుదమగు షిర్జిరావుపదవినంది తనకుమార్తెను దౌలతార్వున కిత్తునని మాట యిచ్చెనే గాని పెండ్లి చేయలేదు. నానా కేమాత్రమైన యధికార మున్నంతకాల మాతనికి సింధియా యొక్క మంత్రిపదవి దొరకుట దుర్లభమని పీష్వా చెప్పుచుండెను. ఐనను సింధియావద్ద ఘాట్గే కపరిమితమగు పలుకుబడి యుండెను. కాని నానా స్వేచ్ఛావర్తన ముడుగ నున్నంతకాల మెవ్వరి యాటలును సాగవని యాతని చెర నుచుటే యవసరమనియెల్లరు నిశ్చయించుకొనిరి. కాన 1797సం॥ డిశంబరు 31వ తేదీ నాడతనిని ఖైదీగా బట్టుకొనిరి.

అంతకు కొలది దినముల క్రిందటనె సింధియా నానాను జూడవచ్చి యుండెను. అందుకు ప్రతిగ నానా వాని శిబిరమున కరుగవలసి వచ్చెను. అతడును వలయునంత శ్రద్ధ వహించియే జాగ్రత్త పడినపై నట్టి కార్యమునకు బూనుకొనెను. కాని మైకేల్ ఫయలోజ్ అను విదేశీయు డొకడు విశ్వాస ఘాతకుడై దేశీయు లెవ్వరును స్వయముగ జేయ వెరచిన నీ పనికి నెట్టుకొని నానాను బంధించెను. ఇతడు మహాదాజీ సింధియా కొలువులోనుండి 1792సం॥లో దక్షిణమునకు వానితోనరుదెంచెను. ఇప్పట్టుకు దౌలతార్వు సేనలోని యెనిమిదిపటాళముల కధి

నేతగ నుండెను. నాడు దేశీయ సంస్థానములలో కొలువునకు జేరిన విదేశీయు లెంతటి ధీరులని పేరొందియుండిరో అంతగ మాట తప్పరనికూడ ప్రఖ్యాతి గడించి యుండిరి. నానా యట్టి విశ్వాసముననె ఫయిలోజు సురక్షితముగ దన నింటికి దెచ్చి విడతునని భాస జేయ, నమ్మి సింధియా శిబిరమున కరిగి యట నా పరదేశి ద్రోహమున పట్టు బడెను. అట్టి కళంక చర్యను వినిన పాశ్చాత్యులెల్లరు, నాడు మండిపడి, వాని నెంతయు నిందించిరట. కాని నాటి మహారాష్ట్రులు మాత్రము అతడు నిర్దోషియనియు, సింధియా మనమునన్న తలంపు నెరుగడనియు, ద్రోహచింతతోడ నట్టి బాస జేసి యుండడనియు, షిర్జీరా వటాత్తుగ నంపిన యనుజ్ఞలకు వెరచియో, లొంగియో యట్టిపని చేసెననియు, ఆంగ్లచరిత్రకారులు వ్రాసియున్నారు. (వ్రాతలను తర్కింపముగాని మహారాష్ట్రులు నానా నంతగ మరచిరనియు, వానిని మోసమున చెరబట్టిన విదేశీయు నంతగ నిర్దోషియని భావించిరనియు జెప్పనమ్మజాలకున్నాము.)

అబ్బా షిరూల్కర్, రఘోబాషిరూల్కర్, నరూపంతు విద్య మొదలుగాగల ప్రఖ్యాత మహారాష్ట్ర ప్రముఖులు నానాతోడ నేగి వాని తోడనె పట్టు కొనబడిరి. సుమారు వేయివరకు నున్న పరివార జనమును దోచుకొని, కొట్టియు చంపియు చెదరగొట్టిరి. వెంటనే సైన్యమంపబడి షిర్జీరావు ఘాట్గే నానా యొక్కయు వాని మిత్రులయొక్కయు గృహములను దోచుకొన ననుజ్ఞాతుడయ్యెను. అనేకు లింటితలుపుల కరదండములపైచి లోనుండి గవాక్షములద్వారా, పైభాగములనుం

డియు శతృవులు రాకుండ రక్షించుకొనిరి. ముట్టడిని నున్న పట్టణమువలె పూనా కనుపించుచుండెను. ఆరాత్రియంతయు మరునాటి యుదయమునను గూడ తుపాకీ ధ్వని పట్టణమెల్ల డలమారు మోగుచుండెను. పురవీధులు నిర్మానుష్యము లయ్యెను. ఎటజూచిన దోపిడియు, కోలాహలమును నిండియుండెను. నాదర్ షా దాడిని పరదేశజుల ప్రసాదమున ఢిల్లీ పడిన పాట్లు నేడు పీష్వాకాంక్షను దేశీయులచే పూనా ప్రసాదింపబడెను. ధర్మ సంస్థాపనార్థము నెలకొల్పబడిన రాష్ట్రమున రాజధానియె పాలకుని కాంక్షను పాడు గావింపబడెను. కాలమహిమ యన నిట్టిదే గదా!

సింధియా శిబిరమున నానా శృంఖలాబద్ధుడగు సమయము ననె మంత్రిణమునకని పీష్వా,నానా సహకారుల రావించి బంధించెను. అట్టి వీరిలో ముఖ్యులు బాబూరావు ఫడ్కే, అప్పా బల్వంతు, నారూపంతు చెక్రిదేవు, నారూ నీలకంఠమజుమ్దారు గోవిందరావు పింగళే. నానా యెవ్వరికిని కాన్పించకుండునట్లు జాగ్రత్తగ అహమ్మదు నగర దుర్గమునకు దీసుకొని పోబడెను. వాని స్థానమున పీష్వా తనయన్నయగు నమృతరావును మంత్రిగా జేసెను. గోవిందరావు కళ్లే, శివరామ్నారాయణులు వానికి సహాయులుగ నియమింపబడిరి. ఏమాత్రమైన యనుభవములేనిబల్లాజీపంతుపట్వర్ధనుడుసైన్యాధిపత్యమును వడసెను.

నానా నట్లు సాధించివైచితి ననుకొని పీష్వా బాజీరావు సింధియా నింక నేరీతిని విదలించుకొందునని యోచించెను. కాని సింధియా, ఘాట్గేలకు చేసిన వాగ్దానము నెరవేర్చు టతనికి ముఖ్యావసరమయ్యెను. కాని వానిని నెరవేర్చుటలో దాను

దలచిన కార్యమును కొనసాగింపదగు యదను లభించుననిదలంచెను. సింధియా మార్చి మాసమున ఘాట్గే కొమార్తెను బెండ్లియాడెను. పెండ్లికి కర్చుమితమయ్యెను. పూనాలోనున్న సింధియా సేనలకు మాసమునకగు వ్యయము యిరువదిలక్షుల కధికముగనుండెను. ధనలేమిని చాల యిక్కట్లువడి సింధియా పీష్వానుదనకియవలసిన రెండుకోట్లను వెంటనే యిమ్మనుమని తొందర బెట్టెను. బాజీరావు తన బొక్కసమున ధనము లేదని చెప్పి ఘాట్గేను మంత్రిగా చేసుకొని ధనికులగు పూనాపౌరులనుండి యీ మొత్తమును గ్రహింపుమని సింధియాకు సలహానిచ్చెను. సింధియా పీష్వా చెప్పినట్లే జేసెను. నరరూప రాక్షసియగు ఘాట్గే శలవందినంతనె పూనా పైబడి చేసిన దురంతములా పట్టణమున నొకరాయియైన మిగిలినంతకాలము మరువశక్యముకానివి. తొలుదొల్త నాహంతకుడు బాజీరావుని నగరుజొచ్చి యట బంధితులైయున్న నానా సహకారులను బట్టి పలుబాములంబెట్టి వారి ధనముల నర్పింపజేసెను. వర్తకులును, వ్యాపారులను తదితర ధనాఢ్యులును అటుపైని పీడిపింపబడి తమ కష్టార్జితముల నర్పించిరి. అనేకు లీపీడనకు దాళలేక యకాల మృత్యువువాతను బడిరి. నానాబంధువగు గంగాధరపంతు భావూయను నతడు, కాలి యెరిపడియున్న ఫిరంగికి కట్టబడి మ్రగ్గెను.

ఇట్టిదోపిడులకును, ఘోరములకును పూనా యనేక దినముల వరకాహుతి యయ్యెను. లోని సమాధానము నెరుగని అమృతరావు, తన సోదరుడు పైకమున కిట్టి యత్నముల జేయించు టెరుంగక, సింధియా దుర్మార్గ కారణమున ఘాట్గే

యిట్టి ఘోరముల జేయుచు న్నాడనుకొని, బాజీరావును కలసి సింధియా నేల చంపివేయరాదని యడిగెను. అడిగినంతనె పీష్వా దానందుకు సమ్మతించె ననెను. సింధియా శిబిరములో నిప్పట్టున కష్టలేర్పడియుండెను. ఆ తగవులాటను వృద్ధిచేసిన తనమంత్రులకు సింధియాసేన సహాయమై దన పక్షమౌననియు, లేనియెడ దమనేలినవారైన పదవీచ్యుతిని చేయ సమ్మతించుననియు దలంచెను. అట్టి స్థితిలో సింధియా జనకంటకుడై యుండ పీష్వాయెదకను అమృతరావు, పీష్వా స్వంత సిబ్బందిలో నొక పటాలాధికారియగు, ఆబాకల్లే యను వానిని తాను స్వాజ్ఞ చేసి నంతనె వచ్చిపడి సింధియానంత మొందింప, సిద్ధపరచెను.

దౌలత్రావు సింధియా కార్య కారణమున పీష్వానగరున కాహ్వానింపబడెను. అతడందుకు సమ్మతింపమి వెంటనే యున్నపాటున రావలసినదని యాజ్ఞాపింపబడెను. సింధియా ఆయాజ్ఞనుల్లంఘింపక వచ్చెను. వచ్చి కూర్చుండిన యంతనె బాజీరావు నాతని వాని పరివారమును పొగరెక్కి యున్నారనియు, క్రూరకర్ములనియు దూషించి దానింక వారి యధికార ధిక్కారమును సహింపనేరవని చెప్పి, తడవుచేయక రాజధానిని వీడి వారిని పొమ్మనెను. సింధియాయలుగక నతివినయముగ పీష్వా వారి యాజ్ఞకు బద్ధుడనని జెప్పి, విడిది కదల్పనైకము లేకుండుటం జేసి పీష్వాను సింహాసనాసీనుని జేయుటలో దనకైనయమిత వ్యయధనమును మాత్రమిప్పించవేడెను. ఆసమయమున అమృతరావు పీష్వాను దా మదివరకు నిశ్చయించుకొనిన కార్యమున కనుజ్ఞనీయవేడెను. కాని బాజీరావు గుండె జారెను. సింధియా నిశ్చింతగ కోటవీడెను. ధృఢసంకల్పత లేమిన్ని నాడు బాజీరావు

పెట్టి మొదట వెలిబుచ్చెను. ఆమొదలుగ జీవనాంతము దనుక నీలోపమే వీని నల్వురిలో నవ్వుల బాలుజేసెను.

ఇక బాజీరావు, శత్రువులని చెరనుంచిన నారూపంతు చక్రిదేవు, పరశురామభావు నానాలను విడుచుటకు గలిగినపరిస్థితులనొకింత గమనింతము. పీష్వా, సైన్యమున కెంతయో ధనము బాకీ పడియుండెను. ఆసేనను సతారాకరిగి దుర్గమును పట్టుకొన దలచి, పీష్వా, యాజ్ఞాపింప నది వాని నుల్లంఘించుటేగాక తిరుగడెను. సైన్యమున గలిగిన దిరుగుబాటు నణచదగిన వాడొక్క చక్రిదేవని దలంచివానిని విడిచిపెట్టి పీష్వా యాయల్లరి నాపగలిగెను. అట్లు సందడి సర్దుకొని కో[illegible] సతారాకరిగినను, సేనాధ్యక్షుల చేత గాకుండుటను, కోట పట్టుబడ కుండెను. భావూ సమయము జూచుకొని, యనుజ్ఞ వడసి విముక్తుడై సైన్యమును జాగ్రత్త పరచుకొని ఆదుర్గమును జయించెను. తలచిన కార్యమును నెరవేర్చిన పైని పీష్వా, పరశురాముని వాని సేనను బంపివేయుమని కోరెను; అతడు దా వారికీయవలసిన ధన మీయకుండ నింటికి బంపివేయనేర ననియు, సర్వకాలముల పీష్వా యనుజ్ఞలకు బద్ధుడనై యుందు ననియు జెప్పెను. భావూ పదిలక్షల రూపాయి లిచ్చిన క్షమించుటకు బాజీరా వొప్పుకొనెను. పూనాలోని పరిస్థితులీ లోపున విషమించెను. సింధియాయవస్థ కంటకావృత మయ్యెను. ఎన్నడు నాతడు దలంపలేని స్థానమునుండి యీ సంకట మావిర్భవించెను.

మహాదాజీ సింధియా కాలధర్మమునొందు నాటికి వానికి ముగ్గురు భార్యలుండిరి. అందు భగీరథీ భాయి యను నావె

యశోవనవతియు చక్కనిదియు నై యుండెను. దౌలతారావు పె
ద తాతకు వారసుడుగ పరిగణింపబడి వాని స్థాన మాక్రి
మించు నాడు మహాదాజీ భార్యల కెట్టి లోటును గలుగకుండ
చేతు నని యొప్పుకొనియుండెను. అందుచే వా రాతని విడిది
లోననె నివసించుచుండిరి. దౌలతారావు వే రెట్టి యేర్పాటును
వారికై జేయక వారి సామాన్య సదుపాయములను కొంతకా
లమునకు కొరత పరచెను. వా రెప్పుడును తమకు కలిగిన లో
టు పాటులను గూర్చి మొరబెట్టినట్లు కన్నబడదు గాని; సింధి
యా భగీరథీ భాయితోడ బోవుచున్నటుల గనిపెట్టి, తక్కిన
యిర్వురును, దామట్టి మాతృద్రోహిని కుమరునిగ భావింప నేర
మని రట్టుజేసిరి. వా రూరక మోపిన నిందయో, సత్యమో
గాని షీర్జీరావు ఘాట్గే జోక్యము కలుగజేసుకొని వారిని చూ
డ గోరెను. వా రాతని చూడ నిచ్చగింపనందున యా దుండగీ
డు వారి గుడారములోనికి జొరబడి వారిని పట్టి కొట్టించి చెప్ప
రాని యవమానముల బా లొనరించెను.

ఎట్టకేల కా వితంతువులు బర్హాన్పురమున నివసించుట
కును, వారికి దగు పరిచారక బృందమును గావలసిన ద్రవ్యమి
చ్చుటకును యేర్పాటు గావింపబడెను. ఆ రీతిగ వారు పూనా
వీడిరి, కాని వారిని బర్హాన్పురమునకు గొని బోవలసిన భటు ల
హమ్మదు నగరమున వారిని చెరనుంచుట కాజ్ఞాపింపబడిరి. వా
రితో నేగుచున్న వారి పరివారమున కీ మోసము దెలిసెను.
భీమానదీ తీరముననున్న కొరిగాము మకాము చేరినంతనె, అ
టనున్న షెన్వీ బ్రాహ్మణుల కొలువులో నున్న ముజఫర
ఖాను ఢను పఠానుడు వారి నెదిరించి యా వితంతువుల గొ

చని భీమా తీరమునకె విడిసియున్న అమృతరావుని శిబిరమున
జేర్చెను. జూనేరి కేగుచున్న అమృతరావు వారిసంగతి విని
నంతనె శరణ మొసంగెను. ఘాట్గే, దనను వెన్నాడిన పఠానుల
నెదిరించి, యోడించి అమృతరావు శిబిరమును జేరెను.

బాజీరావే యీ తిరుగుబాటునకు కారకు డని యందు
రు. ఆ స్త్రీల పరివారమును పట్టును పడకుండ నుంచినది పీష్వా
యని మాత్రము స్పష్టముగ జెప్పవచ్చును. బాజీరావు మాత్ర
ము తన సోదరు డొనరించిన పని ప్రకృతి సామాన్యమనియు,
ధర్మ సమన్వితమనియు జెప్పుచుండెను. కాని సింధియా ఘా
ట్గేలు మిన్నకుండ రని వెరచి తన దర్బారున నున్న ఆంగ్ల రా
యబారి కర్నలు పామరును, సింధియాను శాంతిపరుప మని కో
రెను. అందుల కా పాశ్చాత్యు డొప్పుకొనకుండెను. ఘాట్గే రెం
డు పటాళముల గొని యమృతరావు నెదిరించి యోడెను. ఆ
రీతిగ సింధియా పీష్వాలకు బహిరంగ మగు యుద్ధము సిద్ధమ
య్యె నని యెల్లరు దలంపజొచ్చిరి.

అంతట కాశీరావు హోల్కారు అమృతరావును వచ్చి
కలసుకొనెను. మింకారీలు వాని యాశ్రయముననే జేరి వాని
జెండా నీడనే యుద్ధముజేయ నుండిరి. శత్రు సాధనకొరకు నై
జామాలీతో పీష్వా సంధి జరిపెను. ఇందుమూలమున మా
సంధి నిబంధనలకు పీష్వా బద్ధుడగుటకును, బీడరు చౌతును వ
దలివేయుటకును, సింధియాను సాధింప సాయ మొనర్చినందు
కును, యెనిమిదిలక్షల రాబడి గల దేశమును శాశ్వతముగ నై
జామాలీ యనుభవింప నిచ్చివేయుటకును నొప్పుకొనబడెను.
పాశ్చాత్యు డైన మంత్రి నానా ముందెన్నడైన యధికార

ము నాశించునెడ వానిని వారింప పీష్వాకు సాయ మొనర్చెద నని నైజాము వాగ్దాన మొనరించెను. ఒకవేళ సింధియా వానిని విడిపించుచో బాజీరావు వానికొక లక్ష వార్షిక మిచ్చుట కొప్పుకొనెను. రఘోజీ భోంస్లే యీ యేర్పాటులకు సమ్మతించిన దానును నొక వంతుదారునిగ భావింవబడి బాజీరావునుండి గుర్రా మండలమును బడయ నగు నని దెలియజేయబడెను.

ఈ సన్నాహముల గాంచి సింధియా భీతిగొని, యిదివర కాంగ్ల ప్రభుత్వమువారు మధ్యవర్తులుగ నుండి జేసెద మను నుపకార మప్పట్టున తృణీకరించినను, యిప్పుడు కోరెను. కర్నలు పామరు వానిని దన మంత్రుల కొల్వునుండి పంపివేయ వలసిన దనియు, మహాదాజీ భార్యలు శాశ్వతముగ ననుభవించుటకు జాగీ రొకటి యీయవలసిన దనియు, పీష్వా యధికారమునకు లొంగి వానిని సంతుష్టిపరుపవలె ననియు కోరెను. ఆ హితబోధ ననుసరింప సింధియా దలంచెను; గాని మహాదాజీ భార్యలు కోరిన కోర్కెలకు మితిలేకుండెను. హిందూస్థానమునకు బోవ నెంతయో యిచ్ఛగించినను సైన్యమున కపరిమితముగ తా బాకీపడి యుండెను.

చేయునది లేక బాజీరావును భయపెట్టుటకును, నైజాము పీష్వాల సఖ్యత కెదురెత్తుగను, సింధియా టిప్పువకడకు రాయబారుల నంపెను. కాని గోవిందరావు కళ్లే సలహా గొని పీష్వాకూడ మైసూరునకు రాయబారుల నంపెను. అంతకన్న బాగుగ బాజీరావును జడిపింప జూచి, సింధియా నానాను విడువ నెంచెను. అందుమూలమున దనకునూపిరి దిరుగ వీలొసంగని సైన్య వ్యవహారమును జక్కబెట్టుకొన, వలయు ధనము

కూడ లభించు నని యాసపడెను. వెంటనె నానాను అహమ్మదు నగరమునుండి దెప్పించి, విముక్త్యుపహారముగ రెండుకోట్ల నిమ్మనెను. నానా కొంత విళంబముజేసి, ఆంగ్ల ప్రభుత్వమువారి సహాయము లభించు నేమో యని జూచి విఫల మనోరథుడై తనను మొదట విడచిన పదిలక్షల నిత్తు ననియు, లేకున్న చెరనుండి దా నెట్టికేబు రంపినను దనవారు పైక మీయ రనియు జెప్పెను. కోరినరీతి నానా విడిచిపెట్టబడి, వెంటనే యొత్తునసిన ధన మిచ్చివేసెను.

ఫర్నవీసు మరల స్వేచ్ఛగ నలువురిలో దిరుగుచున్నా డని వినినంతనె పీష్వా, నైజాముతో దా జేసుకొనిన సంధిని రద్దుపరచుకొనెను. సింధియా తోడను, నానా తోడను సఖ్యత కుదుర్చుకొన నెత్నములు జేయ జొచ్చెను. అప్పుడే సింధియా దన మంత్రియగు ఘాట్గే క్రూరకర్మలకును పీడనలకును విసిగి వానిని పట్టి చెర నుంపించెను. తాను మాత్రము పూనా విడి బోలేదు.

16 చరమ దశ

ఆంగ్ల వర్తక సంఘాధికారుల రాజనీతి విధానము ననుసరించి వారి ప్రతినిధులు దేశీయ వ్యవహారములలో జోక్యము కలుగజేసుకొన కుండి రని దెల్పితిమి. దీని ఫలితముగ గలిగిన మార్పులను మనము జూడగలిగితిమి. టిప్పు సుల్తానుతో గలిగిన యుద్ధము వలన వర్తక సంఘపు లాభము కురుచవడి యుండెను. కాని మహా బుద్ధిమంతుడును, ఆంగ్ల సామ్రాజ్య స్థాపనాచార్యులలో నొక్కడును ననదగు మార్నిగ్టను ప్రభువు

భారతదేశమునకు పంపబడిన తరువాత నాంగ్ల నీతి విధానమున గొప్ప మార్పు గలిగెను. వర్తకులకు లాభమున లోటురాకున్న దేశాక్రమణమున కెట్టి యభ్యంతర ముండ నేరదని యతడు గ్రహించెను. అట్టి యాక్రమణమున కవసరమగు ద్రవ్యమును సైన్యాది పరికరములను, దమ నడుగకున్న వారేమియు, నసరని యత డెరుగును. అట్టి యాక్రమణముననే దాము ప్రఖ్యాతులై దేశమున గల వర్తకమునే గాక, తదితర లాభములను గూడ గ్రహింపగల స్థితి నుండగలమని గుర్తించెను. అప్పటి దేశ స్థితిగూడ వాని కనుకూలముగ నుండెను. దానినాధారము జేసుకొని మార్నిగ్టను దన యత్నములు ఫలింపని నాడు గదా యెవరేమైన నందురని దలచి స్వీయ నిర్మాణమగు విధాన మొండు భారత పాలనమున బ్రవేశ బెట్టెను. ఇందుమూలమున దేశీయ ప్రభుత్వము లాంగ్లేయులతో ప్రత్యేకముగ నొక్క యొడంబడిక జేసుకొన వలసియుండెను. ఆ యొడంబడిక ననుసరించి దేశీయ ప్రభుత్వము లొండొంటితో నెట్టి సంబంధము నాంగ్లేయుల యనుమతి లేకుండ గుదుర్చుకొనరాదు. ఆంగ్లేయులకు విరోధులగు పాశ్చాత్యుల నెవరిని గాని దమ కొలువున నుంచరాదు; తమ కవసరమగు పట్ల సహాయము చేయుటకుగా నాంగ్లేయు లిచ్చెడి సేనను ఖర్చువెచ్చములిచ్చి భరించవలెను; వారి కొల్వుకూటములలో నాంగ్లేయ ప్రతినిధి (Resident) యుండి రాచకీయ వ్యవహారముల సలహా నిచ్చుచుండ వలెను. ఆంగ్లేయు, లట్టి షరతుల కొప్పుకొనిన వారిని పరరాజుల పగనుండి కాపాడ బాధ్యులై యుండిరి. ఇది యుప యనేల నా విధానానుసార మాంగ్లేయులు కేంద్ర

ప్రభుత్వాధికారమును వహించి దామెల్లరాజ్యముల కధినాథులై యుంటయు, దేశీయ స్వతంత్ర పాలనలు వారికి దాసోహమని యుంటయు, తటస్థింప నుండెను. ఒక్క మాటలో, ఆంగ్లేయులు మొగలాయి సామ్రాట్టుల స్థాన మాక్రమించుకొననుండి రనిన జాలును; మిత్రత్వ రూపమున శత్రుత్వముచే సాధింపరానిది, జేపట్ట నుండిరి. మతకలహ కారణమునను పొరుగు పచ్చ నోర్వలేమిని, భ్రాతృభావ వినాశమునను, దేశమునకు విదేశీయ దాస్యమే సర్వ సౌఖ్య సంధాయినిగ దోచెను. నాట నెలకొనినది నేటికైన మనవారికి దాస్యమని దోచెనో, లేదో యింకను జెప్పనేరము.

చతురుడగు మార్నిగ్టను ప్రభువు కోర్కె నెరవేర్చుకొనుట కెల్లరాజులు నొకకీలిగనె, యాత డొసగిన యెరను మ్రింగవలసియుండెను. దీర్ఘాలోచన పరులు గాని, స్వలాభముకన్న దేశహితమునే ముఖ్యముగ నెంచువారు గాని, యాంగ్లేయాధికారి పన్నిన వలను పడరైరి. అట్టివారిలో టిప్పూ, నానాలు ముఖ్యులు. స్వతంత్రేచ్ఛ గల టిప్పునకీ మార్నిగ్టను దొర యీయనున్న రక్షణ ప్రస్తుత సౌఖ్య కారణమయ్యు, శాస్వత దాస్యదాయక మగునను మాట స్పష్టమయ్యెను; గాన నాతడీ మాయ సఖ్యత కొడంబడకుండెను. ఆంగ్లాధికారి కిట్టి స్వతంత్రేచ్ఛాపరుని సహించుట కష్టమయ్యెను, ఆజన్మ శత్రులైన ఫ్రెంచివారి స్నేహమును వడసిన టిప్పు నెటులైన నడతేర్చుట వానికి ముఖ్యావసర మయ్యెను. ఇందులకు దొలుత నైజాముతో సంధిచేసుకొనెను. నైజా మాంగ్లేయులు కోరిన రీతి వారంపిన సేనను బుచ్చుకొని దానిని భరించుటకును,

తదితర నియమములకును నొడంబడెను. అతని కొరు వేల సైన్యమును కొంత ఫిరంగి దళమును బంపబడెను. సింధియా పూనాలో నుండి మార్నిగ్టను యెత్తులకు ప్రతిఘటింప నున్నాడని దెలసి వాని నెటులైన యచ్చోటు నుండి హిందూస్థానమున కనుప నిశ్చయింపబడెను. అందులకై గవర్నరు జనరలు వీలగు నెత్నముల నెల్ల జేసెను.

కాబూలు నేతయగు జమన్‌షా హిందూస్థానము నాక్రమింప జూచుచున్నాడను వదంతి నాంగ్లేయులు బుట్టించిరి. ఈ రీతిని సింధియాను నిజరాష్ట్ర సంరక్షణార్థము హిందూస్థానమున కంప నెంచిరి. పీష్వా నిజ సంరక్షణార్థమునకును, వాని యధికార పోషణమునకును వీలగు నట్లు ఆంగ్ల సేనను పూనా కంపెద మని జెప్పిరి. ఈ రీతిని బాజీరావు దన పిత్రార్జితాధికృతను మరల సంపాదింప వచ్చునని బోధించిరి.

నే డాంగ్లేయులు జెప్పెడి రీతినె పీష్వా బాజీరావు వారిని సహాయము జేయమని కోరియుండెను. వారప్పుడు దేశీయ వ్యవహారములలో జోక్యము కల్పించుకొనలే మనియు, తమ నిశ్చితవిధానమునకు విరుద్ధముగ వర్తింపనేరమనియు స్పష్టముగ జెప్పి యుండిరి. ఇప్పుడు కోరని కోర్కెగ సేనా సహాయ మొనర్తు మనియు, నానాను మరల మంత్రిగ దీసుకొన వలసినదనియు, సింధియాను పూనా నుండి బంపివేయ వలసిన దనియును, చెప్పుటను జూడ, బాజీరావున కిదంతయు నానా పన్నిన పన్నాగముగ గన్పట్టెను. పరమ శత్రుడని దలంచిన నానా ఫర్నవీసుని నీడయె వాని కెటజూచినను గానవచ్చుచుండెను. కాననే సింధియా ప్రత్యేకముగ నానాతోడను, పీష్వా తోడను

బహిరంగముగ కలసి మాట్లాడి సఖ్యపడిన వెనుక హిందూస్థానమున కేగ నున్నానని జెప్పియు, బాజీరావుచే నేకాంతమున ప్రోత్సాహ పరుపబడి, పూనా విడిచిపెట్టక నానా యాంగ్లేయుల నటకు దెచ్చిపెట్టకుండ జూచుచుండెను. బాజీరావున కంత మాత్రమున నె తృప్తి లేకుండుటం జేసి నానాతో గూడ మంచి జేసుకొనుటకు చేయగల నెత్నముల నెల్ల జేసెను. ఆ ముదుసలిని, సింధియా రక్షణ వీడి మంత్రి పదవిని మరల స్వీకరించి, పాలనలో దనకు సహాయము జేయుమని కోరుచుండెను. పీష్వా కోరిన రీతి నానా మరల రాజనగరున కరుదెంచెను; గాని యాంగ్లేయులును నైజామును తన నెవ్వరును దోచుకొనకుండ చెరబెట్టకుండ కాపాడుదు మని పూచీపడి, సింధియా గృహకలతలు తేలి యతడు హిందూస్థానమున కేగ వీలు కలిగిన గాని, దాను రాజకీయ వ్యవహారములలో జోక్యము కలిగించుకొన నని భీష్మించెను. దౌలత్రావు వ్యవహారముల పరిష్కరింప నష్టకష్టముల బడి నతనిని హిందూస్థానమున కంపుటకు, దాను బంధవిముక్తుడై నపు డిచ్చిన పదిలక్షలకు తోడు మరి పదునైదు లక్షలు దన స్వంత బొక్కసము నుండి దీసి అప్పిచ్చెను. సింధియా హిందూస్థానమున కేగుట తప్పదని తెలసి, బాజీరా వొంటరిగ గుప్తవేషమున సింధియా యెరుక లేకుండ నానాను సందర్శించెను. అర్థరాత్రమున, నొక్క పరిచారకుని మాత్రము సహాయముగా గొని, యెవ్వరైనను పట్టి పరిభవింతు రను చింతలేక, నానా యింటి కరుదెంచిన పీష్వా వృద్ధమంత్రికి నమ్మిక కలుగజేసి, దా నాతని మిత్రుల బంధించు టెల్ల, వారిని సింధియా బారినుండి దప్పించుటకే

యని జెప్పి యొప్పించెను. ఆంగ్లరాయబారి కర్నలు పామరు నానా మోసపడె ననిన నమ్మలేము; గాని పర్యవసాన మాతని నమ్మిక తప్పు అని దెల్లము జేసెను. చతురుడగు బాజీరాయని వాక్చతురిమయు, ప్రవర్తనయు నెట్టివాని నైనను మోసబుచ్చి నమ్మింప గలిగియుండెను. నానా నొక దారికి తేగలనను ధైర్యము గల్గినంతనె బాజీరావు వాని పాదముల దన శిరమునుంచి, నానాను దన తండ్రి వోలె భావింతు ననియు, ముందెన్నడైన నాతని నడుగకుండ నేమియుజేయనననియు, మహారాష్ట్రులలోని యంతఃకలములచేతను, ఆంగ్లేయుల నత్యాశను, శిథిలముగా నున్న బ్రాహ్మణ ప్రభుత్వమును నిరాధారముగ వదలి వేయవల దనియు బ్రతిమాలి కన్నీరు విడచెను.

నానాయొక్క మనసు కరగెను. అతడు మైమరచెను. దేశ సేవాకాంక్షను నిజ సంరక్షణావశ్యకతను గుర్తింపలేకుండెను. మును గోరిన రక్షణ లభింపకుండనె, నైజాము గాని యాంగ్లేయులు గాని యభయ హస్త మొసగకుండనే, మరల నమాత్య పదవి స్వీకరించెను; గాని పీష్వా మాత్రము మాట నిలుపుకొనలేదు. నానా మంత్రియై నంతనె వాని నంతమొందింప బాజీరావు యత్నముల జేయజొచ్చెను. సింధియాను, మరల నా ముదుసలిని చెరబెట్టమని, బలవంత పెట్టెను. ఫర్నవీసున కీతని సన్నాహము పొడగట్టగా వెంటనే పీష్వా గృహాంగణము జొచ్చి, ముఖాముఖిని వాని ద్రోహ చింతనలకు దూషించెను. ఒక్క వృద్ధుని స్వేచ్ఛా ప్రాణముల కయ్యునింతటి నీచమున కొడిగట్టుకొన వలదని జెప్పెను. తా గోరని యుద్యోగమును వదలి నిశ్చింతగా నే మూలనైన వార్ధక్య

మును గడుపుకొన సెలవొసంగ వేడెను. కపటియగు బాజీరావు తాను నిరపరాధి ననియు, ద్రోహ చింతన లేమైన జరిగిన నవి దానెరుగకుండ దన వారు జేసియుందు రనియు, పరివార జనాపరాధమునకు దనను వీడుట దగ దనియు, ఫర్నపీసునకు జెప్పి బ్రతిమాలెను. నానాకు వానియెడ ననుమానము మాత్రము బోలేదు. అత్యవసర ప్రసంగముల దప్ప నాత డితర వ్యవహారముల చేయిజేసుకొనుట మానెను.

ఈ సమయమున నాంగ్లరాయబారి, పీష్వాకు, సింధియా యదుపునుండి దప్పింప వెలస్లీప్రభువు (మార్నింగ్టను నూతనముగ వడసినబిరుదు) పంపిన సఖ్యతా సందేశమును దెల్పెను. అందు మూలమున గొప్ప యాంగ్లసేన పూనా కంపెబడుననియు, పీష్వా దానిని భరించుభారము వహింపవలెననియు, ఫ్రెంచివారిని పీష్వా రాజ్యమునకు మరెప్పుడును రానీయ రాదనియు, సింధియా నైజాములతోడి తగవులు ఆంగ్లేయుల మూలమున పరిష్కరింపబడవలయు ననియు దెలుపబడెను. సింధియా పోటుదప్పుటకిది యొకమార్గమే యైనను, దీనివలన దేశీయుడును సామంత ప్రభువు నగు సింధియా వీడిన స్థానమున శాశ్వతముగ నాంగ్లేయులు నెలకొందురనియు, వారిని తప్పుకొన దనకు వీలుండదనియు, బాజీరావు దెలుసుకొనెను. నానా ఫర్నవీసు సలహాగొని, యీసఖ్యతమాట నటుండనిచ్చి, ఆంగ్లరాయబారికి దాపూర్వ మొప్పుకొనిన సంధి షరతుల నతిక్రమింపమని జెప్పి, పంచి, నాంగ్లేయసేనలతో దనబలములను జేర్పుమని సేనాధిపతియగు పరశురామభావూ నాత డాజ్ఞాపించెను. కాని తన కపట స్వభావానుకూలముగ టిప్పూవంపిన యిరువురు వకీళ్ళను నానా

కెరుక లేకుండ గలసుకొని వారినుండి పదమూడు లక్షల రూ
పాయిల కానుకగ గొనెను. అందుచేతనె తరువాత జరిగిన
యుద్ధమున మహారాష్ట్రసేన టిప్పూతో యెదురుపడి బోరా
నర్పలేదు. అంతియకాక, పీష్వా సింధియాల సేనలు కలసి నై
జాముబలమాంగ్లేయులగూడి శ్రీరంగమును ముట్టడించునాడు
యా తురక, రాజ్యము నెదిరింప సన్నాహ మొనరించు చుండెను.
కాని వాని యోచనలు కార్యరూపమును వహింపకమున్నె టి
ప్పూసుల్తాను రణ నిహతుడై శాశ్వతముగ రాజకీయ రంగము
ను వీడెనని దెలియవచ్చెను. కలనైన దలంచని యీవిధి విధా
నమున నా మహారాష్ట్ర నాయకులు స్తబ్ధులైరి.

టిప్పూ నిష్క్రమణ మాంగ్లేయుల కెంతసహకారియో
తదితరదేశీయ పాలకుల కంతకష్టకారణ మయ్యెను. అల్పకాల
మె యుండినను మైసూరు సుల్తానుల ప్రభ పరదేశజుల విజృం
భణ నరికట్టి, దేశీయ రాజ్యాంగ సంస్థలకు బాగుపడుటకైన పా
డుపడుటకైన వలయు నంత స్వయంకృషికి వీలొసగెను. విజ
యనగర సామ్రాజ్య వినాశనానంతరమున పేరునకు పెద్దరికము
వహించిన మారుమూలనుండు మైసూరునకు పేరు ప్రతిష్ఠల గ
డించి ప్రఖ్యాత సామ్రాజ్యవైభవముల జతపరచెను. ఖండాంత
రముల నెపోలియనునంతవానికి వెర్రియాశలబుట్టించి తనతోడ
చెలిమి కాశ్రయింప జేసినదియు, ఆంగ్ల సామ్రాజ్య స్థాపనా
చార్యులకు పెద్దయుం బొద్దు పని కల్పించి విషమ సమస్యయ
ని విసిగించి విడచిపెట్టినదియు, నగు పే రన్నిక గనిన నితని
ప్రఖ్యాత కీర్తి నే డంత మొందినది. కాని భార తేతిహా
సమున దన చరిత్ర నచ్చు బడ జేసిపోయినది. శతాబ్దములో

సహస్రాబ్దములో మనినపారసీక రోమకాదిరాజ్యములైన చిర
కీర్తి దప్ప మరేమిగడించెను. పారసీకులు ఖండాంతరములగూడ బా
నిసీల జేసిరనియు, శ్వేచ్ఛకె చోట్లటనువీలొసంగరై రనియు, నిం
దపడినను, వారికీర్తి శాశ్వతమై యుండినదికాదా! క్రైస్తవమ
త పీడనలకు ప్రఖ్యాతమైన రోము రాజ్యము నశించియు మరు
వనిచ్చినదా? మైసూరు కాల స్థల ప్రమాణముల నంతదిగాకు
న్నను, తద్విజేత లిప్పట్టున బలాధికార సమన్వితులై యుండినను,
దన తలకు తగినదానికన్న యెక్కుడు ప్రశంసకే యర్హమై, భా
రతీయుల కృతజ్ఞతకు పాత్రమై, చిరసంస్మణీరయమై దనరుచు
న్నయది.

టక్కరి తనములకు పేరొందిన బాజీరావుయెంత మోసంతసిం
చినటుల వర్తించెను. నానా కారణముననె దా నాంగ్లేయులకు
సమయమున సహాయముజేయ లేకుంటినని వారి రాయబారి
యగు కర్నలు పామరునకు జెప్పెను. పీష్వా కైతవము నెరింగి
యు నాంగ్లేయులు, యుద్ధకాలమున సహాయమునునందకుండు
టంజేసి పీష్వాకెట్టి వంతునీయ వీలులేదనిపామరు దొరను, చె
ప్పుమనిగోరిరి. కాని నైజాముతోడితగవులలో తమ మధ్యవర్తి
త్వ మంగీకరించి, ఫ్రెంచివారిని దనసీమనుండి దోలిన రెండు
లక్షల యరువదిమూడువేలు మొహరులు విలువగల మండల
ములనిత్తుమని జెప్పిరి. మైసూరు ప్రభుత్వము దమ కీయవలసి
యున్న చౌతునకు బదులుగా నిత్తుమనిన దేశమును బుచ్చుకొ
నుటకు దనకెట్టి యభ్యంతరము లేదుగాని ఆంగ్లేయులడిగిన
రెండు షరతులకు దానెన్నడును సమ్మతింప నేరనని బాజీరావు
కబురంపెను. అందుపై నాదేశము నాంగ్లేయులును నైజాము

ను సమముగ బంచుకొనిరి.

టిప్పూ సుల్తానుని మరణవార్త వినినంతనె సింధియా, దనచారులను శ్రీరంగమునకు బంపి, సుల్తాను కక్షవారింక నెవ్వరైన మిగిలిన వారిని, రేపెట్టజూచెను. వేరొకవంక, నాంగ్లయ రాయబారికి, ఆంగ్లేయులు గెలిచిరని విని సంతసించితిననియు, యుద్ధమును సాంతముగ ముగించినందుకు యభినుతులనియు దెలియ బంచెను.

ఈ సమయమున సింధియా వ్యవహారములు చాల చీకాకుగానుండెను. షిర్జీరావు ఘాట్గే, యమృతరావు శిబిరముపైబడి దొంగ దోపిడికి నెట్టుకొనినప్పుడు, మహాదాజీ భార్యలు పీష్వాతో యుద్ధము జేయుచున్న కొల్హాపురపు రాజును శరణుజొచ్చిరి. సింధియా శిబిరముననున్న షెన్వీబ్రాహ్మణులును యనేక యశ్విక దళములును రాచవితంతువులపక్షమును వహించి విడబడిరి. తగినంత బలము చేకూరినంతనె వా రుత్తర ముఖముగ కృష్ణాతీరమునుండి గోదావరి వరకుగల దౌలత్రావు యొక్క రాజ్యమును దోచుకొని పాడొనర్చిరి. బలోబా తాతియా యందలి విశ్వాసముచే వాని నిర్బంధా నంతరము సింధియాచే కొలువునుండి తొలగింపబడిన లక్వా దాదా హిందూస్థానమున తిరుగుబాటొనర్చి యెదిరింపవచ్చిన సేనలనెల్ల నోడించెను. నాగపురమున చెరలోపెట్టబడిన జస్వంతరావు హోల్కారు తప్పించుకొని బోయి మాళవలో దోపిడుల ప్రారంభించెను. విధిలేక దౌలత్రావా వితంతువుల తోడ రాయబారము జరపెను. కాని స్థితిగతుల బాగుగ గుర్తించిన యా వనితలు యాన దాస్థిని తమపరము గావించి దమ ప్రతినిధిగ వాని

సేల వలసినదని జెప్పిరి. ఏ యేర్పాటునకైన దామొప్పుకొనక పూర్వము బలోబా తాతియాను విడువవలసిన దని కోరిరి.

కోరిన రీతి బలోబా విడువబడెను. తిరుగుబాటుతగ్గెను. బలోబా నిర్ణయించినరీతి కట్టుబడుట కాస్త్రీలొప్పుకొనిరి. అశీర్గరు దుర్గమును బర్హాన్పుర నగరమును పదునొకొండు లక్షల విలువగల జాగీరులతో వారికి భరణమీయబడెను. తగవులన్నియు నంతమైనట్లు గన్పట్టెను. వారి వస్త్రాలంకారములును తదితర సామగ్రియు సింధియా విడిదినుండి బంపివేయబడెను. అవి గ్రహించి వారు పూనాకేగు త్రోవలో జిజూరీ వద్దనున్న రాజవారికేగి, యట దమ కక్షిదారొకడు తెగటార్చబడెనని వినిరి. వెంటనే వారు పంధరపురమునకు మరలి యథావిధిని దోపిడిని మొదలిడిరి.

మహారాష్ట్రమున దక్షిణభాగమెల్ల యరాచక స్థితినుండెను. పీష్వాకు కొల్హాపురముతోడి యుద్ధ మంతముగాలేదు. సతారా నోడించి చితూరుసింగు కొల్హాపురబలముల కధికోత్సాహ మొసంగెను. చితూరుసింగును రాస్తియాసేనలు వెన్నాడి కొల్హాపుర రాజ్యములోనికి యదిరెను. ప్రతినిధి బలంబులు రాస్తియాకు సహాయమయ్యెను. అల్పసంఖ్యాకములైన సేనలతోడను, నిండుకొనియున్న బొక్కసముతోడను చితూరుసింగు బలాధికులగు శత్రుల నెదుర్కొని, వారిచేనెన్ని సారులోడింప బడినను లక్ష్యము సేయక, రాస్తియా యేడువేల సేనలను నీరా వార్నానదుల మధ్యదేశమున ముప్పతిప్పల బెట్టుచుండెను. వాని చాకచక్యమును, అద్భుతమగు గమనికలును, ఆకర్షణానుశక్తియు, ప్రజారంజకమగు సేవయు, సామాన్యప్రజల యందలి

విశ్వాసమును, ప్రతివారికి నతనియందు వాత్సల్యమును గలిగించెను. అత డెన్నిసారులు గ్రామముపై బడి వలయు విత్తమును బుచ్చుకొనుచుండినను యెవ్వరును నొచ్చుకొనకుండిరి. అట్టి చితూరుసింగుని దోపిడి కొల్హాపురముతోడి యుద్ధమున నొక భాగముగ భావించబడి, పీష్వా, నానాలు నిందింపబడిరి.

సతారా తిరుగుబాటునను, అటుపిమ్మటను, చితూరుసింగు రాస్తియాను వార్నాకుత్తరమున నేయుంచి తిప్పలబెట్టుచుండ, కొల్హాపురపు రాజు పట్వర్ధములను దండూపంతు గోక్లేను నెదిరించి వారితో పోరాడుచుండెను. పరశురామ భావూ జాగీరున ముఖ్యస్థానమగు తాస్గాము కొల్లబెట్టబడెను. ఎంతయో వ్యయమొనర్చి యతడు కట్టించిన భవంతి భస్మరాసి గావింపబడెను. కర్ణాటకము కప్పము గట్టవలసి వచ్చెను. గోక్లే ధైర్యవంతుడును చతురుడునైనను యెన్నియో సారులు బరాజయమందవలసిన వాడయ్యెను. మన చరిత్ర కాలమునాటికి కొల్హాపురయుద్ధ మీరీతిని జరుచుండెను.

ఆగష్టు మాసమున బలోబా విడుదలై నానాతో సఖ్యత గుదుర్చుకొని, యధికారు లెరుకను నైజామాలీ తోడను, ఆంగ్లేయులతోడను మెలగవలసిన రీతిని గూర్చి యోచించెను. అనుసరణీయ మగు విధానమును నిశ్చయింపక మున్ను దక్షిణ భాగమున పెచ్చు పెరుగుచున్న తొందరల నణచుట ముఖ్య మని వారు తీర్మానించుకొనిరి. టిప్పూతోడి యుద్ధమున వాని శత్రులకు సహాయముజేయుట కాయత్తముగ నున్న సేనను, నానా, పరశురామభావూనకిచ్చి మరికొంత సైన్యమును గూడ సహాయముగ బంపి యీ పని గావింప నెంచెను. ఈ సేన వర్తి

కొకత్తు ననుసరించి పీష్వా, సింధియా, యితర జాగీరుదారులును గూడ కలసి వారి శక్త్యానుసారము పటాళము లంపుటకును మొత్తమున సేనలోన ముప్పదివేల రౌతులును, ఆరువేల కాల్బలమును కలసి పనిచేయుటకును, నిశ్చయింపబడెను. కాని యింతటి సేన నొక్కమారు జాగ్రతచేయుట కష్టము గాన, దసరా దనుక కొల్హాపురము వారిని కనిపెట్టి యుండి వీలగునంత నణచి యుంచవలసిన దని భావూ కనుజ్ఞనిచ్చిరి. అతను శత్రువులచేత స్వయముగ నష్టము నంధియుండెను గాన, యినుమడించిన యుత్సాహముతో సమరభూమి కేగి, ఆరోగ్యము చెడియుండినను లక్ష్యపెట్టక వర్షకాలమెల్ల బనిచేసి గల్పర్బా మల్పర్బానదుల మధ్యనున్న సైనిక నికాయములజాగ్రతపరచెను.

సెప్టంబరు మాసమున గోకాకునుండి కొల్హాపురమునకే బోయి దానిని పట్టుకొని యుద్ధమున నెవ్వరి సహాయము లేకుండగనే యంత మొందింప నెంచెను. కాని పుటున్కుండీ గ్రామ సమీపమున కొల్హాపుర రాజును, చితూరుసింగును సైన్య సమేతులై యుండ కలసి యెదిరించి యోడెను. ఈ యుద్ధమున పీష్వాసైన్య మోడుటయే గాక భావూ ప్రాణాపాయకర మగు దెబ్బతిని చెరగొనబడెను. షిర్జీరావు ఘాట్గే సోదరుడగు విశ్వాసరావతని నెత్తుకొని తన గుఱ్ఱముపై బెట్టి శత్రురాజుకడకు గొంపోయి యట బడవైచెను. సగము చచ్చియున్న నా యోధుని ఖండ ఖండములుగ కోయింపు డని యా కొల్హాపు రాధిపతి యాజ్ఞాపించెను. పరశురామభావు నమ్మినవాడగు దాజిబాలిమాయి యను నత డీ సమాచారమును జూచి చెప్పెను. 1812 సం॥ లో ఎల్ఫిన్‌స్టన్ దొరతో బాజీరావు

కగాడ దా నెరిగినట్లే యీ వృత్తాంతమునుగూర్చి చెప్పియుండెను, గాని కొల్హాపురపు వారి శత్రువులే యున్నను కొల్హాపురమున గాని సతారాలో గాని యిట్టివార్త చెప్పబడదు.

ప్రతినిధి యగు వించూర్కారుని యొక్క బలమును, మేజరు బ్రౌనింగు క్రిందను, సింధియా శిక్షిత పటాళము లైదును, భావూ కొమారుడగు అప్పా సాహేబుకు సహాయముజేసి కొల్హాపురమును సాధించి లొంగదీయుటకు, నానా బలాబాలు పంపిరి. ఇంతటి సేన నెదుర్కొన నా రాజునకు తరము గాకుండుటం జేసి యతడు పనస్లా దుర్గమున తలదాచుకొన బోయెను. ఆకస్మికముగ వానిపై బడి అప్పా, వాని బలమును చెదరజేసి కొంత కోటలోనికి చొరునట్లు జేసి, మిగిలిన యధిక సంఖ్యాకుల వెన్నాడి, కొల్హాపుర పట్టణములోనికిదరిమెను. వెంటనే పేష్వా సేన లా పట్టణమును గిరవేసెను. ఆ ముట్టడి కొంత కాలము సాగి, పట్టణము పట్టుబడి కొల్హాపుర చరిత్ర యంతమాయనని యెల్ల రనుకొను సమయమునకు ఫూనాలోవృద్ధుడగు నానా కాలధర్మము నొంది అఖిల భారత దేశమునకును, దీరని లోపమును గలిగించెను. దీనికారణమున ముట్టడి ఆపుచేయబడెను. కొల్హాపురము రక్షింపబడెను.

సింహావలోకనము

మరణము-జీవిత విధానము-కుటుంబస్థితి.

మహామంత్రి యగు నానా ఫడ్నవీసు యిహలోకమును వీడెను. షష్టి పూర్తియైన సరిగ కాక పూర్వమె దేశ భక్తులలో నెన్నదగిన వ్యక్తి యుసువు లుడిగెను. హైందవ ప్రతిష్టకు నాఖరి యాతకోల బోయెను. పాశ్చాత్యాధిపత్యాంబుధికి చెలియ గట్టు తెగెను. బాజీరాయని యధికార కాంక్ష కంకుశము బోయెను. మహారాష్ట్ర రాజనీతి విశారదులలో కడనాటివా డయ్యు నెవ్వరికి నీడుతీయని మహామహుడు స్వర్గస్థుడయ్యెను. కొల్హాపురమును రక్షించిన విధాత్రి విధానములలో నానా ఫడ్నవీసు మరణము ముఖ్యమైనదై ప్రస్తుత జీవిత చరిత్ర రచనమునకు విశ్రామ మొసంగినది.

నానా పడిన కష్టములచే వాని దేహ దారుఢ్యము సడలియుండెను. కాని కార్యభారమును వహించుటంజేసి ముక్కుదండె నూపిరి యుండునంతకాల మాతడు తదేకదీక్షతో పనిచేయుచు 1800 సం॥ మార్చినెల 13 వ తేదీని కనుల మూసెను. ఆంగ్ల రాయబారి కర్నల్ పామరు "మహారాష్ట్రుల బుద్ధి బలము నాతని తోడ గొంపోయె" నని వ్రాసెను. రాజకీయ వేత్తలలోన నంతటివా డప్పట్టున యుండియుండ డనవచ్చును. పిరికిగుండెయు, పట్టినపట్టు వీడకుండుటకు ధర్మాధర్మ విచక్షణ చేయకుండుటయు వీని లోపము లట. కాని కంటకావృత మగు జీవితావసాన కాలమున నానా చూపిన నిశ్చల దేశభక్తి మెచ్చుకొనదగిన దని ఆంగ్ల మహారాష్ట్ర చరిత్రకారులే, సమ

కాలిపులే యొప్పుకొనక తీరినది కాదు. తనకు రానున్న యిక్క
ట్టుల నరకుజేయక దేశ కళ్యాణమున కవసరమగు పట్ల బాజీ
రావునకు తగినరీతి హితోపదేశ మొనరించెను. ఆంగ్ల సేనా
సహాయ మవసరము లేకుండ రాజ్య సౌష్టవము జేకూరునేని,
వెల్లస్లీ ప్రభు వంపిన సమాధాన మార్గమునకు పీష్వా యొప్పు
కొనుట, నానా సమ్మతింపకుండెను. ఆంగ్లేయులయెడ నాతనికి
గౌరవ ముండెను. వారి సుగుణ సంపత్తికిని పాలనా సౌష్టవము
నకును వారిని మెచ్చుకొనెను; గాని రాచకీయ వ్యవహారముల
లో ఆంగ్లేయుల కతనికన్న గొప్ప శత్రుడు లేకుండెను. వెల్లస్లీ
కోరినరీతి, కాలూన వారికి వీలయ్యెనా, ఆంగ్లేయులు సామ్రా
జ్య నేతలు కాగల రని నాతడు గ్రహించి, వారి నేరీతినైన
యణచ దలచెను.

ఫర్నవీసు జీవితమెల్ల రచ్చ చావడులనె గడపబడె ననవ
చ్చును. అందలి యంశము లన్నియు విపులముగ చర్చించియె
యుండుటను వేరుగ వాని గుణవర్ణన మవసర మని దలంపము.
సంసార వ్యవహారములో నతడు సత్యసంధుడు, దయాళు
డు, దానశీలుడు, ఆడంబరమున కాసించువాడు కాడు. మహ
త్తర కార్యభారమును వహించియుండియు నెప్పట్టునను దేనికిని
కాలము లేదని విసుగక దన కార్యముల సకాలమున జేయు
చుండెను. అతడు స్వంతముగ జేసిన పనిని జూచిన సామాన్యు
న కెవ్వని కలవి యగునని జెప్ప దరముగాదు.

నిజ రాజ్యపాలనమున, నానా యధికారమున నుండి
నంతకాలము, మాధవరావు బల్లాలుని విధానమే యనుసరింప
బడెను. అమిత కార్యభారమునను విరామము లేక గలిగిన విశర

తొందరలచేతను, దీక్షగ నెల్ల వ్యవహారముల జూచుకొను
టకు ఫడ్నవీసునకు వీలైనది కాదు.

చూచుటకు ఫడ్నవీసు పొడగరి, శ్యామలాంగుడు, బక్క
పలుచని వాడు. ఏదియో యోచించుచున్నట్లే యుండును.
అతని చూడ్కులలో వాని బుద్ధియు, సూక్ష్మ గ్రహణ శ
క్తియు, తాండవ మాడుచుండును.

పాపము నానా జీవితకాలములో తొమ్మండుగురు భార్యల
బెండ్లాడియు సంతానము లేకయే పోయెను. అతని య
వసాన కాలమున వాని ఆఖరు భార్య జీవాభాయి పూ
నాకు ముప్పదిమైళ్ళ దూరమున నున్న సీదరు చేరువున నుండె
ను. నానా భార్యను, వాని యపార సంపదను గూడ తనచేత
జిక్కించుకొన జూచిన పీష్వా, వెంటనే కొంత సైన్య మంపి
యామెను పూనాకు దెప్పించ నెంచెను. నానా, యంగరక్షకులు
గ జీతమిచ్చి యుంచిన, అరబ్బులు, రెండువేలమంది పీష్వా సేన
ల నెదుర్కొని వారిలో ననేకుల జంపిరి. అదిగని పీష్వా వారి
కి గుజరాతులోని గాంబే సీమకు బోవ వీ లొసంగి, నానా భా
ర్యను తనవద్దకు దెచ్చుకొనెను. ఈలోపుగా జస్వంతరావు హో
ల్కారు వచ్చుచున్నాడను వార్త దెలియ, పీష్వా పూనాపట్టణ
మువదలి పారిపోయెను. హోల్కారు పూనాలో నున్నంతకాల
మును నానాభార్యను దయతో చాల మర్యాదగ జూచెను; గా
ని అమృతరావు పూనాకువచ్చినంతనె నానాకతడు పరమశత్రు
డగుట మర్యాద దక్కదని తలచి యామె, నగర దుర్గమున
కిల్లేదారగు నానా నమ్మినబంటు దండూ బల్లాలుని కడకు పా
రిపోయెను. 180± సం॥ లో పీష్వాచే దక్షిణదేశమందలి రాజ

కీయ వ్యవహారములన్నియు చక్కజేయ సర్వాధికారమీయ బడిన జనరలు వెల్లస్లీ దండు బల్లాలుడు కోటవిడచున ట్లేర్పాటుజేసెను. నానా భార్య జీవాభాయి దనయిచ్ఛవచ్చినచోట నివసింపవచ్చు ననియు, నామె రక్షణభార మాంగ్లేయులు భరింతురనియు, సాలున కామెకు పండ్రెండువేలరూపాయిలు భరణమిత్తుమనియు జెప్పిరి. ఆమెయు,బల్లాలు కోరినట్లు మెల్లాలుగ్రామమున నివసింపదలచెనే గాని యట బ్రాహ్మణ కుటుంబము లెన్నియో లేకుండుటంజేసి పన్వేల్లులోనే యుండ నిశ్చయించెను. అచటనే పదునారేండ్లుండి, అప్పుడు వాయీ పరిసరములనున్న మేనాల్లీ దేవస్థానమునకు దన జీవిత శేషమును గడుప నేగెను.

పీష్వా యెన్నియో సారులు వేడి, విసిగి నేడు 1827 సం॥ నాంగ్లేయుల యనుమతిని నామె కుమారుని బెంచుకొనెను. రామకృష్ణభానూ కుమారుడగు సీదత్తుడు, మహాడ్జీ బుల్హారు, 1830 సం॥లో పురంధరు జాగీర్దారుడగు కేశవరావు పట్వర్ధనుని కుమార్తె, రామాభాయిని వివాహమాడెను. ఆ వివాహమున వరునకు యిరువదైదువేలు దక్షిణ యొసగబడెనట! వేయి రూకలు రాబడిగల గ్రామమును భూదానముగ నిచ్చిరట! కాని రామాభాయియు తన యత్తలబోలె సంతానము గలుగకనె కాలధర్మము నొందెను.

ఆంధ్ర భారతీయ సోదరులారా!



ఈలాటి పేరులతో నున్న ప్రకటనలను చూచుటను మీకందరకిని మిక్కిలి ఆనందముగానుండును. ఏలనన: అట్టి సమయములయందు మీకు కావలసిన వాటిని మిక్కిలి తక్కువ ధరలను కొనుటకు వీలుండును. ఎవరైనను, లాభములేనిదే విక్రయించరను స్వల్ప సంగతి మీ కెల్లరకును బాగుగా తెలియును. సాధారణముగా ప్రతిదినము అమ్మకపు ధరలు మిక్కిలియెక్కువగానుండుటచే మీరు తక్కువ ధరల అమ్మకమున కెదురు చూతురు. అయితే యెల్ల కాలములందును మిక్కిలి తక్కువ ధరలకు సామానులు అనగా యిమిటేషన్ చక్రిసాన కెంపు కమలములు, డబుల్ కట్టు వైక్రాంతములు, పుష్యరాగములు, జిగినీబిళ్ళలు, దుద్దుల జతలు, ముక్కు పుడకలు, పుదుచ్చేరి నానులు, బంగారు గాజులు, గాజులలో లతలతో చెక్కబడిన గాజులు, Diamond Cutting Bangles (వజ్రపు పలకలవలె చెక్కబడిన గాజులు), యీ చెక్కబడిన గాజులలో అనేక రకములు చేయబడును. ఉంగరములు (Rings) రకరకములలో తమ తమ అభిప్రాయముల చొప్పున త్వరలో చేయించి యివ్వబడును.

కదంబ వెంకటేశం ఆచారి

బాపురం, గోళీల వీధి, బరంపురం, గంజాం.

☞ ఈ తరములును, విలాసములును, స్పష్టముగా వ్రాయవలెను.

కవిరాజు వైద్యభూషణ వైద్యనాథశర్మ కృతమగు

సుప్రసిద్ధ

రత్నకల్ప రత్నపురుష లేహ్యము

చికిత్సాగ్రంథములను ననుసరించి, యా నియమంబులననుసరించి, సర్వదేశ సర్వఋతు రోగములకు నుపచరించు విధమున, నీ మా

రత్న పురుష లేహ్యము

నిర్మింపబడినది. వీర్యవంతములగు మూలికలకు, స్వర్ణరౌప్యాది భస్మములకు, శుద్ధిగల సకల పదార్థములకు, కస్తూరీ కర్పూరాది సుగంధ వస్తు విశేషములకు, నీ మహౌషధము ని[illegible]ట్టియు రుచికరమై, యింద్రియప్రదమై, జీర్ణజ్వర, అగ్నిమాంద్యాదిరోగములకు వజ్రాయుధమై, దేహమునకు నూతనకాంతి బలము గలిగించునదియై, నూతన పురాతన మేహములను నివారించునదియై, స్వప్నదోషస్ఖలితములకు, ధ్వజభంగాదులకు నమోఘమై, వంధ్యారజోదోష, ప్రదరాది స్త్రీరోగము లను నశింపజేయునదియు, ఎల్లరును సేవింపదగినదయి యున్నది. పథ్యాపథ్య నియమము లేదు. ఆవుపాలతోగాని మంచి నీళ్ళతోగాని అరతులం మోతాదు చొ॥ పుచ్చుకొనదగును.

20 దినములకు 20 తు॥ డబ్బీ 1కి రూ 2—0—0 మాత్రమే.

10 దినములకు 10 తు॥ డబ్బీ రూ 1—8—0 మాత్రమే.

మేనేజరు, సంజీవనీ ఔషధాలయము,

బరంపురం, గంజాం.

END OF
TITLE